ఓమ్

# షష్ఠ సర్గము

## గంగాతరణము - భరద్వాజ, వాల్మీకి మునులతో సమాగమము.

శ్రీమహాదేవ ఉవాచ

సుప్తం రామం సమాలోక్య గుహః సోఽశ్రుపరిప్లుతః,
లక్ష్మణం ప్రాహ వినయాద్ భ్రాతః పశ్యసి రాఘవమ్. 1

శయానం కుశపత్రౌఘసంస్తరే సీతయా సహ,
యః శేతే స్వర్ణపర్యంకే స్వాస్తీర్ణే భవనోత్తమే. 2

కైకేయీ రామదుఃఖస్య కారణం విధినా కృతా,
మంథరాబుద్ధిమాస్థాయ కైకేయీ పాపమాచరత్. 3

తచ్ఛ్రుత్వా లక్ష్మణః ప్రాహ సఖే శృణు వచో మమ,
కః కస్య హేతుర్దుఃఖస్య కశ్చ హేతుః సుఖస్య వా. 4

స్వపూర్వార్జితకర్మైవ కారణం సుఖదుఃఖయోః. 5

సుఖస్య దుఃఖస్య న కోఽపి దాతా
పరో దదాతీతి కుబుద్ధిరేషా,
అహం కరోమీతి వృథాభిమానః
స్వకర్మసూత్రగ్రథితో హి లోకః. 6

సుహృన్మిత్రార్యుదాసీనద్వేష్యమధ్యస్థబాంధవాః,
స్వయమేవాచరన్కర్మ తథా తత్ర విభావ్యతే. 7

సుఖం వా యది వా దుఃఖం స్వకర్మవశగో నరః,
యద్యద్యథాగతం తత్తద్ భుక్త్వా స్వస్థమనా భవేత్. 8

న మే భోగాగమే వాంఛా న మే భోగవివర్జనే,
ఆగచ్ఛత్వథ మాగచ్ఛత్వభోగవశగో భవేత్. 9

యస్మిన్ దేశే చ కాలే చ యస్మాద్వా యేన కేన వా,
కృతం శుభాశుభం కర్మ భోజ్యం తత్తత్ర నాన్యథా. 10

శ్రీమహాదేవుడిట్లనెను - నిదురించుచున్న శ్రీరాముని పరికించి గుహుడు కన్నులనీరు నిండగ, వినయపూర్వకముగా లక్ష్మణునితో ''సోదరా! చూచుచుంటివా? దివ్యభవనమున సుందరతరమగు స్వర్ణ పర్యంకముపై శయనించెడి రాముడు సీతాసహితుడై కుశపత్ర మయమగు శయ్యపై నిదురించినాడు (1-2). విధాత, రాముని దుఃఖమునకు కైకేయిని కారణము గావించెను. మంథర బుద్ధిని విశ్వసించి కైకేయి ఘోర పాపకృత్యమును ఆచరించినది'' (3) అనెను.

ఈమాటవిని లక్ష్మణుడు ఇట్లనెను - ''సోదరా! నా మాట వినుము. ఒకని సుఖమునకు గాని, దుఃఖమునకు కాని వేరెవ్వరును కారణము కాదు. మానవుని పూర్వకృత కర్మమే అతని సుఖమునకుగాని దుఃఖమునకుగాని కారణ మగుచుండును (4-5). సుఖదుఃఖముల నిచ్చువారు వేరెవ్వరు లేరు. పరులెవ్వరో సుఖదుఃఖములకు కారణమని తలచుట తెలివితక్కువ. 'నేను చేయుచున్నాను' అనుకొనుట మిథ్యాభిమానము. ఏలయన జనులు తమతమ కర్మపాశములచే కట్టబడియున్నారు (6). మానవుడు స్వయముగా కర్మలు ఆచరించి తద్భావానుసారముగా సుహృత్తు, మిత్రుడు, శత్రువు, ఉదాసీనుడు, ద్వేషి, మధ్యస్థుడు, బంధువు మున్నగువారిని కల్పించుకొను చున్నాడు (7). కావున మానవుడు ప్రారబ్ధానుసారము సుఖదుఃఖాదులలో ఏది ప్రాప్తించినను అనుభవించుచు సదా ప్రసన్నచిత్తుడై యుండవలెను (8). నాకు భోగములు వచ్చుట యందుగాని పోవుటయందుగాని ఆపేక్ష లేదు. భోగములు వచ్చిన రావచ్చును. పోయిన పోవచ్చును. భోగములకు మనము అధీనులము (9). ఏ దేశమున ఏ కాలమున ఎవడు ఏ శుభాశుభ కర్మలు ఆచరించునో వానిని అతడు అవశ్యము అదే విధానముగా అనుభవింపవలసియుండును. దీనిని ఎవరు తప్పింపలేరు (10).

అలం హర్షవిషాదాభ్యాం శుభాశుభఫలోదయే,
విధాత్రా విహితం యద్యత్తదలంఘ్యం సురాసురైః. 11

సర్వదా సుఖదుఃఖాభ్యాం నరః ప్రత్యవరుధ్యతే,
శరీరం పుణ్యపాపాభ్యాముత్పన్నం సుఖదుఃఖవత్. 12

సుఖస్యానంతరం దుఃఖం దుఃఖస్యానంతరం సుఖమ్,
ద్వయమేతద్ధి జంతూనామలంఘ్యం దినరాత్రివత్. 13

సుఖమధ్యే స్థితం దుఃఖందుఃఖమధ్యే స్థితం సుఖమ్,
ద్వయమన్యోన్యసంయుక్తం ప్రోచ్యతే జలపంకవత్. 14

తస్మాద్ధైర్యేణ విద్వాంస ఇష్టానిష్టోపపత్తిషు,
న హృష్యంతి న ముహ్యంతి సర్వం మాయేతి భావనాత్.
15

గుహలక్ష్మణయోరేవం భాషతోర్విమలం నభః,
బభూవ రామః సలిలం స్పృష్ట్వా ప్రాతః సమాహితః. 16

ఉవాచ శీఘ్రం సుదృఢాం నావమానయ మే సఖే,
శ్రుత్వా రామస్య వచనం నిషాదాధిపతిర్గుహః. 17

స్వయమేవ దృఢాం నావమానినాయ సులక్షణామ్,
స్వామిన్నారుహ్యతాం నౌకా సీతయా లక్ష్మణేన చ. 18

వాహయే జ్ఞాతిభిః సార్థమహమేవ సమాహితః,
తథేతి రాఘవః సీతామారోప్య శుభలక్షణామ్. 19

గుహస్య హస్తావాలంబ్య స్వయం చారోహదచ్యుతః,
ఆయుధాదీన్ సమారోప్య లక్ష్మణోఽప్యారురోహ చ.20

గుహస్తాన్వాహయామాస జ్ఞాతిభిః సహితః స్వయమ్,
గంగామధ్యే గతా గంగాం ప్రార్థయామాస జానకీ. 21

దేవి గంగే నమస్తుభ్యం నివృత్తా వనవాసతః,
రామేణ సహితాఽహం త్వాం లక్ష్మణేన చ పూజయే. 22

ఇత్యుక్త్వా పరకూలం తౌ శనైరుత్తీర్య జగ్మతుః. 23

కావున శుభాశుభకర్మ ఫలము ప్రాప్తించగనే హర్షమునో శోకమునో పొందుట నిరర్థకము. విధాతగతిని దేవదానవులలో ఎవరును ఉల్లంఘించజాలరు. మానవుడు సదా సుఖదుఃఖముల చేత చుట్టబడియుండును. మనుష్యశరీరము పాపపుణ్యఫలముగా ఉత్పన్నమగుటచే సుఖదుఃఖమయముగానే యుండును. సుఖము వెనుక దుఃఖము, దుఃఖమును అనుసరించి సుఖము పగలు, రేయువలె జీవులకు అపరిహార్యము. ఈ రెండు సర్వదా నీరు బురదవలె ఒకదానితో నొకటి కలిసియే యుండును (11 - 14). కావున విద్వాంసులు 'అంతయు మాయయే' యను భావన కలిగి ఇష్టానిష్ట ప్రాప్తి యందు ధైర్యము వహించి హర్షశోకములను పొందరు (15).''

గుహుడు లక్ష్మణుడు ఈవిధముగా సంభాషించు కొనుచుండగనే అరుణోదయమైనది. శ్రీరాముడు యథావిధి ఆచమించి ప్రాతఃకాలిక క్రియలు నిర్వహించి (16) గుహునితో ''మిత్రమా! వేగమే దృఢమగు నావను తెమ్ము'' అని చెప్పెను. రాముని మాటవిని నిషాదరాజు గుహుడు స్వయముగా సులక్షణమగు ఒక దృఢమైన నావను తీసికొని వచ్చి, ''స్వామీ! సీతాలక్ష్మణ సహితులై నావ నధిరోహించుడు (17-18). నేను నా బంధువులతో కూడి స్వయముగా జాగరూకతతో నావ నడిపెదను'' అని పలికెను. ''అటులే'' యని రాముడు ముందుగా శుభలక్షణయగు సీతను నావ నెక్కించెను (19). తరువాత అచ్యుతుడగు రాముడు గుహుని హస్తావలంబనముతో స్వయముగ నావ నధిరోహించెను. ఆయుధములను పడవలోనుంచి లక్ష్మణుడు కూడ అధిరోహించెను (20). గుహుడు స్వయముగా తన బలగముతో నావ నడిపెను. నావ గంగానదీ మధ్యము చేరగనే జానకి గంగను గూర్చి ఇట్లు ప్రార్థించెను (21) ''దేవీ! గంగా! నమస్కారములు. వనవాసమునుండి రామ లక్ష్మణ సహితముగా మరలివచ్చి మరల నిన్ను పూజించెదను''. పిమ్మట వారు మెల్లగా గంగ కావలి యొడ్డును దిగి, మెల్లగా నడువసాగిరి (22-23).

గుహోఽపి రాఘవం ప్రాహ గమిష్యామి త్వయా సహ,
అనుజ్ఞాం దేహి రాజేంద్ర నోచేత్ప్రాణాంస్త్యజామ్యహమ్.
24

అపుడు గుహుడు రామునితో ''రాజేంద్రా! నేనును నీవెంట వచ్చెదను. నన్ను అనుమతింపుము. లేకున్న నేను ప్రాణములు విడిచెదను'' అనెను (24).

శ్రుత్వా నైషాదివచనం శ్రీరామస్తమథాబ్రవీత్,
చతుర్దశ సమాః స్థిత్వా దండకే పునరప్యహమ్. 25

అయాస్యామ్యుదితం సత్యం నాసత్యం రామభాషితమ్,
ఇత్యుక్త్వాలింగ్య తం భక్తం సమాశ్వాస్య పునః పునః. 26

నివర్తయామాస గుహం సోఽపి కృచ్ఛ్రాద్యయౌ గృహమ్.
27

నిషాదరాజు మాటవిని రాముడాతనితో ''నేను పదునాల్గేండ్లు దండకారణ్యమున నుండి, మరలి వచ్చెదను. నేను సత్యమే పలుకుచున్నాను. రాముని మాట ఏనాడును మిథ్య కానేరదు'' అని పలికి భక్తుడగు గుహునికి ఊరట కలిగించెను. మరల మరల ఓదార్చి వీడుకొలిపెను. అనంతరము నిషాదరాజు గుహుడు అతి కష్టముమీద ఇంటికి మరలెను (25-27).

తతో రామస్తు వైదేహ్యా లక్ష్మణేన సమన్వితః. 28

భరద్వాజాశ్రమపదం గత్వా బహిరుపస్థితః,
తత్రైకం వటుకం దృష్ట్వా రామః ప్రాహ చ హే వటో. 29

రామో దాశరథిః సీతాలక్ష్మణాభ్యాం సమన్వితః,
ఆస్తే బహిర్వనస్యేతి హ్యుచ్యతాం మునిసన్నిధౌ. 30

తచ్ఛ్రుత్వా సహసా గత్వా పాదయోః పతితో మునేః,
స్వామిన్ రామః సమాగత్య వనాద్బహిరవస్థితః. 31

సభార్యః సానుజః శ్రీమానాహ మాం దేవసన్నిభః।
భరద్వాజాయ మునయే జ్ఞాపయస్వ యథోచితమ్।। 32

తదుపరి వైదేహి లక్ష్మణసహితుడై రాముడు భరద్వాజుని ఆశ్రమము చేరి వెలుపల నిలబడెను. అటనొక బ్రహ్మచారిని చూచి ''బ్రహ్మచారీ! దాశరథియగు రాముడు సీతాలక్ష్మణ సమేతుడై వచ్చి ఆశ్రమము వెలుపల నిలిచి యున్నాడని మునివరునకు తెలుపుము'' అని చెప్పెను. అతడును ఆ మాట విని, వడివడిగా ముని పాదములపై బడి ''గురుదేవా! దేవతుల్యుడగు రాముడు భార్యతో, తమ్మునితో వచ్చి ఆశ్రమము వెలుపల వేచియున్నారు. యథోచితముగా భరద్వాజ మునివరులకు యీ విషయము తెలియచేయుమని చెప్పినారు''అనెను (28-32).

తచ్ఛ్రుత్వా సహసోత్థాయ భరద్వాజో మునీశ్వరః,
గృహీత్వార్ఘ్యం చ పాద్యం చ రామసామీప్యమాయయౌ.33

దృష్ట్వా రామం యథాన్యాయం పూజయిత్వా సలక్ష్మణమ్,
అహ మే పర్ణశాలాం భో రామ రాజీవలోచన. 34

ఆగచ్ఛ పాదరజసా పునీహి రఘునందన,
ఇత్యుక్త్వోటజమానీయ సీతయా సహ రాఘవౌ. 35

భక్త్యా పునః పూజయిత్వా చకారాతిథ్యముత్తమమ్,
అద్యాహం తపసః పారం గతోఽస్మి తవ సంగమాత్. 36

ఈ మాట వినిన వెంటనే తటాలున నిలిచి, భరద్వాజ మునీంద్రుడు అర్ఘ్యపాద్యాదులు గొని రాముని సమీపమునకు వెళ్లెను. రాముని చూచి, లక్ష్మణునితో సహా యథావిధిగా పూజించి, ఇట్లు అనెను ''ఓ రామా! రాజీవనేత్రా! రమ్ము! నీ చరణరేణువులతో నా పర్ణశాలను పవిత్రము చేయుము''. ఇట్లని, జానకితో సహా కుటీరములోనికి రాముని ఆహ్వానించెను. భక్తిపూర్వకముగా మరల వారిని పూజించి, ఉత్తమమగు అతిథి సత్కారములు చేసెను. అతడు ఇట్లనెను – ''రామా! నేడు నీ శుభాగమము వలన నా తపస్సు సఫలమైనది (33-36).

జ్ఞాతం రామ తవోదంతం భూతం చాగామికం చ యత్,
జానామి త్వాంపరాత్మానం మాయయా కార్యమానుషమ్.

రఘునందనా! మీ భూతభవిష్యద్వృత్తాంతములను పూర్తిగా ఎరుగుదును. నీవు పరమాత్ముడవే యని తెలియును. కార్యసిద్ధికై మాయామానుషవేషమున లీలలు చేయుదువని నాకు తెలియును (37).

యదర్థమవతీర్ణోఽసి ప్రార్థితో బ్రహ్మణా పురా,
యదర్థం వనవాసస్తే యత్కరిష్యసి వై పురః. 38

జానామి జ్ఞానదృష్ట్యాహం జాతయా త్వదుపాసనాత్,
అతః పరం త్వాం కిం వక్ష్యే కృతార్థోఽహం రఘూత్తమ. 39

యస్త్వాం పశ్యామి కాకుత్స్థం పురుషం ప్రకృతేః పరమ్,
రామస్తమభివాద్యాహ సీతాలక్ష్మణసంయుతః. 40

అనుగ్రాహ్యాస్త్వయా బ్రహ్మన్ వయం క్షత్రియబాంధవాః,
ఇతి సంభాష్య తేఽన్యోన్యముషిత్వా మునిసన్నిధౌ. 41

ప్రాతరుత్థాయ యమునాముత్తీర్య మునిదారకైః,
కృతాప్లవేన మునినా దృష్టమార్గేణ రాఘవః. 42

ప్రయయౌ చిత్రకూటాద్రిం వాల్మీకేర్యత్ర చాశ్రమః,
గత్వా రామోఽథ వాల్మీకేరాశ్రమం ఋషిసంకులమ్. 43

నానామృగద్విజాకీర్ణం నిత్యపుష్పఫలాకులమ్,
తత్ర దృష్ట్వా సమాసీనం వాల్మీకిం మునిసత్తమమ్. 44

ననామ శిరసా రామో లక్ష్మణేన చ సీతయా,
దృష్ట్వా రామం రమానాథం వాల్మీకిర్లోకసుందరమ్. 45

జానకీలక్ష్మణోపేతం జటాముకుటమండితమ్,
కందర్పసదృశాకారం కమనీయాంబుజేక్షణమ్. 46

దృష్ట్వైవ సహసోత్థాయ విస్మయానిమిషేక్షణః,
ఆలింగ్య పరమానందం రామం హర్షాశ్రులోచనః. 47

పూజయిత్వా జగత్పూజ్యం భక్త్యార్ఘ్యాదిభిరాదృతః,
ఫలమూలైః స మధురైః భోజయిత్వా చ లాలితః. 48

రాఘవః ప్రాంజలిః ప్రాహ వాల్మీకిం వినయాన్వితః,
పితురాజ్ఞాం పురస్కృత్య దండకానాగతా వయమ్. 49

పూర్వము బ్రహ్మచే ప్రార్థింపబడి, నీవు అవతారమెందులకు ఎత్తితివో, ఎందులకై వనవాసము చేయవచ్చితివో, ముందేమి కావించనున్నావో అది అంతయు నీ ఉపాసనా ఫలముగా లభించిన జ్ఞానదృష్టితో నేనెరుగుదును. ప్రకృతికి అతీతుడవై సాక్షాత్తు పురుషోత్తముడ వైన నిన్ను కకుత్స్థనందనునిగా చూచి కృతార్థుడనైతిని. రఘుశ్రేష్ఠా! ఎక్కువగా నేనేమని చెప్పగలవాడను''. అపుడు సీతాలక్ష్మణ సమేతుడైన రాముడు మునివరునకు నమస్కరించి ఇట్లనెను (38-40).

''బ్రాహ్మణోత్తమా! మేము క్షత్రియ వంశ సంజాతులము. మీ దయకు పాత్రులము''. ఈ విధముగా పరస్పరము సంభాషించుకొనుచు ముని సన్నిధిలో నాడు గడిపిరి (41). ప్రాతఃకాలముననే మేల్కాంచి రాముడు మునికుమారుల సాయముతో యమునను దాటి, కృత స్నానుడై మునివరుడు తెలిపిన మార్గమున వాల్మీక్యాశ్రమమున్న చిత్రకూటము దిశగా పయనించెను. అట్లు ప్రయాణించి ఋషిసంకులము నానా మృగ పక్షి సమాకులము, సర్వదా పుష్పఫలసంపూర్ణము అయిన వాల్మీకి ఆశ్రమము చేరి, అందు ఆసీనుడై ఉన్న మునిపుంగవుడగు వాల్మీకిని రాముడు దర్శించెను (42-44). సీతా లక్ష్మణులతో కలిసి ఆయనకు నమస్కరించెను. అంత వాల్మీకి త్రిలోకసుందరుడు, మన్మథాకారుడు, జటామకుట శోభితుడు, కమలనేత్రుడు, రమానాథుడు అగు రాముని సీతా లక్ష్మణులతో చూచిన వెంటనే లేచి, విస్మయముతో, రెప్పవేయక చూచుచు, హర్షపులకాంకితుడై, పరమానందస్వరూపుడైన రాముని కౌగలించుకొని, జగత్పూజనీయుడైన అతనిని భక్తిగా అర్ఘ్యపాద్యాదులతో సత్కరించి, మధురములగు కందమూల, ఫలాదులను భుజింపచేసి, వాత్సల్యముతో స్నేహముతో లాలించెను (45-48).

అపుడు శ్రీరాముడు అత్యంత వినయముతో అంజలించి, వాల్మీకి మహర్షితో ''మేము మా తండ్రి ఆజ్ఞతో దండకారణ్యమునకు వచ్చితిమి (49).

భవంతో యది జానంతి కిం వక్ష్యామోఽత్ర కారణమ్,
యత్ర మే సుఖవాసాయ భవేత్ స్థానం వదస్వ తత్. 50

సీతయా సహితః కాలం కించిత్తత్ర నయామ్యహమ్,
ఇత్యుక్తో రాఘవేణాసౌ మునిః సస్మితమబ్రవీత్. 51

త్వమేవ సర్వలోకానాం నివాసస్థానముత్తమమ్,
తవాపి సర్వభూతాని నివాససదనాని హి. 52

ఏవం సాధారణం స్థానముక్తం తే రఘునందన,
సీతయా సహితస్యేతి విశేషం పృచ్ఛతస్తవ. 53

తద్వక్ష్యామి రఘుశ్రేష్ఠ యత్తే నియతమందిరమ్,
శాంతానాం సమదృష్టీనామద్వేష్టౄణాం చ జంతుషు,
త్వామేవ భజతాం నిత్యం హృదయం తేఽధిమందిరమ్. 54

ధర్మాధర్మాన్పరిత్యజ్య త్వామేవ భజతోఽనిశమ్,
సీతయా సహ తే రామ తస్య హృత్సుఖమందిరమ్. 55

త్వన్మంత్రజాపకో యస్తు త్వామేవ శరణం గతః,
నిర్ద్వంద్వో నిఃస్పృహస్తస్య హృదయం తే సుమందిరమ్. 56

నిరహంకారిణః శాంతా యే రాగద్వేషవర్జితాః,
సమలోష్టాశ్మకనకాస్తేషాం తే హృదయం గృహమ్. 57

త్వయి దత్తమనోబుద్ధిర్యః సంతుష్టః సదా భవేత్,
త్వయి సంత్యక్తకర్మా యస్తన్మనస్తే శుభం గృహమ్. 58

యో న ద్వేష్ట్యప్రియం ప్రాప్య
ప్రియం ప్రాప్య న హృష్యతి,
సర్వం మాయేతి నిశ్చిత్య
త్వాం భజేత్తన్మనో గృహమ్. 59

షడ్భావాదివికారాన్యో దేహే పశ్యతి నాత్మని,
క్షుత్తృట్ సుఖం భయం దుఃఖం ప్రాణబుద్ధ్యోర్నిరీక్షతే. 60

సంసారధర్మైర్నిర్ముక్తస్తస్య తే మానసం గృహమ్. 61

మీరు సర్వము తెలిసిన వారే! ఇక మేము ఇందులకు కారణమేమని చెప్పుదుము? నేను సుఖముగా నివసించ ఉచితమగు స్థానమును మీరు తెలియచేయవలసినదని కోరుచున్నాను (50). మీరు నిర్దేశించిన స్థానమున నేను సీతతోడ కొంతకాలము గడిపెదము'' అనెను. రాముడు ఇట్లు పలుకగా మునివరుడు చిరునగవుతో ఇట్లనెను (51)- ''రామా! సమస్త లోకములకు నీవొక్కడవే ఉత్తమనివాస స్థానము. ఈ జీవులెల్లరు మీకు నివాస గృహములగువారే! (52). ఓ రఘునందనా! ఈ విధముగా నేను మీకు సర్వసామాన్య నివాసస్థానము తెలిపితిని. కాని మీరు విశేషముగా సీతాసమేతులై వసించుటకు తగిన స్థానమడిగితిరి. కావున రఘుశ్రేష్ఠా! నీవు వసించుటకు నిశ్చితమైన స్థానమేదో తెలుపుచున్నాను, వినుము. శాంతులై సమదర్శులై సమస్తజీవులయెడల ద్వేషరహితులై అహర్నిశము నిన్ను భజించువారి హృదయములు నీ ప్రథమనివాసస్థానము (53-54). ధర్మాధర్మములు రెంటినివీడి, నిరంతరము మిమ్మే భజించువాడెవడో అతని హృదయ మందిరము సీతాసమేతుడవైన నీకు సుఖపూర్వక వాసస్థానము (55). ఎవరు నీ నామమంత్రమునే జపింతురో, నీ శరణమునే గోరుదురో, రాగద్వేషాది ద్వంద్వభావములు లేక నిఃస్పృహులై యుందురో, వారి హృదయమే నీకు సుందర మందిరము (56). ఎవరు అహంకారశూన్యులై, శాంత స్వభావులై, రాగద్వేషరహితులై, బంగారమును, రాతిని, మట్టిని సమానముగా భావింతురో, వారి హృదయము నీకు నివాసస్థానము (57). ఎవడు నీయందే మనోబుద్ధులను లగ్నముచేసి సదా సంతుష్టుడై యుండునో, తన సమస్త కర్మలు నీకు అర్పించివేయునో, అతని మనస్సే నీకు శుభావాసము (58). ఎవరు అప్రియము పొంది ద్వేషించరో, ప్రియము పొంది హర్షించరో, ఈ సమస్త ప్రపంచము మాయా కల్పిత మని నిశ్చయము కలిగి సదా నీ భజనము చేయుచుందురో వారి మనసు నీకు స్థానము (59). ఎవరు షడ్వికారము లను ఆత్మయందు కాక, శరీరమునందు మాత్రమే చూచునో, ఆకలిదప్పులు, సుఖదుఃఖములు, భయానందములు మొదలగునవి బుద్ధి వికారములుగా గుర్తించునో, ఎవడు సాంసారిక ధర్మములనుండి స్వయముగా విముక్తుడై యుండునో అతని మనసే నీ నిజమందిరము (60-61).

పశ్యంతి యే సర్వగుహాశయస్థం
త్వాం చిద్ఘనం సత్యమనంతమేకమ్,
అలేపకం సర్వగతం వరేణ్యం
తేషాం హృదబ్జే సహ సీతయా వస. 62

నిరంతరాభ్యాసదృఢీ కృతాత్మనాం
త్వత్పాదసేవాపరినిష్ఠితానామ్,
త్వన్నామకీర్త్యా హతకల్మషాణాం
సీతాసమేతస్య గృహం హృదబ్జే. 63

రామ త్వన్నామమహిమా వర్ణ్యతే కేన వా కథమ్,
యత్ప్రభావాదహం రామ బ్రహ్మర్షిత్వమవాప్తవాన్. 64

అహం పురా కిరాతేషు కిరాతైః సహ వర్ధితః,
జన్మమాత్రద్విజత్వం మే శూద్రాచారరతః సదా. 65

శూద్రాయాం బహవః పుత్రా ఉత్పన్నా మేఽజితాత్మనః,
తతశ్చోరైశ్చ సంగమ్య చోరోఽహమభవం పురా. 66

ధనుర్బాణధరో నిత్యం జీవానామంతకోపమః,
ఏకదా మునయః సప్త దృష్టా మహతి కాననే. 67

సాక్షాన్మయా ప్రకాశంతో జ్వలనార్కసమప్రభాః,
తానన్వధావం లోభేన తేషాం సర్వపరిచ్ఛదాన్. 68

గ్రహీతుకామస్తత్రాహంతిష్ఠ
తిష్ఠేతి చాబ్రవమ్,
దృష్ట్వామాంమునయోఽపృచ్ఛన్
కిమాయాసి ద్విజాధమ. 69

అహం తానబ్రవం కించిదాదాతుం మునిసత్తమాః,
పుత్రదారాదయః సంతి బహవో మే బుభుక్షితాః. 70

తేషాం సంరక్షణార్థాయ చరామి గిరికాననే,
తతో మామూచురవ్యగ్రాః పృచ్ఛ గత్వా కుటుంబకమ్. 71

యో యో మయా ప్రతిదినం క్రియతే పాపసంచయః,
యూయం తద్భాగినః కిం వా నేతి నేతి పృథక్పృథక్. 72

''ఎవరు చిద్ఘనుడవు, సత్యరూపుడవు, అనంతుడవు, అద్వితీయుడవు, నిర్లేపుడవు, సర్వగతుడవు, శ్రేష్ఠుడవు, పరమేశ్వరుడవు అయిన నిన్ను సమస్త అంతఃకరణములలో విరాజిల్లెడివానిగా చూతురో, వారి హృదయకమలములందు నీవు సీతాసమేతుడవై నివసింతువు గాక! (62). నిరంతర అభ్యాసము వలన ఎవరి చిత్తము స్థిరత్వమును పొంది యుండునో, ఎవరు సర్వదా మీ చరణసేవలో నిమగ్నులై యుందురో, మీ నామకీర్తనము వలన ఎవరి పాపములు ప్రక్షాళితములగునో వారి హృదయ కమలములు సీతా సమేతుడగు నీ నివాసగృహము (63). రామా! దేని ప్రభావముచే నేను బ్రహ్మర్షిపదము పొందితినో, ఆ నామము యొక్క మహత్వము ఎవరైన ఏ విధముగా వర్ణింపగలరు? (64). పూర్వము నేను కిరాతులతోడ నుండెడివాడను. వారితోనే నా పోషణ జరిగినది. నిరంతరము నేను శూద్రాచారరతుడనై యుంటిని. జన్మమాత్రము చేత బ్రాహ్మణుడనైతిని (65). నాకు శూద్రస్త్రీ గర్భమున అనేకులు కుమారులు పుట్టిరి. నేనా సమయమున చోరుల సాంగత్యము కారణముగా గజదొంగనైతిని (66). సదా ధనుర్బాణధారినై జీవహింసాపరాయణుడనైతిని. ఒకనాడొక ఘోరవనమున నేను సప్తర్షులు వెడలుట చూచితిని. వారు దివ్యప్రభలతో, అగ్నిసూర్యులవలె తేజరిల్లుచుండిరి. వారికడనున్న వస్త్రాదులను అపహరించు కోర్కెతో నేను లోభమునకు లోబడి, వారిని వెంబడించి ''నిలునిలుడని'' అరచితిని. అంతట ఆ మునీశ్వరులు నావంక చూచి ''ద్విజాధమా! ఎందులకిటు వచ్చుచుంటి''వని ప్రశ్నించిరి (67-69). నేను ''మునిపుంగవులారా! నాకు చాలామంది ఆకలితో బాధపడుచున్న కళత్రపుత్రులు కలరు. వారిని పోషించుకొనుటకై ఏదైన గ్రహించుటకు వచ్చుచున్నాను (70). వారిని పోషించుటకే వన పర్వతాదుల యందు సంచరించుచున్నాను'' అని బదులిచ్చితిని. అంతట ఆ మునీశ్వరులు నాతో నిర్భయముగా ''సరియే! ఒకసారి నీవారి కడకేగి వారిలో ఒక్కొక్కరిని నీవు ప్రతిదినము వారికై చేయు పాపమును వారు పంచుకొందురో లేదో వేరువేరుగా అడిగి తెలిసికొనుము (71-72).

వయం స్నాస్యామహే తావదాగమిష్యసి నిశ్చయః,
తథేత్యుక్త్వా గృహం గత్వా మునిభిర్యదుదీరితమ్. 73

అపృచ్ఛం పుత్రదారాదీంస్తైరుక్తోఽహం రఘూత్తమ,
పాపం త్వైవ తత్సర్వం వయం తు ఫలభాగినః. 74

తచ్ఛ్రుత్వా జాతనిర్వేదో విచార్య పునరాగమమ్,
మునయో యత్ర తిష్ఠంతి కరుణాపూర్ణమానసాః. 75

మునీనాం దర్శనాదేవ శుద్ధాంతఃకరణోఽభవమ్,
ధనురాదీన్పరిత్యజ్య దండవత్పతితోఽస్మ్యహమ్. 76

రక్షధ్వం మాం మునిశ్రేష్ఠా గచ్ఛంతం నిరయార్ణవమ్,
ఇత్యగ్రే పతితం దృష్ట్వా మామూచుర్మునిసత్తమాః. 77

ఉత్తిష్ఠోత్తిష్ఠ భద్రం తే సఫలః సత్సమాగమః,
ఉపదేక్ష్యామహే తుభ్యం కించిత్తేనైవ మోక్ష్యసే,
పరస్పరం సమాలోచ్య దుర్వృత్తోఽయం ద్విజాధమః.
78

ఉపేక్ష్య ఏవ సద్వృత్తైస్తథాపి శరణం గతః,
రక్షణీయః ప్రయత్నేన మోక్షమార్గోపదేశతః. 79

ఇత్యుక్త్వా రామ తే నామ వ్యత్యస్తాక్షరపూర్వకమ్,
ఏకాగ్రమనసాఽత్రైవ మరేతి జప సర్వదా. 80

ఆగచ్ఛామః పునర్యావత్తావదుక్తం సదా జప,
ఇత్యుక్త్వా ప్రయయుః సర్వే మునయో దివ్యదర్శనాః. 81

అహం యథోపదిష్టం తైస్తథాకరవమంజసా,
జపన్నేకాగ్రమనసా బాహ్యం విస్మృతవానహమ్. 82

ఏవం బహుతిథే కాలే గతే నిశ్చలరూపిణః,
సర్వసంగవిహీనస్య వల్మీకోఽభూన్మమోపరి. 83

ఈ విషయము తెలిసికొని నీవు మరలివచ్చువరకు నిశ్చయముగా మేమిచ్చట నిలిచియుండెదము'' అని పలికిరి. దానికి నేను ఒడంబడి, యింటికి పోయి, మునివరులు చెప్పినరీతి నా స్త్రీపుత్రులను అడిగితిని. రాఘవా! నా వారు, నీ పాపము నీదే! మేము నీ వలన ప్రాప్తించిన ధనాదికము మాత్రమే అనుభవించు వారమని పలికిరి (73–74). అది విని నాకు వైరాగ్యము కలిగినది. నేను దుఃఖించుచు, పరిపూర్ణ కరుణాంతరంగులగు మునీశ్వరుల కడకు వచ్చితిని (75). అంతట నా మునీశ్వరుల దర్శన మాత్రముననే నా అంతఃకరణము పరిశుద్ధమాయెను. నేను ధనుర్బాణాదులను పారవైచి, సాష్టాంగ దండప్రణామము లాచరించితిని (76). ''మునిశ్రేష్ఠులారా! పాప సముద్రమున పడియున్న నన్ను రక్షింపుడు'' అని ఏడ్చుచు తమ పాదముల యందు పడియున్న నన్ను చూచి మునివరులిట్లనిరి (77)– ''లెమ్ము! నీయీ సత్సంగము సఫలమైనది. నీకు తప్పక మేలు కలుగగలదు. మేము నీకు ఒకింత ఉపదేశము చేసెదము. దానిచేత నీవు ముక్తుడ వయ్యెదవు'' అని పలికి తమలో తాము విచారణ చేసికొని ''ఈ బ్రాహ్మణాధముడు అత్యంత దురాచార పరుడగుటచే ఉత్తమపురుషులకు ఉపేక్షాపాత్రుడు. అయినను శరణాగతుడు కావున మోక్షమార్గము నుపదేశించి ప్రయత్నపూర్వకముగా ఈతనిని కాపాడి తీరవలెను'' (78–79), అని నిర్ణయించికొనిరి. వారు అంతట నీ నామమును తారుమారు చేసి ''నీవు ఈ స్థానముననే యుండి ఏకాగ్రచిత్తముతో 'మరా మరా' యని జపించుచుండుము (80). మేము తిరిగి వచ్చునంతవరకు నీవు సర్వదా మాచే చెప్పబడిన రీతి ఈ మంత్రమును జపించుచుండుము'' అని పలికి దివ్యదర్శనులగు వారు వెడలిపోయిరి (81). అంతట నేను వారుపదేశించిన రీతి ఆచరించితిని. ఆ విధముగా ఏకాగ్రచిత్తముతో జపము నిరంతరము చేయుచుండగ నేను బాహ్యప్రపంచమును మరచిపోతిని (82). ఆ విధముగా బహుకాలము నిశ్చలముగానుండుటచే సర్వసంగవిహీనుడనైన నాపై పుట్టలు (వల్మీకము) ఏర్పడెను (83).

తతో యుగసహస్రాంతే ఋషయః పునరాగమన్.
మామూచుర్నిష్క్రమస్వేతి తచ్ఛ్రుత్వా తూర్ణముత్థితః. 84

వల్మీకాన్నిర్గతశ్చాహం నీహారాదివ భాస్కరః,
మామప్యాహుర్మునిగణా వాల్మీకిస్త్వం మునీశ్వర. 85

వల్మీకాత్సంభవో యస్మాద్ద్వితీయం జన్మ తేఽభవత్,
ఇత్యుక్త్వా తే యయుర్దివ్యగతిం రఘుకులోత్తమ. 86

అహం తే రామ నామ్నశ్చ ప్రభావాదీదృశోఽభవమ్,
అద్య సాక్షాత్ప్రపశ్యామి ససీతం లక్ష్మణేన చ. 87

రామం రాజీవపత్రాక్షం త్వాం ముక్తో నాత్ర సంశయః,
ఆగచ్ఛ రామ భద్రం తే స్థలం వై దర్శయామ్యహమ్. 88

ఏవముక్త్వా మునిః శ్రీమాన్ లక్ష్మణేన సమన్వితః,
శిష్యైః పరివృతో గత్వా మధ్యే పర్వతగంగయోః. 89

తత్ర శాలాం సువిస్తీర్ణాం కారయామాస వాసభూః,
ప్రాక్పశ్చిమం దక్షిణోదక్ శోభనం మందిరద్వయమ్. 90

జానక్యా సహితో రామో లక్ష్మణేన సమన్వితః,
తత్ర తే దేవసదృశా హ్యావసన్ భవనోత్తమే. 91

వాల్మీకినా తత్ర సుపూజితోఽయం
రామః ససీతః సహ లక్ష్మణేన,
దేవైర్మునీంద్రైః సహితో ముదాస్తే
స్వర్గే యథా దేవపతిః సశచ్యా. 92

అనంతరము వేయియుగములు గడచిన తరువాత ఆ ఋషిగణము మరలవచ్చి వెలుపలికి రమ్మని ఆదేశించినది. ఆ మాట విని నేను లేచి నిలబడితిని (84). పొగమంచు ఛేదించుకొని సూర్యుడు బహిర్గతుడగునట్లు, నేను వల్మీకమునుండి బయలువెడలితిని. అంత నా మునిగణము నీవు వల్మీకము నుండి బయటికి వచ్చితివి. ఇది నీకు మరియొక జన్మము. అందువలన నీవిక వాల్మీకి వగుదువు'' అని చెప్పెను. రాఘవా! ఆ విధముగా పలికి, వారు దివ్యలోకమునకు వెడలిరి (85-86). రామా! నీ నామప్రభావముచేతనే నేనిట్టివాడ నైతిని. నేడు సీతా లక్ష్మణ సమేతుడవైన కమలనయనుడవు నిన్ను నేను చూచుచున్నాను. ఆహా! నిస్సందేహముగా నేను ముక్తుడను. రామా! నీకు శుభమగుగాక! రమ్ము! మీరు వసించుటకు తగిన స్థానము చూపించెదను'' (87 -88) అని వాల్మీకి ముగించెను.

శిష్యసమేతుడై వాల్మీకి గంగానది చిత్రకూట శృంగముల నడుమ ప్రదేశము చేరి, అచట వారు నివసించుటకు ఋషిజన యోగ్యమైన విశాలమైన శాలను నిర్మింపచేసెను. అందు పూర్వపశ్చిమములుగ నొకటి ఉత్తరదక్షిణములుగా నొకటి రెండు సుందరవాటికలు నిర్మింప చేసెను (89-90). ఆ దివ్యభవనముల సీతాసమేతులై రామలక్ష్మణులు దేవతల వలె నివసింపసాగిరి (91). స్వర్గమున దేవతలతో, శచీదేవితో కూడి దేవేంద్రుడున్నట్లుల మునిజనులతో, లక్ష్మణునితో, సీతతో కూడి రాముడు సుఖముగా వసించెను (92).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అయోధ్యాకాండ - షష్ఠమ సర్గము ॥ 6 ॥

----****----

ఓం

# సప్తమ సర్గము

**సుమంత్రుడు అయోధ్యకు తిరిగివచ్చుట, దశరథమహారాజు స్వర్గస్థుడగుట, భరతుడు మేనమామల ఇంటినుండివచ్చుట, మరియు వసిష్ఠుని ఆదేశముతో తండ్రికి అంత్యేష్టిసంస్కారము చేయుట.**

శ్రీమహాదేవ ఉవాచ

సుమంత్రోఽపి తదాయోధ్యాం దినాంతే ప్రవివేశ హ,
వస్త్రేణ ముఖమాచ్ఛాద్య బాష్పాకులితలోచనః. 1

బహిరేవ రథం స్థాప్య రాజానం ద్రష్టుమాయయౌ,
జయశబ్దేన రాజానం స్తుత్వా తం ప్రణనామ హ. 2

తతో రాజా నమంతం తం సుమంత్రం విహ్వలోఽబ్రవీత్,
సుమంత్ర రామః కుత్రాస్తే సీతయా లక్ష్మణేన చ. 3

కుత్ర త్యక్తస్త్వయా రామః కిం మాం పాపినమబ్రవీత్,
సీతా వా లక్ష్మణో వాపి నిర్దయం మాం కిమబ్రవీత్. 4

హా రామ! హా గుణనిధే! హా సీతే! ప్రియవాదిని!
దుఃఖార్ణవే నిమగ్నం మాం మ్రియమాణం న పశ్యసి. 5

విలప్యైవం చిరం రాజా నిమగ్నో దుఃఖసాగరే,
ఏవం మంత్రీ రుదంతం తం ప్రాంజలిర్వాక్యమబ్రవీత్. 6

రామః సీతా చ సౌమిత్రిర్మయా నీతా రథేన తే,
శృంగవేరపురాభ్యాశే గంగాకూలే వ్యవస్థితాః. 7

గుహేన కించిదానీతం ఫలమూలాదికం చ యత్,
స్పృష్ట్వా హస్తేన సంప్రీత్యా నాగ్రహీద్విససర్జ తత్. 8

వటక్షీరం సమానాయ్య గుహేన రఘునందనః,
జటాముకుటమాబధ్య మామాహ నృపతే స్వయమ్. 9

సుమంత్ర బ్రూహి రాజానం శోకస్తేఽస్తు న మత్కృతే,
సాకేతాదధికం సౌఖ్యం విపినే నో భవిష్యతి. 10

మాతుర్మే వందనం బ్రూహి శోకం త్యజతు మత్కృతే,
ఆశ్వాసయతు రాజానం వృద్ధం శోకపరిప్లుతమ్. 11

శ్రీమహాదేవుడిట్లనెను – సుమంత్రుడు సిగ్గుతో ముఖమును వస్త్రముతో కప్పుకొని కన్నుల నీరు నింపుకొని, సాయంకాల సమయమునకు అయోధ్య చేరెను (1). రథమును బయటనే నిలిపి, రాజును చూచుటకు వచ్చెను. దశరథునకు జయ శబ్దముతో స్తుతించి, నమస్కరించెను (2).

తనకు నమస్కరించుచున్న సుమంత్రుని చూచి దుఃఖపరవశుడై ''సుమంత్రా! సీతాలక్ష్మణ సమేతుడైన నా రాముడెక్కడ? నీవు అతనిని ఎక్కడ విడిచిపెట్టితివి? పాపినగు నన్ను గూర్చి అతడేమనెను? సీత గాని, లక్ష్మణుడు గాని ఈ నిర్దయుని ఏమనినారు? (4) ''హా రామా! గుణనిధీ! ప్రియవాదినీ! సీతా! దుఃఖసముద్రమున మునిగి మరణించు నన్ను కనలేరా! (5)'' అనుచు

ఎంతోసేపు విలపించి, దుఃఖములో మునిగి పోయెను. ఈ విధముగా దుఃఖించెడి అతనిని చూచి మంత్రి, చేతులు జోడించి ఇట్లనెను (6) – 'మహారాజా! నేను రాముని, సీతను, లక్ష్మణుని రథమున తీసికొని వెళ్లితిని. వారు గంగా తటమున శృంగవేర పురమున నిలిచిరి (7). అక్కడ నిషాదరాజు గుహుడు ఫలమూలాదులు తెచ్చియిచ్చెను. కాని రాముడు వానిని గ్రహించలేదు. ప్రేమతో వానిని చేతితోనే తాకి, అనుగ్రహము ప్రసాదించెను (8). అనంతరము రాఘవుడు గుహునిచే మఱ్ఱిపాలు తెప్పించుకొని తాను జడలు ధరించెను. పిమ్మట అతడు నాతో స్వయముగా ఇట్లనెను (9) ''సుమంత్రా! మాకై శోకించవలదని రాజుతో (నామాటగా) తెలుపుము. మాకు అయోధ్యకన్నను ఎక్కువ సుఖము వనవాసములోనే లభించునని చెప్పుము (10). మా తల్లికి గూడ వందనములు తెలిపి నాకై శోకించవలదనుము. వృద్ధుడు, శోకాతురుడగు రాజును ఊరడించుమని చెప్పుము. (11).

సీతా చాశ్రుపరీతాక్షీ మామాహ నృపసత్తమ,
దుఃఖగద్గదయా వాచా రామం కించిదవేక్షతీ. 12

సాష్టాంగం ప్రణిపాతం మే బ్రూహి శ్వశురయోః పదే,
ఇతి ప్రరుదతీ సీతా గతా కించిదవాఙ్ముఖీ. 13

తతస్తేఽశ్రుపరీతాక్షా నావమారురుహుస్తదా,
యావద్గంగాం సముత్తీర్య గతాస్తావదహం స్థితః. 14

తతో దుఃఖేన మహతా పునరేవాహమాగతః,
తతో రుదంతీ కౌసల్యా రాజానమిదమబ్రవీత్. 15

కైకేయ్యై ప్రియభార్యాయై ప్రసన్నో దత్తవాన్వరమ్,
త్వం రాజ్యం దేహి తస్యైవ మత్పుత్రః కిం వివాసితః. 16

కృత్వా త్వమేవ తత్సర్వమిదానీం కిం ను రోదిషి,
కౌసల్యావచనం శ్రుత్వా క్షతే స్పృష్ట ఇవాగ్నినా. 17

పునః శోకాశ్రుపూర్ణాక్షః కౌసల్యామిదమబ్రవీత్,
దుఃఖేన మ్రియమాణం మాం కిం పునర్దుఃఖయస్యలమ్. 18

ఇదానీమేవ మే ప్రాణా ఉత్క్రమిష్యంతి నిశ్చయః,
శప్తోఽహం బాల్యభావేన కేనచిన్మునినా పురా. 19

పురాహం యౌవనే దృప్తశ్చాపబాణధరో నిశి,
అచరం మృగయాసక్తో నద్యాస్తీరే మహావనే. 20

తత్రార్ధరాత్రసమయే మునిః కశ్చిత్తృషార్దితః,
పిపాసార్దితయోః పిత్రోర్జలమానేతుముద్యతః,
పూరయఞ్జలే కుంభం తదా శబ్దోఽభవన్మహాన్. 21

గజః పిబతి పానీయమితి మత్వా మహానిశి,
బాణం ధనుషి సంధాయ శబ్దవేధి సమక్షిపమ్. 22

హా హతోఽస్మీతి తత్రాభూచ్ఛబ్దో మానుషసూచకః,
కస్యాపి న కృతో దోషో మయా కేన హతో విధే. 23

రాజా! అంతట కన్నుల నీరు నింపుకొని దుఃఖముతో కంఠము గద్గదముకాగా, సీత రామునివంక చూచుచు ఇట్లనెను (12).

–'అత్తమామలకు నా సాష్టాంగదండ ప్రణామములు తెలుపు'మని శిరము వంచుకొని రోదించుచు, ఆమె అటనుండి వెడలిపోయెను (13). అటుపిదప వారు అశ్రుపూరిత నయనులై నావనెక్కిరి. వారు గంగకావలి యొడ్డు చేరువరకు నేనచ్చటనే నిలిచియుంటిని (14). తరువాతనే కడు దుఃఖముతో ఇక్కడికి చేరితిని.

అంత కౌసల్య దుఃఖించుచు రాజుతో నిట్లనెను (15)– ''మీరు ప్రసన్నులై ప్రియురాలగు కైకేయికి వరము లిచ్చివేసినారు. మీరు మీ రాజ్యము ఆమె పుత్రునకే అర్పించుకొనుడు. కాని నా కుమారుని అడవులకేల పంపితిరి? (16) చేయదలిచినదంతయు చేసి, యిపుడు రోదించనేల?'' కౌసల్య పలికిన ఈ మాటలు విని, దశరథుడు గాయములపై నిప్పులు పడిన రీతిగా వేదన ననుభవించెను (17).

ఆపై అతడు కన్నులలో దుఃఖాశ్రులు నిండ, కౌసల్యతో ఇట్లనెను – ''దుఃఖముతోనే మరణించుచున్న నన్ను మరింత దుఃఖపెట్టుటేల? (18) నా ప్రాణములు ఇప్పుడే పోవుట నిశ్చయము. పూర్వము నా మూర్ఖత్వము కారణముగా నన్నొక మునీశ్వరుడు శపించెను (19). పూర్వము యౌవన మదమునిండిన నేను చాపబాణధరుడనై, రాత్రివేళ మృగములను వేటాడుటలో నిమగ్నుడనై, నదీతీరములో అడవి యందు తిరుగుచుంటిని (20).

''అక్కడ అర్ధరాత్రమున దప్పికకలవాడైన మునిబాలకు డొకడు దప్పికచే బాధపడుచున్న తల్లిదండ్రులకు నీటిని తీసికొనిపోవుటకై నీటియందు కడవను ముంచగా పెద్దశబ్దమాయెను. ఈ నడురేయి ఏనుగేదియో నీరు త్రాగుచున్నదని భావించి, నేను శబ్దవేధి బాణమును సంధించి విడచితిని (21 – 22). తోడనే ''హా చచ్చితిని! ఓవిధీ! నేనెవ్వరికిని అపకారము చేయలేదే! నన్నెవ్వరు కొట్టిరి?

ప్రతీక్షేతే మాం మాతా చ పితా చ జలకాంక్షయా,
తచ్ఛ్రుత్వా భయసంత్రస్తస్తతోఽహం పౌరుషం వచః. 24

శనైర్గత్వాథ తత్పార్శ్వం స్వామిన్దశరథోఽస్మ్యహమ్,
అజానతా మయా విద్ధస్త్రాతుమర్హసి మాం మునే. 25

ఇత్యుక్త్వా పాదయోస్తస్య పతితో గద్గదాక్షరః,
తదా మామాహ స మునిర్మా భైషీర్నృపసత్తమ। 26

బ్రహ్మహత్యా స్పృశేన్న త్వాం వైశ్యోఽహం తపసి స్థితః,
పితరౌ మాం ప్రతీక్షేతే క్షుత్తృడ్భ్యాం పరిపీడితౌ. 27

తయోస్త్వముదకం దేహి క్షిప్రమేవావిచారయన్,
న చేత్త్వాం భస్మసాత్కుర్యాత్పితా మే యది కుప్యతి. 28

జలం దత్త్వా తు తౌ నత్వా కృతం సర్వం నివేదయ,
శల్యముద్ధర మే దేహాత్ప్రాణాంస్త్యక్ష్యామి పీడితః. 29

ఇత్యుక్తో మునినా శీఘ్రం బాణముత్పాట్య దేహతః,
సజలం కలశం ధృత్వా గతోఽహం యత్ర దంపతీ. 30

అతివృద్ధావంధదృశౌ క్షుత్పిపాసార్దితౌ నిశి,
నాయాతి సలిలం గృహ్య పుత్రః కిం వాత్ర కారణమ్. 31

అనన్యగతికౌ వృద్ధౌ శోచ్యౌ క్షుత్పరిపీడితౌ,
ఆవాముపేక్షతే కిం వా భక్తిమానావయోః సుతః. 32

ఇతి చింతావ్యాకులౌ తౌ మత్పాదన్యాసజం ధ్వనిమ్,
శ్రుత్వా ప్రాహ పితా పుత్ర కిం విలంబః కృతస్త్వయా. 33

దేహ్యావయోః సుపానీయం పిబ త్వమపి పుత్రక,
ఇత్యేవం లపతోర్భీత్వా సకాశమగమం శనైః. 34

పాదయోః ప్రణిపత్యాహమబ్రవం వినయాన్వితః,
నాహం పుత్రస్త్వయోధ్యాయా రాజా దశరథోఽస్మ్యహమ్
35

(23). అయ్యో! నా తల్లిదండ్రులు దప్పికగొన్నవారై నాకై ఎదురుచూచుచుందురు కదా!'' అను మానవుని మాటలు వినిపించినవి. అది వినిన నేను అత్యంత భయకంపితుడనై, మెల్లమెల్లగా అతని వద్దకు వెళ్ళి ఇట్లంటిని – ''స్వామీ! నేను దశరథుడను. నేనే తెలియక బాణమును విడిచితిని. మునివరా! మీరే నన్ను రక్షింపవలెను (24-25)''

అని దుఃఖపూరితకంఠుడనై అతని పాదముల వ్రాలితిని. అంత నా మునికుమారుడు నాతో ''నృపశ్రేష్ఠా! భయపడవలదు (26). నిన్ను బ్రహ్మహత్యా పాతకము అంటదు. నేను తాపసవృత్తిలో ఉన్న వైశ్యుడను. నా తల్లిదండ్రులు ఆకలిదప్పులతో అలమటించుచు నాకొరకు ఎదురుచూచుచుందురు (27). కాన వేరేమియు యోచింపక, వేగమే నీవు వారికి జలమునిచ్చిరమ్ము. లేకున్నచో నా తండ్రి కుపితుడైనచో నిన్ను భస్మము చేయును (28). వారికి జలమునిచ్చి నమస్కరించి చేసినదంతయు నివేదింపుము. బాణపీడితుడను. శరీరమునుండి బాణము పెరికివేయుము. నేను ప్రాణములు విడిచెదను (29)''. మునిబాలుడట్లు పలుకగా వెంటనే అతని దేహమునుండి బాణమును తీసివైచి, నీరు నింపిన కలశము తీసికొని వృద్ధదంపతులున్నచోటికి పోయితిని (30). ''అతివృద్ధులము! అంధులము! ఆకలిదప్పుల అలమటించుచున్నాము. ఇది రాత్రివేళ! కుమారుడింకను నీటిని కొనిరాలేదు. కారణమేమై యుండును? అతడుతప్ప వేరుగతి (రక్షకుడు) లేనివారము! దీనులము! ఆకలిదప్పుల పీడితుల మైన మమ్ము పితృభక్తి పరాయణుడైన కుమారుడు ఏల నిర్లక్ష్యము చేయుచున్నాడు?'' అని ఇద్దరు చింతించుచుండిరి. నా అడుగుల చప్పుడు విని, తండ్రి ఇట్లనెను – ''కుమారా! నీవెందులకు ఆలసించితివి? మంచినీటిని మాకిద్దరకు ఇమ్ము. నీవు కూడా త్రాగుము నాయనా!''. ఈ మాటలు విని భయముతో మెల్లగా వారి సమీపమునకు పోయితిని (30-34).

వారి పాదములకు నమస్కరించి వినయ పూర్వకముగా ఇట్లంటిని – ''నేను మీ కుమారుడను కాను. అయోధ్యానగరి రాజాను. దశరథుడను (35).

పాపోఽహం మృగయాసక్తో రాత్రౌ మృగవిహింసకః,
జలావతారాద్దూరేఽహం స్థిత్వా జలగతం ధ్వనిమ్. 36

శ్రుత్వాహం శబ్దవేధిత్వాదేకం బాణమథాత్యజమ్,
హతోఽస్మీతి ధ్వనిం శ్రుత్వా భయాత్తత్రాహమాగతః. 37

జటా వికీర్య పతితం దృష్ట్వాహం మునిదారకమ్,
భీతో గృహీత్వా తత్పాదౌ రక్ష రక్షేతి చాబ్రువమ్. 38

మా భైషీరితి మాం ప్రాహ బ్రహ్మహత్యాభయం న తే,
మత్పిత్రోః సలిలం దత్త్వా నత్వా ప్రార్థయ జీవితమ్. 39

ఇత్యుక్తో మునినా తేన హ్యాగతో మునిహింసకః,
రక్షతాం మాం దయాయుక్తౌ యువాం హి శరణాగతమ్. 40

నేను పాపిని. వేటయందాసక్తుడనై, రాత్రివేళయందు మృగములను వధించుచు జలాశయమునకు కొంతదూరమున నిలిచియుండి 'బుడబుడ' మను నీటిధ్వని విని అక్కడ మృగమేదో ఉన్నదని భావించి శబ్దవేధి బాణమును విడిచితిని. 'హా! చచ్చితిని' అను ధ్వనిని విని భయముతో అక్కడకు వచ్చితిని (36-37).

''విప్పారిన జటలతో క్రిందపడియున్న ఒక మునికుమారుని చూచి, భయపడి; అతని పాదములు పట్టుకొని 'రక్షింపుమని' వేడుకొంటిని. అపుడతడిట్లనెను (38) - 'భయపడవలదు. నీకు బ్రహ్మహత్యా దోషము లేదు. నా తల్లిదండ్రులకు నీరిచ్చి, నమస్కరించి ప్రాణదానమును కోరుకొనుము'(39). మీ కుమారుని చంపిన పాపాత్ముడను నేను. మీరు దయాశీలురు. మీకు శరణంటిని. నన్ను రక్షింపుడు (40)''.

ఇతి శ్రుత్వా తు దుఃఖార్తౌ విలప్య బహు శోచ్య తమ్,
పతితౌ నౌ సుతో యత్ర నయ తత్రావిలంబయన్. 41

తతో నీతౌ సుతో యత్ర మయా తౌ వృద్ధదమ్పతీ,
స్పృష్ట్వా సుతం తౌ హస్తాభ్యాం బహుశోఽథ విలేపతుః. 42

హాహేతి క్రందమానౌ తౌ పుత్రపుత్రేత్యవోచతామ్,
జలం దేహీతి పుత్రేతి కిమర్థం న దదాస్యలమ్. 43

తతో మామూచతుః శీఘ్రం చితిం రచయ భూపతే,
మయా తథైవ రచితా చితిస్తత్ర నివేశితాః,
త్రయస్తత్రాగ్నిరుత్సృష్టో దగ్ధాస్తే త్రిదివం యయుః. 44

తత్ర వృద్ధః పితా ప్రాహ త్వమప్యేవం భవిష్యసి,
పుత్రశోకేన మరణం ప్రాప్స్యసే వచనాన్మమ. 45

స ఇదానీం మమ ప్రాప్తః శాపకాలోఽనివారితః,
ఇత్యుక్త్వా విలలాపాథ రాజా శోకసమాకులః. 46

ఇది విని వారు దుఃఖార్తులై, రోదించుచు నేలపై బడి, ''మా కుమారుడెక్కడ నున్నాడో అక్కడకు మమ్ము త్వరగా గొనిపొమ్ము'' అని పలికిరి (41). బాలుడు పడియున్నచోటికి వృద్ధదంపతులను నేను కొనిపోయితిని. వారా బాలుని చేతులతో స్పృశించి ఎంతగానో విలపించిరి (42). 'హా!హా!' యనుచు 'కుమారా! కుమారా!' యనుచు, 'నాయనా! మాకింత నీటినీయుము' యనుచు, 'ఎందులకు ఈయవు చాలు!' అనుచు విలపించిరి (43).

తదుపరి వారు నాతో ''రాజా! వెంటనే చితి పేర్చుము'' అని అడిగిరి. అపుడే నేను చితి పేర్చితిని. వారు ముగ్గురిని చితిపై చేర్చితిని. చితికి నిప్పు ముట్టించబడగా ముగ్గురు దగ్ధులై స్వర్గము చేరిరి (44).

ఆ సమయమున వృద్ధుడగు తండ్రి నాతో ''నీకు ఈ గతియే ప్రాప్తించును. నీవును పుత్రశోకముతో మరణము పొందెదవు'' అని పలికి నన్ను శపించెను (45). అనివార్యమైన ఆ శాపరూపమగు మృత్యువు నేడు నాకు ప్రాప్తించినది'' అని పలికి దశరథమహారాజు అత్యంత శోకాతురుడై విలపించ సాగెను (46).

హా రామ! పుత్ర! హా సీతే! హా లక్ష్మణ గుణాకర!
త్వద్వియోగాదహం ప్రాప్తో మృత్యుం కైకేయిసంభవమ్. 47

వదన్నేవం దశరథః ప్రాణాంస్త్యక్త్వా దివం గతః,
కౌసల్యా చ సుమిత్రా చ తథాన్యా రాజయోషితః. 48

చుక్రుశుశ్చ విలేపుశ్చ ఉరస్తాడనపూర్వకమ్,
వసిష్ఠః ప్రయయౌ తత్ర ప్రాతర్మంత్రిభిరావృతః. 49

తైలద్రోణ్యాం దశరథం క్షిప్త్వా దూతానథాబ్రవీత్,
గచ్ఛత త్వరితం సాశ్వా యుధాజిన్నగరం ప్రతి. 50

తత్రాస్తే భరతః శ్రీమాఞ్ఛత్రుఘ్నసహితః ప్రభుః,
ఉచ్యతాం భరతః శీఘ్రమాగచ్ఛేతి మమాజ్ఞయా. 51

అయోధ్యాం ప్రతి రాజానం కైకేయీం చాపి పశ్యతు,
ఇత్యుక్తాస్త్వరితం దూతా గత్వా భరతమాతులమ్, 52

యుధాజితం ప్రణమ్యోచుర్భరతం సానుజం ప్రతి,
వసిష్ఠస్త్వాఽబ్రవీద్రాజన్ భరతః సానుజః ప్రభుః. 53

శీఘ్రమాగచ్ఛతు పురీమయోధ్యామవిచారయన్,
ఇత్యాజ్ఞప్తోఽథ భరతస్త్వరితం భయవిహ్వలః. 54

ఆయయౌ గురుణాదిష్టః సహ దూతైస్తు సానుజః,
రాజ్ఞో వా రాఘవస్యాపి దుఃఖం కించిదుపస్థితమ్. 55

ఇతి చింతాపరో మార్గే చింతయన్నగరం యయౌ,
నగరం భ్రష్టలక్ష్మీకం జనసంబాధవర్జితమ్. 56

ఉత్సవైశ్చ పరిత్యక్తం దృష్ట్వా చింతాపరోఽభవత్,
ప్రవిశ్య రాజభవనం రాజలక్ష్మీవివర్జితమ్. 57

అపశ్యత్కైకయీం తత్ర ఏకామేవాసనే స్థితామ్.
ననామ శిరసా పాదౌ మాతుర్భక్తిసమన్వితః. 58

ఆగతం భరతం దృష్ట్వా కైకేయీ ప్రేమసంభ్రమాత్,
ఉత్థాయాలింగ్య రభసా స్వాంకమారోప్య సంస్థితా. 59

'కుమారా! రామా! హా సీతా! గుణనిధీ! హా లక్ష్మణా! కైకేయి వలన కలిగిన మీ వియోగ కారణముగా మృత్యువు వాత బడుచున్నాను (47)'' అని పలుకుచు దశరథమహారాజు ప్రాణములు వదలి స్వర్గమును చేరెను. ఆ సమయమున కౌసల్య, సుమిత్ర, ఇతర రాణులు గుండెలు బాదుకొనుచు రోదించసాగిరి. ఉదయముననే మునివరుడగు వశిష్ఠమహర్షి ఏగుదెంచెను (48-49). దశరథుని శవమును ఒక తైలద్రోణి యందుంచి, దూతలను పిలిచి, వారితో 'మీరు అశ్వారూఢులై త్వరితగతిని, యుధాజిత్తుని నగరమున కేగుడు (50). అచట శత్రుఘ్నసహితుడై ప్రభువగు భరతు డున్నాడు. అతనికి నా ఆజ్ఞగా వేగమే అయోధ్యకు వచ్చి, మహారాజును కైకను దర్శింపుమని తెలుపుడు'' అని చెప్పెను. ఇట్లు వేగిరపెట్టగా దూతలు వెళ్లి, భరతుని మేనమామయగు యుధాజిత్తునకు నమస్కరించి, సోదర యుతుడైన తమ యజమాని భరతునితో యిట్లనిరి ''రాజా! మా స్వామియగు భరతుడు తమ్మునితో సహా వేరు ఆలోచన లేక, వెంటనే అయోధ్యాపురికి వచ్చుగాక యని వశిష్ఠులు నీకు తెలిపిరి''. ఈ ఆజ్ఞ విని, భయముతో భరతుడు వ్యాకులుడై గుర్వాజ్ఞ ననుసరించి సోదరయుతుడై దూతలతో ప్రయాణమయ్యెను. ''అవశ్యముగా రాజునకు గాని, రాఘవునకు గాని ఏదియో దుఃఖము కలిగియుండును'' (51-55) అని మార్గమున చింతించుచు, నగరమును చేరెను. శోభావిహీనముగా, జనసమూహములులేక, ఉత్సవములులేక యున్న నగరమును చూచి అతడెంతయో చింతించెను. రాజభవనమునకు పోయి చూడగా అదియు కళావిహీనమైయుండెను. అక్కడ ఒక్క కైకేయి మాత్రమే ఆసనముపై యుండుట చూచెను. అతడు భక్తితో శిరసు వంచి, పాదములకు ప్రణమిల్లెను (56-58).

భరతుడు రాగాచూచి, తల్లియగు కైకేయి అతనిని ప్రేమతో లేవనెత్తి, త్వరగా హృదయమునకు హత్తుకొని ఒడిలో కూర్చుండబెట్టుకొనెను (59). పిమ్మట అతని

మూర్ధ్న్యవఘ్రాయ పప్రచ్ఛ కుశలం స్వకులస్య సా,
పితా మే కుశలీ భ్రాతా మాతా చ శుభలక్షణా. 60

దిష్ట్యా త్వమద్య కుశలీ మయా దృష్టోఽసి పుత్రక,
ఇతి పృష్టః స భరతో మాత్రా చింతాకులేంద్రియః. 61

ధూయమానేన మనసా మాతరం సమపృచ్ఛత,
మాతః పితా మే కుత్రాస్తే ఏకా త్వమిహ సంస్థితా. 62

త్వయా వినా న మే తాతః కదాచిద్రహసి స్థితః,
ఇదానీం దృశ్యతే నైవ కుత్ర తిష్ఠతి మే వద. 63

అదృష్ట్వా పితరం మేఽద్య భయం దుఃఖం చ జాయతే,
అథాహ కైకయీ పుత్రం కిం దుఃఖేన తవానఘ. 64

యా గతిర్ధర్మశీలానామశ్వమేధాదియాజినామ్,
తాం గతిం గతవానద్య పితా తే పితృవత్సల! 65

తచ్ఛ్రుత్వా నిపపాతోర్వ్యాం భరతః శోకవిహ్వలః,
హా తాత క్వ గతోఽసి త్వం త్యక్త్వా మాం వృజినార్ణవే. 66

అసమర్ప్యైవ రామాయ రాజ్ఞే మాం క్వ గతోఽసి భోః,
ఇతి విహ్వలితం పుత్రం పతితం ముక్తమూర్ధజమ్. 67

ఉత్థాప్యామృజ్య నయనే కైకేయీ పుత్రమబ్రవీత్,
సమాశ్వసిహి భద్రం తే సర్వం సంపాదితం మయా. 68

తామాహ భరతస్తాతో మ్రియమాణః కిమబ్రవీత్,
తమాహ కైకయీ దేవీ భరతం భయవర్జితా. 69

హా రామ రామ సీతేతి లక్ష్మణేతి పునః పునః,
విలపన్నేవ సుచిరం దేహం త్యక్త్వా దివం యయౌ. 70

తామాహ భరతో హేఽంబ రామః సన్నిహితో న కిమ్,
తదానీం లక్ష్మణో వాపి సీతా వా కుత్ర తే గతాః. 71

శిరము మూర్కొని పుట్టింటివారి కుశలమిట్లడిగెను – ''నా తండ్రి, సోదరుడు, శుభలక్షణయగు నా తల్లి కుశలమే గదా! (60) నాయనా! నేడు బహు భాగ్యవశమున నిన్ను క్షేమముగా చూచుచున్నాను''.

అని తల్లి పలుకగా, భరతుడు చింతాక్రాంతమైన మనస్సుతో ''అమ్మా! తండ్రిగారెక్కడ? నీవు ఒంటరిగా ఉంటివేమి? నీవు లేకుండగ తండ్రిగారు ఏకాంతమున ఉండరు కదా! వారిట కనిపించుట లేదే! ఎక్కడ ఉన్నారు? (61–63). తండ్రిని చూడక నాకిపుడు భయము దుఃఖము కలుగుచున్నవి'' అని అడిగెను.

అపుడు కైకేయి ''పుణ్యశీలుడా! నీకు దుఃఖమేల? (64) పితృవత్సలా! ధర్మపరాయణులు, అశ్వమేధాది యజ్ఞకర్తలు, ఏ ఉత్తమగతిని పొందెదరో అట్టిగతినే నేడిపుడు నీ తండ్రియు పొందినారు (65)'' అనెను.

ఆ మాట విన్నంతనే భరతుడు శోకార్తుడై నేలపై కూలెను. ''హా! తండ్రీ! నన్ను దుఃఖసముద్రమున విడిచి, నీవెక్కడికి పోతివి (66). నన్ను రామునకు ఒప్పగించకయే నీవెక్కడికి పోతివి?'' అని విలపించుచు చెదరిన కేశములతో నేలకూలిన కుమారుని లేవనెత్తి, కైకేయి కన్నీరు తుడిచి, కుమారునితో యిట్లనెను – ''నాయనా! ఊరడిల్లుము! నీకు మేలగు గాక! నీకొరకు సర్వమును చక్కబరచితిని'' (67–68).

భరతుడపుడిట్లడిగెను –''మరణించువేళ మహారాజు ఏమని పలికెను?'' కైకేయి నిర్భయురాలై భరతునితో నిట్లనెను (69). ''అతడు హారామా! హారామా! హాసీతా! హాలక్ష్మణా! అని చాలసేపు విలపించుచునే శరీరము వదలి స్వర్గమును చేరెను'' (70).

భరతుడా మాట విని ''అమ్మా! అట్లయిన ఆ సమయమున రాముడు దగ్గర లేకుండెనా? లక్ష్మణుడు గాని సీతగాని లేకుండిరా! వా రెచటికి పోయిరి''అని ప్రశ్నించెను (71).

కైకేయ్యువాచ

రామస్య యౌవరాజ్యార్థం పిత్రా తే సంభ్రమః కృతః,
తవ రాజ్యప్రదానాయ తదాహం విఘ్నమాచరమ్. 72

రాజ్ఞా దత్తం హి మే పూర్వం వరదేన వరద్వయమ్,
యాచితం తదిదానీం మే తయోరేకేన తేఽఖిలమ్. 73

రాజ్యం రామస్య చైకేన వనవాసో మునివ్రతమ్,
తతః సత్యపరో రాజా రాజ్యం దత్త్వా తవైవ హి. 74

రామం సంప్రేషయామాస వనమేవ పితా తవ,
సీతాప్యనుగతా రామం పాతివ్రత్యముపాశ్రితా. 75

సౌభ్రాత్రం దర్శయన్ రామమనుయాతోఽపి లక్ష్మణః,
వనం గతేషు సర్వేషు రాజా తానేవ చింతయన్. 76

ప్రలపన్ రామ రామేతి మమార నృపసత్తమః,
ఇతి మాతుర్వచః శ్రుత్వా వజ్రాహత ఇవ ద్రుమః. 77

పపాత భూమౌ నిస్సంజ్ఞస్తం దృష్ట్వా దుఃఖితా తదా,
కైకేయీ పునరప్యాహ వత్స శోకేన కిం తవ. 78

రాజ్యే మహతి సంప్రాప్తే దుఃఖస్యావసరః కుతః,
ఇతి బ్రువంతీమాలోక్య మాతరం ప్రదహన్నివ. 79

అసంభాష్యాసి పాపే మే ఘోరే త్వం భర్తృఘాతినీ,
పాపే త్వద్గర్భజాతోఽహం పాపవానస్మి సాంప్రతమ్,
అహమగ్నిం ప్రవేక్ష్యామి విషం వా భక్షయామ్యహమ్. 80

ఖడ్గేన వాథ చాత్మానం హత్వా యామి యమక్షయమ్,
భర్తృఘాతిని దుష్టే త్వం కుంభీపాకం గమిష్యసి. 81

ఇతి నిర్భర్త్స్య కైకేయీం కౌసల్యాభవనం యయౌ,
సాపి తం భరతం దృష్ట్వా ముక్తకంఠా రురోద హ. 82

పాదయోః పతితస్తస్యా భరతోఽపి తదారుదత్,
ఆలింగ్య భరతం సాధ్వీ రామమాతా యశస్వినీ,
కృశాతిదీనవదనా సాశ్రునేత్రేదమబ్రవీత్. 83

కైకేయి యిట్లనెను - ''రాముని యౌవ రాజ్యాభిషేకమునకు నీ తండ్రి సన్నాహములు చేసెను. కాని నీకు రాజ్య మిప్పించుటకు దానికి నేను విఘ్నము కలిగించితిని (72).

ఇతఃపూర్వము రాజొకసారి ప్రసన్నుడై నాకు రెండు వరము లిచ్చియున్నాడు. ఈ సమయమున వరములలో నొకటిగా నీకొరకై సకల సామ్రాజ్యమును, రెండవ వరముగా రామునకు మునివ్రతముతో వనవాసము కోరియుంటిని. ఆ కారణమున నీ తండ్రి, సత్యసంధుడగు దశరథమహారాజు నీకే రాజ్యమిచ్చి, రాముని వనములకే పంపెను. పాతివ్రత్యము పాటించుచు సీత రామునివెంట వనము కేగినది (73–75). భ్రాతృప్రేమ ప్రదర్శించుచు లక్ష్మణుడు రాముని అనుసరించెను. ఈ విధముగా వారు వనవాసమున కేగగా వారినే స్మరించుచు 'రామా! రామా!' యని విలపించుచు మహారాజు మరణించెను''. తల్లిమాటలు విని పిడుగుపాటు నందిన వృక్షమువలె భరతుడు నిశ్చేష్టుడై నేలకొరిగెను. అతనిని ఆ దశలో చూచి, కైక దుఃఖితురాలై ''వత్సా! నీకి శోకమేల! (76–78). ఇంతటి విశాల సామ్రాజ్యమును పొందిన నీవు దుఃఖింపవలసిన అవసరమేమున్నది?'' అనెను. ఇటుల మాటలాడుచున్న తల్లిని దహించివేయువానివలె చూచి భరతు డిట్లనెను - ''నీవు పలుకరించబడుటకు తగనిదానవు. నా పాపస్వరూపమే నీవు. క్రూరురాలా! నీవు భర్తృ హంతకురాలవు. పాపిష్ఠురాలా! నేను నీ కడుపున పుట్టిన కారణమున నేనిపుడు మహాపాపిని అయితిని. నేను అగ్నిప్రవేశము చేయుదును. లేదా విషమైనను భక్షింతును (79 - 80). లేదా ఖడ్గముతో ఆత్మహత్య గావించుకొని యమ సదనమునకు పోయెదను. భర్తృఘాతినీ! దుష్టురాలా! నీవును కుంభీపాక నరకమును చేరుదువు'' (81).

కైకను ఈ విధముగా గద్దించి, అతడు కౌసల్యా మందిరమునకు వెళ్లెను. భరతుని చూడగనే కౌసల్య ఎలుగెత్తి ఏడువసాగెను (82). అపుడు భరతుడుకూడ ఆమె చరణముల వ్రాలి రోదించసాగెను. పతివ్రత, యశస్విని, శోకముచే

పుత్ర త్వయి గతే దూర దేవం సర్వమభూదిదమ్.
ఉక్తం మాత్రా శ్రుతం సర్వం త్వయా తే మాతృచేష్టితమ్. 84

పుత్రః సభార్యో వనమేవ యాతః
సలక్ష్మణో మే రఘురామచంద్రః,
చీరాంబరో బద్ధజటాకలాపః
సంత్యజ్య మాం దుఃఖసముద్రమగ్నామ్. 85

హా రామ! హా! మే రఘువంశనాథ!
జాతోఽసి మే త్వం పరతః పరాత్మా
తథాపి దుఃఖం న జహాతి మాం వై
విధిర్బలీయానితి మే మనీషా. 86

స ఏవం భరతో వీక్ష్య విలపంతీం భృశం శుచా,
పాదౌ గృహీత్వా ప్రాహేదం శృణు మాతర్వచో మమ. 87

కైకేయ్యా యత్కృతం కర్మ రామరాజ్యాభిషేచనే,
అన్యద్వా యది జానామి సా మయా నోదితా యది. 88

పాపం మేఽస్తు తదా మాతర్బ్రహ్మహత్యాశతోద్భవమ్,
హత్వా వసిష్ఠం ఖడ్గేన అరుంధత్యా సమన్వితమ్. 89

భూయాత్తత్పాపమఖిలం మమ జానామి యద్యహమ్,
ఇత్యేవం శపథం కృత్వా రురోద భరతస్తదా. 90

కౌసల్యా తమథాలింగ్య పుత్ర! జానామి మా శుచః,
ఏతస్మిన్నంతరే శ్రుత్వా భరతస్య సమాగమమ్. 91

వసిష్ఠో మంత్రిభిః సార్ధం ప్రయయౌ రాజమందిరమ్,
రుదంతం భరతం దృష్ట్వా వసిష్ఠః ప్రాహ సాదరమ్. 92

వృద్ధో రాజా దశరథో జ్ఞానీ సత్యపరాక్రమః,
భుక్త్వా మర్త్యసుఖం సర్వమిష్ట్వా విపులదక్షిణైః. 93

అశ్వమేధాదిభిర్యజ్ఞైర్లబ్ధ్వా రామం సుతం హరిమ్,
అంతే జగామ త్రిదివం దేవేంద్రార్ధాసనం ప్రభుః. 94

తం శోచసి వృథైవ త్వమశోచ్యం మోక్షభాజనమ్,
ఆత్మా నిత్యోఽవ్యయః శుద్ధో జన్మనాశాదివర్జితః. 95

చిక్కినది, దీనవదన అయిన రామమాత కౌసల్య భరతుని అక్కున చేర్చుకొని "నీవు దూరమునకు వెడలిపోగా, ఇదంతయు జరిగినది. తల్లి చెప్పియే యుండును. నీ తల్లి చెయిదములు సర్వము వినియేయుందువు (84).

నాయనా! నా పుత్రుడు రఘురాముడు భార్యయగు సీతతో, లక్ష్మణునితో, నారచీరలు కట్టి జటాధారియై నన్ను దుఃఖసముద్రమున మునిగినదానిగా చేసి, అడవికే పోయినాడు (85).

"హా! రామా! రఘువంశనాథా! పరాత్పరుడవు, పరమాత్మవు నీవే నా కడుపున పుట్టినను దుఃఖము నన్ను వీడలేదు కదా! విధి బలీయమని నే తలతును" (86). ఇట్లు బహుధా విలపించెడి కౌసల్యను చూచి ఆమె పాదములు పట్టుకొని భరతుడిట్లనెను - "తల్లీ! నా మాట వినుము! (87). కైకేయి రాముని రాజ్యాభిషేక విషయమున గాని, మరియే ఇతరమును గాని ఏమేమి చేసెనో, వానిని నే నెఱిగి యున్నను (88), నాకు నూరు బ్రహ్మహత్యాపాతకములు ప్రాప్తించుగాక! అరుంధతీ సమేతుడైన వశిష్ఠుని ఖడ్గముతో నరికిన పాపము నాకు కలుగుగాక!" అని శపథము గావించి భరతుడు భోరున ఏడ్చెను (89-90). కౌసల్య అతనిని కౌగలించుకొని "నాయనా! నేనిదంతయు ఎరుగుదును. నీవు ఇక చింతించకుము" అని పలికెను.

ఈ సమయముననే భరతునిరాక విని వశిష్ఠుడు మంత్రులతో కూడి రాజభవనములోనికి వచ్చెను. విలపించుచున్న భరతుని చూచి సాదరముగా అతడిట్లు పలికెను - "నాయనా! దశరథుడు వృద్ధుడు. మహారాజు, జ్ఞాని. సత్యపరాక్రముడు. మానవుడగు వాని సర్వసుఖములు అతడనుభవించి, భూరి దక్షిణలతో చేయబడు అశ్వమేధాది యాగములు చేసి, మహావిష్ణువునే రామునిగా పుత్రునిగా పొంది, అంతమున దేవేంద్రుని అర్ధాసనముకై స్వర్గమునకు వెడలెను (93-94). శోకింపతగనివాడు, మోక్షమునకు అర్హుడు అగు అతనికై నీవు వృథాగా శోకించుచున్నావు. ఆత్మ నిత్యము. అవ్యయము, శుద్ధము, జన్మనాశములు లేనిది

శరీరం జడమత్యర్థమపవిత్రం వినశ్వరమ్,
విచార్యమాణే శోకస్య నావకాశః కథంచన. 96

పితా వా తనయో వాపి యది మృత్యువశం గతః,
మూఢాస్తమనుశోచంతి స్వాత్మతాడనపూర్వకమ్. 97

నిస్సారే ఖలు సంసారే వియోగో జ్ఞానినాం యదా,
భవేద్వైరాగ్యహేతుః స శాంతిసౌఖ్యం తనోతి చ. 98

జన్మవాన్యది లోకేఽస్మింస్తర్హి తం మృత్యురన్వగాత్,
తస్మాదపరిహార్యోఽయం మృత్యుర్జన్మవతాం సదా. 99

స్వకర్మవశతః సర్వజంతూనాం ప్రభవాప్యయౌ,
విజానన్నప్యవిద్వాన్యః కథం శోచతి బాంధవాన్. 100

బ్రహ్మాండకోటయో నష్టాః సృష్టయో బహుశో గతాః,
శుష్యంతి సాగరాః సర్వే కైవాస్థా క్షణజీవితే. 101

చలపత్రాంతలగ్నాంబుబిందువత్ క్షణభంగురమ్.
అయుస్త్యజత్యవేలాయాం కస్తత్ర ప్రత్యయస్తవ. 102

దేహీ ప్రాక్తనదేహోత్థకర్మణా దేహవాన్పునః,
తద్దేహోత్థేన చ పునరేవం దేహః సదాత్మనః. 103

యథా త్యజతి వై జీర్ణం వాసో గృహ్ణాతి నూతనమ్,
తథా జీర్ణం పరిత్యజ్య దేహీ దేహం పునర్నవమ్. 104

భజత్యేవ సదా తత్ర శోకస్యావసరః కుతః,
ఆత్మా న మ్రియతే జాతు జాయతే న చ వర్ధతే. 105

షడ్భావరహితోఽనంతః సత్యప్రజ్ఞానవిగ్రహః,
ఆనందరూపో బుద్ధ్యాదిసాక్షీ లయవివర్జితః. 106

ఏక ఏవ పరో హ్యాత్మా హ్యద్వితీయః సమః స్థితః.
ఇత్యాత్మానం దృఢం జ్ఞాత్వాత్యక్త్వా శోకం కురుక్రియామ్.
107

(95). శరీరమందువా - అది జడము, అత్యంతము అపవిత్రము, నశ్వరము. విచారించి చూడగా ఇందు శోకమునకు ఏ విధమైన అవకాశము లేదు (96).

తండ్రిగాని, తనయుడుగాని మరణించిన గుండెలు బాదుకొనుచు మూఢజనులు మాత్రమే విలపింతురు (97). నిస్సారమగు ఈ సంసారమునందు జ్ఞానులకు ఎవరితోనైన వియోగము సంభవించిన అది వైరాగ్యము కలుగుటకే కారణమగును. అది శాంతి సౌఖ్యములను కూడ విస్తరించును (98). ఎవరికైన ఈ లోకమున జన్మము సంభవించునో, వాని వెంట మృత్యువు ఉండి తీరును. జననము కలవారికి మృత్యువు అపరిహార్యము (99). తమ తమ కర్మానుసారముగనే ప్రాణు లన్నిటికి జనన మరణములు కలుగును. ఇది తెలిసి యుండి కూడ మూఢులు తమ బంధువుల కొఱకై ఎటుల శోకించెదరో చూడుము! (100). కోట్లాది బ్రహ్మాండములు నశించినవి. లెక్కకు అందని సృష్టులు గడచినవి. సకల సముద్రములు తప్పక ఇంకిపోవునవే! క్షణభంగురమగు జీవితము మీద ఆస్థ ఎందులకు? (101). కదలుచున్న ఆకు చివర వ్రేలాడెడి నీటి బిందువు వంటిది ఆయువు. దానిని నీవు ఎటుల విశ్వసించెదవు? (102). జీవుడు తన పూర్వదేహ కర్మలతో తిరిగి దేహమును పొందును. ఈ (ప్రస్తుత) శరీరముతో చేయు కర్మలతో మరియొక దేహమును పొందును. ఈ విధముగా జీవునకు పరంపరగా వేరువేరు దేహములు ప్రాప్తమగును (103). మానవుడెట్లు పాత వస్త్రమును వీడి, క్రొత్త వస్త్రమును ధరించునో అట్లే దేహ సంబంధము పొందు జీవుడు జీర్ణమైన పాత శరీరమును వదలి, నూతన శరీరము ధరించును. ఇక శోకించుటకు కారణమేమున్నది? ఆత్మ ఏనాటికి మరణించదు, జన్మించదు, వృద్ధి చెందదు (104 -105). అది షడ్వికార రహితమైనది. అనంతము. సచ్చిత్స్వరూపము. ఆనందరూపము. బుద్ధ్యాదులకు సాక్షి. లయము లేనిది (106). ఆత్మ ఒక్కటియే (ప్రకృతికన్న) పరుడు. అద్వితీయుడు. సమభావస్థితుడు. ఈ భావమును దృఢముగా తెలిసికొని ఆత్మజ్ఞానము పొంది శోకరహితుడవై సమస్త కార్యములు నిర్వహింపుము (107).

తైలద్రోణ్యాః పితుర్దేహముద్ధృత్య సచివైః సహ,
కృత్యం కురు యథాన్యాయమస్మాభిః కులనందన. 108

ఇతి సంబోధితః సాక్షాద్గురుణా భరతస్తదా,
విసృజ్యాజ్ఞానజం శోకం చక్రే స విధివత్ క్రియామ్. 109

గురుణోక్తప్రకారేణ ఆహితాగ్నేర్యథావిధి,
సంస్కృత్య స పితుర్దేహం విధిదృష్టేన కర్మణా. 110

ఏకాదశేఽహని ప్రాప్తే బ్రాహ్మణాన్వేదపారగాన్,
భోజయామాస విధివచ్ఛతశోఽథ సహస్రశః. 111

ఉద్దిశ్య పితరం తత్ర బ్రాహ్మణేభ్యో ధనం బహు,
దదౌ గవాం సహస్రాణి గ్రామాన్ రత్నాంబరాణి చ.112

అవసత్ స్వగృహే తత్ర రామమేవానుచింతయన్,
వసిష్ఠేన సహ భ్రాత్రా మంత్రిభిః పరివారితః. 113

రామేఽరణ్యం ప్రయాతే సహ జనకసుతా-
లక్ష్మణాభ్యాం సుఘోరం
మాతా మే రాక్షసీవ ప్రదహతి హృదయం
దర్శనాదేవ సద్యః,
గచ్ఛామ్యారణ్యమద్య స్థిరమతిరఖిలం
దూరతోఽపాస్య రాజ్యం
రామం సీతాసమేతం స్మితరుచిరముఖం
నిత్యమేవానుసేవే. 114

రఘుకులనందనా! భరతా! నీ తండ్రి దేహమును తైలద్రోణి నుండి వెలికితీయించి, మంత్రులతో పురోహితులమగు మాతోగూడి, విధియుక్తముగ అంత్యక్రియలు జరిపింపుము'' (108).

ఈ విధముగా గురువు బోధించిన మీదట భరతుడు అజ్ఞానజనిత శోకమును త్యజించి తన తండ్రికి విధివిధానముగ అంత్యక్రియలు చేసెను (109).

గురుని ఆజ్ఞానుసారము తండ్రిదేహమునకు ఆహితాగ్ని యగువానికి విధింపబడినరీతినే అంత్య సంస్కారములను భరతుడు గావించి (109 -110), పదునొకండవ దినమున వేలాది వేదవిదులగు బ్రాహ్మణులకు యథావిధిగా సంతర్పణ చేసెను (111). తండ్రికి ఉత్తమగతులు కలుగుటకై బ్రాహ్మణులకు విరివిగా ధనమును వేలాది గోవులను, గ్రామములను రత్నములను వస్త్రాదులను సమర్పించెను (112). పిదప రామునే స్మరించుచు, వశిష్ఠునితో, తమ్మునితో, మంత్రులతో కూడి, తన గృహమందు నిలిచెను (113).

( అతని రామచింతన మిటుల సాగెను)- ''జనకసుత సీతతో, లక్ష్మణునితో, రాముడు ఘోరాటవులకు వెడలిపోగా, దర్శనమాత్రాన వెంటనే మా తల్లి రాక్షసివలె నా హృదయము దహించివేయు చున్నది. స్థిరమైన బుద్ధితో ఇపుడే అడవికి పోయెదను. సమస్త సామ్రాజ్యము వదలిపెట్టి సీతాసమేతుడై, మందస్మిత సుందరవదనుడగు రాముని నిత్యము సేవించెదను'' (114).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అయోధ్యాకాండ - సప్తమ సర్గము ॥ 7 ॥

----****----

ఓమ్

# అష్టమ సర్గము

భరతుని వనగమనము; నిషాద, భరద్వాజ సమాగమము; చిత్రకూట దర్శనము

శ్రీమహాదేవ ఉవాచ

వసిష్ఠో మునిభిః సార్ధం మంత్రిభిః పరివారితః,
రాజ్ఞః సభాం దేవసభాసన్నిభామవిశద్విభుః. 1

తత్రాసనే సమాసీనశ్చతుర్ముఖ ఇవాపరః,
ఆనీయ భరతం తత్ర ఉపవేశ్య సహానుజమ్. 2

అబ్రవీద్వచనం దేశకాలోచితమరిందమమ్,
వత్స రాజ్యేఽభిషేక్ష్యామస్త్వామద్య పితృశాసనాత్. 3

కైకేయ్యా యాచితం రాజ్యం త్వదర్థే పురుషర్షభ,
సత్యసంధో దశరథః ప్రతిజ్ఞాయ దదౌ కిల. 4

అభిషేకో భవత్వద్య మునిభిర్మంత్రపూర్వకమ్,
తచ్ఛ్రుత్వా భరతోఽప్యాహ మమ రాజ్యేన కిం మునే. 5

రామో రాజాధిరాజశ్చ వయం తస్యైవ కింకరాః,
శ్వః ప్రభాతే గమిష్యామో రామమానేతుమంజసా. 6

అహం యూయం మాతరశ్చ కైకేయీం రాక్షసీం వినా,
హనిష్యామ్యధునైవాహం కైకేయీం మాతృగంధినీమ్. 7

కింతు మాం నో రఘుశ్రేష్ఠః స్త్రీహంతారం సహిష్యతే,
తచ్ఛ్వోభూతే గమిష్యామి పాదచారేణ దండకాన్. 8

శత్రుఘ్నసహితస్తూర్ణం యూయమాయాత వా న వా,
రామో యథా వనే యాతస్తథాహం వల్కలాంబరః. 9

ఫలమూలకృతాహారః శత్రుఘ్నసహితో మునే,
భూమిశాయీ జటాధారీ యావద్రామో నివర్తతే. 10

ఇతి నిశ్చిత్య భరతస్తూష్ణీమేవావతస్థివాన్,
సాధుసాధ్వితి తం సర్వే ప్రశశంసుర్ముదాన్వితాః. 11

శ్రీ మహాదేవుడిట్లనెను - ''పార్వతీ! మునీశ్వరులతో, మంత్రులతో పరివేష్టించబడి, దేవసభా సదృశమైన అయోధ్యా రాజసభకు వశిష్ఠుడు వచ్చెను (1). అపర చతుర్ముఖునివలె వశిష్ఠుడు ఆసనమున కూర్చుండి, భరతుని తమ్మునితో గూడ రావించి, కూర్చుండబెట్టెను (2). శత్రుదమనుడగు భరతునితో నాతడు దేశకాలోచితములగు వాక్యములు ఈ విధముగా పలికెను - ''వత్సా! నీతండ్రి యాదేశానుసారము, నిన్ను నేడు రాజుగా అభిషేకించెదము (3). పురుషపుంగవా! కైకేయి నీకొరకే రాజ్యమును కోరినది. సత్యసంధుడగు దశరథుడును చేసిన ప్రతిన కొరకై దానినిచ్చి వేసెను (4). కావున మునులచే మంత్రోక్త విధానమున నీకు అభిషేకము జరుగుగాక''. ఆ మాటలు విని భరతుడును ఇట్లు ఉత్తరమిచ్చెను - ''మునీశ్వరా! రాజ్యముతో నాకేమి ప్రయోజనము! (5). రాముడు రాజాధిరాజు. మేము అతనికే దాసులము. రాముని వేగమే మరలించుకొని వచ్చుటకు నేనును, మీరు, రాక్షసియగు కైక తప్ప మిగిలిన తల్లులును, రేపటి ఉదయముననే బయలు దేరుదము. అసలు ఇప్పటికిప్పుడే మాతృశబ్దవాచ్యురాలగు కైకను చంపుదును. కాని స్త్రీ హంతకుడనని రాఘవశ్రేష్ఠుడు నన్ను సైచునా! కావున రేపటి ప్రభాతముననే మీరు మాతో వచ్చినను, రాకున్నను శత్రుఘ్నసహితుడనై పాదచారినై దండక వనమునకు వెంటనే పోయెదను. రాముడు ఎటుల వనమున కేగెనో, ఆ విధముగనే వెడలి, అతడెంతవరకు మరలి రాడో అంతవరకు నేను కూడ శత్రుఘ్నసమేతుడనై నారచీరలు ధరించి, ఫలమూలములను ఆహారముగా తీసికొనుచు, భూమి శాయినై, జటాధారినై వసింతును గాక! (6-10)''. ఇటుల నిశ్చయించి భరతుడు మౌనము వహించెను. అక్కడ చేరినవారందరు ఆ మాటలు విని, సంతోషించి, 'బాగు బాగు' అని అతనిని ప్రశంసించిరి (11). తరువాత

తతః ప్రభాతే భరతం గచ్ఛంతం సర్వసైనికాః,
అనుజగ్ముః సుమంత్రేణ నోదితాః సాశ్వకుంజరాః. 12

కౌసల్యాద్యా రాజదారా వసిష్ఠప్రముఖా ద్విజాః,
ఛాదయంతో భువం సర్వే పృష్ఠతః పార్శ్వతోఽగ్రతః. 13

శృంగవేరపురం గత్వా గంగాకూలే సమంతతః,
ఉవాస మహతీ సేనా శత్రుఘ్నపరిచోదితా. 14

ఆగతం భరతం శ్రుత్వా గుహః శంకితమానసః,
మహత్యా సేనయా సార్ధమాగతో భరతః కిల. 15

పాపం కర్తుం న వా యాతి రామస్యావిదితాత్మనః,
గత్వా తద్ధృదయం జ్ఞేయం యది శుద్ధస్తరిష్యతి. 16

గంగాం నోచేత్సమాకృష్య నావస్తిష్ఠంతు సాయుధాః,
జ్ఞాతయో మే సమాయత్తాః పశ్యంతః సర్వతోదిశమ్. 17

ఇతి సర్వాన్సమాదిశ్య గుహో భరతమాగతః,
ఉపాయనాని సంగృహ్య వివిధాని బహూన్యపి. 18

ప్రయయౌ జ్ఞాతిభిః సార్ధం బహుభిర్వివిధాయుధైః,
నివేద్యోపాయనాన్యగ్రే భరతస్య సమంతతః. 19

దృష్ట్వా భరతమాసీనం సానుజం సహ మంత్రిభిః,
చీరాంబరం ఘనశ్యామం జటాముకుటధారిణమ్. 20

రామమేవానుశోచంతం రామరామేతి వాదినమ్,
ననామ శిరసా భూమౌ గుహోఽహమితి చాబ్రవీత్. 21

శీఘ్రముత్థాప్య భరతో గాఢమాలింగ్య సాదరమ్,
పృష్ట్వానామయమవ్యగ్రః సఖాయమిదమబ్రవీత్. 22

భ్రాతస్త్వం రాఘవేణాత్ర సమేతః సమవస్థితః,
రామేణాలింగితః సాంద్రనయనేనామలాత్మనా. 23

ధన్యోఽసి కృతకృత్యోఽసి యత్త్వయా పరిభాషితః,
రామో రాజీవపత్రాక్షో లక్ష్మణేన చ సీతయా. 24

మరునాటి ఉదయమున భరతుడు మునుముందు కదలిపోవుచుండగా, సుమంత్రుని ప్రేరణతో గజ తురగ సమేతములై సర్వసైన్యములు, కౌసల్యాది రాజభార్యలు, వశిష్ఠప్రముఖులైన బ్రాహ్మణోత్తములు నేల యీనినట్లు వ్యాపించి, ఇరుపార్శ్వముల, ముందు వెనుకల సందడించుచు అనుసరించిరి (12-13). వారట్లు శృంగవేర పురము చేరిన తరువాత, విశాలమైన సైన్య మంతయు శత్రుఘ్నుని సూచనతో గంగాతటమున విడిసెను (14).

భరతుడు వచ్చుచున్నాడని గుహుడు విని శంకాకులిత[1] స్వాంతుడై 'గొప్ప సైన్యముతో భరతుడిదే వచ్చుచున్నాడు. రామునికి ఏమియు తెలియని దశలో అతనికి హాని చేయుటకే భరతుడు వచ్చెనా ఏమి? నేను పోయి అతని హృదయము (భావము) తెలిసికొనవలయును. అతడు సదుద్దేశ్యముతో వచ్చిన, గంగను దాటగలడు. అటుల కాని పక్షమున నా నౌకలన్నియు గంగ నడుమనే నిలుచుగాక ! నా బలగమువారందరు సాయుధులై, జాగరూకులై, అన్ని వంకలు పరికించుచు సన్నద్ధులగుదురు గాక !'' అని అందరకును ఆజ్ఞలిచ్చి, వివిధములగు కానుకలు సమృద్ధిగా కొనివచ్చి పలువిధములైన ఆయుధములు ధరించిన తన వారందరితో కలిసి, అన్ని దిశలూ పరి కించుచు, భరతుని వద్దకు వచ్చి అతని కట్టెదుట కానుకల నన్నిటిని నివేదించెను (15-19). తమ్మునితో, మంత్రులతో కలసి ఆసీనుడై యుండి నారచీరలు ధరించి జటాధారియై, శ్యామలవర్ణుడైన భరతుడు, రామునే సదా ధ్యానించుచు 'రామా' 'రామా' యని పలుకుచు ఆసనముపై కూర్చుని యున్న భరతుని చూచి, గుహుడు వినయముతో నమ్రుడై నమస్కరించి 'నేను గుహుడను' అని పలికెను (20-21). భరతుడాతనిని వెంటనే ఆదర పూర్వకముగా లేవనెత్తి, కౌగలించుకొనెను. (రాముని) సఖుడైన అతని క్షేమసమాచారమడిగి స్నేహపూర్వకముగా ఇట్లనెను - ''సోదరా! నీవిచట రామునితో కూడియుంటివి. నిర్మలహృదయుడైన అతనిచే ఆలింగనమును పొందితివి (23). నీవు ధన్యుడవు. రాజీవనేత్రుడు రాముడు సీతా లక్ష్మణులతో కూడి నీతో సంభాషించినాడు. నీవు కృతకృత్యుడవు (24).

[1] గుహునికి శ్రీరాముని యందు గల అత్యంత అనురాగము కారణముగా భరతుని రాకగురించి అనుమానము కలిగెను.

యత్ర రామస్త్వయా దృష్టస్తత్ర మాం నయ సువ్రత,
సీతయా సహితో యత్ర సుప్తస్తద్దర్శయస్వ మే. 25

త్వం రామస్య ప్రియతమో భక్తిమానసి భాగ్యవాన్,
ఇతి సంస్మృత్య సంస్మృత్య రామం సాశ్రువిలోచనః. 26

గుహేన సహితస్తత్ర యత్ర రామః స్థితో నిశి,
యయౌ దదర్శ శయనస్థలం కుశసమాస్తృతమ్. 27

సీతాభరణసంలగ్నస్వర్ణబిందుభిరర్చితమ్,
దుఃఖసంతప్తహృదయో భరతః పర్యదేవయత్. 28

అహోఽతిసుకుమారీ యా సీతా జనకనందినీ,
ప్రాసాదే రత్నపర్యంకే కోమలాస్తరణే శుభే. 29

రామేణ సహితా శేతే సా కథం కుశవిస్తరే,
సీతా రామేణ సహితా దుఃఖేన మమ దోషతః. 30

ధిక్ మాం జాతోఽస్మి కైకేయ్యాం పాపరాశిసమానతః,
మన్నిమిత్తమిదం క్లేశం రామస్య పరమాత్మనః. 31

అహోఽతిసఫలం జన్మ లక్ష్మణస్య మహాత్మనః,
రామమేవ సదాన్వేతి వనస్థమపి హృష్టధీః. 32

అహం రామస్య దాసా యే తేషాం దాసస్య కింకరః,
యది స్యాం సఫలం జన్మ మమ భూయాన్న సంశయః. 33

భ్రాతర్జానాసి యది తత్కథయస్వ మమాఖిలమ్,
యత్ర తిష్ఠతి తత్రాహం గచ్ఛామ్యానేతుమంజసా. 34

గుహస్తం శుద్ధహృదయం జ్ఞాత్వా సస్నేహమబ్రవీత్,
దేవ త్వమేవ ధన్యోఽసి యస్య తే భక్తిరీదృశీ. 35

రామే రాజీవపత్రాక్షే సీతాయాం లక్ష్మణే తథా,
చిత్రకూటాద్రినికటే మందాకిన్యవిదూరతః. 36

మునీనామాశ్రమపదే రామస్తిష్ఠతి సానుజః,
జానక్యా సహితో నందాత్సుఖమాస్తే కిల ప్రభుః. 37

నీవు ఎక్కడ రాముని దర్శించితివో నన్ను అక్కడకు కొనిపొమ్ము. సువ్రతుడా! రాముడు ఎక్కడ సీతాసహితుడై విశ్రమించెనో ఆ ప్రదేశము నాకు చూపుము (25). నీవు రామునకు ప్రియతముడవు. భక్తుడవు, భాగ్యశాలివి'' ఇటుల రాముని గురించి తలచి తలచి, కన్నుల నీరు నిండగా (26), భరతుడు గుహునితో కూడి ఆ రాత్రి యందు రాముడు నిలిచిన ప్రదేశమును చేరెను. కుశలతో నిండిన రాముని శయనమును చూచెను (27). ఆ ప్రదేశము సీత ధరించిన ఆభరణముల నుండి రాలిన సువర్ణ బిందువులతో శోభిల్లుచుండెను. దానినిగాంచి భరతుడు దుఃఖపూరిత హృదయముతో విలపించెను (28). ''అయ్యో! అతి సుకుమారి యైన జనకుని ముద్దుబిడ్డ సీత, రాజభవంతులలో, కుసుమ కోమలమైన పాన్పు అమరియున్న రత్న పర్యంకముపై శ్రీరామునితో గూడి పవళించెడి సాధ్వి, నా దోషము వలన ఇప్పుడు రామ సహితయై, కుశాస్తరణముపై (ఎంతయో క్లేశము నందుచు) ఎటుల శయనించెనో కదా! (29 – 30). ఇస్సీ! పాపరాశితో సమానమగు కైకేయి కడుపున నేను పుట్టితిని. నా నిమిత్తముగా రామునకు ఇట్టి క్లేశము సంభవించినది (31). ఆహా! మహాత్ముడగు లక్ష్మణుని జన్మ అత్యంత సఫలము. వనవాసియైనను, సంతోషమనస్కుడై రామునే అనుసరించుచున్నాడు (32). శ్రీరామునికి దాసులైన వారి దాసులకు కింకరుడను కాగలిగిన నిస్సంశయముగా నా జన్మ సఫలమగును (33). సోదరా! నీకు తెలిసియున్నచో రాముడు ఎచట వసించినాడో నాకు సంపూర్ణముగా తెలుపుము. అతనిని మరలించి తీసికొనివచ్చుటకై వెంటనే నేనక్కడికి పోయెదను (34)'' అనెను.

గుహుడు భరతుని చిత్తశుద్ధిని గ్రహించి, స్నేహ పూర్వకముగా ఇట్లనెను – ''దేవా! రాజీవనేత్రుడైన రాముని యందు, సీతాలక్ష్మణులయందు ఇంతటి భక్తి ప్రపత్తులు కలిగిన నీవే ధన్యుడవు. చిత్రకూటపర్వతము చెంత మందాకినీ తీరమునకు సమీపముననే ప్రభువు రాముడు అనుజానితో జానకితో కలసి ఆనందముతో, ఋష్యాశ్రమమునందు కొలువుతీరి యున్నాడు (35–37).

తత్ర గచ్ఛామహే శీఘ్రం గంగాం తర్తుమిహార్హసి,
ఇత్యుక్త్వా త్వరితం గత్వా నావః పంచశతా నిహ. 38

సమానయత్సైన్యస్య తర్తుం గంగాం మహానదీమ్,
స్వయమేవానినాయైకాం రాజనావం గుహస్తదా. 39

ఆరోప్య భరతం తత్ర శత్రుఘ్నం రామమాతరమ్,
వసిష్ఠంచ తథాన్యత్ర కైకేయీం చాన్యయోషితః. 40

తీర్త్వా గంగాం యయౌ శీఘ్రం భరద్వాజాశ్రమం ప్రతి,
దూరే స్థాప్య మహాసైన్యం భరతః సానుజో యయౌ. 41

ఆశ్రమే మునిమాసీనం జ్వలంతమివ పావకమ్,
దృష్ట్వా ననామ భరతః సాష్టాంగమతిభక్తితః. 42

జ్ఞాత్వా దాశరథిం ప్రీత్యా పూజయామాస మౌనిరాట్,
పప్రచ్ఛ కుశలం దృష్ట్వా జటావల్కలధారిణమ్. 43

రాజ్యం ప్రశాసతస్తేఽద్య కిమేతద్వల్కలాదికమ్,
ఆగతోఽసి కిమర్థం త్వం విపినం మునిసేవితమ్. 44

భరద్వాజవచః శ్రుత్వా భరతః సాశ్రులోచనః,
సర్వం జానాసి భగవన్ సర్వభూతాశయస్థితః. 45

తథాపి పృచ్ఛసే కించిత్తదనుగ్రహ ఏవ మే,
కైకేయ్యా యత్కృతం కర్మ రామరాజ్యవిఘాతనమ్. 46

వనవాసాదికం వాపి న హి జానామి కించన,
భవత్పాదయుగం మేఽద్య ప్రమాణం మునిసత్తమ. 47

ఇత్యుక్త్వా పాదయుగలం మునేః స్పృష్ట్వార్తమానసః,
జ్ఞాతుమర్హసి మాం దేవ శుద్ధో వాఽశుద్ధ ఏవ వా. 48

మమ రాజ్యేన కిం స్వామిన్ రామే తిష్ఠతి రాజని,
కింకరోఽహం మునిశ్రేష్ఠ రామచంద్రస్య శాశ్వతః. 49

అతో గత్వా మునిశ్రేష్ఠ రామస్య చరణాంతికే,
పతిత్వా రాజ్యసంభారాన్ సమర్ప్యాత్రైవ రాఘవమ్. 50

అక్కడకు మనము పోదము. వేగమే గంగను దాటవలయును'' ఇట్లని చెప్పి, వడివడిగా పోయి సేనాసహితుడైన భరతుని గంగానదిని దాటించుటకై అయిదు వందల నౌకలను రప్పించెను. తానే స్వయముగా నౌక రాజనౌకను నడిపించుకొనివచ్చెను (36-39). అందు భరతుని, శత్రుఘ్నుని, వశిష్ఠుని కౌసల్యను ఎక్కించెను. మరొకదానియందు కైకేయిని, ఇతర రాణులను ఎక్కించెను (40). ఈ విధముగా గంగానది దాటి వడివడిగా భరద్వాజాశ్రమము దిశగా వెడలిరి. తన సేనను (ఆశ్రమమునకు) దూరముగానే నిలిపి, శత్రుఘ్నసమేతుడై భరతుడు ఆశ్రమముకడకు వెళ్లెను (41). అచట ప్రజ్వలించెడి అగ్నివలె ప్రకాశించుచు ఆసీనుడై యున్న భరద్వాజుని చూచి, ఆతనికి భక్తిపూర్వకముగా సాష్టాంగ ప్రణామము గావించెను (42). ఆతడు దశరథుని కుమారుడని తెలియగానే, మునీశ్వరుడతనిని ప్రేమపూర్వకముగా గౌరవించెను. కుశల మడిగెను. ఆతని జటావల్కలధారిగా యుండుట గమనించి (43), 'రాజ్యము పరిపాలించుచు ఇపుడీ వల్కలాదుల ధారణ మేల? మునులు వసించెడి యీ వనభూములకు ఎందులకై వచ్చితివి?' అని ఆతనిని ప్రశ్నించెను (44).

భరద్వాజమహర్షి మాటలను విని భరతుడు కంట నీరు నిండగా ''స్వామీ! మీరు సమస్తము తెలిసినవారు. సర్వ అంతర్యాములు (45). అయినను నన్నిట్లు ప్రశ్నించుచున్నారనిన, అది నాపై తమకున్న కృపావిశేషమే! రామరాజ్య (అభిషేక)మునకు కైకచేత చేయబడిన విఘాతము, (రామ) వనవాసాదికము నేను ఏ మాత్రము ఎరుగను. మునీంద్రా! ఇపుడు మీ పాదములపై ప్రమాణము చేసి చెప్పుచున్నాను (46-47)''. ఇట్లు పలికి, భరతుడు భరద్వాజుని పాదయుగ్మము స్పృశించి, ఆర్తహృదయుడై ''దేవా! నేను దోషినో, కానో స్వయముగా తెలిసికొనగలరు (48). రాజై రాముడుండగా నాకు రాజ్యముతో పనియేమి స్వామీ! నేను శాశ్వతముగా శ్రీరాముని దాసుడను. మునీశ్వరా! నేను రాముని పాదముల కడకేగి, పాదములపై బడి, రాఘవునికే రాజ్యసంభారములు సమర్పించి, వశిష్ఠాదు లతో, పౌర

అభిషేక్ష్యే వసిష్ఠాద్యైః పౌరజానపదైః సహ,
నేష్యేఽయోధ్యాం రమానాథం దాసః సేవేఽతినీచవత్. 51

ఇత్యుదీరితమాకర్ణ్య భరతస్య వచో మునిః,
ఆలింగ్య మూర్ధ్న్యవఘ్రాయ ప్రశశంస సవిస్మయః. 52

వత్స జ్ఞాతం పురైవైతద్భవిష్యం జ్ఞానచక్షుషా,
మా శుచస్త్వం పరో భక్తః శ్రీరామే లక్ష్మణాదపి. 53

ఆతిథ్యం కర్తుమిచ్ఛామి ససైన్యస్య తవానఘ,
అద్య భుక్త్వా ససైన్యస్త్వం శ్వో గంతా రామసన్నిధిమ్. 54

యథాజ్ఞాపయతి భవాంస్తథేతి భరతోఽబ్రవీత్,
భరద్వాజస్తపః స్పృష్ట్వా మౌనీ హోమగృహే స్థితః. 55

దధ్యౌ కామదుఘాం కామవర్షిణీం కామదో మునిః,
అసృజత్కామధుక్ సర్వం యథాకామమలౌకికమ్. 56

భరతస్య ససైన్యస్య యథేష్టం చ మనోరథమ్,
యథా వవర్ష సకలం తృప్తాస్తే సర్వసైనికాః. 57

వసిష్ఠం పూజయిత్వాగ్రే శాస్త్రదృష్టేన కర్మణా,
పశ్చాత్ససైన్యం భరతం తర్పయామాస యోగిరాట్. 58

ఉషిత్వా దినమేకం తు ఆశ్రమే స్వర్గసన్నిభే,
అభివాద్య పునః ప్రాతర్భరద్వాజం సహానుజః,
భరతస్తు కృతానుజ్ఞః ప్రయయౌ రామసన్నిధిమ్. 59

చిత్రకూటమనుప్రాప్య దూరే సంస్థాప్య సైనికాన్,
రామసందర్శనాకాంక్షీ ప్రయయౌ భరతః స్వయమ్. 60

శత్రుఘ్నేన సుమంత్రేణ గుహేన చ పరంతపః,
తపస్విమండలం సర్వం విచిన్వానో న్యవర్తత. 61

జానపదులతో సహా అతనిని రాజ్యాభిషిక్తుని చేసెదను. రమానాథుని అయోధ్యకు గొనిపోయెదను. అతనికి దాసానుదాసుడనై సేవించెదను (49 -51).

మునీశ్వరుడు భరతుని యీ మాటలకు విస్మయ మంది అతనిని కౌగలించుకొని, శిరము మూర్కొని అతనిని ప్రశంసించుచు ఇట్లనెను (52) - ''కుమారా! నా జ్ఞానచక్షువులతో ముందే, జరుగబోవు విషయములను తెలిసికొంటిని. శోకింపవలదు. నీవు లక్ష్మణునికన్న శ్రీరామునియందు భక్తి కలవాడవు (53). పుణ్యాత్ముడా! సేనా సహితుడవగు నీకు అతిథి సత్కారము చేయదలచితిని. నేడు మీరందరు ఇక్కడనే భోజనము గావించి, రాత్రికి విశ్రమించి, రేపు రాముని కడకు పోవచ్చును'' (54). భరతుడు ''తామెట్లు ఆజ్ఞాపించిన అట్లే జరుగును'' అనెను. మునీశ్వరుడు ఆచమించి యజ్ఞశాలయందు మౌనముగా కూర్చుండెను (55). అతడు సమస్తకామములను ప్రసాదించు కామధేనువును స్మరించెను. అంత నా కామధేనువు అతని ఇచ్ఛానుసారముగా సంపూర్ణముగా అలౌకికములగు భోగపదార్థములను సృజించెను (56). ఆ ధేనువు భరతునకు అతని సేనకు వారివారి మనోరథములు తీరునట్లు సర్వ సంభారములు వర్షించెను (57). అంతట నా మునిశ్రేష్ఠుడు శాస్త్రవిధిని తొలుత వశిష్ఠుని పూజించి, తరువాత సేనా సమేతముగా భరతుని తృప్తుని గావించెను (58).

ఈ విధముగా స్వర్గసదృశముగానున్న ఆ ఆశ్రమమున ఒక్క దినము ఉండి, మరునాడు ఉదయముననే మునివరునకు నమస్కరించి ఆయన అనతి తలదాల్చి, సోదర సహితుడై భరతుడు శ్రీరాముని కడకు పయనమయ్యెను (59). చిత్రకూటము సమీపించిన మీదట, సేనలను దూరముగా నిలిపి, స్వయముగా రాముని దర్శించు తహతహతో ముందుకు నడచెను (60). పరంతపుడగు భరతుడు శత్రుఘ్నునితో, సుమంత్రునితో గుహునితో, తాపసాశ్రమములన్నింటిని వెదకుచు తిరిగి వచ్చెను (61). కాని



రామ భరత సమాగమము

అదృష్ట్వారామభవనమపృచ్ఛదృషిమండలమ్,
కుత్రాస్తే సీతయా సార్ధం లక్ష్మణేన రఘూత్తమః. 62

ఊచురగ్రే గిరేః పశ్చాద్గంగాయా ఉత్తరే తటే.
వివిక్తం రామసదనం రమ్యం కాననమండితమ్. 63

సఫలైరామ్రపనసైః కదలీషండసంవృతమ్.
చమ్పకైః కోవిదారైశ్చ పున్నాగైర్విపులైస్తథా. 64

ఏవం దర్శితమాలోక్య మునిభిర్భరతోఽగ్రతః.
హర్షాద్యయౌ రఘుశ్రేష్ఠభవనం మంత్రిణా సహ. 65

దదర్శ దూరాదతిభాసురం శుభం
రామస్య గేహం మునిబృందసేవితమ్.
వృక్షాగ్రసంలగ్నసువల్కలాజినం
రామాభిరామం భరతః సహానుజః. 66

అచట రాముని కుటీరము ఎక్కడను కానరాలేదు. అంత భరతుడు అటనున్న ఋషులను ''సీతా లక్ష్మణ సమేతుడగు రామచంద్రు డెచట నున్నాడని '' ప్రశ్నించెను (62). వారు ''ఎదుట కానవచ్చు పర్వతమునకు ఆవలివంక మందాకినికి ఉత్తరతటమున వనములతో సుశోభితమై ఏకాంతముగా రాముని రమణీయ కుటీరమున్నది (63). అది ఫలభరితము లైన మామిడి చెట్లతో పనస, అరటి చెట్లతో, కూడియున్నది. సంపెంగ, కాంచన, పున్నాగ తరులతో అలరారుచున్నది'' అని తెలిపిరి (64). మునులీ విధముగా తెలుపగా ప్రసన్నుడై భరతుడు మంత్రులను దోడ్కొని రఘుశ్రేష్ఠుని వాస స్థానమును చేర ముందుకు సాగెను (65). అట్లు ముందుకుసాగి సోదర సహితుడై భరతుడు దూరమునుండియే మునిజనసేవితమై అతి సుందరమై ప్రకాశించు రాముని కుటీరమును చూచెను. అందు వృక్షశాఖలపై వల్కలవములు మృగచర్మములు వ్రేలవైచబడి యుండెను. శ్రీరాముని సాన్నిధ్యముతో అది పరమ రమణీయమై విరాజిల్లుచుండెను.

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అయోధ్యాకాండ - అష్టమసర్గము ॥ 8 ॥

----****----

ఓం

# నవమ సర్గము

## శ్రీరామ భరత సమాగమము - భరతుడు అయోధ్యకు. శ్రీరాముడు అత్రిముని ఆశ్రమమునకు పోవుట.

శ్రీమహాదేవ ఉవాచ

అథ గత్వాశ్రమపదసమీపం భరతో ముదా,
సీతారామపదైర్యుక్తం పవిత్రమతిశోభనమ్. 1

స తత్ర వజ్రాంకుశవారిజాంచిత -
ధ్వజాదిచిహ్నాని పదాని సర్వతః,
దదర్శ రామస్య భువోఽతిమంగలా-
న్యచేష్టయత్పాదరజస్సు సానుజః. 2

అహో సుధన్యోఽహమమూని రామ-
పాదారవిందాంకితభూతలాని,
పశ్యామి యత్పాదరజో విమృగ్యం
బ్రహ్మాదిదేవైః శ్రుతిభిశ్చ నిత్యమ్. 3

ఇత్యద్భుతప్రేమరసాప్లుతాశయో
విగాఢచేతా రఘునాథభావనే,
ఆనందజాశ్రుస్నపితస్తనాంతరః
శనైరవాపాశ్రమసన్నిధిం హరేః. 4

స తత్ర దృష్ట్వా రఘునాథమాస్థితం
దూర్వాదలశ్యామల మాయతేక్షణమ్,
జటాకిరీటం నవవల్కలాంబరం
ప్రసన్నవక్త్రం తరుణారుణద్యుతిమ్. 5

విలోకయంతం జనకాత్మజాం శుభాం
సౌమిత్రిణా సేవితపాదపంకజమ్,
తదాభిదుద్రావ రఘూత్తమం శుచా
హర్షాచ్చ తత్పాదయుగం త్వరాఽగ్రహీత్. 6

రామస్తమాకృష్య సుదీర్ఘబాహు-
ర్దోర్భ్యాం పరిష్వజ్య సిషించ నేత్రజైః,
జలైరథాంకోపరి సన్న్యవేశయత్
పునః పునః సంపరిష్వజతే విభుః. 7

శ్రీమహాదేవుడిట్లనెను - ''పార్వతీ! అనంతరము ఆనందము నిండిన మనస్సుతో, భరతుడు సీతారాముల పాద చిహ్నములతో సుశోభితమై, పవిత్రమై, సుందరమై విరాజిల్లు ఆశ్రమ సమీపము చేరెను (1). అచట అంతట వజ్ర అంకుశ పద్మ ధ్వజాది చిహ్నములతో, సుందరములై, భూదేవికి మంగళకరములైన రాముని పాద ముద్రలను చూచెను. వానిని గాంచి, శత్రుఘ్నసహితుడై ఆ పాదధూళి కణములపై పొరలి పొరలి దొర్లసాగెను (2). ''నేడు కదా నేను ధన్యుడనైతిని! ఏ పాదధూళికొరకై బ్రహ్మాదులు, దేవగణములు, శ్రుతులును నిత్యము వెదకుచుందురో అట్టి రామపాదారవింద చిహ్నితమై శోభించు యీ భూఖండము నేను దర్శింపగలుగుచున్నాను'' (3).

అని, హృదయము అద్భుత ప్రేమామృత రసాప్లుతము కాగా, రాముని భావనతో, చైతన్యము నిండగా, ఆనందాశ్రువులతో ఎద సిక్తము కాగా భరతుడు మెల్లమెల్లగా తాపత్రయహరుని ఆశ్రమవాస సన్నిధి చేరెను (4). దూర్వాదళ శ్యాముడు, విశాల నేత్రుడు, జటాకిరీటధారి, నూత్న వల్కలధారి, ప్రసన్న ముఖమండలుడు, బాలార్కతేజుడు అయిన రాముడు ఆసీనుడై యుండుట భరతుడు చూచెను (5). శుభలక్షణ లక్షితయగు జానకీ దేవి వంకకు రాముడు చూచుచుండగా, లక్ష్మణుడు అతని పాదములు సేవించుచుండెను. రఘురాముని చూడగనే భరతుడు పరుగెత్తి, హర్షశోకము లుప్పతిల్ల అతని చరణయుగము గ్రహించెను (6). ఆజానుబాహుడగు రాముడు తన రెండు చేతుల అతనిని లేవనెత్తి గాఢాలింగన మొనరించుకొని మెల్లిగా అతనిని తన ఒడిలో కూర్చుండబెట్టుకొని, అశ్రుధారలతో అభిషేకించుచు, మాటిమాటికి కౌగిలించుకొనెను (7).

అథ తా మాతరః సర్వాః సమాజగ్ముస్త్వరాన్వితాః,
రాఘవం ద్రష్టుకామాస్తాస్తృషార్తా గౌర్యథా జలమ్. 8

రామః స్వమాతరం వీక్ష్య ద్రుతముత్థాయ పాదయోః,
వవందే సాశ్రు సా పుత్రమాలింగ్యాతీవ దుఃఖితా. 9

ఇతరాశ్చ తథా సర్వా జననీ రఘునందనః,
తతః సమాగతం దృష్ట్వా వసిష్ఠం మునిపుంగవమ్. 10

సాష్టాంగం ప్రణిపత్యాహ ధన్యోఽస్మీతి పునః పునః,
యథార్హముపవేశ్యామ సర్వానేవ రఘూద్వహః. 11

పితా మే కుశలీ కిం వా మాం కిమాహాతిదుఃఖితః,
వసిష్ఠస్తమువాచేదం పితా తే రఘునందన. 12

త్వద్వియోగాభితప్తాత్మా త్వామేవ పరిచింతయన్,
రామ రామేతి సీతేతి లక్ష్మణేతి మమార హ. 13

శ్రుత్వా తత్కర్ణశూలాభం గురోర్వచనమంజసా,
హా హతోఽస్మీతి పతితో రుదన్ రామః సలక్ష్మణః. 14

తతోఽనురురుదుః సర్వా మాతరశ్చ తథాపరే,
హా! తాత మాం పరిత్యజ్య క్వ గతోఽసి ఘృణాకర. 15

అనాథోఽస్మి మహాబాహో మాం కో వా లాలయేదితః,
సీతా చ లక్ష్మణశ్చైవ విలేపతురతో భృశమ్. 16

వసిష్ఠః శాంతవచనైః శమయామాస తాం శుచమ్,
తతో మందాకినీం గత్వా స్నాత్వా తే వీతకల్మషాః. 17

రాజ్ఞే దదుర్జలం తత్ర సర్వే తే జలకాంక్షిణే,
పిండాన్నిర్వాపయామాస రామో లక్ష్మణసంయుతః. 18

ఇంగుదీఫలపిణ్యాకరచితాన్మధుసంప్లుతాన్,
వయం యదన్నాః పితరస్తదన్నాః స్మృతినోదితాః. 19

అటుపిమ్మట దప్పికగొన్న గోవులు జలాశయమువంక పరుగిడునట్లు కౌసల్యాది మాతలెల్లరు రాముని చూచుటకు పరువిడి వచ్చిరి (8).

రాముడు తన తల్లిని చూచినంతనే లేచి నిలిచి, కన్నీరు నింపుకొని ఆమెకు పాదాభివందనము చేసెను. ఆమెయు అత్యంత దుఃఖముతో పుత్రుని ఆలింగనము చేసికొనెను (9). అదే రీతిలో మిగిలిన తల్లులకు రాముడు నమస్కరించెను. తరువాత, మునీంద్రుడగు వశిష్ఠుడు రాగా చూచి (10), సాష్టాంగ దండ ప్రణామములాచరించి పలుమారు ''ధన్యుడనైతిని'' అని పలికెను.

రాముడు అందరిని యథోచిత రీతి కూర్చుండచేసి ఇట్లడిగెను (11)- ''మా తండ్రి క్షేమముగా నుండెను గదా! చెప్పుడు. ఆయన నా వియోగముతో దుఃఖితులై నాకు ఏమి ఆనతిచ్చిరి?'' వశిష్ఠుడు ''రఘునందనా! నీ వియోగముచే అత్యంత సంతాపము నొంది 'రామా! రామా' యనుచు 'సీతా! లక్ష్మణా!' యనుచు మీ చింతనమే చేయుచు నీ తండ్రి ప్రాణములు విడెను'' (12-13) అని చెప్పెను.

కర్ణములకు శూలములై తాకిన ఈ మాటలను గురుని నోట విని రామ లక్ష్మణులు 'హా! హతులమైతిమి!' అనుచు రోదించుచు కుప్పకూలిరి (14). అపుడు తల్లులు, ఆయెడ చేరిన అందరు విలపించసాగిరి. రాముడు ''హా! తండ్రీ! దయామయా! నీవు నన్ను విడచి ఎక్కడికి పోయితివి? (15). మహాబాహూ! నేననాథుడనైతిని. ఇంక నన్ను ఎవరు లాలింతురు?'' అని విలపింపగా సీతయు, లక్ష్మణుడును అతనికంటె ఎక్కువగ రోదించసాగిరి (16).

అపుడు వశిష్ఠుడు చల్లని మాటలతో వారి శోకమును ఉపశమింపచేసెను. తదుపరి ఎల్లరును మందాకినీ నదికేగి స్నానముచేసి పవిత్రులైరి (17). అందరు అచ్చట (బంధువులు సమర్పించెడి) జలమును కోరు దశరథునకు జలాంజలి నిచ్చిరి. లక్ష్మణునితో కలసి రాముడు గారపండ్ల గుజ్జుతో మధువు మేళవించి, పిండములను ప్రదానము చేసెను మనము దేనిని ఆహారముగా తీసికొనుచున్నామో అదియే పితృ దేవతలకు ప్రియమైన ఆహారమని స్మృతి వాక్యము గదా! (18-19).

ఇతి దుఃఖాశ్రుపూర్ణాక్షాః
పునః స్నాత్వా గృహం యయౌ,
సర్వే రుదిత్వా సుచిరం
స్నాత్వా జగ్ముస్తదాశ్రమమ్. 20

తస్మింస్తు దివసే సర్వే ఉపవాసం ప్రచక్రిరే,
తతః పరేద్యుర్విమలే స్నాత్వా మందాకినీజలే. 21

ఉపవిష్టం సమాగమ్య భరతో రామమబ్రవీత్,
రామ రామ మహాభాగ స్వాత్మానమభిషేచయ. 22

రాజ్యం పాలయ పిత్ర్యం తే జ్యేష్ఠస్త్వం మే పితా యథా,
క్షత్రియాణామయం ధర్మో యత్ప్రజాపరిపాలనమ్. 23

ఇష్ట్వా యజ్ఞైర్బహువిధైః పుత్రానుత్పాద్య తంతవే,
రాజ్యే పుత్రం సమారోప్య గమిష్యసి తతో వనమ్. 24

ఇదానీం వనవాసస్య కాలో నైవ ప్రసీద మే,
మాతుర్మే దుష్కృతం కించిత్స్మర్తుం నార్హసి పాహి నః. 25

ఇత్యుక్త్వా చరణౌ భ్రాతుః శిరస్యాధాయ భక్తితః,
రామస్య పురతః సాక్షాద్దండవత్పతితో భువి. 26

ఉత్థాప్య రాఘవః శీఘ్రమారోప్యాంకేఽతిభక్తితః,
ఉవాచ భరతం రామః స్నేహాశ్రునయనః శనైః. 27

శృణు వత్స! ప్రవక్ష్యామి త్వయోక్తం యత్తథైవ తత్,
కింతు మామబ్రవీత్తాతో నవ వర్షాణి పంచ చ. 28

ఉషిత్వా దండకారణ్యే పురం పశ్చాత్సమావిశ,
ఇదానీం భరతాయేదం రాజ్యం దత్తం మయాఖిలమ్. 29

తతః పిత్రైవ సువ్యక్తం రాజ్యం దత్తం తవైవ హి,
దండకారణ్యరాజ్యం మే దత్తం పిత్రా తథైవ చ. 30

అతః పితుర్వచః కార్యమావాభ్యామతియత్నతః,
పితుర్వచనముల్లంఘ్య స్వతంత్రో యస్తు వర్తతే. 31

స జీవన్నేవ మృతకో దేహాంతే నిరయం వ్రజేత్,
తస్మాద్రాజ్యం ప్రశాధి త్వం వయం దండకపాలకాః. 32

పిమ్మట వారు అశ్రుపూరిత నయనములతో మరల స్నానమాచరించి, ఆశ్రమమునకు తిరిగి వచ్చిరి. మిగిలిన అందరు అదే విధముగా విలపించి, స్నానమాచరించి, మరలి వచ్చిరి (20).

ఆ దినమున అందరు ఉపవసించిరి. మరునాడు మందాకినీ పావన జలముల స్నానమాచరించి భరతుడు ఆశ్రమమందు కూర్చునియున్న రామునివెంతకు వచ్చి ఇట్లు పలికెను. "రామా! మహాభాగా! నీవు పట్టాభిషేకము చేసికొనుము (21-22). పిత్రార్జితమైన యీ రాజ్యము నీది. నీవు దీనిని పాలింపుము. నీవు నాకు అగ్రజాడవు. పితృ సముడవు. రాజా! ప్రజలను పాలించుట క్షత్రియుల ముఖ్య ధర్మము (23). కావున మీరు వివిధములగు యజ్ఞములు చేసి, వంశాభివృద్ధికై పుత్రులను బడసి, వారికి సింహాసనము నప్పగించి, ఆ తరువాత వనవాసమునకు పోగలరు (24). ప్రభూ! ఇంకను వనవాసమునకేగు సమయము మీకు రాలేదు. మీరు నాపై ప్రసన్నులుకండు. నా తల్లి యొక్క అపరాధమును మన్నింపుడు. మమ్ము రక్షింపుడు" (25). ఇట్లు చెప్పి భరతుడు అన్న పాదములను తన శిరసున దాల్చెను. అతని ముందు దండమువలె నేలవ్రాలెను (26).

రాముడు భరతుని లేవనెత్తి, ప్రేమతో అంకమున చేర్చుకొని, ప్రేమాశ్రువులు కన్నుల నిండగా మెలమెల్లగా (నవ్వుబలుకుమ) ఇట్లనెను (27) - "సోదరా! నా మాటలు వినుము. నీవు తెలిపినదంతయు సత్యమే! కాని మన తండ్రి "నీవు పదునాల్గేండ్లు వనమున నుండి అయోధ్యకు మరలి రమ్ము. ఇపుడీ రాజ్యమును భరతునకు ఇచ్చుచున్నాను" అని నాతో చెప్పెను. అనగా ఈ రాజ్యమును నీకు తండ్రి ఇచ్చె నన్నది స్పష్టము. అటులనే దండకారణ్యము నాకు ఇచ్చెను (28 -30). కావున మనము ఇరువురము తప్పనిసరిగా ప్రయత్న పూర్వకముగా తండ్రి ఆజ్ఞను పాలించవలెను. తండ్రి మాట యుల్లంఘించి స్వేచ్ఛాయుతముగా వర్తించెడి తనయుడు బ్రతికియుండియు మరణించినవాడే! అతడు మరణానంతరము నరకమును పొందును. కావున నీవు రాజ్యమును పాలించుము. నేను దండకారణ్యమును రక్షించెదను" (31-32).

భరతస్త్వబ్రవీద్రామం కాముకో మూఢధీః పితా,
స్త్రీజితో భ్రాంతహృదయ ఉన్మత్తో యది వక్ష్యతి,
తత్సత్యమితి న గ్రాహ్యం భ్రాంతవాక్యం యథా సుధీః. 33

శ్రీరామ ఉవాచ

న స్త్రీజితః పితా బ్రూయాన్న కామీ నైవ మూఢధీః,
పూర్వం ప్రతిశ్రుతం తస్యై సత్యవాదీ దదౌ భయాత్. 34

అసత్యాద్భీతిరధికా మహతాం నరకాదపి,
కరోమీత్యహమప్యేతత్సత్యం తస్యై ప్రతిశ్రుతమ్. 35

కథం వాక్యమహం కుర్యామసత్యం రాఘవో హి సన్,
ఇత్యుదీరితమాకర్ణ్య రామస్య భరతోఽబ్రవీత్. 36

తథైవ చీరవసనో వనే వత్స్యామి సువ్రత,
చతుర్దశ సమాస్త్వం తు రాజ్యం కురు యథాసుఖమ్. 37

శ్రీరామ ఉవాచ

పిత్రా దత్తం తవైవైతద్రాజ్యం మహ్యం వనం దదౌ,
వ్యత్యయం యద్యహం కుర్యామసత్యం పూర్వవత్ స్థితమ్. 38

భరత ఉవాచ

అహమప్యాగమిష్యామి సేవే త్వాం లక్ష్మణో యథా,
నోచేత్ప్రాయోపవేశేన త్యజామ్యేతత్కలేవరమ్. 39

ఇత్యేవం నిశ్చయం కృత్వా దర్భానాస్తీర్య చాతపే,
మనసాపి వినిశ్చిత్య ప్రాఙ్ముఖోపవివేశ సః. 40

భరతస్యాపి నిర్బంధం దృష్ట్వా రామోఽతివిస్మితః,
నేత్రాంతసంజ్ఞాం గురవే చకార రఘునందనః. 41

ఏకాంతే భరతం ప్రాహ వసిష్ఠో జ్ఞానినాం వరః,
వత్స గుహ్యం శృణుష్వేదం మమ వాక్యాత్సునిశ్చితమ్.
42

రామో నారాయణః సాక్షాద్బ్రహ్మణా యాచితః పురా,
రావణస్య వధార్థాయ జాతో దశరథాత్మజః. 43

యోగమాయాపి సీతేతి జాతా జనకనందినీ,
శేషోఽపి లక్ష్మణో జాతో రామమన్వేతి సర్వదా. 44

ఈ మాటలు విని భరతుడు రామునితో ఇట్లనెను 'అన్నా! మన తండ్రి కాముకుడై, మూఢబుద్ధియై, స్త్రీ వశవర్తియై, భ్రాంతచిత్తుడై, ఉన్మత్తుడై యట్లు పలికిన పలికి యుండవచ్చును. భ్రాంతుడగువాని మాటలు బుద్ధిమంతులు పరిగణించనట్లు ఆ మాటను సత్యమని భావింపనవసరము లేదు (33)'.

రాముడు ఇట్లనెను - ''తండ్రి స్త్రీ వశవర్తుడై, కామవశీభూతుడై, మూఢమతియై ఆ విధముగా పలుకలేదు. అతడు తన పూర్వప్రతిజ్ఞానుసారమే తల్లియగు కైకేయికి వరము నిచ్చిన మాటకు కట్టుబడి ఉండి, వచన భంగమునకు వెరచి ఈ వరముల నిచ్చెను (34). మహాత్ములకు సత్యపాలన చేయకుండుట నరకముకన్న భయంకరము. కాన నేను కూడ తండ్రి మన తల్లికిచ్చిన వరదానమును సత్యము చేయుచున్నాను (35). రఘువంశ సంజాతుడనై తండ్రి వాక్యమును ఎటుల అసత్యము చేయుదును'' అనగా విని భరతుడు ''అట్లయిన అదే నిజమగు గాక! సువ్రతా! నేను వల్కలధారినై నీకు ప్రతినిధిగా పదునాల్గేడులు వనవాసము చేసెదను. నీవు సుఖముగా రాజ్యపాలన చేయుము. (ఈ విధముగా తండ్రి యిచ్చిన రెండు వరములు సిద్ధించును)'' అనెను (37). రాముడిట్లు అనెను - ''నీకు తండ్రి యిచ్చినది రాజ్యభారము. నాకు విధించినది వనవాసము. రెండిటిని వ్యత్యస్తము (మార్చిన) చేసిన అసత్యము అసత్యముగనే యుండును గదా! ''(38).

భరతుడది విని ''సరియే! అట్లయిన నేనును వనమున మీతోఉండి, లక్ష్మణునివలె సేవ చేసెదను. లేకున్నచో నేను అన్నపానములు మాని ఈ శరీరమును త్యజించి వైచెదను'' (39). ఈ నిశ్చయము ప్రకటించి మనసులో కూడ దృఢముగా నిశ్చయించుకొని, ఎండలో దర్భలు పరచికొని, తూర్పుముఖముగా ప్రాయోపవేశము చేసెను (40). భరతుని ఈ పంతము చూచి, రాముడు అత్యంత విస్మితుడై గురువగు వశిష్ఠునికి కడకంటితో సన్నజేసెను (41). అంత మహాజ్ఞాని యగు వశిష్ఠుడు భరతుని ఏకాంతమునకు గొనిపోయి, ఇట్లు చెప్పెను - ''వత్సా! ఒక సునిశ్చితమగు రహస్యమును చెప్పుచున్నాను వినుము (42). రాముడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. పూర్వము బ్రహ్మ ప్రార్థింపగా రావణాసురుని చంపుటకై దశరథుని యింట పుత్రుడై జన్మించినాడు (43). అదే విధముగా యోగమాయ జనకనందిని సీతగా జన్మించినది. ఆదిశేషుడు లక్ష్మణ రూపమున రాముని అనుగమించుచున్నాడు (44). వారు




భరతుడు పాదుకలను తీసుకొని అయోధ్యకు వచ్చుట

రావణం హంతుకామాస్తే గమిష్యంతి న సంశయః,
కైకేయ్యా వరదానాది యద్యన్నిష్ఠురభాషణమ్. 45

సర్వం దేవకృతం నో చేదేవం సా భాషయేత్కథమ్,
తస్మాత్త్యజాగ్రహం తాత రామస్య వినివర్తనే. 46

నివర్తస్వ మహాసైన్యైర్మాతృభిః సహితః పురమ్,
రావణం సకులం హత్వా శీఘ్రమేవాగమిష్యతి. 47

ఇతి శ్రుత్వా గురోర్వాక్యం భరతో విస్మయాన్వితః,
గత్వా సమీపం రామస్య విస్మయోత్ఫుల్లలోచనః. 48

పాదుకే దేహి రాజేంద్ర రాజ్యాయ తవ పూజితే,
తయోః సేవాం కరోమ్యేవ యావదాగమనం తవ. 49

ఇత్యుక్త్వా పాదుకే దివ్యే యోజయామాస పాదయోః,
రామస్య తే దదౌ రామో భరతాయాతిభక్తితః. 50

గృహీత్వా పాదుకే దివ్యే భరతో రత్నభూషితే,
రామం పునః పరిక్రమ్య ప్రణనామ పునః పునః. 51

భరతః పునరాహేదం భక్త్యా గద్గదయా గిరా,
నవపంచసమాంతే తు ప్రథమే దివసే యది. 52

నాగమిష్యసి చేద్రామ ప్రవిశామి మహానలమ్.
బాఢమిత్యేవ తం రామో భరతం సన్యవర్తయత్. 53

ససైన్యః సవసిష్ఠశ్చ శత్రుఘ్నసహితః సుధీః,
మాతృభిర్మంత్రిభిః సార్ధం గమనాయోపచక్రమే. 54

కైకేయీ రామమేకాంతే ప్రసన్నేత్రజలాకులా,
ప్రాంజలిః ప్రాహ హే రామ తవ రాజ్యవిఘాతనమ్. 55

కృతం మయా దుష్టధియా మాయామోహితచేతసా,
క్షమస్వ మమ దౌరాత్మ్యం క్షమాసారా హి సాధవః. 56

త్వం సాక్షాద్విష్ణురవ్యక్తః పరమాత్మా సనాతనః,
మాయామానుషరూపేణ మోహయస్యఖిలం జగత్,
త్వయైవ ప్రేరితో లోకః కురుతే సాధ్వసాధు వా. 57

రావణసంహారమునకై బయలుదేరినారు. కావున నిస్సందేహముగా కానల కేగుదురు. కైకేయి వరము కోరుట, నిష్ఠురముగా మాట్లాడుట మొదలగునవి దైవప్రేరణచేతనే జరిగినవి. కాకున్న ఆమె యీ రీతి ఎటుల మాటలాడగలదు! వత్సా! నీవు రాముని మరలించు పట్టు వీడుము (45-46). ఆగ్రహము వీడుము. రాముడు కూడ రావణుని సకులముగా వధించి అయోధ్యకు మరలివచ్చును (47)''. గురుని ఈ వాక్యములు వినిన భరతునకు అపరిమితమగు ఆశ్చర్యము కలిగెను. అతడు ఆశ్చర్యచకితుడై, సంతోషముతో విప్పారిన నేత్రములతో రామునికడకు చని ఇట్లనెను(48) - 'రాజేంద్రా! జగత్పూజ్యములైన నీ పాదుకలు రాజ్యపాలనమునకై నాకు ప్రసాదింపవలెను. నీవు మరలి అయోధ్య వచ్చునంతవరకు నేను వానిని సేవించుకొనుచునుందును' (49).

భరతుడట్లు చెప్పి, రాముని పాదములకు దివ్యపాదుకలు తొడిగెను. రాముడు భరతుని భక్తికి మెచ్చి ఆ పాదుకల నిచ్చెను (50). భరతుడా రత్నఖచితములగు దివ్యపాదుకలను తీసికొని, రామునకు ప్రదక్షిణమాచరించి నమస్కరించెను (51).

భక్త్యావేశమున కంఠము గద్గదికము కాగా ''రామా! పదునాల్గేండ్లు దాటిన మీదట మొదటి దినముననే నీవు రానిచో నేను మహాగ్నిలో ప్రవేశించెదను'' అని చెప్పెను. రాముడందులకు అట్లే యని పలుకుచు వీడుకొలిపెను (52-53). తదనంతరము బుద్ధిమంతుడగు భరతుడు శత్రుఘ్నునితో వశిష్ఠునితో, సేనతో, తల్లులతో, మంత్రులతో గూడి వెడలుటకు ఆయత్తమాయెను (54).

ఆ సమయముననే కైకేయి ఏకాంతమున చేతులు జోడించి కన్నీటితో రామునితో ఇట్లనెను - ''రామా! మాయామోహితనైన కారణమున అల్పబుద్ధినై నేను నీ రాజ్యాభిషేకమునకు విఘ్నము కల్పించితిని. నీవు నా కుటిలత్వము క్షమింపుము. సాధుజనులు సర్వదా క్షమాశీలురై యుందురు (55-56). నీవు సాక్షాత్తు శ్రీమహావిష్ణుడవు. ఇంద్రియములకు అగోచరుడవు. పరమాత్ముడవు, సనాతన పురుషుడవు. నీ మాయామానుషరూపముతో సమస్త ప్రపంచమును మోహింపచేయుచుందువు. నీ ప్రేరణతోనే మానవులు శుభాశుభకర్మలు చేయుదురు (57). ఈ సమస్త

త్వదధీనమిదం విశ్వమస్వతంత్రం కరోతి కిమ్,
యథా కృత్రిమనర్తక్యో నృత్యంతి కుహకేచ్ఛయా. 58

త్వదధీనా తథా మాయా నర్తకీ బహురూపిణీ,
త్వయైవ ప్రేరితాహం చ దేవకార్యం కరిష్యతా. 59

పాపిష్ఠం పాపమనసా కర్మాచరమరిందమ,
అద్య ప్రతీతోఽసి మమ దేవానామప్యగోచరః 60

పాహి విశ్వేశ్వరానంత జగన్నాథ నమోఽస్తు తే,
ఛింధి స్నేహమయం పాశం పుత్రవిత్తాదిగోచరమ్. 61

త్వజ్జ్ఞానానలఖడ్గేన త్వామహం శరణం గతా,
కైకేయ్యా వచనం శ్రుత్వా రామః సస్మితమబ్రవీత్. 62

యదాహ మాం మహాభాగే నానృతం సత్యమేవ తత్,
మయైవ ప్రేరితా వాణీ తవ వక్త్రాద్వినిర్గతా. 63

దేవకార్యార్థసిద్ధ్యర్థమత్ర దోషః కుతస్తవ,
గచ్ఛ త్వం హృది మాం నిత్యం భావయంతీ దివానిశమ్. 64

సర్వత్ర విగతస్నేహా మద్భక్త్యా మోక్ష్యసేఽచిరాత్,
అహం సర్వత్ర సమదృగ్ ద్వేష్యో వా ప్రియ ఏవ వా. 65

నాస్తి మే కల్పకస్యేవ భజతోఽనుభజామ్యహమ్,
మన్మాయామోహితధియో మామంబ మనుజాకృతిమ్. 66

సుఖదుఃఖాద్యనుగతం జానంతి న తు తత్త్వతః,
దిష్ట్యా మద్గోచరం జ్ఞానముత్పన్నం తే భవాపహమ్. 67

స్మరంతీ తిష్ఠ భవనే లిప్యసే న చ కర్మభిః,
ఇత్యుక్తా సా పరిక్రమ్య రామం సానందవిస్మయా. 68

ప్రణమ్య శతశో భూమౌ యయౌ గేహం ముదాన్వితా,
భరతస్తు సహామాత్యైర్మాతృభిర్గురుణా సహ. 69

అయోధ్యామగమచ్ఛీఘ్రం రామమేవానుచింతయన్,
పౌరజానపదాన్ సర్వా నయోధ్యాయాముదారధీః. 70

విశ్వము మీ అధీనము. సూత్రధారుని ఇచ్ఛానుసారమే బొమ్మలు కదలుచుండును. అటులనే ఈ ప్రపంచము పరతంత్రమగుటచే మీ ఇచ్ఛానుసారమే ప్రవర్తించును (58). నానా రూపములు దాల్చు మాయానటి కూడ మీ అధీనురాలే! శత్రుదమనా! దేవకార్యము నెరవేర్చ మీచే ప్రేరితురాలనై పాపినగు నేను దుష్టబుద్ధితో పాపకార్యమొనరించితిని. నేను మిమ్ము గుర్తించితిని. మీరు దేవతలకు సైతము మనో వాక్కులకు అందనివారు (59-60). విశ్వేశ్వరా! అనంతా! నన్ను రక్షింపుము. జగన్నాథా! నమస్సులు. ప్రభూ! మీ శరణాగతను. మీరు మీ జ్ఞానాగ్నిరూప ఖడ్గముతో నాకున్న పుత్ర ధనాది స్నేహ బంధములను ఖండింపుడు''

కైకేయి పలికిన ఈ మాటలు విని రాముడు చిరునవ్వుతో ఇట్లనెను (61-62) - ''అమ్మా! నీవు పలికినది సత్యమే! నా ప్రేరణచేతనే దేవకార్య సిద్ధికై నీ నోట అట్టి మాటలు బయలువెడలినవి. ఇందు నీ దోషమేమియును లేదు. ఇంక నీవు పొమ్ము. నిరంతరము హృదయమున నన్ను భావన చేయుటచే ఏ విషయమునందును ఆసక్తి లేనిదానవై నా యందలి భక్తివలన శీఘ్రముగ ముక్తురాలవయ్యెదవు. నేను సర్వత్ర సమదర్శనుడను. నాకెవరును ప్రియులుగాని అప్రియులుగాని లేరు (63-65). గారడీడు మాయతో తాను సృజించిన వస్తువులయందు రాగద్వేషములు కలిగియుండడు, అ విధముగనే నాకు దేనియందును రాగ ద్వేషములు లేవు. ఎవరు ఏవిధముగా నన్ను భజింతురో అ విధముగానే నేను వారిని తలపుతో అనుసరించెదను. తల్లీ! నా మాయచే మోహితులై జనులు నన్ను సుఖదుఃఖములకు వశమగు సాధారణ మానవునిగా చూచెదరు. వారు నా వాస్తవ స్వరూపము నెరుగరు. నీ భాగ్యవిశేషమున నీలో సంసార భయము హరించునట్టి నా తత్త్వజ్ఞానము కలిగినది (66 - 67). నీవు నన్ను స్మరించుకొనుచునే ఇట నుండుము. అపుడు నిన్ను కర్మబంధములు అంటవు'' రాముడిట్లు పలుకగా కైకేయి ఆనందముతో ఆశ్చర్యముతో రామునకు ప్రదక్షిణముచేసి (68), పలుమారు నమస్కరించి ప్రసన్నురాలై యింటికి మరలెను. భరతుడు మంత్రులతో, తల్లులతో, వశిష్ఠమహర్షితో గూడి రామునే స్మరించుచు అయోధ్యకు మరలెను (69 -70).

స్థాపయిత్వా యథాన్యాయం
నందిగ్రామం యయౌ స్వయమ్,
తత్ర సింహాసనే నిత్యం
పాదుకే స్థాప్య భక్తితః. 71

పూజయిత్వా యథా రామం గంధపుష్పాక్షతాదిభిః,
రాజోపచారైరఖిలైః ప్రత్యహం నియతవ్రతః. 72

ఫలమూలాశనో దాంతో జటావల్కలధారకః,
అధశ్శాయీ బ్రహ్మచారీ శత్రుఘ్నసహితస్తదా. 73

రాజకార్యాణి సర్వాణి యావంతి పృథివీతలే,
తాని పాదుకయోః సమ్యఙ్నివేదయతి రాఘవః. 74

గణయన్ దివసానేవ రామాగమనకాంక్షయా,
స్థితో రామార్పితమనాః సాక్షాద్బ్రహ్మమునిర్యథా. 75

రామస్తు చిత్రకూటాద్రౌ వసన్మునిభిరావృతః,
సీతయా లక్ష్మణేనాపి కించిత్కాలముపావసత్. 76

నాగరాశ్చ సదా యాంతి రామదర్శనలాలసాః,
చిత్రకూటస్థితం జ్ఞాత్వా సీతయా లక్ష్మణేన చ. 77

దృష్ట్వా తజ్జనసంబాధం రామస్తత్యాజ తం గిరిమ్,
దండకారణ్యగమనే కార్యమప్యనుచింతయన్. 78

అన్వగాత్సీతయా భ్రాత్రా హ్యత్రేరాశ్రమముత్తమమ్,
సర్వత్ర సుఖసంవాసం జనసంబాధవర్జితమ్. 79

గత్వా మునిముపాసీనం భాసయంతం తపోవనమ్,
దండవత్ప్రణిపత్యాహ రామోఽహమభివాదయే. 80

పితురాజ్ఞాం పురస్కృత్య దండకాననమాగతః,
వనవాసమిషేణాపి ధన్యోఽహం దర్శనాత్తవ. 81

శ్రుత్వా రామస్య వచనం రామం జ్ఞాత్వా హరిం పరమ్,
పూజయామాస విధివద్భక్త్యా పరమయా మునిః. 82

ఉదారబుద్ధియగు భరతుడు సమస్త పురవాసులకు, దేశవాసులకు యథాయోగ్యముగ అయోధ్యానగరమున నివాసమేర్పరచి, తాను నందిగ్రామమునకు వెళ్లెను. అచట నొక సింహాసనముపై రామపాదుకలను నుంచి శ్రీరామునితో సమానముగ భావించి, నిత్యము భక్తితో గంధ పుష్పాదులతో, అక్షతలతో సమస్త రాజలాంఛనములతో పూజించసాగెను. ఈ విధముగా భరతుడు ఫలమూలములు దినుచు, ఇంద్రియ నిగ్రహముతో, జటావల్కలధారియై, భూమిపై పరుండుచు బ్రహ్మచర్యము నవలంబించి, శత్రుఘ్న సహితుడై యుండెను (72- 74).

భూమండలమున రాజకార్యములు అన్నింటిని భరతుడు రామపాదుకలకు నివేదించెడివాడు (74). రామచంద్రుని ఆగమనమును ప్రతీక్షించుచు, గడుచు దినములు లెక్కించుకొనుచు రామునియందే మనసునిలిపి, బ్రహ్మర్షి వలె కాలము గడుపసాగెను (75).

ఇట రాముడు సీతాలక్ష్మణ సమేతుడై చిత్రకూటమున కొన్నాళ్ళు గడపెను (76). రాముడు భార్యతో, అనుజునితో చిత్రకూటమున ఉండెనను మాట వినిన పరిసరప్రాంత జనులు వారి దర్శనార్థము ఎల్లవేళల వచ్చుచుండెడివారు (77). రాముడట్లు వచ్చువారి వలన మునుల ప్రశాంతతకు భంగము వాటిల్లునని చింతించి, తాను దండకవనము పోవలయు కార్యము తలచి, ఆ పర్వత నివాసము వదలిపెట్టెను (78). అటనుండి కదలి రాముడు సీతా లక్ష్మణ సమేతుడై అత్రిముని ఆశ్రమమునకు వెళ్లెను. జనసమూహము లేనిదై, అత్యుత్తమమై అన్ని విధముల సుఖదాయకమై ఆ ఆశ్రమముండెను (79).

అటకేగి, ఆశ్రమములో ఉపాసీనుడై, తన కాంతిచే ఆశ్రమమును ప్రకాశింపచేయుచున్న మునీశ్వరుని కడకేగి అతనికి దండప్రణామము లాచరించి ''నేను రాముడను, నమస్కరించుచున్నాను (80). మా తండ్రి ఆజ్ఞకై దండకారణ్యమునకు వచ్చితిని. ఈ సమయమున వనవాసము నెపమున మీ దర్శనము గావించి ధన్యుడనైతిని'' అని పలికెను (80-81).

శ్రీరాముని వచనములు విని యా మునీశ్వరుడు అతనిని సాక్షాత్తుగ పరమాత్ముడని యెరిగి అత్యంత భక్తిపూర్వకముగా విధ్యుక్తముగా పూజించెను (82). పిమ్మట వన్యఫలములతో

వన్యైః ఫలైః కృతాతిథ్యముపవిష్టం రఘూత్తమమ్,
సీతాం చ లక్ష్మణం చైవ సంతుష్టో వాక్యమబ్రవీత్. 83

భార్యా మేఽతీవ సంవృద్ధా హ్యనసూయేతి విశ్రుతా,
తపశ్చరంతీ సుచిరం ధర్మజ్ఞా ధర్మవత్సలా. 84

అంతస్తిష్ఠతి తాం సీతా పశ్యత్వరినిషూదన,
తథేతి జానకీం ప్రాహ రామో రాజీవలోచనః. 85

గచ్ఛ దేవీం నమస్కృత్య శీఘ్రమేహి పునః శుభే,
తథేతి రామవచనం సీతా చాపి తథాకరోత్. 86

దండవత్ప్రణతామగ్రే సీతాం దృష్ట్వాతిహృష్టధీః,
అనసూయా సమాలింగ్య వత్సే సీతేతి సాదరమ్. 87

దివ్యే దదౌ కుండలే ద్వే నిర్మితే విశ్వకర్మణా,
దుకూలే ద్వే దదౌ తస్యై నిర్మలే భక్తిసంయుతా. 88

అంగరాగం చ సీతాయై దదౌ దివ్యం శుభాననా,
న త్యక్ష్యతేఽంగరాగేణ శోభా త్వాం కమలాననే. 89

పాతివ్రత్యం పురస్కృత్య రామమన్వేహి జానకి,
కుశలీ రాఘవో యాతు త్వయా సహ పునర్గృహమ్. 90

భోజయిత్వా యథాన్యాయం రామం సీతాసమన్వితమ్,
లక్ష్మణం చ తదా రామం పునః ప్రాహ కృతాంజలిః. 91

రామ త్వమేవ భువనాని విధాయ తేషాం
సంరక్షణాయ సురమానుషతిర్యగాదీన్.
దేహాన్బిభర్షి న చ దేహగుణైర్విలిప్త-
స్త్వత్తో బిభేత్యఖిలమోహకరీ చ మాయా. 92

వారికి అతిథి సత్కారము గావించి, రాముని సీతను లక్ష్మణుని కూర్చుండవేసి సంతుష్టితో ఇట్లనెను (83) - "నా పత్ని అనసూయ యను పేర ఖ్యాతి గన్నది. ఆమె అతి వృద్ధురాలు. గొప్ప తపస్విని. ధర్మజ్ఞురాలు. ధర్మము నందు ప్రేమ గలది (84). ఇపుడు కుటీరము లోపల నున్నది. శత్రుదమనా! రామా! ఆమెను సీత చూచుగాక!" అనెను. రాజీవాక్షుడు రాముడు 'మంచిదని' జానకితో ఇట్లనెను 'కల్యాణీ! శీఘ్రమే నీవు అనసూయాదేవికి నమస్కరించి రమ్ము'. సీతయు వల్లెయని రామునాజ్ఞ పాలించెను (86).

అనసూయాదేవి తనకు దండప్రణామము లాచరించు సీతను చూచి కడు సంతోషముతో 'చిరంజీవీ! బిడ్డా! సౌభాగ్యవతీ! సీతా' యనుచు ఆదరముగా కౌగలించుకొనెను. ఆమెకు భక్తితో విశ్వకర్మ నిర్మితములగు రెండు దివ్య కుండలములు, రెండు స్వచ్ఛమగు పట్టుచీరలు అర్పించెను (87-88). ఋషిపత్ని అనసూయ ఇంకను ఆమెకు దివ్యమగు అంగరాగలేపనము కూడ ఇచ్చి "పద్మముఖీ! ఈ అంగరాగ లేపనమున నీ శరీరశోభ ఏనాటికిని తరిగిపోకుండ ఉండగలదు. జానకీ! నీవు సదా పాతివ్రత్యము పాలించుము. శ్రీరాముని అనుగమించుము. రఘునాథుడు నీతోడ కుశలముగ తిరిగి గృహము చేరుగాక (90)" అని ఆశీర్వదించెను.

అటుపిమ్మట ఆమె విధిపూర్వకముగా సీతారామ లక్ష్మణులకు ముగ్గురకు భోజనము పెట్టెను. అనంతరము అత్రిమహర్షి రామునితో (91) - "రామా! ఈ సమస్త భువనములు సృజించి, నీవే వీనిని రక్షించుటకు దేవ మనుష్య తిర్యగాది యోనులలో శరీరధారణ చేయుచుందువు. అయినను దేహగుణములు నిన్నంటవు. సర్వలోకమును మోహింపచేయు మాయకూడ సర్వదా నీకు భయపడు చుండును" అనెను (92).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అయోధ్యాకాండ - నవమ సర్గము ॥ 9 ॥

----****----

## సమాప్తమిదం అయోధ్యాకాండమ్.

----****----

॥ శ్రీహరిః ॥

ఓం శ్రీపరమాత్మనే నమః

# అధ్యాత్మ రామాయణము

## అరణ్యకాండము

## ప్రథమ సర్గము

### విరాధ వధ

శ్రీమహాదేవ ఉవాచ

అథ తత్ర దినం స్థిత్వా ప్రభాతే రఘునందనః,
స్నాత్వా మునిం సమామంత్ర్య ప్రయాణాయోపచక్రమే. 1

మునే గచ్ఛామహే సర్వే మునిమండలమండితమ్,
విపినం దండకం యత్ర త్వమాజ్ఞాతుమిహార్హసి. 2

మార్గప్రదర్శనార్థాయ శిష్యానాజ్ఞప్తుమర్హసి,
శ్రుత్వా రామస్య వచనం ప్రహస్యాత్రిర్మహాయశాః,
ప్రాహ తత్ర రఘుశ్రేష్ఠం రామ రామ సురాశ్రయ! 3

సర్వస్య మార్గద్రష్టా త్వం తవ కో మార్గదర్శకః,
తథాపి దర్శయిష్యంతి తవ లోకానుసారిణః. 4

ఇతి శిష్యాన్సమాదిశ్య స్వయం కించిత్తమన్వగాత్,
రామేణ వారితః ప్రీత్యా అత్రిః స్వభవనం యయౌ. 5

క్రోశమాత్రం తతో గత్వా దదర్శ మహతీం నదీమ్,
అత్రేః శిష్యానువాచేదం రామో రాజీవలోచనః. 6

నద్యాః సంతరణే కశ్చిదుపాయో విద్యతే న వా.
ఊచుస్తే విద్యతే నౌకా సుదృఢా రఘునందన. 7

తారయిష్యామహే యుష్మాన్వయమేవ క్షణాదిహ,
తతో నావి సమారోప్య సీతాం రాఘవలక్ష్మణౌ. 8

క్షణాత్సంతారయామాసుర్నదీం మునికుమారకాః,
రామాభినందితాః సర్వే జగ్మురత్రేరథాశ్రమమ్. 9

తావేత్య విపినం ఘోరం ఝిల్లీఝంకారనాదితమ్,
నానామృగగణాకీర్ణం సింహవ్యాఘ్రాదిభీషణమ్. 10

శ్రీమహాదేవుడిట్లనెను - ''పార్వతీ! నాటి దివసమున రాముడు సీతాలక్ష్మణులతో అత్రిముని ఆశ్రమమునందే వసించి, మరునాడు ప్రాతఃకాలమున స్నానమాచరించి, మునివరుని అనుమతి గైకొని బయలుదేరుచు (1) ఇట్లు అనెను ''మునివరా! మేము మునిమండలముచే శోభించెడి దండకారణ్యమునకు పోవదలచుచున్నాము. మీరు మాకు అనుజ్ఞనిండు (2). మాకు మార్గము చూపుటకు కొందరు శిష్యులను పంపుడు'. ఇట్లు పలుకగా విని మహాయశస్వియగు అత్రిముని చిరునవ్వుతో రామునితో ఇట్లనెను ''రామా! దేవతాశ్రయ స్వరూపా! అందరికిని మార్గము చూపువాడవు నీవే! మరిక నీకు మార్గదర్శకులు ఎవరు కాగలరు? అయినను ఈ సమయమున నీవు లోక వ్యవహారము అనుసరించుచున్నావు కనుక మా శిష్యులు నీకు మార్గమును చూపుటకు వచ్చెదరు (3-4)''. అనంతరము శిష్యుల నాజ్ఞాపించి, స్వయముగా తాను కొంతదూరము రాముని అనుగమించి, అతడు ప్రేమతో నివారించగా అత్రి మహర్షి ఆశ్రమమునకు వచ్చెను (5).

ఒక క్రోసు దూరమేగిన తరువాత రాముడొక పెద్దనదిని చూచెను. రాజీవలోచనుడు రాముడు అత్రి మహర్షి శిష్యులను ఇట్లడిగెను (6)- ''బ్రహ్మచారులారా! నది దాటుటకు ఏదైన ఉపాయమున్నదా? లేదా?'' అంత శిష్యులు ''ఇచట సుదృఢమైన నౌక ఒకటి యున్నది (7). దానిలో మేము మిమ్ము ఎక్కించి త్రుటిలో అవతలి దరికి చేర్చగలము'' అని పలికి వారు సీతా రామ లక్ష్మణులను నౌకలోనికి ఎక్కించి క్షణములో అద్దరికి చేర్చిరి. పిమ్మట రాముని అభినందనలు అందుకొని వారు అత్రిమహర్షి ఆశ్రమమునకు మరలిరి (8-9).

అంతట వారు (సీతారామలక్ష్మణులు) కీచురాళ్ల మ్రోతతో మారు మ్రోగునదియు, వివిధ వన్యమృగములతో నిండినదియు, సింహ వ్యాఘ్రాది క్రూరమృగములతో భయానకమై యుండునదియు నగు ఘోరాటవిని చేరిరి.



వన మార్గమున సీతారామ లక్ష్మణులు

రాక్షసైర్ఘోరరూపైశ్చ సేవితం రోమహర్షణమ్,
ప్రవిశ్య విపినం ఘోరం రామో లక్ష్మణమబ్రవీత్. 11

ఇతః పరం ప్రయత్నేన గంతవ్యం సహితేన మే,
ధనుర్గుణేన సంయోజ్య శరానపి కరే దధత్. 12

అగ్రే యాస్యామ్యహం పశ్చాత్త్వమన్వేహి ధనుర్ధరః,
ఆవయోర్మధ్యగా సీతా మాయేవాత్మపరాత్మనోః. 13

చక్షుశ్చారయ సర్వత్ర దృష్టం రక్షోభయం మహత్,
విద్యతే దండకారణ్యే శ్రుతపూర్వమరిందమ. 14

ఇత్యేవం భాషమాణౌ తౌ జగ్మతుః సార్ధయోజనమ్,
తత్రైకా పుష్కరిణ్యాస్తే కల్హారకుముదోత్పలైః. 15

అంబుజైః శీతలోదేన శోభమానా వ్యదృశ్యత,
తత్సమీపమథో గత్వా పీత్వా తత్సలిలం శుభమ్. 16

ఊషుస్తే సలిలాభ్యాశే
క్షణం ఛాయాముపాశ్రితాః,
తతో దదృశురాయాంతం
మహాసత్త్వం భయానకమ్. 17

కరాలదంష్ట్రవదనం భీషయంతం స్వగర్జితైః,
వామాంసే న్యస్తశూలాగ్రగ్రథితానేకమానుషమ్. 18

భక్షయంతం గజవ్యాఘ్రమహిషం వనగోచరమ్,
జ్యారోపితం ధనుర్ధృత్వా రామో లక్ష్మణమబ్రవీత్. 19

పశ్య భ్రాతర్మహాకాయో
రాక్షసో౽యముపాగతః,
ఆయాత్యభిముఖం సో౽గ్రే
భీరూణాం భయమావహన్. 20

సజ్జీకృతధనుస్తిష్ఠ మా భైర్జనకనందిని,
ఇత్యుక్త్వా బాణమాదాయ స్థితో రామ ఇవాచలః. 21

స తు దృష్ట్వా రమానాథం లక్ష్మణం జానకీం తదా,
అట్టహాసం తతః కృత్వా భీషయన్నిదమబ్రవీత్. 22

కౌ యువాం బాణతూణీరజటావల్కలధారిణౌ,
మునివేషధరౌ బాలౌ స్త్రీసహాయౌ సుదుర్మదౌ. 23

సుందరౌ బత మే వక్త్రప్రవిష్టకవలోపమౌ,
కిమర్థమాగతౌ ఘోరం వనం వ్యాలనిషేవితమ్. 24

(10). (దర్శన మాత్రాన) వెంట్రుకలు నిక్కబొడుచుకొనచేయు భయంకరులగు రాక్షసులు సంచరించుచున్న ఆ ఘోరవనమున ప్రవేశించి రాముడు లక్ష్మణునితో ఇట్లనెను (11) - ''ఇటనుండి మనము ఇరువురము జాగ్రత్తగా అంతట పరికించుచు నడువవలయును. నేను వింటికి నారి సంధించి, బాణమును చేతబట్టి ముందుగా నడచెదను. నీవు ధనుర్ధారివై వెనుక రమ్ము. జీవునకు పరమాత్మకు నడుమ మాయవలె సీత మనమధ్య నడువగలదు (12-13). శత్రుసూదనా! అన్నివంకల జాగ్రత్తగా పరికించుము. మనము వినియున్నట్లుగానే యీ దండకారణ్యమున రాక్షసుల భయము ఎక్కువగా కనబడుచున్నది'' (14).

ఈ విధముగా పరస్పరము మాటలాడుకొనుచు వారు ఒకటిన్నర యోజనము దూరము నడచిరి. అచట కలువలు, మొల్లలు, పద్మములతో శోభించు పుష్కరిణి యున్నది (15). ఆ సరస్సు శీతల జలములతో అతి సుందరముగా కనువట్టెను. వారు దాని కడకేగి ఆ చల్లటి నీరు త్రావిరి (16). పిదప కొంతసేపు సరసు ఒడ్డున వృక్షఛాయలో కూర్చుండిరి. ఆ సమయమునందే వారు అటుగా వచ్చుచున్న భయంకరుడు, మహాబలశాలి యగు రాక్షసుని చూచిరి (17). అతని నోటిలో తీక్ష్ణమైన కోరలున్నవి. వాడు భయంకరముగా గర్జించుచుండెను. వాని ఎడమభుజముపై నొక త్రిశూలముండెను. దాని మొనకి యందు ఎందరో మానవులు గ్రుచ్చబడియుండిరి (18).

వాడెన్నియో అడవి ఏనుగులను, సింహములను, దున్నలను, తినుచు వచ్చుచుండెను. వానిని చూచినంతనే రాముడు చేతనున్న ధనువును ఎక్కుపెట్టి, లక్ష్మణునితో యిట్లనెను (19) - ''సోదరా! ఈ వచ్చిన మహాకాయుడగు రాక్షసుని చూడుము. పిరికివారిని భయపెట్టు ఉగ్రస్వరూపుడు మనముందుకు వచ్చుచున్నాడు (20).

నీవు ధనువున బాణము సంధించి యుండుము. జానకీ! నీవు భయపడవలదు'' అని పలికి రాముడు ధనువున బాణము సంధించి కొండవలె నిశ్చలముగా నిలిచెను (21).

అనంతరము ఆ రాక్షసుడు రాముని, జానకిని, లక్ష్మణుని చూచి అట్టహాసము గావించి వారిని భయపెట్టుచు ఇట్లు పలికెను (22) - ''ఎవరు మీరు? బాణ తూణీర జటా వల్కలధారులు, మునిరూపులు, బాలురు మీరెవరు? స్త్రీ సహాయులై నిర్భయముగా చరించుచు కనబడుచున్నారు? మీరు అతి సుందరులు. నా నోటికి కబళముల వంటివారు! ఘోరమృగాకులమైన యీ అడవికేల వచ్చితిరి? (24)''.

శ్రుత్వా రక్షోవచో రామః స్మయమాన ఉవాచ తమ్.
అహం రామస్త్వయం భ్రాతా లక్ష్మణో మమ సమ్మతః. 25

ఏషా సీతా మమ ప్రాణవల్లభా వయమాగతాః.
పితృవాక్యం పురస్కృత్య శిక్షణార్థం భవాదృశామ్. 26

శ్రుత్వా తద్రామవచనమ్
అట్టహాసమథాకరోత్.
వ్యాదాయ వక్త్రం బాహుభ్యాం
శూలమాదాయ సత్వరః. 27

మాం న జానాసి రామ త్వం విరాధం లోకవిశ్రుతమ్.
మద్భయాన్మునయః సర్వే త్యక్త్వా వనమితో గతాః. 28

యది జీవితుమిచ్ఛాస్తి త్యక్త్వా సీతాం నిరాయుధౌ.
పలాయతం న చేచ్ఛీఘ్రం భక్షయామి యువామహమ్. 29

ఇత్యుక్త్వా రాక్షసః సీతామాదాతుమభిదుద్రువే.
రామశ్చిచ్ఛేద తద్బాహూ శరేణ ప్రహసన్నివ. 30

తతః క్రోధపరీతాత్మా వ్యాదాయ వికటం ముఖమ్.
రామమభ్యద్రవద్రామశ్ఛిచ్ఛేద పరిధావతః. 31

పదద్వయం విరాధస్య తదద్భుతమివాభవత్. 32

తతః సర్ప ఇవాస్యేన గ్రసితుం రామమాపతత్.
తతోఽర్ధచంద్రాకారేణ బాణేనాస్య మహచ్ఛిరః. 33

చిచ్ఛేద రుధిరౌఘేణ పపాత ధరణీతలే.
తతః సీతా సమాలింగ్య ప్రశశంస రఘూత్తమమ్. 34

తతో దుందుభయో నేదుర్దివి దేవగణేరితాః.
ననృతుశ్చాప్సరా హృష్టా జగుర్గంధర్వకిన్నరాః. 35

విరాధకాయాదతిసుందరాకృతి-
ర్విభ్రాజమానో విమలాంబరావృతః.
ప్రతప్తచామీకరచారుభూషణో
వ్యదృశ్యతాగ్రే గగనే రవిర్యథా. 36

ప్రణమ్య రామం ప్రణతార్తిహారిణం
భవప్రవాహోపరమం ఘృణాకరమ్.
ప్రణమ్య భూయః ప్రణనామ దండవత్
ప్రపన్నసర్వార్తిహరం ప్రసన్నధీః. 37

రాక్షసుని యీ మాటలు విని రాముడు చిరునవ్వుతో ఇట్లు బదులు చెప్పెను - ''నేను రాముడను. ఇతడు నాతో సమానుడగు లక్ష్మణుడు నా సోదరుడు (25). ఈమె నా ప్రాణప్రియ సీత. మేము మా తండ్రి ఆనతితో నీవంటివారిని శిక్షించుటకు ఈ వనమునకు వచ్చియున్నాము''.

రాముని మాటలువిని రాక్షసుడు వికటాట్టహాసము చేసెను. అతడు నోరు తెరచి, వెంటనే చేత శూలము నెత్తి ''రామా! నన్ను నీవెరుగవు! నేను లోకప్రసిద్ధుడనగు విరాధుడనువాడను. నా భయము చేతనే మునిజనులందరు ఈ వనము వదలి పారిపోయిరి (27-28).

''నీవు బ్రదుకగోరినచో సీతను వదలి, నిరాయుధుడవై పరుగెత్తుము. లేకున్న నేనిప్పుడే మిమ్ముల నిద్దరను తినివైచెదను(29)''. ఇట్లు పలికి ఆ రాక్షసుడు సీతను పట్టుకొనుటకు పరుగెత్తెను. అంతట రాముడు నవ్వుచు, తన బాణముతో వాని భుజములు ఖండించెను (30). అంతట రాక్షసుడు అత్యంత క్రోధపూరితుడై భయంకరమైన నోరు తెరచి రాముని వంకకు పరుగెత్తెను. తనవంకకు పరుగులిడుచున్న వాని పాదములను రాముడు నరకివైచెను. ఇది మిక్కిలి ఆశ్చర్యము కలిగించినదయ్యెను (31-32).

అంతట వాడు సర్పమువలె నోరు తెరచి రాముని మ్రింగివేయదలచి ముందుకు రాసాగెను. రాముడొక అర్ధచంద్ర బాణముతో వాని శిరస్సును ఖండించెను. ఆ రాక్షసుడు రక్తపరిప్లుతుడై నేలకూలెను. ఇట్లు రాక్షసుడు మరణించగా చూచి, సీత రఘూత్తముని ఆలింగనము చేసికొని, ఎంతయో ప్రశంసించెను (33-34). ఆ సమయమున ఆకసమున దేవదుందుభులు మ్రోగినవి. అప్సరసలు ఆనందముగా నర్తించిరి. కిన్నరులు, గంధర్వులు గానము చేసిరి (35).

అపుడు విరాధుని మృతదేహము నుండి గగన మండలముననున్న సూర్యుని కాంతితో, సమానమగు తేజస్సుతో, సుందరాంబరములతో, సువర్ణాలంకారములతో శోభిల్లుచు ఒక పురుషుడు కనవచ్చెను (36). అతడు, నమస్కరించువారి దుఃఖమును దూరము చేయువాడు, సంసారసాగరము దాటించువాడు, దయామయుడు, శరణాగతుల సకలబాధలను నివారించువాడు అగు రామునికి ప్రసన్నచిత్తుడై ప్రణమిల్లి మరల దండవత్ప్రణామాదులు ఆచరించి మాటిమాటికి నమస్కరించుచు యిట్లు స్తుతింప సాగెను (37).

విరాధ ఉవాచ

శ్రీరామ రాజీవదలాయతాక్ష
విద్యాధరోఽహం విమలప్రకాశః,
దుర్వాససోఽకారణకోపమూర్తినా
శప్తః పురా సోఽద్య విమోచితస్త్వయా. 38

ఇతః పరం త్వచ్చరణారవిందయోః
స్మృతిః సదా మేఽస్తు భవోపశాంతయే.
త్వన్నామసంకీర్తనమేవ వాణీ
కరోతు మే కర్ణపుటం త్వదీయమ్. 39

కథామృతం పాతు కరద్వయం తే
పాదారవిందార్చనమేవ కుర్యాత్,
శిరశ్చ తే పాదయుగప్రణామం
కరోతు నిత్యం భవదీయమేవమ్. 40

నమస్తుభ్యం భగవతే విశుద్ధజ్ఞానమూర్తయే,
ఆత్మారామాయ రామాయ సీతారామాయ వేధసే. 41

ప్రపన్నం పాహి మాం రామ యాస్యామి త్వదనుజ్ఞయా,
దేవలోకం రఘుశ్రేష్ఠ మాయా మాం మాఽవృణోతు తే.

ఇతి విజ్ఞాపితస్తేన ప్రసన్నో రఘునందనః,
దదౌ వరం తదా ప్రీతో విరాధాయ మహామతిః. 43

గచ్ఛ విద్యాధరాశేషమాయాదోషగుణా జితాః,
త్వయా మద్దర్శనాత్సద్యో ముక్తో జ్ఞానవతాం వరః. 44

మద్భక్తిర్దుర్లభా లోకే జాతా చేన్ముక్తిదా యతః,
అత స్త్వం భక్తిసంపన్నః పరం యాహి మమాజ్ఞయా. 45

రామేణ రక్షోనిధనం సుఘోరం
శాపాద్విముక్తిర్వరదానమేవమ్,
విద్యాధరత్వం పునరేవ లబ్ధం
రామం గృణన్నేతి నరోఽఖిలార్థాన్. 46

విరాధుడిట్లనెను – ''రాజీవవిశాలనేత్రా! విమల తేజాడనగు నేను విద్యాధరుడను. అకారణ కోపనుడైన దుర్వాస మహర్షి నన్ను శపించెను. నేడు నన్ను నీవు శాపవిముక్తుని చేసితివి (38). ఇకనుండి, సంసారబంధము నుండి విడిపించు నీ పాదారవిందములయందలి స్మృతి నాలో ఎల్లప్పుడు ఉండుగాక! నా వాక్కు సర్వదా నీ నామసంకీర్తన చేయు గాక! కర్ణములు నీ కథామృతము పానము చేయుగాక! కరములు నీ చరణకమలములు సేవించుగాక! శిరసు నీ చరణ యుగళమందు ప్రణమిల్లు చుండుగాక! (39- 40). విశుద్ధ జ్ఞానమూర్తి! భగవన్! నమస్కారము. స్వస్వరూపమును రమించువాడవు కాన ఆత్మారాముడవు, కాన రాముడవు! మాయతోగూడి జంటగా సీతారాముడ వైనావు. నమస్కారము (41). శరణాగతుడను నన్ను రక్షింపుము. రఘుశ్రేష్ఠా! నీ అనతితో దేవలోకమునకు పోవుచున్నాను. నీ మాయ నన్ను ఆవరించకుండునట్లు అనుగ్రహించుము'' (42).

విరాధుడిట్లు ప్రార్థన చేయగా మహామతియగు రాముడు వానికి ప్రసన్నుడై ఈ వరముల నిచ్చెను (43). ''విద్యాధరా! నీవిక పొమ్ము. నా దర్శన ప్రభావమున నీవు మాయాగత దోషములను, గుణములను గెలిచితివి. ఇంకిపుడు జ్ఞానశ్రేష్ఠుడవు, ముక్తుడవైతివి (44). ఈ ప్రపంచమున నా విషయిక భక్తి అతి దుర్లభము. అట్టిది కలిగిన తప్పక ముక్తి లభించును. నీవు నా యందలి భక్తి కలవాడవు. నా అనతిచే పరమ పదమును చేరుము.''

రాముడీ విధముగా భయంకరుడైన రాక్షసుని వధించుట, వానిని శాపవిముక్తుని గావించుట, వానికి వరము లిచ్చుట, మరల విద్యాధరత్వము పొందింపచేయుట తలచుచు రాముని స్తుతించువారు అన్ని కోరికలను పొందెదరు. వారికి చతుర్విధ పురుషార్థములు లభించును (46).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అరణ్యకాండ ప్రథమ సర్గము ॥ 1 ॥

____****____

# ద్వితీయ సర్గము

## శరభంగ సుతీక్ష్ణాది మునీశ్వరుల సందర్శనము

శ్రీమహాదేవ ఉవాచ

విరాధే స్వర్గతే రామో లక్ష్మణేన చ సీతయా,
జగామ శరభంగస్య వనం సర్వసుఖావహమ్. 1

శరభంగస్తతో దృష్ట్వా రామం సౌమిత్రిణా సహ,
ఆయాంతం సీతయా సార్ధం సంభ్రమాదుత్థితః సుధీః. 2

అభిగమ్య సుసంపూజ్య విష్టరేషూపవేశయత్,
ఆతిథ్యమకరోత్తేషాం కందమూలఫలాదిభిః. 3

ప్రీత్యాహ శరభంగోఽపి రామం భక్తపరాయణమ్,
బహుకాలమిహైవాసం తపసే కృతనిశ్చయః. 4

తవ సందర్శనాకాంక్షీ రామ త్వం పరమేశ్వరః,
అద్య మత్తపసా సిద్ధం యత్పుణ్యం బహు విద్యతే,
తత్సర్వం తవ దాస్యామి తతో ముక్తిం వ్రజామ్యహమ్. 5

సమర్ప్య రామస్య మహత్సుపుణ్య-
ఫలం విరక్తః శరభంగయోగీ,
చితిం సమారోహయదప్రమేయం
రామం ససీతం సహసా ప్రణమ్య. 6

ధ్యాయంశ్చిరం రామమశేషహృత్స్థం
దూర్వాదలశ్యామలమంబుజాక్షమ్,
చీరాంబరం స్నిగ్ధజటాకలాపం
సీతాసహాయం సహలక్ష్మణం తమ్. 7

కో వా దయాలుః స్మృతకామధేను-
రన్యో జగత్యాం రఘునాయకాదహో,
స్మృతో మయా నిత్యమనన్యభాజా
జ్ఞాత్వా స్మృతిం మే స్వయమేవ యాతః. 8

పశ్యత్విదానీం దేవేశో రామో దాశరథిః ప్రభుః,
దగ్ధ్వా స్వదేహం గచ్ఛామి బ్రహ్మలోకమకల్మషః. 9

శ్రీమహాదేవుడు ఇట్లనెను - పార్వతీ! విరాధుడు స్వర్గమున కేగిన పిదప రామలక్ష్మణులు సీతాసమేతులై సర్వ సుఖదాయకమైన శరభంగుని తపోవనమునకు వెళ్లిరి (1). ధీమంతుడగు శరభంగుడు సీతా లక్ష్మణ సమేతుడై రాముడు వచ్చుటను చూచి సంభ్రమముగా లేచి నిలుచుండెను (2). ఎదురేగి ఆ మహర్షి, వారిని బాగుగా పూజించెను. ఆసనము లిచ్చి, కూర్చుండబెట్టి కందమూల ఫలాదులతో అతిథిసత్కారము గావించెను (3). అనంతరము మునివరుడగు శరభంగుడు భక్తవత్సలుడైన రామునితో ప్రేమపూర్వకముగా నిట్లనెను "నేను చిరకాలము నుండి మీ దర్శనము కోరుచు తపస్సు చేయుచుంటిని. అటుల ఇచ్చటనే నిలచియుంటిని. రామా! నీవు సాక్షాత్తుగ పరమేశ్వరుడవు. నా తపము వలన లభించిన పుణ్యమంతయు నీకు నేడు సమర్పించి నేను మోక్షపదము పొందెదను" (4-5). ఇట్లు పలికి మహావిరాగియగు శరభంగుడు తన మహాపుణ్యమును రామునకు సమర్పించి సీతాసమేతుడై, అప్రమేయుడై దర్శనమిచ్చిన ఆతనికి నమస్కరించి, త్వరగా చితి నధిరోహించెను (6).

అతడా సమయమున చాలసేపటివరకు మనమున సర్వాంతర్యామి, దూర్వాదళ శ్యామలవర్ణుడు, కమల నేత్రుడు, చీరాంబరధారి, స్నిగ్ధ జటాజూటధారియగు రాముని సీతాలక్ష్మణ సమేతముగా ధ్యానించెను (7). "ఆహా! ఈ లోకమున రాముడు కాక తలచినంతనే కోరిక లీడేర్చు దయాళువులు ఇంకెవ్వరు గలరు? నేను అనన్యభావముతో అతనిని నిత్యము స్మరించువాడను. ఆ కారణమున అతడు నా స్మరణ నెరిగి స్వయముగా ఇటకు వచ్చినాడు (8). దేవేశుడగు దాశరథి శ్రీరామప్రభువు నన్ను చూచుచు నుండుగాక! ఇపుడే ఈ శరీరమును దహింపజేసుకొని నిష్పాపుడనై బ్రహ్మలోకమున కేగెదను (9).

అయోధ్యాధిపతిర్మేఽస్తు హృదయే రాఘవః సదా,
యద్వామాంకే స్థితా సీతా మేఘస్యేవ తడిల్లతా. 10

ఎవని వామాంకమందు మేఘములో మెఱపువలె సీతాదేవి ప్రకాశించుచుండునో, ఆ రాముడు, అయోధ్యాపతి సర్వదా హృదయమందుండుగాక! (10).''

ఇతి రామం చిరం ధ్యాత్వా దృష్ట్వా చ పురతః స్థితమ్,
ప్రజ్వాల్య సహసా వహ్నిం దగ్ధ్వా పంచాత్మకం వపుః.11

దివ్యదేహధరః సాక్షాద్యయౌ లోకపతేః పదమ్,
తతో మునిగణాః సర్వే దండకారణ్యవాసినః,
ఆజగ్ము రాఘవం ద్రష్టుం శరభంగనివేశనమ్. 12

ఇట్లు చాలసేపు రాముని ధ్యానించి, తన కట్టెదుట నున్న అతని స్వరూపమును గాంచుచు, మునివరుడైన శరభంగుడు అగ్నిని ప్రజ్వలింపచేసి తన పాంచభౌతిక దేహమును దగ్ధము చేసికొనెను. రాముడు చూచుచుండగా దివ్యదేహముతో లోకపతియగు విష్ణుపదమునకే అతడు వెడలెను. అనంతరము దండకారణ్యవాసులు సమస్త మునిజనులు రాముని దర్శింప శరభంగాశ్రమము చేరిరి (11-12).

దృష్ట్వా మునిసమూహం తం జానకీరామలక్ష్మణాః,
ప్రణేముః సహసా భూమౌ మాయామానుషరూపిణః.
13

ఆ మునిసమాజమును చూచి మాయామానుష రూపుడగు రాముడు సీతా లక్ష్మణులతో ఆదరమున వారికి సాష్టాంగప్రణామములు చేసెను (13).

ఆశీర్భిరభినంద్యాథ రామం సర్వహృది స్థితమ్,
ఊచుః ప్రాంజలయః సర్వే ధనుర్బాణధరం హరిమ్. 14

ఆ మునీశ్వరులు సర్వాంతర్యామియగు రాముని ఆశీర్వాదముతో అభినందించి ధనుర్బాణధారి అయిన శ్రీహరితో చేతులు జోడించి యిట్లనిరి (14) -

భూమేర్భారావతారాయ జాతోఽసి బ్రహ్మణార్థితః,
జానీమస్త్వాం హరిం లక్ష్మీం జానకీం లక్ష్మణం తథా. 15

శేషాంశం శంఖచక్రే ద్వే భరతం సానుజం తథా,
అతస్త్వావౌ ఋషీణాం త్వం దుఃఖం మోక్తుమిహార్హసి.16

''నీవు బ్రహ్మ ప్రార్థనచే భూభారము హరింప నవతరించితివి. నీవు సాక్షాత్తు శ్రీహరి వనియు, జానకి లక్ష్మియనియు, లక్ష్మణుడు శేషాంశ యని, భరతశత్రుఘ్నులు శంఖచక్రములని మేము ఎరుగుదుము. కాన మీరు తొలుత మునుల దుఃఖము తొలగింపవలయును (15-16).

అగచ్ఛ యామో మునిసేవితాని
వనాని సర్వాణి రఘూత్తమ! క్రమాత్.
ద్రష్టుం సుమిత్రాసుతజానకీభ్యాం
తదా దయాఽస్మాసు దృఢా భవిష్యతి. 17

రాఘవా! సీతాలక్ష్మణ సమేతుడవై నీవు మావెంట క్రమముగా, సమస్త మునీశ్వరుల ఆశ్రమములు చూచుటకు రావలయును. అట్లయిన నీకు మాయందు దయాభావము దృఢమగును'' (17).

ఇతి విజ్ఞాపితో రామః కృతాంజలిపుటైర్విభుః,
జగామ మునిభిః సార్ధం ద్రష్టుం మునివనాని సః. 18

దోయిలిఒగ్గి వారివిధముగా వేడుకొనగా రాముడు మునులవెంట తపోవనములను చూడ బయలు దేరెను (18).

దదర్శ తత్ర పతితాన్యనేకాని శిరాంసి సః,
అస్థిభూతాని సర్వత్ర రామో వచనమబ్రవీత్. 19

ఆ ప్రదేశముల అన్నిచోట్ల చాలా పుఱ్ఱెలు, ఎముకలు పడియుండెను. దానినిచూచి మునులను రాముడు (19).

అస్థీని కేషామేతాని కిమర్థం పతితాని వై,
తమూచుర్మునయో రామ ఋషీణాం మస్తకాని హి.20

''ఈ అస్థిక లెవరివి? ఈ తపోభూమిలో ఏల పడియున్నవి?'' అని అడిగెను. అంతట ఆ మునులు ''రామా! ఇవి ఋషుల శిరస్సులు'' (20).



దండకారణ్య వాసులగు మునులు శరభంగముని ఆశ్రమమునకు వచ్చి శ్రీరామచంద్రుని ప్రార్థించుట

రాక్షసైర్భక్షితానీహ ప్రమత్తానాం సమాధితః,
అంతరాయం మునీనాం తే పశ్యంతోఽనుచరంతి హి. 21

శ్రుత్వా వాక్యం మునీనాం
స భయదైన్యసమన్వితమ్.
ప్రతిజ్ఞామకరోద్రామో
వధాయాశేషరక్షసామ్. 22

పూజ్యమానః సదా తత్ర
మునిభిర్వనవాసిభిః.
జానక్యా సహితో రామో
లక్ష్మణేన సమన్వితః. 23

ఉవాస కతిచిత్తత్ర వర్షాణి రఘునందనః.
ఏవం క్రమేణ సంపశ్యన్ ఋషీణామాశ్రమాన్విభుః. 24

సుతీక్ష్ణస్యాశ్రమం ప్రాగాత్ప్రఖ్యాతమృషిసంకులమ్.
సర్వర్తుగుణసంపన్నం సర్వకాలసుఖావహమ్. 25

రామమాగతమాకర్ణ్య సుతీక్ష్ణః స్వయమాగతః.
అగస్త్యశిష్యో రామస్య మంత్రోపాసనతత్పరః.
విధివత్పూజయామాస భక్త్యుత్కంఠితలోచనః. 26

సుతీక్ష్ణ ఉవాచ

త్వన్మంత్రజాప్యహమనంతగుణాప్రమేయ
సీతాపతే శివవిరించిసమాశ్రితాంఘ్రే.
సంసారసింధుతరణామలపోతపాద
రామాభిరామ సతతం తవ దాసదాసః. 27

మామద్య సర్వజగతామవిగోచరస్త్వం
త్వన్మాయయా సుతకళత్రగృహాంధకూపే.
మగ్నం నిరీక్ష్య మలపుద్గలపిండమోహ-
పాశానుబద్ధహృదయం స్వయమాగతోఽసి. 28

''సర్వేశా! సమాధిస్థితినిపొంది, బాహ్యస్మృతిలేని ఋషులను రాక్షసులు తినగా మిగిలిన ఎముకలివి. ఋషుల ప్రమత్తతను (అవకాశమును) అన్వేషించుచు రాక్షసులు ఇచట తిరుగాడుచుందురు'' (21).[1] భయము, దైన్యము ముప్పిరిగొన్న ఋషుల మాటలు విని, అశేష రాక్షస సమూహమును వధించుటకై రాముడు ప్రతిజ్ఞ చేసెను (22). ఈ విధముగా క్రమముగా, వరుసగా మునీశ్వరుల ఆశ్రమములు దర్శించుచు, వనవాసులైనవారిచే (ఋషులచే) పూజాది సత్కారములు పొందుచు శ్రీరాముడు అచట సీతాలక్ష్మణ సహితముగా కొన్ని సంవత్సరములు నివసించెను (23- 24).

అనంతరము వారు విఖ్యాతుడైన సుతీక్ష్ణ మునివర్యుని ఆశ్రమమునకు వెళ్ళిరి. ఆ ఆశ్రమము ఋషులతో నిండియుండి (ఒకేసారి) సమస్త ఋతువుల వాతావరణముతో అన్నివేళల సుఖదాయకమై యుండెను (25). రాముని ఆగమనవార్తవిని శ్రీరామమంత్రోపాసకుడు, అగస్త్యశిష్యుడగు సుతీక్ష్ణమహాముని స్వయముగా ముందునకువచ్చి వారిని విధివిధానముగ పూజించెను. ఆ సమయమున సుతీక్ష్ణుని కన్నులు భక్తి పారవశ్యమున భగవద్దర్శనార్థము ఉత్కంఠభరములై యుండెను (26).

సుతీక్ష్ణుడు ఇట్లనెను - ''అనంతగుణశాలీ! అప్రమేయా! సీతాపతీ! నేను నీ మంత్రమే జపించువాడను! శివ బ్రహ్మాదులచే ఆశ్రయింపబడిన పాదములు గల స్వామీ! అభిరామా! రామా! మీ చరణములే సంసార సాగరము దాటించు దృఢమగు నావలు! నాథా! నేను సర్వదా నీ దాసానుదాసుడను (27).

నీవు చరాచరాత్మకమగు సకల ప్రపంచమునకు దృష్టిపథమున అందనివాడవు. నీ మాయచే మలపూరితమగు యీ శరీరమునందలి మోహపాశముతో బంధింపబడిన చిత్తము కలిగి, దీనుడనై పుత్రకళత్రాదుల మోహముతో నిండి, అంధకారకూపమున పడియుండగా చూచి, నీవే స్వయముగా నీ యమోఘదర్శనమిచ్చుటకు విచ్చేసితివి. ఇది మీ కరుణ మాత్రమే (28).

[1] ఋషులు సమాధిదశలో లేకున్న రాక్షసులకు శాపభయముండును. కావున తగిన అవకాశమును రాక్షసులు వెదకుచుందురని భావము.

త్వం సర్వభూతహృదయేషు కృతాలయోఽపి
త్వన్మంత్రజాప్యవిముఖేషు తనోషి మాయామ్,
త్వన్మంత్రసాధనపరేష్వపయాతి మాయా
సేవానురూపఫలదోఽసి యథా మహీపః. 29

"నీవు సమస్త ప్రాణుల హృదయమందు నివసించు వాడవు. నీ మంత్ర జపమునకు విముఖులైన వారిని నీ మాయతో మోహింపజేయుచున్నావు. నీ మంత్ర జపము అనుష్ఠించు వారినుండి నీ మాయను దూరముగా తొలగించెదవు. మహారాజువలె వారివారి సేవలను అనుసరించి ఫలమిచ్చుచుందువు గదా! (29).

విశ్వస్య సృష్టిలయసంస్థితిహేతురేక-
స్త్వం మాయయా త్రిగుణయా విధిరీశవిష్ణూ
భాసీశ మోహితధియాం వివిధాకృతిస్త్వం
యద్వద్రవిః సలిలపాత్రగతో హ్యనేకః. 30

"వాస్తవమున నీవొక్కండవే అయినను బ్రహ్మ విష్ణు మహేశ్వర రూపములతో జగత్తును సృష్టించుట, రక్షించుట, నశింపజేయుట చేయుచున్నావు. కాని మాయా మోహితచిత్తులైన వారు, వాస్తవముగా ఒక్కడేయైన సూర్యుని, నానా జలపాత్రలలో నానాజనులు చూచునట్లు నిన్ను పలు రూపములుగా చూచెదరు (30). రామా! తపస్సునకు కూడా అందని తమ చరణారవిందములను నేడు ఈ కన్నులతో ప్రత్యక్షముగా చూచుచున్నాను.

ప్రత్యక్షతోఽద్య భవతశ్చరణారవిందం
పశ్యామి రామ తపసః పరతః స్థితస్య,
దృగ్రూపతస్త్వమసతామవిగోచరోఽపి
త్వన్మంత్రపూతహృదయేషు సదా ప్రసన్నః. 31

సర్వద్రష్టవగు నీవు, నీ మంత్రజప విహీనులగు సత్పురుషులకు గోచరము కాని నీవు, మంత్రజపముతో పరిశుద్ధి పొందిన చిత్తములు కలవారికి సర్వదా ప్రసన్నుడవై భాసింతువు (31).

పశ్యామి రామ తవ రూపమరూపిణోఽపి
మాయావిడంబనకృతం సుమనుష్యవేషమ్,
కందర్పకోటిసుభగం కమనీయచాప-
బాణం దయార్ద్రహృదయం స్మితచారువక్త్రమ్. 32

"రామా! నీవు రూపరహితుడవు. అయినను నీ మాయా విలాసమున దాల్చిన మనోహర మానుష వేషమును నేను చూచుచున్నాను. నీ ఈ రూపము కోట్లాది మన్మథుల సమానమైన సౌందర్యము కలిగియున్నది. నీవు సుందర ధనుర్బాణములను ధరించియున్నావు. నీ హృదయము దయాపరిపూర్ణము. ముఖము మందహాసభాసురము (32).

సీతాసమేతమజినాంబరమప్రధృష్యం
సౌమిత్రిణా నియతసేవితపాదపద్మమ్,
నీలోత్పలద్యుతిమనంతగుణం ప్రశాంతం
మద్భాగధేయమనిశం ప్రణమామి రామమ్. 33

"సీతాసమేతుని, కృష్ణాజినాంబరధారిని, అజేయుని, జితేంద్రియుడగు లక్ష్మణ సేవిత పాదకమలుని, నల్లకలువకాంతి కల తేని, అనంత కల్యాణ గుణాకరుని, ప్రశాంతుని, నాపాలి మహద్భాగ్య ప్రదాత శ్రీరాముని నిరంతరము సేవింతును (33).

జానంతు రామ తవ రూపమశేషదేశ-
కాలాద్యుపాధిరహితం ఘనచిత్ప్రకాశమ్,
ప్రత్యక్షతోఽద్య మమ గోచరమేతదేవ
రూపం విభాతు హృదయే న పరం వికాంక్షే. 34

"రామా! నీస్వరూపము దేశకాలాదులు మొదలైన ఉపాధులు లేనిదిగా, చిద్ఘన ప్రకాశస్వరూపముగా గుర్తించువారు ఆ విధముగనే గురుతించనిమ్ము. నా హృదయమున ఈనాడు ఇపుడు ప్రత్యక్షముగా కానవచ్చిన దివ్యరూపమే సర్వదా ప్రకాశించుగాక! దీనికన్న భిన్నమగు రూపము దేనిని నేను చూడగోరను (34)".

ఇత్యేవం స్తువతస్తస్య
రామః సస్మితమబ్రవీత్.
మునే జానామి తే చిత్తం
నిర్మలం మదుపాసనాత్. 35

అతో౽హమాగతో ద్రష్టుం
మదృతే నాన్యసాధనమ్.
మన్మంత్రోపాసకా లోకే
మామేవ శరణం గతాః. 36

నిరపేక్షా నాన్యగతా -
స్తేషాం దృశ్యో౽హమన్వహమ్.
స్తోత్రమేతత్పఠేద్యస్తు
త్వత్కృతం మత్ప్రియం సదా. 37

సద్భక్తిర్మే భవేత్తస్య
జ్ఞానం చ విమలం భవేత్.
త్వంమమోపాసనాదేవ
విముక్తో౽సీహ సర్వతః. 38

దేహాంతే మమ సాయుజ్యం లప్స్యసే నాత్ర సంశయః.
గురుం తే ద్రష్టుమిచ్ఛామి హ్యగస్త్యం మునినాయకమ్.
కించిత్కాలం తత్రవస్తుం మనో మే త్వరయత్యలమ్. 39

సుతీక్ష్ణో౽పి తథేత్యాహ శ్వో గమిష్యసి రాఘవ.
అహమప్యాగమిష్యామి చిరాద్దృష్టో మహామునిః. 40

అథ ప్రభాతే మునినా సమేతో
రామః ససీతః సహ లక్ష్మణేన.
అగస్త్యసంభాషణలోలమానసః
శనైరగస్త్యానుజమందిరం యయౌ. 41

సుతీక్ష్ణుడిట్లు స్తుతింపగా రాముడు చిరునగవులు చిందించుచు ఇట్లనెను - "మునివరా! నీ చిత్తము నా ఉపాసనచే నిర్మలమైనదని నేనెరుగుదును (35). నీకు నేను తప్ప వేరుగా ఎట్టి సాధనము లేదు. కావుననే నిన్ను చూడ నేను వచ్చితిని. ప్రపంచమున ఎవ్వరు నా మంత్రోపాసన చేయుదురో, ఎవరు నన్నే శరణు పొందుదురో (36), నిత్యము అపేక్షారహితులై వేరొక్క గతిని కోరకుందురో, వారికి నేను నిత్యము దర్శన మిచ్చెదను. నీవు పలికిన యీ స్తోత్రము ఎవరు పఠింతురో (37), వారికి నాదగు శుద్ధమగు భక్తి, నిర్మలమగు జ్ఞానము లభించును. నీవు కేవలము నా ఉపాసనతో ఈ జీవితావస్థ యందే సర్వవిధముల ముక్తుడవైతివి (38). శరీరత్యాగము చేసిన తరువాత నీవు నిస్సంశయముగా నా సాయుజ్య పదవి పొందెదవు. ఇపుడు నేను నీ గురుశ్రేష్ఠుడగు అగస్త్యుని దర్శింపకోరుచున్నాను. ఆతనికడ కొంతకాలము గడుప వలెనని నా మనము త్వరపెట్టుచున్నది (39)".

అనగా విని సుతీక్ష్ణుడు "రాఘవా! అటులనే! అటకు రేపు పోయెదవుగాక! ఆ మునీశ్వరుని నేనుకూడ చూచి చిరకాలమైనది. నేనుకూడా మీతో వచ్చెదను గాక!" (40) అని పల్కెను.

ప్రభాతము కాగానే రాముడు సీతా లక్ష్మణయుతుడై, సుతీక్ష్ణునితో సహా, అగస్త్యునితో సంభాషింప నువ్విళ్లూరుచు బయలుదేరి మెలమెల్లగా అగస్త్యుని తమ్ముని (అగ్ని జిహ్వముని) ఆశ్రమము వంకకు సాగెను (41).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అరణ్యకాండ ద్వితీయసర్గము ॥ 2 ॥

----****----

ఓం

# తృతీయ సర్గము

## అగస్త్యమునివరునితో సమాగమము.

శ్రీమహాదేవ ఉవాచ

అథ రామః సుతీక్ష్ణేన జానక్యా లక్ష్మణేన చ,
అగస్త్యస్యానుజస్థానం మధ్యాహ్నే సమపద్యత. 1

తేన సంపూజితః సమ్యగ్భుక్త్వా మూలఫలాదికమ్,
పరేద్యుః ప్రాతరుత్థాయ జగ్ముస్తే౽గస్త్యమండలమ్. 2

సర్వర్తుఫలపుష్పాఢ్యం నానామృగగణైర్యుతమ్,
పక్షిసంఘైశ్చ వివిధైర్నాదితం నందనోపమమ్. 3

బ్రహ్మర్షిభిర్దేవర్షిభిః సేవితం మునిమందిరైః,
సర్వతో౽లంకృతం సాక్షాద్బ్రహ్మలోకమివాపరమ్. 4

బహిరేవాశ్రమస్యాథ స్థిత్వా రామో౽బ్రవీన్మునిమ్,
సుతీక్ష్ణ గచ్ఛ త్వం శీఘ్రమాగతం మాం నివేదయ. 5

అగస్త్యమునివర్యాయ సీతయా లక్ష్మణేన చ,
మహాప్రసాద ఇత్యుక్త్వా సుతీక్ష్ణః ప్రయయౌ గురోః. 6

ఆశ్రమం త్వరయా తత్ర ఋషిసంఘసమావృతమ్,
ఉపవిష్టం రామభక్తైర్విశేషేణ సమాయుతమ్. 7

వ్యాఖ్యాతరామమంత్రార్థం శిష్యేభ్యశ్చాతిభక్తితః,
దృష్ట్వాగస్త్యం మునిశ్రేష్ఠం సుతీక్ష్ణః ప్రయయౌ మునేః. 8

దండవత్ప్రణిపత్యాహ వినయావనతః సుధీః,
రామో దాశరథిర్బ్రహ్మన్ సీతయా లక్ష్మణేన చ,
ఆగతో దర్శనార్థం తే బహిస్తిష్ఠతి సాంజలిః. 9

శ్రీమహాదేవుడు ఇట్లనెను - "పార్వతీ! నాటి మధ్యాహ్న సమయమునకు రాముడు సుతీక్ష్ణునితో, సీతా లక్ష్మణయుతుడై అగస్త్యభ్రాత ఆశ్రమమును పొందెను (చేరెను) (1). ఆ మహర్షిచేత చక్కగా గౌరవింపబడి, ఫల మూలాదులు స్వీకరించి, మరునాటి ఉదయముననే అగస్త్యాశ్రమమునకు వారు బయలుదేరిరి (2).

ఆ ఆశ్రమము సర్వఋతువుల (పలించెడి) ఫలపుష్పములతో పరిపూర్ణమైయుండెను. వివిధములగు వన్యప్రాణులచే సేవింపబడుచుండెను. నానావిధములగు పక్షుల కిలకిలారవములతో నందనవన సమానమై శోభిల్లుచుండెను (3). అది బ్రహ్మర్షులచేత, దేవర్షులచేత సేవితమై యుండెను. దానికి నాలుగువంకల ఋషుల ఆశ్రమములు శోభిల్లుచుండెను. అది బ్రహ్మలోకసమానముగా కానవచ్చుచుండెను (4). ఆ యాశ్రమమునకు బయటనే నిలిచి, సుతీక్ష్ణునితో "నీవు శీఘ్రముగా అగస్త్యుని కడకేగి, సీతా లక్ష్మణయుతుడనై నేను వచ్చితినని, ఆయనకు ఎరిగింపు" మని పలికెను. అతడు "చాలా సంతోషము" అని హర్షోల్లాసముతో వేగముగా గురుని ఆశ్రమములోనికి వెళ్లెను. అచటికేగి సుతీక్ష్ణుడు శ్రీరామభక్తులగు మునీశ్వరుల మండలిలో ఆసీనుడైయున్న అగస్త్యమునిని దర్శించెను. ఆయన అత్యంత భక్తితో తన శిష్యులకు రామ మంత్రార్థమును వ్యాఖ్యానించుచుండెను. సుతీక్ష్ణుడది దర్శించుచు, దరికి చేరెను (5-8). ఆయనకు వినయ పూర్వకముగా దండప్రణామము లాచరించి, ధీశాలి యగు సుతీక్ష్ణుడిట్లనెను - "బ్రహ్మవరేణ్యా! దాశరథియగు రాముడు సీతాలక్ష్మణ సమేతుడై మీ దర్శనార్థము వచ్చి యున్నాడు. అంజలిబద్ధుడై ఆశ్రమము వెలుపల నున్నాడు" అని తెలిపెను (9).

అగస్త్య ఉవాచ

శీఘ్రమానయ భద్రం తే
రామం మమ హృది స్థితమ్,
తమేవధ్యాయమానోఽహం
కాంక్షమాణోఽత్ర సంస్థితః. 10

అగస్త్యుడిట్లనెను - ''తండ్రీ! నీకు శుభమగు గాక! నా హృదయమున సుస్థిరముగా నున్న ఆ రాముని వెంటనే తీసికొనిరమ్ము. నేను అతనినే ధ్యానించుచు, అతని రాక కోరుచూ ఇక్కడ నిలచియున్నాను'' (10).

ఇత్యుక్త్వా స్వయముత్థాయ మునిభిః సహితో ద్రుతమ్,
అభ్యగాత్త్వరయా భక్త్యా గత్వా రామమథాబ్రవీత్. 11

ఆగచ్ఛ రామ భద్రం తే దిష్ట్యా తేఽద్య సమాగమః,
ప్రియాతిథిర్మమ ప్రాప్తోఽస్యద్య మే సఫలం దినమ్. 12

ఇట్లతడు శీఘ్రముగా లేచి, మునులతో రాముని కడకు వచ్చి దూరమునుండి చూచుచునే, అత్యంత భక్తిపూర్వకముగా (11) ''రామా! స్వాగతము! నీకు మేలగు గాక! నా మహద్భాగ్యవశమున నీతోడి సమాగము లభించినది. నేటి దినము సఫలమైనది. నాకు అత్యంత ప్రియుడగువాడే అతిథిగా వచ్చిన ఈ దినము పరమ పుణ్యప్రదము'' (12) అనెను.

రామోఽపి మునిమాయాంతం దృష్ట్వా హర్షసమాకులః,
సీతయా లక్ష్మణేనాపి దండవత్పతితో భువి. 13

ద్రుతముత్థాప్య మునిరాడ్రామమాలింగ్య భక్తితః,
తద్గాత్రస్పర్శజాహ్లాదస్రవన్నేత్రజలాకులః. 14

రాముడుకూడా (స్వాగతము చెప్పుచూ) వచ్చిన మునిని చూచి పరమ హర్షము పొంది, సీతా లక్ష్మణులతో సహా సాష్టాంగదండప్రణామములు చేసెను (13). మునియు వెంటనే రాముని లేవనెత్తి భక్తిపూర్వకముగా హృదయమునకు హత్తుకొనెను. అతని స్పర్శచే కన్నుల ఆనందబాష్పములు ప్రవహించినవి (14).

గృహీత్వా కరమేకేన కరేణ రఘునందనమ్,
జగామ స్వాశ్రమం హృష్టో మనసా మునిపుంగవః. 15

సుఖోపవిష్టం సంపూజ్య పూజయా బహువిస్తరమ్,
భోజయిత్వా యథాన్యాయం భోజ్యైర్వన్యైరనేకధా. 16

అనంతరము మునిశ్రేష్ఠుడగు అగస్త్యుడు ప్రసన్న మనస్కుడై తన చేతితో రాముని హస్తము స్వీకరించి, ఆశ్రమము లోనికి గొనివచ్చెను (15). అతనిని సుఖపూర్వకముగా ఆసనముపై కూర్చుండజేసి, విధివిధానమున విస్తారముగా పూజ చేసెను. వివిధ వన్యఫలములను కొసరి కొసరి ఆరగింపజేసెను (16).

సుఖోపవిష్టమేకాంతే రామం శశినిభాననమ్,
కృతాంజలిరువాచేదమగస్త్యో భగవానృషిః. 17

త్వదాగమనమేవాహం ప్రతీక్షన్సమవస్థితః,
యదా క్షీరసముద్రాంతే బ్రహ్మణా ప్రార్థితః పురా. 18

భూమేర్భారాపనుత్త్యర్థం రావణస్య వధాయ చ,
తదాది దర్శనాకాంక్షీ తవ రామ తపశ్చరన్,
వసామి మునిభిః సార్ధం త్వామేవ పరిచింతయన్. 19

ఏకాంతమున సుఖాసీనుడైయున్న చంద్రవదనుడు రామునితో ఋషివర్యుడగు అగస్త్యు డిట్లనెను (17). ''రామా! పూర్వము క్షీరసముద్ర తీరమున బ్రహ్మదేవుడు నిన్ను భూభారము హరింపను, రావణాదుల వధింపను ప్రార్థించియున్నాడు. నాటినుండియు నీ దర్శనాభిలాషతో నేను తపము గావించుకొనుచు, నీ స్మరణమే చేయుచు నీరాకకై ఎదురుచూచుచు, ఇక్కడనే యీ మునులతోకూడి నివసించుచున్నాను (18-19).




శ్రీరామచంద్రుడు అగస్త్య మహర్షిని దర్శించుట

సృష్టేః ప్రాగేక ఏవాసీర్నిర్వికల్పోఽనుపాధికః,
త్వదాశ్రయా త్వద్విషయా మాయా తే శక్తిరుచ్యతే. 20

త్వామేవ నిర్గుణం శక్తిరావృణోతి యదా తదా,
అవ్యాకృతమితి ప్రాహుర్వేదాంతపరినిష్ఠితాః. 21

మూలప్రకృతిరిత్యేకే ప్రాహుర్మాయేతి కేచన,
అవిద్యా సంసృతిర్బంధ ఇత్యాది బహుధోచ్యతే. 22

త్వయా సంక్షోభ్యమాణా
సా మహత్తత్త్వం ప్రసూయతే,
మహత్తత్త్వాదహంకార
స్త్వయా సంచోదితాదభూత్. 23

అహంకారో మహత్తత్త్వసంవృతస్త్రివిధోఽభవత్,
సాత్త్వికో రాజసశ్చైవ తామసశ్చేతి భణ్యతే. 24

తామసాత్సూక్ష్మతన్మాత్రా-
ణ్యాసన్ భూతాన్యతః పరమ్,
స్థూలాని క్రమశో రామ
క్రమోత్తరగుణాని హ. 25

రాజసానీంద్రియాణ్యేవ
సాత్త్వికా దేవతా మనః,
తేభ్యోఽభవత్సూత్రరూపం
లింగం సర్వగతం మహత్. 26

తతో విరాట్ సముత్పన్నః
స్థూలాద్భూతకదంబకాత్,
విరాజః పురుషాత్సర్వం
జగత్స్థావరజంగమమ్. 27

సృష్టికి పూర్వము వికల్పరహితముగా, ఉపాధి రహితముగా నీవొక్కడవే యుంటివి. ( ఆ సమయమున వేరు ఏదియు లేదు. నిన్నే ఆశ్రయించుకొని, నిన్నే విషయము గావించు కొను మాయ నీ శక్తియే యని చెప్పబడుచున్నది) (20). నిర్గుణుడవై యున్న నిన్ను ఆవరించిన యీ మాయను వేదాంతులు 'అవ్యాకృత' మని చెప్పుదురు (21). మరికొందరు దీనిని 'మూలప్రకృతి' యందురు. వేరొకరు 'మాయ' అందురు. అటులే 'అవిద్య' అని 'సంసృతి' యని 'బంధన'మని అనేక నామములతో దీనిని పిల్చుదురు (22). నీచేత క్షుభితమైనపుడు ఆ శక్తినుండి మహత్తత్త్వము పుట్టును. మహత్తత్త్వమునుండి మీ ప్రేరణచే అహంకారము పుట్టును (23). మహత్తత్త్వముతో ఆవృతమైన అహంకారము సాత్త్విక, రాజస తామసములని మూడు విధము లాయెను (24). రామా! తామసాహంకారము నుండి శబ్దస్పర్శరూప రస గంధములను తన్మాత్రలు ఐదును జనించినవి. ఈ సూక్ష్మతన్మాత్రలనుండి వీనిలో పూర్వ గుణములతో కూడి, ఉత్తరగుణవృద్ధి క్రమముగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అను పంచ స్థూల భూతములు జన్మించినవి (25). రాజసాహంకారము నుండి దశేంద్రియములు మాత్రమే జన్మించినవి. సాత్త్విక అహంకారము నుండి ఇంద్రియ అధిష్ఠానదేవతలు, మనస్సు ఉత్పన్నమైనవి. పైన చెప్పిన మాయా విస్తారరూపము నుండి, అనగా సూక్ష్మపంచ భూతముల నుండి సూక్ష్మ శరీరరూప హిరణ్యగర్భుడు పుట్టెను. ఇతనినే 'మహాలింగ' మని 'సూత్రాత్మ' యని 'ప్రాణశక్తి' యని 'క్రియాశక్తి' యని అందురు. ఇదియే సర్వవ్యాపి పటములోని సూత్రము వలె అని తెలియవలయును (26).

పిమ్మట స్థూలమైన భూత సమూహమునుండి విరాట్పురుషుడు జన్మించెను. విరాట్పురుషునినుండి సంపూర్ణస్థావర జంగమాత్మకమగు ప్రపంచము పుట్టెను. (27).

దేవతిర్యఙ్మనుష్యాఖ్యాః కాలకర్మక్రమేణ తు,
త్వం రజోగుణతో బ్రహ్మా జగతః సర్వకారణమ్. 28

సత్త్వాద్విష్ణుస్త్వమేవాస్య
పాలకః సద్భిరుచ్యతే,
లయే రుద్రస్త్వమేవాస్య
త్వన్మాయాగుణభేదతః. 29

జగదీశ్వరా! కాలము, కర్మము వీటి క్రమమును నీవే దేవ, తిర్యక్, మనుష్యాది యోనులలో ప్రకటితమగు చున్నావు. నీ మాయాగుణభేదము ననుసరించి, నీవే రజోగుణముద్వారా జగత్ సృష్టికర్త బ్రహ్మదేవునిగా, సత్త్వగుణముద్వారా జగద్రక్ష కావించు విష్ణువుగా, తమోగుణము చేత సంహారకర్త శివునిగా, రూపు దాల్తువు - అని విద్వాంసులగు వారందురు (28 -29).

జాగ్రత్స్వప్నసుషుప్త్యాఖ్యా
వృత్తయో బుద్ధిజైర్గుణైః,
తాసాం విలక్షణో రామ
త్వం సాక్షీ చిన్మయోఽవ్యయః. 30

సృష్టిలీలాం యదా కర్తుమీహసే రఘునందన,
అంగీకరోషి మాయాం త్వం తదా వై గుణవానివ. 31

రామ మాయా ద్విధా భాతి విద్యావిద్యేతి తే సదా,
ప్రవృత్తిమార్గనిరతా అవిద్యావశవర్తినః,
నివృత్తిమార్గనిరతా వేదాంతార్థవిచారకాః. 32

త్వద్భక్తినిరతాయే చ
తే వై విద్యామయాః స్మృతాః
అవిద్యావశగా యే తు
నిత్యం సంసారిణశ్చ, తే
విద్యాభ్యాసరతా యే తు
నిత్యముక్తాస్త ఏవహి. 33

లోకే త్వద్భక్తినిరతాస్త్వన్మంత్రోపాసకాశ్చ యే,
విద్యా ప్రాదుర్భవేత్తేషాం నేతరేషాం కదాచన. 34

అతస్త్వద్భక్తిసమ్పన్నా ముక్తా ఏవ న సంశయః,
త్వద్భక్త్యమృతహీనానాం మోక్షః స్వప్నేఽపి నో భవేత్. 35

"రామా! బుద్ధిజన్యములైన సత్త్వ రజస్ తమస్సులను ఈ మూడు గుణములచేతనే జీవులకు జాగ్రత్, స్వప్న, సుషుప్తి అను మూడుదశలు కలుగు చున్నవి. కాని నీవు ఈ మూడిటికన్నను విలక్షణముగా సాక్షిభూతుడవై, చిత్స్వరూపుడవై, అవ్యయుడవై ఉందువు (30). రఘునందనా! నీవు సృష్టిరూపలీలను విస్తరింపవేయ దలచికొన్న సమయమున, త్రిగుణమాయను అంగీకరించి గుణయుతునిగా భాసించెదవు (31). రామా! నీదగు మాయ 'విద్య' 'అవిద్య' అను రెండు రూపములతో భాసిల్లు చున్నది. ప్రవృత్తిమార్గము అవలంబించి, కామ్యకర్మలను అచరించువారు అవిద్యకు వశీభూతులై యుందురు. నివృత్తిమార్గపరాయణులు పరమాత్మచింతనయందు నిత్యము చిత్తులై వేదార్థవిచారకులు అగుదురు. వీరు భగవద్భక్తినిరతులు, విద్యామయులుగా పరిగణింప బడుదురు. అవిద్యకు లోబడియుండువారు సదా జనన మరణరూప సంసారమున చిక్కుకొనియుందురు. విద్యా పరాయణులైన వారు మాత్రము నిత్యముక్తులై ఉందురు (32-33). లోకములో నీ భక్తితత్పరులై, నీ మంత్రజపము చేయువారికి, ఉపాసించెడివారికి వారి అంతఃకరణము నందే విద్య ప్రాదుర్భవించును. వేరెవ్వరి యందును కలుగదు (34). కావున మీయందు భక్తిగల పురుషుడు నిస్సందేహముగా ముక్తుడగును. నీ భక్తిరూపామృతము లేనివానికి స్వప్నము నందు కూడ మోక్షము కలుగనేరదు. (35).

కిం రామ బహునోక్తేన సారం కించిద్బ్రవీమి తే.
సాధుసంగతిరేవాత్ర మోక్షహేతురుదాహృతా 36

సాధవః సమచిత్తా యే నిఃస్పృహా విగతైషణాః.
దాంతాః ప్రశాంతాస్త్వద్భక్తా నివృత్తాఖిలకామనాః. 37

ఇష్టప్రాప్తివిపత్త్యోశ్చ సమాః సంగవివర్జితాః.
సన్న్యస్తాఖిలకర్మాణః సర్వదా బ్రహ్మతత్పరాః. 38

యమాదిగుణసంపన్నాః సంతుష్టా యేన కేనచిత్.
సత్సంగమో భవేద్యర్హి త్వత్కథాశ్రవణే రతిః. 39

సముదేతి తతో భక్తిస్త్వయి రామ సనాతనే.
త్వద్భక్తావుపపన్నాయాం విజ్ఞానం విపులం స్ఫుటమ్.40

ఉదేతి ముక్తిమార్గోఽయమాద్యశ్చతురసేవితః.
తస్మాద్రాఘవ సద్భక్తి స్త్వయి మే ప్రేమలక్షణా. 41

సదా భూయాద్ధరే సంగస్త్వద్భక్తేషు విశేషతః.
అద్య మే సఫలం జన్మ భవత్సందర్శనాదభూత్. 42

అద్య మే క్రతవః సర్వే బభూవుః సఫలాః ప్రభో.
దీర్ఘకాలం మయా తప్తమనన్యమతినా తపః. 43

తస్యేహ తపసో రామ ఫలం తవ యదర్శనమ్.
సదా మే సీతయా సార్ధం హృదయే వస రాఘవ.
గచ్ఛతస్తిష్ఠతో వాపి స్మృతిఃస్యాన్మే సదా త్వయి. 44

రామా! ఇంకను అధికముగా ఏమి చెప్పుదును! సారభూతమైన విషయమును చెప్పుచున్నాను. వినుము. లోకమున సాధుసాంగత్యమే మోక్షమునకు ముఖ్యకారణమని తెలుపబడినది (36). సంపత్తులో, విపత్తులో, సమాన చిత్తము గలవారు, దారాది ఈషణత్రయరహితులు, ఇంద్రియ నిగ్రహము కలవారు, శాంతచిత్తులు మీయందు భక్తి గలవారు, ఏ కోరికలు లేనివారు ఇష్టానిష్టముల ప్రాప్తి యందు సమభావము కలవారు, ఆసక్తిరహితులు, సమస్త కర్మారంభము త్యజించినవారు, సర్వదా బ్రహ్మపరాయణులై యుండువారు, యమనియమాది గుణసంపద కలవారు, యదృచ్ఛాలాభ సంతుష్టులు – వీరే సాధుజనులనబడుదురు. ఇట్టి సాధుపురుషుల సాంగత్యము కలిగినపుడు మానవులకు నీ కథాశ్రవణమున ప్రీతి కలుగును (37–39). రామా! దానివలన వారికి సనాతనుడవగు నీ యందు భక్తి కలుగును. అట్లు మీయందు భక్తి కలిగినమీదట ప్రస్ఫుటముగా విస్తారముగా నీ విషయిక జ్ఞానము కలుగును. ఇదియే ముక్తికి కుశలజన సేవితమగు తొలిమార్గము. కాన రాఘవా! నాకు నీ యందు ప్రేమలక్షితమైన ఉత్తమభక్తి సర్వథా ఉండుగాక! రామా! నా కత్యధికముగా మీ భక్తుల సాంగత్యము కలుగు గాక! నాథా! నేడు మీ దర్శనముచే నా జన్మ సఫలమైనది (40–42). ప్రభూ! నా యజ్ఞములన్నియు నేడు సఫలములైనవి. నేను చాలకాలముగా అనన్య భావముతో తపమాచరించితిని. దాని ఫలితముగా ప్రత్యక్షముగా నేను నిన్ను (సపరివారముగా) పూజించ గలిగితిని. ఇది నా అదృష్టము (43). ఓ రాఘవా! సీతా సమేతుడవై నీవు నా హృదయమందు నివసింతువు గాక! నేను నడచుచున్నను, తిరుగుచున్నను సార్వకాలికముగా మీ స్మరణమే నిలచియుండు గాక! (44).''

ఇతి స్తుత్వా రమానాథమగస్త్యో మునిసత్తమః,
దదౌ చాపం మహేంద్రేణ రామార్థే స్థాపితం పురా. 45

అక్షయ్యౌ బాణతూణీరౌ ఖడ్గో రత్నవిభూషితః,
జహి రాఘవ భూభారభూతం రాక్షసమండలమ్. 46

యదర్థమవతీర్ణోఽసి మాయయా మనుజాకృతిః,
ఇతో యోజనయుగ్మే తు పుణ్యకాననమండితః. 47

అస్తి పంచవటీ నామ్నా ఆశ్రమో గౌతమీతటే.
నేతవ్యస్తత్ర తే కాలః శేషో రఘుకులోద్వహ. 48

తత్రైవ బహుకార్యాణి దేవానాం కురు సత్పతే. 49

లక్ష్మీపతియగు రామచంద్రునీవిధముగా స్తుతించి, అగస్త్యుడు తనకు ఇంద్రుడు శ్రీరాముని కొరకే యిచ్చిన ధనుస్సును, రెండు అక్షయ తూణీరములను, రత్నఖచిత ఖడ్గమును యిచ్చి యిట్లనెను - ''రాఘవా! భూమికి భారభూతులైన రాక్షసులను వధింపుము. ఆ కార్యము నిర్వర్తించుటకే కదా నీవు మాయామానవ వేషధారవైతివి (45-46). ఇటనుండి రెండు యోజనముల దూరమున గౌతమీ నదీతటమున పవిత్రమగు వనముతో శోభిల్లు పంచవటియను నామము గల ఆశ్రమము ఉన్నది. రఘునందనా! మీరు మీ వనవాస శేషకాలము అక్కడనే గడపుడు. సత్పతీ! అచ్చటనేయుండి మీరు దేవకార్యము లన్నిటిని నెరవేర్చుడు (47-49)''.

శ్రుత్వా తదాగస్త్యసుభాషితం వచః
స్తోత్రం చ తత్త్వార్థసమన్వితం విభుః,
మునిం సమాభాష్య ముదాన్వితో యయౌ
ప్రదర్శితం మార్గమశేషవిద్ధరిః. 50

అనంతరము సర్వజ్ఞుడైన రామచంద్ర భగవానుడు అగస్త్యుని యీ మనోహరభాషణమును, తత్త్వార్థ గర్భితమగు స్తోత్రమును విని, అతని అనుమతిని గొని, ఆనందముతో అతడు చూపిన మార్గమున వెడలెను (50)

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో అరణ్యకాండ
తృతీయ సర్గము ॥ 3 ॥

----****----

ఓమ్

# చతుర్థ సర్గము

## పంచవటీ నివాసము - లక్ష్మణోపదేశము

శ్రీ మహాదేవ ఉవాచ

మార్గే వ్రజన్ దదర్శాథ శైలశృంగమివ స్థితమ్,
వృద్ధం జటాయుషం రామః కిమేతదితి విస్మితః. 1

ధనురానయ సౌమిత్రే రాక్షసోఽయం పురః స్థితః,
ఇత్యాహ లక్ష్మణం రామో హనిష్యామ్యృషిభక్షకమ్. 2

శ్రీమహాదేవుడు ఇట్లనెను- పార్వతీ! మార్గమున వెడలుచు రాముడు, పర్వతశిఖరమువలె కూర్చుండి యున్న వృద్ధుడగు జటాయువును చూచెను. అతనిని జూచి ఇది యేమని ఆశ్చర్యపడెను (1). అంత నాతడు లక్ష్మణునితో "సౌమిత్రీ! నా ధనువును తెమ్ము. చూడు ఎదుట ఒక రాక్షసుడు కూర్చుండియున్నాడు. ఋషులను భక్షించు ఈ దుష్టుని ఇప్పుడే నేను చంపివేయుదును" అని పలికెను (2).

తచ్ఛ్రుత్వా రామవచనం గృధ్రరాడ్భయపీడితః,
వధార్హోఽహం న తే రామ పితుస్తేఽహం ప్రియః సఖా
జటాయుర్నామ భద్రం తే గృధ్రోఽహం ప్రియకృత్తవ. 4

రాముని వచనములు విని గృధ్రరాజు భయవ్యాకులుడై - 'రామా! నేను నీకు వధార్హుడను కాను. నేను నీ తండ్రి ప్రియసఖుడను, జటాయువను నామముగల గృధ్రమును. నీకు మేలగుగాక! నేను నీకు హితకారిని (3-4).

పంచవట్యామహం వత్స్యే తవైవ ప్రియకామ్యయా,
మృగయాయాం కదాచిత్తు ప్రయాతే లక్ష్మణేఽపి చ. 5

సీతా జనకకన్యా మే రక్షితవ్యా ప్రయత్నతః,
శ్రుత్వా తద్గృధ్రవచనం రామః సస్నేహమబ్రవీత్. 6

సాధు గృధ్ర మహారాజ తథైవ కురు మే ప్రియమ్,
అత్రైవ మే సమీపస్థో నాతిదూరే వనే వసన్. 7

"నీకు మేలు చేయుటకే నేను పంచవటియందు నివసింతును. ఏ సమయముననైనను నీవును, లక్ష్మణుడును వేటకై వనములోని కేగినచో, అపుడు నేను జనకనందిని సీతను ప్రయత్నపూర్వకముగ సంరక్షించెదను" అని పలికెను. గృధ్రరాజు ఆడిన మాటలు విని, రాముడు స్నేహపూర్వకముగ (5-6) ఇట్లనెను - 'గృధ్రమహారాజా! బాగు బాగు! ఇచటనే, సమీపముననే, అనతిదూరముననే యుండి మాకు ప్రియమును ఆచరింపుము" (7).

ఇత్యామంత్రితమాలింగ్య యయౌ పంచవటీం ప్రభుః,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా రఘునందన. 8

గత్వా తే గౌతమీతీరం పంచవట్యాం సువిస్తరమ్,
మందిరం కారయామాస లక్ష్మణేన సుబుద్ధినా. 9

ఈ ప్రకారము తన సమ్మతినిచ్చి, రాముడు జటాయువును ఆలింగనము చేసికొని సీతాలక్ష్మణ సమేతుడై పంచవటి కేగెను (8). అతడు గౌతమీతటమును సమీపించి, బుద్ధిమంతుడగు లక్ష్మణునిచే పంచవటిలో నొక పర్ణశాల విశాలముగా నిర్మింపచేసెను (9).

తత్ర తే న్యవసన్ సర్వే గంగాయా ఉత్తరే తటే,
కదంబపనసామ్రాదిఫలవృక్షసమాకులే. 10

వివిక్తే జనసంబాధవర్జితే నీరుజస్థలే,
వినోదయన్ జనకజాంలక్ష్మణేన విపశ్చితా. 11

అధ్యువాస సుఖం రామో దేవలోక ఇవాపరః,
కందమూలఫలాదీని లక్ష్మణోఽనుదినం తయోః. 12

ఆనీయ ప్రదదౌ రామసేవాతత్పరమానసః,
ధనుర్బాణధరో నిత్యం రాత్రౌ జాగర్తి సర్వతః. 13

స్నానం కుర్వంత్యనుదినం త్రయస్తే గౌతమీజలే,
ఉభయోర్మధ్యగా సీతా కురుతే చ గమాగమౌ. 14

ఆనీయ సలిలం నిత్యం లక్ష్మణః ప్రీతమానసః,
సేవతేఽహరహః ప్రీత్యా ఏవమాసన్ సుఖం త్రయః. 15

గౌతమికి ఉత్తర తటమున కదంబ, పనస, ఆమ్రాది ఫలవృక్షములతో కూడి, కాలుష్యరహితమై, జనసంచారము లేని ఏకాంతస్థానమున వారు ముగ్గురు నివసించిరి. ధీమంతుడగు లక్ష్మణునితో కూడియుండి, రాముడు సీతకు మనోరంజనము కలిగించుచు, దేవలోక సమమగు రమ్యస్థలమున రెండవ ఇంద్రునివలె సుఖపూర్వకముగా నుండసాగెను. లక్ష్మణుడు వారికి కందమూల ఫలాదులు తెచ్చియిచ్చుచు, రామసేవా తత్పరుడై నిత్యము ధనుర్బాణధారియై, రాత్రులందు మేల్కొనియుండి, నాల్గుదిశల తిరుగుచు (రక్షణభారము వహించి) ఉండసాగెను (10-13). ముగ్గురును నిత్యము గౌతమిలో స్నానము చేసెడివారు. ఆ సమయమున సీత రామలక్ష్మణుల నడుమనే పోవుచు, వచ్చుచు ఉండెడిది (14). ప్రీతియుతుడై లక్ష్మణుడు నిత్యము నీరు తెచ్చుచు భక్తితో వారి సేవ చేయుచునుండెను. ఈ విధముగా వా ముగ్గురు అట సుఖముగా నుండసాగిరి (15).

ఏకదా లక్ష్మణో రామమేకాంతే సముపస్థితమ్,
వినయావనతో భూత్వా పప్రచ్ఛ పరమేశ్వరమ్. 16

భగవన్ శ్రోతుమిచ్ఛామి మోక్షస్యైకాంతికీం గతిమ్,
త్వత్తః కమలపత్రాక్ష సంక్షేపాద్వక్తుమర్హసి. 17

జ్ఞానం విజ్ఞానసహితం భక్తివైరాగ్యబృంహితమ్,
ఆచక్ష్వ మే రఘుశ్రేష్ఠ ! వక్తా నాన్యోఽస్తి భూతలే. 18

ఒకనాడు లక్ష్మణుడు ఏకాంతమున కూర్చుండి యున్న పరమాత్ముడగు రాముని కడకేగి నమ్రతా పూర్వకముగ ఇట్లడిగెను (16)- ''నేను మీ ముఖార విందమునుండి ఏకాంతికమగు నిశ్చిత మోక్షమార్గమును వినగోరుచున్నాను. కమలనేత్రా! దానిని సంక్షేపముగా వివరింపతగును (17). రఘునందనా! నీవు నాకు భక్తి వైరాగ్యములతో కూడియున్న విజ్ఞానయుక్తమైన జ్ఞానమును ఉపదేశింపుము. ఈ లోకమున ఈ విషయమును ఉపదేశించువారలు నీకన్న ఎవ్వరును లేరు'' (18).

శ్రీరామ ఉవాచ

శృణు వక్ష్యామి తే వత్స! గుహ్యాద్గుహ్యతరం పరమ్,
యద్విజ్ఞాయ నరో జహ్యాత్ సద్యో వైకల్పికం భ్రమమ్. 19

ఆదౌ మాయాస్వరూపం తే వక్ష్యామి తదనంతరమ్,
జ్ఞానస్య సాధనం పశ్చాజ్జ్ఞానం విజ్ఞానసంయుతమ్. 20

రాముడిట్లనెను - ''వత్సా! వినుము, నేను నీకు గుహ్యాతిగుహ్యమగు పరమరహస్యమును, వినిపించు చున్నాను, అది తెలిసికొన్నమీదట మానవుడు శీఘ్రముగా ద్వైదీభావజనితమైన సంసారరూప భ్రమనుండి ముక్తిని పొందును (19). మొదట మాయాస్వరూపమును వివరించెదను. పిదప జ్ఞానసాధనమును తెలిపెదను. విజ్ఞాన సహితమగు జ్ఞానమును తరువాత చెప్పెదను (20).

జ్ఞేయం చ పరమాత్మానం యజ్జ్ఞాత్వా ముచ్యతే భయాత్,
అనాత్మని శరీరాదావాత్మబుద్ధిస్తు యా భవేత్. 21

సైవ మాయా తయైవాసౌ సంసారః పరికల్ప్యతే,
రూపే ద్వే నిశ్చితే పూర్వం మాయాయాః కులనందన. 22

విక్షేపావరణే తత్ర ప్రథమం కల్పయేజ్జగత్,
లింగాద్యబ్రహ్మపర్యంతం స్థూలసూక్ష్మవిభేదతః. 23

అపరం త్వఖిలం జ్ఞానరూపమావృత్య తిష్ఠతి,
మాయయా కల్పితం విశ్వం పరమాత్మని కేవలే. 24

రజ్జౌ భుజంగవద్భ్రాంత్యా విచారే నాస్తి కించన,
శ్రూయతే దృశ్యతే యద్యత్స్మర్యతే వా నరైః సదా. 25

అసదేవ హి తత్సర్వం యథా స్వప్నమనోరథౌ,
దేహ ఏవ హి సంసారవృక్షమూలం దృఢం స్మృతమ్. 26

తన్మూలః పుత్రదారాదిబంధః కిం తేఽన్యథాత్మనః. 27

దేహస్తు స్థూలభూతానాం పంచతన్మాత్రపంచకమ్,
అహంకారశ్చ బుద్ధిశ్చ ఇంద్రియాణి తథా దశ. 28

చిదాభాసో మనశ్చైవ మూలప్రకృతిరేవ చ,
ఏతత్ క్షేత్రమితి జ్ఞేయం దేహ ఇత్యభిధీయతే. 29

ఏతైర్విలక్షణో జీవః పరమాత్మా నిరామయః,
తస్య జీవస్య విజ్ఞానే సాధనాన్యపి మే శృణు. 30

ఇవియేకాక జ్ఞేయమగు పరమాత్మ స్వరూపమును కూడ తెలియచెప్పెదను. అది తెలిసిన మానవుడు సంసార భయమునుండి ముక్తుడగును. శరీరాదులగు అనాత్మ పదార్థములయందుండు ఆత్మబుద్ధినే మాయ అందురు. దానివలననే యీ సంసారము కల్పితమైనది. కులనందనా! మాయకు తొలుతగా రెండురూపములని నిశ్చయించిరి. (21-22). ఒకటి విక్షేపము, రెండవది ఆవరణము. మొదటిదగు విక్షేపశక్తియే మహత్తత్త్వము మొదలు బ్రహ్మ పర్యంతము సమస్త లోకమును స్థూలసూక్ష్మ భేదములతో కల్పించుచున్నది (23). రెండవదియగు ఆవరణశక్తి సమస్త జ్ఞానమును ఆవరించియుండును. ఇది విశ్వమంతయు రజ్జువునందు సర్పభ్రాంతివలె శుద్ధపరమాత్మయందు మాయచే కల్పించబడియున్నది. విచారింపగా ఇది ఏదియు నిలువదు. మానవులు ఎల్లవేళల వినుచున్నది, చూచు చున్నది, స్మరించుచున్నది అంతయు స్వప్నమువలె, మనోరథమువలె అసత్యమైనది. శరీరమే ఈ సంసారరూప వృక్షమునకు దృఢమైన మూలము (24-26). దాని కారణముననే పుత్రకళత్రాది బంధము కలుగుచున్నది. అట్లుకానిచో ఆత్మకు వీరితో ఏమి సంబంధమున్నది? (27). అయిదు స్థూలభూతములు, అహంకారము, బుద్ధి, దశేంద్రియములు, దేహాభిమానము, మనసు, మూలప్రకృతి యనువాని సమూహమే క్షేత్రమనియందురు. దీనినే శరీరమని చెప్పుదురు (28-29). నిర్గుణమగు పరమాత్మ రూపుడగు జీవుడు, వీటన్నిటికన్న వేరైనవాడు. ఇపుడు నేను ఆ జీవుని గుర్తించుటకు కొన్ని సాధనములు చెప్పుచున్నాను, వినుము (30).

జీవశ్చ పరమాత్మా చ పర్యాయో నాత్ర భేదధీః,
మానాభావస్తథా దంభహింసాదిపరివర్జనమ్. 31

పరాక్షేపాదిసహనం సర్వత్రావక్రతా తథా,
మనోవాక్కాయసద్భక్త్యా సద్గురోః పరిసేవనమ్. 32

బాహ్యాభ్యంతరసంశుద్ధిః స్థిరతా సత్క్రియాదిషు,
మనోవాక్కాయదండశ్చ విషయేషు నిరీహతా. 33

నిరహంకారతా జన్మజరాద్యాలోచనం తథా,
అసక్తిః స్నేహశూన్యత్వం పుత్రదారధనాదిషు. 34

ఇష్టానిష్టాగమే నిత్యం చిత్తస్య సమతా తథా,
మయి సర్వాత్మకే రామే హ్యనన్యవిషయా మతిః. 35

జనసంబాధరహితశుద్ధదేశనిషేవణమ్,
ప్రాకృతైర్జనసంఘైశ్చ హ్యరతిః సర్వదా భవేత్. 36

ఆత్మజ్ఞానే సదోద్యోగో వేదాంతార్థావలోకనమ్,
ఉక్తైరేతైర్భవేజ్జ్ఞానం విపరీతైర్విపర్యయః. 37

బుద్ధిప్రాణమనోదేహాహంకృతిభ్యో విలక్షణః,
చిదాత్మాహం నిత్యశుద్ధో బుద్ధ ఏవేతి నిశ్చయమ్. 38

యేన జ్ఞానేన సంవిత్తే తజ్జ్ఞానం నిశ్చితం చ మే,
విజ్ఞానం చ తదైవైతత్సాక్షాదనుభవేద్యదా. 39

ఆత్మా సర్వత్ర పూర్ణః స్యాచ్చిదానందాత్మకోఽవ్యయః,
బుద్ధ్యాద్యుపాధిరహితః పరిణామాదివర్జితః. 40

స్వప్రకాశేన దేహాదీన్ భాసయన్ననపావృతః,
ఏక ఏవాద్వితీయశ్చ సత్యజ్ఞానాదిలక్షణః. 41

అసంగః స్వప్రభో ద్రష్టా విజ్ఞానేనావగమ్యతే,
ఆచార్య శాస్త్రోపదేశాదైక్యజ్ఞానం యదా భవేత్. 42

జీవుడు, పరమాత్మ యనునవి పర్యాయపదములు. రెంటి అభిప్రాయము ఒక్కటియే, కావున వాని యందు భేదబుద్ధి యుండరాదు. అభిమాన రాహిత్యము, దంభము, హింస మొదలైనవి వదలివేయుట (31), పరులు చేసిన ఆక్షేపాదికము సహించుట, సర్వత్ర ఋజుభావము కలిగి యుండుట, మనోవాక్కాయములచేత అనన్యభక్తితో సద్గురుని సేవించుట (32), సత్కర్మల యందు తత్పరత వహించుట, బాహ్యాభ్యంతర శుచి కలిగియుండుట, త్రికరణములతో సంయమనము పాటించుట, విషయము లందు ప్రవర్తిల్లకుండుట (33), అహంకారము తొలగించు కొనుట, జన్మమృత్యుజరాదుల గూర్చిన విచారము, స్త్రీ పుత్ర ధనాదికములందు ఆసక్తి, స్నేహము లేకుండుట (34), ఇష్ట అనిష్టములు సంభవించినపుడు చిత్తమును సదా సమముగా ఉంచుట, సర్వాత్ముడను అయిన నా (రాముని)యందు అనన్యబుద్ధి కలిగి యుండుట (35), జనసందోహము లేని ఏకాంత పవిత్ర ఆవాసమునందు ఉండుట, సాంసారికులైనవారితో సర్వదా ఉదాసీనతతో నుండుట (36), ఆత్మజ్ఞానమునకై సదా కృషి చేయుట, వేదాంతార్థమును విచారించుట అను ఈ సాధనముల వలన జ్ఞానము ప్రాప్తించును. ఇందులకు వ్యతిరేక ఆచరణము వలన విపరీత ఫలము (అజ్ఞానము) కలుగును (37).

బుద్ధి, ప్రాణ, మనో, దేహ, అహంకారాదులకంటె విలక్షణమై నిత్యమై, శుద్ధమై, బుద్ధమై, చేతనమైన ఆత్మను నేనే అని నిశ్చయించగలుగునది జ్ఞానము. ఇది నా దృఢ నిశ్చయము. దీని ప్రత్యక్షానుభవము విజ్ఞానమందురు. (38-39). సర్వత్ర పూర్ణమై, చిదానంద స్వరూపమై, అవ్యయమై, బుద్ధ్యాదికములైన ఉపాధులు లేనిదై, పరిణామ రహితమై యుండెడి తత్త్వము ఆత్మ (40). అది తన ప్రకాశముచేత దేహాదులను ప్రకాశింపచేయును. అయినను ఇది స్వయముగా ఆవరణ రహితము, సజాతీయ, విజాతీయ, స్వగత భేదరహితము, సత్యజ్ఞానాది రూపము, సంగరహితము, స్వప్రకాశము, సర్వసాక్షియను విషయము విజ్ఞానము వలన తెలియును. ఎపుడు శాస్త్ర ఉపదేశముతో గాని, ఆచార్య ఉపదేశము చేత గాని, జీవ పరమాత్మల ఏకత్వ

ఆత్మనో౽జీవపరయోర్మూలావిద్యా తదైవ హి,
లీయతే కార్యకరణైః సహైవ పరమాత్మని. 43

సావస్థా ముక్తిరిత్యుక్తా
హ్యుపచారో౽యమాత్మని,
ఇదం మోక్షస్వరూపం
తే కథితం రఘునందన. 44

జ్ఞానవిజ్ఞానవైరాగ్యసహితం మే పరాత్మనః,
కింత్వేతద్దుర్లభం మన్యే మద్భక్తివిముఖాత్మనామ్. 45

చక్షుష్మతామపి యథా రాత్రౌ సమ్యఙ్న దృశ్యతే,
పదం దీపసమేతానాం దృశ్యతే సమ్యగేవ హి. 46

ఏవం మద్భక్తియుక్తానామాత్మా సమ్యక్ ప్రకాశతే,
మద్భక్తేః కారణం కించిద్వక్ష్యామి శృణు తత్త్వతః. 47

మద్భక్తసంగో మత్సేవా మద్భక్తానాం నిరంతరమ్,
ఏకాదశ్యుపవాసాది మమ పర్వానుమోదనమ్. 48

మత్కథాశ్రవణే పాఠే వ్యాఖ్యానే సర్వదా రతిః,
మత్పూజాపరినిష్ఠా చ మమ నామానుకీర్తనమ్. 49

ఏవం సతతయుక్తానాం భక్తిరవ్యభిచారిణీ,
మయి సంజాయతే నిత్యం తతః కిమవశిష్యతే. 50

అతో మద్భక్తియుక్తస్య
జ్ఞానం విజ్ఞానమేవ చ,
వైరాగ్యం చ భవేచ్ఛీఘ్రం
తతో ముక్తిమవాప్నుయాత్. 51

కథితం సర్వమేతత్తే తవ ప్రశ్నానుసారతః,
అస్మిన్మనః సమాధాయ యస్తిష్ఠేత్స తు ముక్తిభాక్. 52

పరిజ్ఞానము కలుగునో, అపుడు మూలభూతమైన అవిద్య తన (స్థూల సూక్ష్మ) కార్యములతో (శరీరాది) ఇంద్రియ సమేతముగా పరమాత్మలో లీనమైపోవును (41-43). అవిద్య లయమగుటయే మోక్షము. ఆత్మ దృష్ట్యా మోక్షమను భావన ఔపచారికమే! (ఆత్మకు ముక్తావస్థ క్రొత్తది కాదు. అది సర్వదా ముక్తమే) రఘునందనా! లక్ష్మణా! జ్ఞాన, విజ్ఞాన, వైరాగ్యములతోడ పరమాత్మ రూపమగు నా మోక్ష స్వరూపమును నేను నీకు వినిపించి యున్నాను. కాని నా భక్తియందు విముఖులైన వారికిది అత్యంత దుర్లభము. ఇది నా అభిమతము (44-45). నేత్రములున్నను జనులు రాత్రులందు (చీకటిలో) దొంగల జాడలను గాని, ఇతర వస్తువులను గాని చూడజాలరు. దీపమున్నవేళనే చక్కగా చూడగలరు. అదేవిధముగా నా యందు అనన్య భక్తి ప్రవణులైనవారికి ఆత్మసాక్షాత్కారము సులభముగా కలుగును. ఇక నాయందు భక్తి కలుగుటకు కొన్ని ఉపాయములను చెప్పుచున్నాను. సావధానుడవై వినుము (46-47).

''నాభక్తులతో సాంగత్యముచేయుట, నిరంతరము నాకును, నా భక్తులకును సేవ చేయుట, ఏకాదశ్యాది వ్రతము లాచరించుట, నా పర్వదినములను పాటించుట (48), నా కథలు వినుట, చదువుట, వ్యాఖ్యానించుట - వీనియందు ప్రేమకలిగియుండుట, నా పూజల యందు ఆసక్తి కలిగియుండుట, నా నామ సంకీర్తనము చేయుట (49), ఈ విధమగు క్రియలతో ఎవరు నిరంతరము మనసు నిలిపెదరో వారికి నాయందు ఏకాంతభక్తి తప్పక కలుగును. ఇక చెప్పుటకు ఏమి మిగిలి యున్నది? (50) కావున నిశ్చయమేమనగా నా యందు భక్తిగలవానికి జ్ఞాన విజ్ఞాన వైరాగ్యములు శీఘ్రముగా లభించును. దానివలన అతడు మోక్షమును పొందును (51).

''ఈ విధముగా నేను నీ ప్రశ్నానుసారము రహస్య మగు ఈ విషయమును నీకు సంపూర్ణముగా వినిపించితిని. ఏ మానవుడు తన మనసును ఇందు సంలగ్నము చేసికొని యుండునో అతడు మోక్షమును పొందును (52).

న వక్తవ్యమిదం యత్నాన్మద్భక్తివిముఖాయ హి.
మద్భక్తాయ ప్రదాతవ్యమాహూయాపి ప్రయత్నతః. 53

లక్ష్మణా! నాయందు భక్తిలేని పురుషునకు (వీలున్నంత వరకు) చెప్పకుండవలయును. నా భక్తులైన వారికి పిలిచి, ప్రయత్నపూర్వకముగా బోధింపవలయును (53).

య ఇదం తు పఠేన్నిత్యం శ్రద్ధాభక్తిసమన్వితః.
అజ్ఞానపటలధ్వాంతం విధూయ పరిముచ్యతే. 54

భక్తానాం మమ యోగినాం సువిమల-
స్వాంతాతిశాంతాత్మనాం
మత్సేవాభిరతాత్మనాం చ విమల-
జ్ఞానాత్మనాం సర్వదా.
సంగం యః కురుతే సదోద్యతమతి-
స్తత్సేవనానన్యధీ-
ర్మోక్షస్తస్య కరే స్థితో ఉహమనిశం
దృశ్యో భవే నాన్యథా. 55

“ఏ పురుషుడు దీనిని శ్రద్ధాభక్తులతో చదువు చుండునో అతడు అజ్ఞాన సమూహ జన్యమైన అంధకారము తొలగించుకొని ముక్తుడగును (54). నా సేవలో అనురక్త చిత్తులు, నిర్మలహృదయులు, శాంతాత్ములు విమల జ్ఞాన సంపన్నులు అగు నా పరమ భక్తులగు యోగిజనుల సాంగత్యము కలిగి, సర్వదా వారి సేవలో ఏ మానవుడు ఉండునో, వానికి ముక్తి అరచేతియందుండును. సర్వదా వాని దృష్టికి సమ్ముఖముననే నేను దర్శన మిచ్చుచుందును. ఇదికాక మరి ఏ ఉపాయముచేతను నా దర్శనము లభింపదు. మోక్షమును లభింపదు” (55).

ఇతి శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో అరణ్యకాండ చతుర్థ సర్గము ॥ 4 ॥

----****----

ఓం

# పంచమ సర్గము

శూర్పణఖ భంగపాటు - ఖరాది రాక్షస వధ. రావణునకు శూర్పణఖ నివేదన.

శ్రీమహాదేవ ఉవాచ

తస్మిన్ కాలే మహారణ్యే రాక్షసీ కామరూపిణీ,
విచచార మహాసత్త్వా జనస్థాననివాసినీ. 1

ఏకదా గౌతమీతీరే పంచవట్యాః సమీపతః,
పద్మవజ్రాంకుశాంకాని పదాని జగతీపతేః. 2

దృష్ట్వా కామపరీతాత్మా పాదసౌందర్యమోహితా,
పశ్యంతీ సా శనైరాయాద్రాఘవస్య నివేశనమ్. 3

తత్ర సా తం రమానాథం సీతయా సహ సంస్థితమ్,
కందర్పసదృశం రామం దృష్ట్వా కామవిమోహితా. 4

రాక్షసీ రాఘవం ప్రాహ కస్య త్వం కః కిమాశ్రమే,
యుక్తో జటావల్కలాద్యైః సాధ్యం కిం తేఽత్ర మే వద. 5

అహం శూర్పణఖా నామ రాక్షసీ కామరూపిణీ,
భగినీ రాక్షసేంద్రస్య రావణస్య మహాత్మనః. 6

ఖరేణ సహితా భ్రాత్రా వసామ్యత్రైవ కాననే,
రాజ్ఞా దత్తం చ మే సర్వం మునిభక్షా వసామ్యహమ్. 7

త్వాం తు వేదితుమిచ్ఛామి వద మే వదతాం వర,
తామాహ రామనామాహమయోధ్యాధిపతేః సుతః. 8

ఏషా మే సుందరీ భార్యా సీతా జనకనందినీ,
స తు భ్రాతా కనీయాన్మే లక్ష్మణోఽతీవ సుందరః. 9

కిం కృత్యం తే మయా బ్రూహి కార్యం భువనసుందరి,
ఇతి రామవచః శ్రుత్వా కామార్తా సాఽబ్రవీదిదమ్. 10

ఏహి రామ మయా సార్ధం రమస్వ గిరికాననే,
కామార్తాహం న శక్నోమి త్యక్తుం త్వాం కమలేక్షణమ్. 11

రామః సీతాం కటాక్షేణ పశ్యన్ సస్మితమబ్రవీత్,
భార్యా మమైషా కల్యాణీ విద్యతే హ్యనపాయినీ. 12

శ్రీమహాదేవుడిట్లనెను -పార్వతీ! ఆ సమయమున అక్కడి ఘోరాటవి యందు జనస్థానములో గొప్ప బలము కలది, కామరూపిణియగు రాక్షసి తిరుగాడసాగెను (1). ఆమె ఒకనాడు పంచవటియొద్ద, గౌతమీతీరమున పద్మ వజ్ర అంకుశచిహ్నితములైన జగత్పతియగు రాముని పాద ముద్రలను చూచి, వాని సౌందర్యముచేత మోహితురాలై, కామాసక్తయై, వానినే పరికించుచు మెల్లమెల్లగా చప్పుడు కాకుండగా అడుగులు వేయుచు (క్రమముగా) రాముని ఆశ్రమమునకు వచ్చెను (2-3). అటకుచేరి కందర్పసదృశు డైన రమానాథుడగు రాముని, సీతతో సహా కూర్చుండి యుండగా చూచి, కామాతురయైన ఆ రాక్షసి ఆతనితో ఇట్లనెను - "నీ వెవ్వరివాడవు? నీ పేరేమి? జటావల్కములు ధరించి ఈ ఆశ్రమమున ఏల నివసించుచున్నావు? ఇందుండి నీవు సాధింపదలచినది ఏది? చెప్పుము (4-5). నేను మహానుభావుడగు రాక్షసరాజగు రావణుని సోదరిని. కామ రూపిణిని. రాక్షసిని. శూర్పణఖను (6). నేను నా సోదరుడగు ఖరునితోగూడి ఈ వనమునందే వసించు చున్నాను. ఈ వనమంతయు నాకు రాజాచే ఇవ్వబడినది. అందువలన నేను మునిజనులను భక్షించుచు ఇచట నివసించుచున్నాను (7). నేర్పుగా మాట్లాడువాడా! నేను నీ విషయము తెలియ గోరుచున్నాను. కావున నీవునాకు నీ వివరములు తెలుపుము" అని పలుకగా ఆతడిట్లు చెప్పెను - "నేను రాముడను. అయోధ్యాపతికుమారుడను (8). ఈ సుందరి నా భార్య సీత. జనకుని కూతురు. అతి సుందరుడైన ఆతడు నా చిన్న సోదరుడు లక్ష్మణుడు (9). భువనసుందరి! నేను నీకేమి పని చేయగలనో తెలుపుము". కామాతురయగు శూర్పణఖ మరల ఇట్లనెను (10). "రామా! నాతో రమ్ము. కొండ కోనలలో నాతో రమించెదవు గాక! పద్మనేత్రుడవైన నిన్ను కామాతురయగు నేను విడువజాలను (11)"

రాముడు సీతను చూచుచు, చిరునవ్వుతో ఇట్లనెను - "సుందరీ! కల్యాణియగు ఈ నా భార్య నన్నెన్నడు వీడదు. సమీపముననే యున్నది (12).

త్వం తు సాపత్న్యదుఃఖేన కథం స్థాస్యసి సుందరి,
బహిరాస్తే మమ భ్రాతా లక్ష్మణోఽతీవ సుందరః. 13

తవానురూపో భవితా పతిస్తేనైవ సంచర,
ఇత్యుక్తా లక్ష్మణం ప్రాహ పతిర్మే భవ సుందర. 14

భ్రాతురాజ్ఞాం పురస్కృత్య సంగచ్ఛావోఽద్య మాచిరమ్,
ఇత్యాహ రాక్షసీ ఘోరా లక్ష్మణం కామమోహితా. 15

తామాహ లక్ష్మణః సాధ్వి దాసోఽహం తస్య ధీమతః,
దాసీ భవిష్యసి త్వం తు తతో దుఃఖతరం ను కిమ్. 16

తమేవ గచ్ఛ భద్రం తే స తు రాజాఖిలేశ్వరః,
తచ్ఛ్రుత్వా పునరప్యాగాద్రాఘవం దుష్టమానసా. 17

క్రోధాద్రామ కిమర్థం మాం భ్రామయస్యనవస్థితః,
ఇదానీమేవ తాం సీతాం భక్షయామి తవాగ్రతః. 18

ఇత్యుక్త్వా వికటాకారా జానకీమనుధావతి,
తతో రామాజ్ఞయా ఖడ్గమాదాయ పరిగృహ్య తామ్. 19

చిచ్ఛేద నాసాం కర్ణౌ చ లక్ష్మణో లఘువిక్రమః,
తతో ఘోరధ్వనిం కృత్వా రుధిరాక్తవపుర్భృశమ్. 20

క్రందమానా పపాతాగ్రే ఖరస్య పరుషాక్షరా,
కిమేతదితి తామాహ ఖరః ఖరతరాక్షరః. 21

కేనైవం కారితాసి త్వం మృత్యోర్వక్త్రానువర్తినా,
వద మే తం వధిష్యామి కాలకల్పమపి క్షణాత్. 22

తమాహ రాక్షసీ రామః సీతాలక్ష్మణసంయుతః,
దండకం నిర్భయం కుర్వన్నాస్తే గోదావరీతటే. 23

మమైవం కృతవాంస్తస్య భ్రాతా తేనైవ చోదితః,
యది త్వం కులజాతోఽసి వీరోఽసి జహి తౌ రిపూ. 24

నీవు సవతి (పోరు) దుఃఖముతో ఎటుల నిలువగలవు? అత్యంత సుందరుడగు నా తమ్ముడు లక్ష్మణుడు వెలుపలనేయున్నాడు (13). అతడు నీకు యోగ్యుడైన పతి కాగలడు. అతనితోనే సంచరింపుము''. ఇటుల చెప్పబడిన శూర్పణఖ లక్ష్మణునితో ''సుందరాంగా! నా భర్త వగుము. అన్న మాటను పురస్కరించుకొని ఆలసింపక మనము సంగమించెదము గాక!'' అనుచు ఘోరరాక్షసియగు ఆమె పలికెను (14-15).

అవెంతో లక్ష్మణుడు - ''ఆ ధీమంతునికి (రామునికి) నేను దాసుడను. (నన్ను పతిగా పొందిన) నీవును దాసివయ్యెదవు. మరి నీకు ఇంతకన్న దుఃఖతరము మరేమి ఉండును? (16) నీకు మేలగుగాక! అతనికడకే పొమ్ము. అతడు రాజు! అఖిలజనులకు స్వామి'' అనెను. ఆ మాట విని దుష్టభావనయగు ఆ రాక్షసి మరల రాముని కడకేగెను (17). క్రోధముతో ఇట్లనెను - ''రామా! నీవు చపలచిత్తుడవై నన్నేల ఈ లీల అటునిటు త్రిప్పుచున్నావు? నేనిపుడే నీ ముందే ఈ సీతను భక్షించెదను (18)''. ఇట్లు పలికి వికటరూపముతో జానకి వంకకు పరుగెత్తెను. అపుడు రామాజ్ఞచే అలఘువిక్రముడు లక్ష్మణుడు కత్తిదూసి, ఆమెను పట్టుకొని ముక్కుచెవులు కోసివైచెను. అనంతరము ఆమె ఘోరశబ్దము చేయుచు, రక్తము ఓడుచున్న ముఖముతో, ఆరచుచు వడిగా పరుగెత్తి ఖరునిముందు కూలబడెను. ఖరుడు పరుషముగా ఇట్లనెను - ''ఇది ఏమి? (19-21) మృత్యుముఖమున పడుటకు నిశ్చయించినవాడు ఎవడు నీకి దుర్దశ కలిగించెను? వాడెవడో చెప్పుము. వాడు యమునంతటి వాడైనను వధించివేసెదను'' (22).

అంత రాక్షసి శూర్పణఖ ఖరునితో ఇట్లనెను - ''రాముడు సీతా లక్ష్మణ సంయుతుడై దండకావనమును నిర్భయము గావించుచు గోదావరీ తీరమందున్నాడు (23). అతని ప్రేరణచేతనే అతని తమ్ముడు లక్ష్మణుడు నాకీ గతి కల్పించెను. నీవే కనుక కులీనుడవైన, వీరుడవైన ఆ శత్రువుల నిరువురను చంపివేయుము (24).

తయోస్తు రుధిరం పాస్యే భక్షయైతౌ సుదుర్మదౌ,
నో చేత్ప్రాణాన్పరిత్యజ్య యాస్యామి యమసాదనమ్.25

తచ్ఛ్రుత్వా త్వరితం ప్రాగాత్ఖరః క్రోధేన మూర్ఛితః,
చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్. 26

చోదయామాస రామస్య సమీపం వధకాంక్షయా,
ఖరశ్చ త్రిశిరాశ్చైవ దూషణశ్చైవ రాక్షసః. 27

సర్వే రామం యయుః శీఘ్రం నానాప్రహరణోద్యతాః,
శ్రుత్వా కోలాహలం తేషాం రామః సౌమిత్రిమబ్రవీత్.
28

శ్రూయతే విపులః శబ్దో నూనమాయాంతి రాక్షసాః,
భవిష్యతి మహద్యుద్ధం నూనమద్య మయా సహ. 29

సీతాం నీత్వా గుహాం గత్వా తత్ర తిష్ఠ మహాబల,
హంతుమిచ్ఛామ్యహం సర్వాన్ రాక్షసాన్ఘోరరూపిణః.
30

అత్ర కించిన్న వక్తవ్యం శాపితోఽసి మమోపరి,
తథేతి సీతామాదాయ లక్ష్మణో గహ్వరం యయౌ. 31

రామః పరికరం బద్ధ్వా ధనురాదాయ నిష్ఠురమ్,
తూణీరావక్షయశరౌ బద్ధ్వాయత్తోఽభవత్ప్రభుః. 32

తత ఆగత్య రక్షాంసి రామస్యోపరి చిక్షిపుః,
ఆయుధాని విచిత్రాణి పాషాణాన్ పాదపానపి. 33

తాని చిచ్ఛేద రామోఽపి లీలయా తిలశః క్షణాత్,
తతో బాణసహస్రేణ హత్వా తాన్ సర్వరక్షసాన్. 34

ఖరం త్రిశిరసం చైవ దూషణం చైవ రాక్షసమ్,
జఘాన ప్రహరార్ధేన సర్వానేవ రఘూత్తమః. 35

లక్ష్మణోఽపి గుహామధ్యాత్సీతామాదాయ రాఘవే,
సమర్ప్య రాక్షసాన్దృష్ట్వా హతాన్విస్మయమాయయౌ.36

సీతా రామం సమాలింగ్య ప్రసన్నముఖపంకజా,
శస్త్రవ్రణాని చాంగేషు మమార్జ జనకాత్మజా. 37

నేనా ఇరువుర రక్తము త్రాగెదను లేదా దుర్మదులగు వారిరువురిని నీవు భక్షింపుము. లేకున్న నా ప్రాణములు వదలి యమలోకమున కరిగెదను'' (25).

ఆ మాటలువిని అధిక క్రోధము పొంది, భీమకర్ములగు పదునాలుగువేలమంది రాక్షస వీరులతో యుద్ధమునకై ఖరుడు వెడలెను. రాముని వధించు కోరికతో అతడు ఖరదూషణ త్రిశిరులను ప్రేరేపించెను. వారందరు నానా ఆయుధములతో వేగముగా రాముడున్న చోటుచేరిరి. వారి కోలాహలము విని రాముడు లక్ష్మణునితో ఇట్లనెను (26-28) - ''గొప్ప కోలాహలము వినవచ్చుచున్నది. నిశ్చయముగా రాక్షసులు వచ్చుచున్నట్లున్నది. నిశ్చయముగా నాతో ఇపుడు వారికి గొప్ప యుద్ధము జరుగగలదు. మహాబలా! నీవు సీతను తీసికొని గిరి గుహలో నిలువుము. ఘోరరూపులగు అందరు రాక్షసులను (నేనే) చంపవలెనని కోరుచున్నాను (30). ఈ విషయమున మరేమి పలుకవద్దు. నాపై ఆన''. 'అటులే' యని లక్ష్మణుడు సీతను తీసికొని గిరికందరము చేరెను (31).

రాముడు కవచము తొడిగి కఠోరమగు ధనువును తీసికొని రెండు అక్షయతూణీరములు కట్టుకొని యుద్ధమునకు ఆయత్తమయ్యెను (32). అంతట రాక్షసులు అక్కడికి వచ్చి రామునిపై చిత్ర విచిత్రములగు ఆయుధములు, రాళ్ళు, చెట్లు కురిపించసాగిరి. రాముడు అవలీలగా వాటినన్నింటిని పొడిపొడి చేసెను. అంత వేలబాణములతో సర్వరాక్షసులను వధించి ఖరత్రిశిర దూషణాదులను అందరిని అరఝాము కాలములోనే చంపివేసెను (34-35).

లక్ష్మణుడు సీతను గుహనుండి తీసికొని వచ్చి, రామచంద్రునకు అప్పగించెను. రాక్షసులందరు హతమగుట చూచి అతడు చాల ఆశ్చర్యపడెను. సీతాదేవి ప్రసన్నముఖియై రాముని ఆలింగనము చేసికొని అతని శరీరమున శస్త్రము వలని గాయములను చేతితో నిమిరెను (36-37).

సాపి దుద్రావ దృష్ట్వా తాన్ హతాన్ రాక్షసపుంగవాన్,
లంకాం గత్వా సభామధ్యే క్రోశంతీ పాదసన్నిధౌ. 38

రావణస్య పపాతోర్వ్యాం భగినీ తస్య రక్షసః,
దృష్ట్వా తాం రావణః ప్రాహ భగినీం భయవిహ్వలామ్. 39

సమస్తమగు మహాభయంకరులగు రాక్షసులు నిహతులు కాగా చూచి, రాక్షసరాజగు రావణుని సోదరి శూర్పణఖయు పరుగిడిపోయెను. ఆమె లంకను చేరి, విలపించుచు, సభామధ్యమున, రావణుని పాదములపై పడెను. చెల్లెలగు ఆమెను చూచి, భయవిహ్వలయగు ఆమెతో రావణుడిట్లనెను (38-39) - ''చెల్లీ! లెమ్ము లెమ్ము! ఇట్టి నీ విరూపకరణము ఎవరిచేత చేయబడినది? ఇంద్రుని చేతనా! యముని చేతనా? వరుణుని చేతనా? కుబేరుని చేతనా? భద్రా! చెప్పుము! వానిని క్షణములో భస్మము చేసెదను''. ఆమె వాని కిట్లనెను ''నీవు ప్రమత్తుడవు, మూఢబుద్ధివి (40-41). మద్యపానాసక్తుడవు. స్త్రీ విజితుడవు. చూడచూడ అన్నివిధముల షండుడవు. గూఢచారులను కన్నులులేని నీవు ఎట్లు రాజు కాగలవు? (42). యుద్ధములో ఖరుడు నిహతుడైనాడు. అటులనే దూషణ త్రిశిరులు, రాక్షస శ్రేష్ఠులగు పదునాల్గువేలమంది, రాక్షసశత్రువైన రామునిచేత క్షణములో చంపబడిరి. అందరు మునీంద్రులకు జనస్థానము నిర్భయముగా చేయబడినది. ఆ విషయము నీవెరుగవు. అందులకే నిన్ను నేను మూఢుడవు అని అంటిని'' (43-44).

ఉత్తిష్ఠోత్తిష్ఠ వత్సే త్వం విరూపకరణం తవ,
కృతం శక్రేణ వా భద్రే యమేన వరుణేన వా. 40

కుబేరేణాథవా బ్రూహి భస్మీకుర్యాం క్షణేన తమ్,
రాక్షసీ తమువాచేదం త్వం ప్రమత్తో విమూఢధీః. 41

పానాసక్తః స్త్రీవిజితః షండః సర్వత్ర లక్ష్యసే,
చారచక్షుర్విహీనస్త్వం కథం రాజా భవిష్యసి. 42

ఖరశ్చ నిహతః సంఖ్యే దూషణస్త్రిశిరాస్తథా,
చతుర్దశ సహస్రాణి రాక్షసానాం మహాత్మనామ్. 43

నిహతాని క్షణేనైవ రామేణాసురశత్రుణా,
జనస్థానమశేషేణ మునీనాం నిర్భయం కృతమ్.
న జానాసి విమూఢస్త్వమత ఏవ మయోచ్యతే. 44

రావణ ఉవాచ

కో వా రామః కిమర్థం వా కథం తేనాసురా హతాః,
సమ్యక్కథయ మే తేషాం మూలఘాతం కరోమ్యహమ్. 45

రావణుడడిగెను - ''ఆ రాముడు ఎవరు? రాక్షసు లందరు అతనిచేత ఏల చంపబడిరి? ఈ విషయమును సవిస్తరముగ తెలుపుము. అతనిని మూలచ్ఛేదము చేసెదను (45)''.

శూర్పణఖోవాచ

జనస్థానాదహం యాతా కదాచిద్గౌతమీతటే,
తత్ర పంచవటీ నామ పురా మునిజనాశ్రయా. 46

తత్రాశ్రమే మయా దృష్టో రామో రాజీవలోచనః,
ధనుర్బాణధరః శ్రీమాన్ జటావల్కలమండితః. 47

కనీయాననుజస్తస్య లక్ష్మణోఽపి తథావిధః,
తస్య భార్యా విశాలాక్షీ రూపిణీ శ్రీరివాపరా. 48

శూర్పణఖ ఇట్లనెను - ''జనస్థానమునుండి ఒకనాడు గౌతమీతటములో పోవుచుంటిని. అక్కడ ఇంతకుముందు మునిజన ఆవాసమైన పంచవటి యున్నది (46). అక్కడి ఆశ్రమములో రాజీవలోచనుడు, ధనుర్బాణ ధరుడు, శ్రీయుతుడు, జటావల్కలముచే శోభించువాడు అగు రాముని చూచితిని. అతని తమ్ముడు లక్ష్మణుడును అతని వలెనే చాల అందగాడు. ఆ రాముని భార్య సీత విశాల నేత్రములు కలది, అపర లక్ష్మీదేవి స్వరూపిణి (47-48).

దేవగంధర్వనాగానాం మనుష్యాణాం తథావిధా,
న దృష్టా న శ్రుతా రాజన్ ద్యోతయంతీ వనం శుభా. 49

ఆనేతుమహముద్యుక్తా తాం భార్యార్థం తవానఘ,
లక్ష్మణో నామ తద్భ్రాతా చిచ్ఛేద మమ నాసికామ్. 50

కర్ణౌ చ నోదితస్తేన రామేణ స మహాబలః,
తతోఽహమతిదుఃఖేన రుదతీ ఖరమన్వగామ్. 51

సోఽపి రామం సమాసాద్య యుద్ధం రాక్షసయూథపైః.
తతః క్షణేన రామేణ తేనైవ బలశాలినా. 52

సర్వే తేన వినష్టా వై రాక్షసా భీమవిక్రమాః
యది రామో మనః కుర్యాత్ త్రైలోక్యం నిమిషార్ధతః.53

భస్మీకుర్యాన్న సందేహ ఇతి భాతి మమ ప్రభో,
యది సా తవ భార్యా స్యాత్సఫలం తవ జీవితమ్. 54

అతో యతస్వ రాజేంద్ర యథా తే వల్లభా భవేత్.
సీతా రాజీవపత్రాక్షీ సర్వలోకైకసుందరీ. 55

సాక్షాద్రామస్య పురతః
స్థాతుం త్వం న క్షమః ప్రభో,
మాయయా మోహయిత్వా
తు ప్రాప్స్యసే తాం రఘూత్తమమ్. 56

శ్రుత్వా తత్సాంత్వవాక్యైశ్చ దానమానాదిభిస్తథా,
ఆశ్వాస్య భగినీం రాజా ప్రవివేశ స్వకం గృహమ్,
తత్ర చింతాపరో భూత్వా నిద్రాం రాత్రౌ న లబ్ధవాన్.57

ఏకేన రామేణ కథం మనుష్య-
మాత్రేణ నష్టః సబలః ఖరో మే.
భ్రాతా కథం మే బలవీర్యదర్ప-
యుతో వినష్టో బత రాఘవేణ. 58

రాజా! దేవగంధర్వ నాగ మానవ జాతులలో ఆమె వంటిది చూడబడలేదు. వినబడలేదు. శుభలక్షణయగు నామె వనమును ప్రకాశింపచేయుచున్నది (49). పుణ్యాత్ముడా! ఆమెను నీ భార్యగా కొనివచ్చుటకై నేను ఉద్యుక్తురాల నైతిని. ఆతని తమ్ముడు లక్ష్మణుడను పేరు గలవాడు, నా నాసికను ఖండించెను (50).

మహాబలశాలి యగు నాతడు రాముని ప్రేరణతో నా చెవులను కత్తిరించెను. అంత నేనతి దుఃఖముతో రోదించుచు ఖరుని వద్దకు పోయితిని (51). ఆతడును తన సేనాపతులతో వెంటనే పోయి రామునితో యుద్ధము నకు తలపడెను. కాని మహాబలశాలియగు రాముడు క్షణములో భీమ విక్రములగు సమస్త రాక్షసులను వధించివైచెను. ప్రభూ! రాముడే తలచికొన్నచో నిస్సందేహముగా అర్ధనిమిషములో మూడు లోకములను సంపూర్ణముగా భస్మము చేయగలవాడని నాకు తోచుచున్నది. ఆతని స్త్రీ సీత నీ భార్య అయినచో నీ జీవితము సఫలము (52-54). కావున రాజేంద్రా! జగదేకసుందరి, రాజీవనేత్రయగు సీతను తెచ్చికొని నీ వల్లభ యగునట్లు ప్రయత్నించుము (55). కాని రాముని ఎదుట ఈ రూపముతో నీవు నిలువ జాలవు. ఆతనిని మాయామోహితుని చేసి నీవామెను దక్కించుకొనుము" (56).

అనగా విని రాక్షసరాజగు రావణుడు ప్రేమ పూరితములగు మాటలతో దానమానాదులతో సోదరియగు శూర్పణఖకు ధైర్యము చేకూర్చి తన అంతఃపురము ప్రవేశించెను. అతడు చింతాపరుడగుటతో నాటి రేయి నిదురింపలేకపోయెను (57).

"మనుష్యమాత్రుడు, ఏకాకి అయిన రామునిచే బల వీర్య దర్పయుతుడగు నా సోదరుడు ఖరుడు సేనాసమేతముగా ఎట్లు వధింపబడెను? ఆశ్చర్యము! (58).

యద్వా న రామో మనుజః పరేశో
మాం హంతుకామః సబలం బలౌఘైః,
సంప్రార్థితోఽయం ద్రుహిణేన పూర్వం
మనుష్యరూపోఽద్య రఘోః కులేఽభూత్. 59

వధ్యో యది స్యాం పరమాత్మనాహం
వైకుంఠరాజ్యం పరిపాలయేఽహమ్,
నో చేదిదం రాక్షసరాజ్యమేవ
భోక్ష్యే చిరం రామమతో వ్రజామి. 60

ఇత్థం విచింత్యాఖిలరాక్షసేంద్రో
రామం విదిత్వా పరమేశ్వరం హరిమ్,
విరోధబుద్ధ్యైవ హరిం ప్రయామి
ద్రుతం న భక్త్యా భగవాన్ప్రసీదేత్. 61

''కాకున్న రాముడు మానవుడు కాడా? నన్ను బలిష్ఠులగు నా బలగముతో సహా వధింపచేయుటకు ఒకవాడు బ్రహ్మచేత ప్రార్థింపబడిన పరమాత్మ మనుష్యరూపములో ఇపుడు రఘువంశములో పుట్టి యుండునా! (59)

''పరమాత్మ చేత నేను వధింపబడిన వైకుంఠ రాజ్యమును పాలించెదను. లేకున్న ఈ రాక్షస రాజ్యమునే చిరకాలము అనుభవించెదను. కావున రామునికడకు తప్పక వెళ్లెదను (60).

ఈ విధముగా బాగుగా ఆలోచించి రావణుడు పరమేశ్వరుడగు హరియని తెలిసికొని ''విరోధబుద్ధితోనే విష్ణువును చేరెదను గాక! భగవంతుడు భక్తిచేత వెంటనే ప్రసన్నుడు కాడు గదా!'' అని రావణుడు తలచెను (61).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో
అరణ్యకాండ - పంచమ సర్గము ॥ 5 ॥

----****----

ఓమ్

# షష్ఠ సర్గము

## రావణుడు మారీచుని కడకేగుట

శ్రీమహాదేవ ఉవాచ

విచింత్యైవం నిశాయాం స ప్రభాతే రథమాస్థితః,
రావణో మనసా కార్యమేకం నిశ్చిత్య బుద్ధిమాన్. 1

యయౌ మారీచసదనం పరం పారముదన్వతః,
మారీచస్తత్ర మునివజ్జటావల్కలధారకః. 2

ధ్యాయన్ హృది పరాత్మానం నిర్గుణం గుణభాసకమ్,
సమాధివిరమేఽపశ్యద్రావణం గృహమాగతమ్. 3

ద్రుతముత్థాయ చాలింగ్య పూజయిత్వా యథావిధి,
కృతాతిథ్యం సుఖాసీనం మారీచో వాక్యమబ్రవీత్. 4

సమాగమనమేతత్తే రథేనైకేన రావణ,
చింతాపర ఇవాభాసి హృది కార్యం విచింతయన్. 5

బ్రూహి మే న హి గోప్యం చేత్ -
 కరవాణి తవ ప్రియమ్,
న్యాయ్యం చేద్ బ్రూహి రాజేంద్ర
 వృజినం మాం స్పృశేన్న హి. 6

రావణ ఉవాచ

అస్తి రాజా దశరథః సాకేతాధిపతిః కిల,
రామనామా సుతస్తస్య జ్యేష్ఠః సత్యపరాక్రమః. 7

వివాసయామాస సుతం వనం వనజనప్రియమ్,
భార్యయా సహితం భ్రాత్రా లక్ష్మణేన సమన్వితమ్. 8

స ఆస్తే విపినే ఘోరే పంచవట్యాశ్రమే శుభే,
తస్య భార్యా విశాలాక్షీ సీతా లోకవిమోహినీ. 9

రామో నిరపరాధాన్మే రాక్షసాన్ భీమవిక్రమాన్,
ఖరం చ హత్వా విపినే సుఖమాస్తేఽతినిర్భయః. 10

భగిన్యాః శూర్పణఖాయా నిర్దోషాయాశ్చ నాసికామ్,
కర్ణౌ చిచ్ఛేద దుష్టాత్మా వనే తిష్ఠతి నిర్భయః. 11

శ్రీమహాదేవుడిట్లనెను - ''పార్వతీ! రాత్రివేళ రావణుడీ విధముగా ఆలోచించి ప్రాతఃకాలము కాగానే ధీమంతుడగు నాతడు, రథమునెక్కి, తన మనసులో ఒక ప్రణాళికను తయారు చేసికొని సముద్రమునకు ఆవలనున్న మారీచుని ఆశ్రమమునకు వెళ్లెను. అచట మారీచుడు మునివలె జటావల్కలములు ధరించి, ప్రాకృతగుణములను ప్రకాశింపచేయు నిర్గుణుని పరమాత్మను హృదయములో ధ్యానించుచునుండెను. సమాధిదశ పూర్తయిన పిదప, తన యింటికి వచ్చిన రావణుని అతడు చూచెను (1-3).

వెంటనే లేచి, ఆలింగనమొనర్చి, యథావిధి పూజించి ఆతిథ్యమిచ్చి, ఆసీనుని చేసి మారీచుడిట్లనెను (4) - ''రావణా! రథమున నీవు ఒక్కడవే ఈ విధముగ వచ్చుట వలన, ఏదియో కార్యమును విచారించుచు చింతాపరుడవైనట్లు నాకు తోచుచున్నది (5). రహస్యవిషయము కానిచో నాకది చెప్పుము. నీకు ప్రియమును కలిగింతును. రాజేంద్రా! అది న్యాయసమ్మతమైనచో, పాపము నన్నంటకున్నచో ఆ విషయము తెలుపుము'' (6).

రావణుడిట్లు చెప్పెను - ''సాకేతపురాధిపతి దశరథరాజు ఉన్నాడు కదా! సత్యపరాక్రముడు రాముడు అతని పెద్ద కుమారుడు. దశరథుడు మునిజనప్రియుడైన ఆ తనయుని భార్యతోడ, తమ్ముడు లక్ష్మణునితో సహా అడవులకు పంపివేసెను (7-8). వారు భయంకరాటవిలో మంగళకరమగు పంచవటిలో వారిపుడున్నారు. అతని భార్య సీత విశాలాక్షి, లోకమోహిని (9). రాముడు నిరపరాధులు అయిన భీమబలులగు నా రాక్షసులను, ఖరుని వధించి అడవిలో అతి నిర్భయముగా సుఖముగా నివసించుచున్నాడు (10). నిర్దోషియగు నా చెల్లెలు శూర్పణఖ ముక్కు చెవులు ఖండించిపోసి దుష్టాత్ముడు (లక్ష్మణుడు) వనములో నిర్భయముగా ఉన్నాడు (11).

అతస్త్వయా సహాయేన గత్వా తత్ప్రాణవల్లభామ్.
ఆనయిష్యామి విపినే రహితే రాఘవేణ తామ్. 12

త్వం తు మాయామృగో భూత్వా హ్యాశ్రమాదపనేష్యసి.
రామం చ లక్ష్మణం చైవ తదా సీతాం హరామ్యహమ్.13

త్వంతుతావత్సహాయంమేకృత్వా స్థాస్యసి పూర్వవత్,
ఇత్యేవం భాషమాణం తం రావణం వీక్ష్య విస్మితః. 14

కేనేదముపదిష్టం తే మూలఘాతకరం వచః,
స ఏవ శత్రుర్వధ్యశ్చ యస్త్వన్నాశం ప్రతీక్షతే. 15

రామస్య పౌరుషం స్మృత్వా చిత్తముద్యాపి రావణ,

బాలో౽పి మాం కౌశికస్య యజ్ఞసంరక్షణాయ సః. 16

ఆగతస్త్విషుణైకేనపాతయామాస సాగరే,

యోజనానాం శతం రామ -స్తదాది భయవిహ్వలః. 17

స్మృత్వా స్మృత్వా తదేవాహం రామం పశ్యామి సర్వతః.
18

కావున అటకువెళ్లి, అడవి యందు ఆమెతో రాముడు లేనివేళ అతని ప్రాణవల్లభను నీ సహాయముతో తీసికొని (హరించి) వచ్చెదను (12). నీవు మాయామృగరూపము దాల్చి రాముని, లక్ష్మణుని ఆశ్రమము నుండి దూరముగా కొనిపోవలయును. అపుడు సీతను నేను అపహరించెదను (13). నీవు అంతమాత్రము సాయము నాకొరకు చేసి యథాపూర్వము నివసించుము''. ఇటుల చెప్పుచున్న రావణుని ఆశ్చర్యముతో చూచి (14), ''సర్వనాశనకరమగు ఈ మాట నీకు ఎవరిచేత ఉపదేశింపబడినది! నీ నాశనము చేయ ఎదురుచూచుచున్న శత్రువు, వాడెవడో అవశ్యము వధార్హుడు (15). రావణా! రాముని పౌరుషముల చూచి నా మనసు ఇంకను వికలము పొందుచున్నది. విశ్వామిత్రుని యజ్ఞసంరక్షణ కొరకై వచ్చిన యాతడు, బాలుడే యైనను ఒకే ఒక్క బాణముతో నన్ను నూరు యోజనముల దూరమున సముద్రమున పడవేసెను. నాటినుండి భయాకులుడనై దానినే తలచి తలచి అన్నివైపుల రామునే చూచుచున్నాను (16-18).

దండకే౽పి పునరప్యహం వనే
పూర్వవైరమనుచింతయన్ హృది,
తీక్ష్ణశృంగమృగరూపమేకదా
మాదృశైర్బహుభిరావృతో౽భ్యయామ్. 19

పూర్వవైరమును హృదయములో స్మరించి, మరల నేను ఒకనాడు దండకారణ్యములో నా వంటి వారితో కూడి, వాడికొమ్ములుగల మృగరూపమును ధరించిపోయితిని (19).

రాఘవం జనకజాసమన్వితం
లక్ష్మణేన సహితం త్వరాన్వితః,
ఆగతో౽హమథ హంతుముద్యతో
మాం విలోక్య శరమేకమక్షిపత్. 20

తేన విద్ధహృదయో౽హముద్భ్రమన్
రాక్షసేంద్ర పతితో౽స్మి సాగరే,
తత్ప్రభృత్యహమిదం సమాశ్రితః
స్థానమూర్జితమిదం భయార్దితః. 21

సీతతో కూడియున్నవానిని, లక్ష్మణుడు అనుసరించుచున్నవానిని, రాఘవుని చంప నుద్యమించి, త్వరగా ముందుకుపోగా నన్ను చూచి యాతడు ఒక బాణమును విడిచెను (20). రాక్షసేంద్రా! అది హృదయమున నాటుకొనగా నేనాకాశమున కెగిరి, గిర గిర తిరుగుచు పోయి సముద్రమున పడితిని. నాటినుండి నేను మిక్కిలి భీతి చెంది యీ స్థానమున నుంటిని (21).

రామమేవ సతతం విభావయే
భీతభీత ఇవ భోగరాశితః,
రాజరత్నరమణీరథాదికం
శ్రోత్రయోర్యది గతం భయం భవేత్. 22

రాజ, రత్నము, రమణి, రథము వంటి భోగసామగ్రుల 'ర' కారము చెవులకు సోకగా భయము కలుగుచున్నది. భోగ సముదాయములకు భయపడిన వానివలె, రామునే సతతము ధ్యానించుచున్నాను (22).

రామ ఆగత ఇహేతి శంకయా
బాహ్యకార్యమపి సర్వమత్యజమ్.
నిద్రయా పరివృతో యదా స్వపే
రామమేవ మనసానుచింతయన్. 23

స్వప్నదృష్టిగతరాఘవం తదా
బోధితో విగతనిద్ర ఆస్థితః.
తద్భవానపి విముచ్య చాగ్రహం
రాఘవం ప్రతి గృహం ప్రయాహి భోః. 24

రక్ష రాక్షసకులం చిరాగతం
తత్స్మృతౌ సకలమేవ నశ్యతి.
తవ హితం వదతో మమ భాషితం
పరిగృహాణ పరాత్మని రాఘవే. 25

త్యజ విరోధమతిం భజ భక్తితః
పరమకారుణికో రఘునందనః.
అహమశేషమిదం మునివాక్యతోఽ-
శ్రుణవమాదియుగే పరమేశ్వరః. 26

బ్రహ్మణార్థిత ఉవాచ తం హరిః.
కిం తవేప్సితమహం కరవాణి తత్.
బ్రహ్మణోక్తమరవిందలోచన
త్వం ప్రయాహి భువి మానుషం వపుః.
దశరథాత్మజభావమంజసా
జహి రిపుం దశకంధరం హరే. 27

అతో న మానుషో రామః సాక్షాన్నారాయణోఽవ్యయః.
మాయామానుషవేషేణ వనం యాతోఽతినిర్భయః. 28

భూభారహరణార్థాయ గచ్ఛ తాత గృహం సుఖమ్.
శ్రుత్వా మారీచవచనం రావణః ప్రత్యభాషత. 29

పరమాత్మా యదా రామః ప్రార్థితో బ్రహ్మణా కిల.
మాంహంతుం మానుషో భూత్వాయత్నాదిహ సమాగతః. 30

కరిష్యత్యచిరాదేవ సత్యసంకల్ప ఈశ్వరః,
అతోఽహం యత్నతః సీతామానేష్యామ్యేవ రాఘవాత్. 31

ఇచటకు రాముడు వచ్చి యుండలేదు కదా! యను అనుమానముతో సమస్త బాహ్యకార్యములు వదలితిని. నిద్రకు వశమై పడియున్న సమయమునను మనసున రామునే స్మరింతును (23). ఈ విధముగా రాముడు స్వప్నములో దర్శనమిచ్చినను నిద్రాభంగమై నిలిచియుందును. కావున రావణా! నీవు కూడ రామునివంక విరోధము వదలి నీ యింటికి మరలిపొమ్ము (24). చిరకాలముగా కొనసాగి వచ్చుచున్న రాక్షస కులమును రక్షింపుము. అతనికి అనిష్టము చేయదలచినచో అంతయు నశించిపోవును. నేను నీకు హితమును చెప్పుచున్నాను. నా సలహా పాటింపుము. పరమాత్మయగు రామునియందు విరోధము వదలిపెట్టుము. పరమ కరుణాశీలుడగు రఘునందనుని భక్తితో భజింపుము. నేను నారదముని వలన యీ విషయములన్నియు వింటిని. ఆదియుగములో (సత్యయుగములో) బ్రహ్మదేవుడు ప్రార్థింపగా పరమాత్మయగు శ్రీహరి అతనిని 'నీకోరిక తెలుపుము. దానిని పూరింతును' అని చెప్పెను. అంత బ్రహ్మ భగవానునితో యిట్లనెను - 'అరవిందలోచనా! నీవు మానుషరూపమున భూమిపై అవతరింపుము. వేగమే దశరథనందనుడైన రామునిగా జన్మించి, దేవద్రోహియగు దశముఖుని సంహరింపుడు' (25-27). కావున రాముడు మానవుడు కాదు. సాక్షాత్తు అవ్యయుడగు నారాయణుడు. మాయామానుషవేషముతో భూభార హరణార్థమై, అతి నిర్భయుడై అడవులకు అరుదెంచెను. నాయనా! క్షేమముగా యింటికి పొమ్ము''.

మారీచుని ఈ మాట విని రావణుడు బదులు పలికెను (28-29) - ''రాముడే పరమాత్మ అయినచో బ్రహ్మచేత ప్రార్థితుడే అయిన, నన్ను వధించుటకై మానవునిగా అవతరించి, ప్రయత్నముతో ఇటువచ్చిన యెడల (30), ఆ పనిని అచిరకాలములోనే చేయును. ఏలయన అతడు సత్యసంకల్పుడు, ఈశ్వరుడు, కావుననే నేను యత్నపూర్వకముగా రాఘవునినుండి సీతను తెచ్చెదను (31).

వధే ప్రాప్తే రణే వీర ప్రాప్స్యామి పరమం పదమ్.
యద్వా రామం రణే హత్వా సీతాం ప్రాప్స్యామి నిశ్చయః. 32

వీరుడా! రాముని తో యుద్ధములో వధము సంప్రాప్తమైనచో పరమపదమును పొందుదును. లేదా రాముని (పరమాత్మ కానియెడల) యుద్ధమున వధించి నిశ్చయముగా సీతను పొందుదును (32).

తదుత్తిష్ఠ మహాభాగ విచిత్రమృగరూపధృక్.
రామం సలక్ష్మణం శీఘ్రమాశ్రమాదతిదూరతః. 33

ఆక్రమ్య గచ్ఛ త్వం శీఘ్రం సుఖం తిష్ఠ యథా పురా.
అతః పరం చేద్యత్కించిద్భాషసే మద్విభీషణమ్. 34

హనిష్యామ్యసినానేన త్వామత్రైవ న సంశయః.
మారీచస్తద్వచః శ్రుత్వా స్వాత్మన్యేవాన్వచింతయత్. 35

కాబట్టి భాగ్యవంతుడా! లెమ్ము! విచిత్రమగు మృగరూపము ధరించి, శీఘ్రముగా రామలక్ష్మణులను ఆశ్రమమునుండి అతిదూరమునకు గొనిపొమ్ము. పిదప పూర్వమువలె నీ ఆశ్రమము చేరి సుఖమున నుండుము. ఇంకను నన్ను భయపెట్టుటకై ఏదేని మాట్లాడినచో, నిశ్చయముగా నేనిపుడే నిన్ను ఈ ఖడ్గముతో నరికివేసెదను'' అనగా విని మారీచుడు మనసులో ఇట్లనుకొనెను (33-35)- ''నన్ను రాముడు సంహరించిన సంసారసముద్రమును తరించిపోయెదను.

యది మాం రాఘవో హన్యాత్తదా ముక్తో భవార్ణవాత్.
మాం హన్యాద్యది చేద్దుష్టస్తదా మే నిరయో ధ్రువమ్. 36

అటుల కాక యీ దుష్టుడు నన్ను చంపిన తప్పక నరకమున పడవలయును'' (36). ఈ విధముగా శ్రీరాముని చేతనే తన మరణము నిశ్చయించుకొని, అతడు వెంటనే లేచి రావణునితో ''రాజా! ప్రభూ! నేను నీ ఆజ్ఞను పాలించెదను'' (37) అని పల్కి అతని రథము నధిరోహించి రాముని ఆశ్రమము వంకగా సాగి, వెండి మచ్చలు గల శుద్ధ బంగారు వర్ణము గల మృగరూపమును దాల్చెను (38). దాని కొమ్ములు రత్నమయములు. గిట్టలు మణిఖచితములు. నేత్రములు నీలరత్నమణులు. మెరుపువలె మెరయుచు మనోహరవదనముతో ఆ మృగము రాముని ఆశ్రమము చెంత సీతయుండు వనమున తిరుగాడసాగెను (39-40). క్షణములో పరుగిడును. క్షణములో నిలుచును. దరికి చేరి, భయపడి పరుగిడును. ఈ విధముగా ఆ దుష్టుడు మాయామృగవేషధారియై సీతను మోహింపచేయుచు తిరుగాడసాగెను (41).

ఇతి నిశ్చిత్య మరణం రామాదుత్థాయ వేగతః.
అబ్రవీద్రావణం రాజన్కరోమ్యాజ్ఞాం తవ ప్రభో. 37

ఇత్యుక్త్వా రథమాస్థాయ గతో రామాశ్రమం ప్రతి.
శుద్ధజాంబూనదప్రఖ్యో మృగోఽభూద్రౌప్యబిందుకః. 38

రత్నశృంగో మణిఖురో నీలరత్నవిలోచనః.
విద్యుత్ప్రభో విముగ్ధాస్యో విచచార వనాంతరే. 39

రామాశ్రమపదస్యాంతే సీతాదృష్టిపథే చరన్. 40

క్షణం చ ధావత్యవతిష్ఠతే క్షణం
సమీపమాగత్య పునర్భయావృతః.
ఏవం స మాయామృగవేషరూపధృక్
చచార సీతాం పరిమోహయన్ ఖలః. 41

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో అరణ్యకాండ షష్ఠ సర్గము ॥ 6 ॥

____ **** ____

ॐ

# సప్తమ సర్గము

## మారీచ వధ - సీతాపహరణము

శ్రీమహాదేవ ఉవాచ

అథ రామోఽపి తత్సర్వం జ్ఞాత్వా రావణచేష్టితమ్,
ఉవాచ సీతామేకాంతే శృణు జానకి మే వచః. 1

రావణో భిక్షురూపేణ ఆగమిష్యతి తేఽంతికమ్,
త్వం తు ఛాయాం త్వదాకారాం స్థాపయిత్వోటజే విశ.2

అగ్నావదృశ్యరూపేణ వర్షం తిష్ఠ మమాజ్ఞయా,
రావణస్య వధాంతే మాం పూర్వవత్ప్రాప్స్యసే శుభే. 3

శ్రుత్వా రామోదితం వాక్యం సాపి తత్ర తథాకరోత్,
మాయాసీతాం బహిః స్థాప్య స్వయమంతర్దధేఽనలే. 4

మాయాసీతా తదాపశ్యన్మృగం మాయావినిర్మితమ్,
హసంతీ రామమభ్యేత్య ప్రోవాచ వినయాన్వితా. 5

పశ్య రామ మృగం చిత్రం కానకం రత్నభూషితమ్,
విచిత్ర బిందుభిర్యుక్తం చరంతమకుతోభయమ్,
బధ్వా దేహి మమ క్రీడామృగో భవతు సుందరః. 6

తథేతి ధనురాదాయ గచ్ఛన్ లక్ష్మణమబ్రవీత్,
రక్ష త్వమతియత్నేన సీతాం మత్ప్రాణవల్లభామ్. 7

మాయినః సంతి విపినే రాక్షసా ఘోరదర్శనాః,
అతోఽత్రావహితః సాధ్వీం రక్ష సీతామనిందితామ్. 8

లక్ష్మణో రామమాహేదం దేవాయం మృగరూపధృక్,
మారీచోఽత్ర న సందేహ ఏవంభూతో మృగః కుతః.9

శ్రీరామ ఉవాచ

యది మారీచ ఏవాయం తదా హన్మి న సంశయః,
మృగశ్చేదానయిష్యామి సీతావిశ్రమహేతవే. 10

శ్రీమహాదేవుడిట్లనెను - ఇక్కడ రామచంద్రుడు రావణుని కుట్రనంతయు తెలుసుకొని ఏకాంతమున జానకితో ఇట్లనెను -'' ఓ సీతా! నా మాటలు వినుము (1). శుభాంగీ! రావణుడు నీకడకు భిక్షుకరూపమున దాల్చివచ్చును. కావున నీవు నీతో సమానాకారముగల ఛాయను కుటీరమున వదలి అగ్నిలో ప్రవేశించుము. నా ఆజ్ఞచేత అందు అదృశ్యరూపమున ఒక సంవత్సరకాల ముండుము. అనంతరము రావణుని చంపినమీదట నీవు నన్ను పూర్వమువలె పొందగలవు (2-3). రామునిమాటలు విని సీత అట్లే ఆచరించెను. ఆమె మాయామయమగు సీతను నిలిపి తాను అగ్నిలో అంతర్ధానము చెందెను (4). అంతట మాయాసీత మాయామృగమును జూచి రాముని కడకేగి నవ్వుచు నమ్రతతో ఇట్లనెను (5) - ''రామా! రత్న విభూషితమైన ఆ స్వర్ణమృగమును చూడుము. దాని శరీరమున ఎంతటి అద్భుతమగు చిన్నెలున్నవి? ఎంత నిర్భయముగా ఇట చరించుచున్నది? ప్రభూ! మీరు దానిని బంధించి నాకు తెచ్చియుండు. ఈ సుందరహరిణము నాకు క్రీడామృగముగుగాక! (6).

అంతట రాముడు 'అట్లే' యని తన ధనుర్బాణములు తీసికొని వెడలుచు లక్ష్మణుని కిట్లు చెప్పెను - ''లక్ష్మణా! నీవు నా ప్రాణప్రియయగు సీతను ప్రయత్న పూర్వకముగా రక్షించుచుండుము (7). వనములో బహు మాయావులైన భయంకరులగు రాక్షసులు తిరుగాడు చున్నారు. కావున నీవు పరిశుద్ధురాలగు సాధ్వి సీతను బహు జాగరూకతతో రక్షింపుము! (8)''.

అంతట లక్ష్మణుడు రామునితో ఇట్లనెను - ''దేవా! ఈ మృగరూపమును దాల్చినవాడు మారీచుడు అనుటలో సందేహము లేదు. ఏలయన మృగము ఇటువంటిది ఎక్కడైనను ఉండునా!'' (9).

రాముడు మరల యిట్లనెను - ''ఇతడు మారీచుడే యైనచో నిస్సందేహముగా వీనిని తప్పక చంపెదను. అట్లుగాక మృగమే అయినచో సీత ముచ్చట తీర్చుటకు పట్టి తెచ్చెదను (10).



సీతాదేవి శ్రీరామచంద్రునికి బంగారు లేడిని చూపుట

గమిష్యామి మృగం బద్ధ్వా హ్యానయిష్యామి సత్వరః.
త్వం ప్రయత్నేన సంతిష్ఠ సీతాసంరక్షణోద్యతః. 11

ఇత్యుక్త్వా ప్రయయౌ రామో మాయామృగమనుద్రుతః.
మాయా యదాశ్రయా లోకమోహినీ జగదాకృతిః.12

నిర్వికారశ్చిదాత్మాపి పూర్ణోఽపి మృగమన్వగాత్,
భక్తానుకంపీ భగవానితి సత్యం వచో హరిః. 13

కర్తుం సీతాప్రియార్థాయ జానన్నపి మృగం యయౌ.
అన్యథా పూర్ణకామస్య రామస్య విదితాత్మనః 14

మృగేణ వా స్త్రియా వాపి కిం కార్యం పరమాత్మనః,
కదాచిద్దృశ్యతేఽభ్యాశే క్షణం ధావతి లీయతే. 15

దృశ్యతే చ తతో దూరాదేవం రామమపాహరత్,
తతో రామోఽపి విజ్ఞాయ రాక్షసోఽయమితి స్ఫుటమ్.
16

వివ్యాధ శరమాదాయ రాక్షసం మృగరూపిణమ్.
పపాత రుధిరాక్తాస్యో మారీచః పూర్వరూపధృక్. 17

హా హతోఽస్మి మహాబాహో
త్రాహి లక్ష్మణ మాం ద్రుతమ్.
ఇత్యుక్త్వా రామవద్వాచా
పపాత రుధిరాశనః. 18

యన్నామాజ్ఞోఽపి మరణే
స్మృత్వా తత్సామ్యమాప్నుయాత్,
కిముతాగ్రే హరిం పశ్యం
స్తేనైవ నిహతోఽసురః. 19

తద్దేహాదుత్థితం తేజః సర్వలోకస్య పశ్యతః,
రామమేవావిశద్దేవా విస్మయం పరమం యయుః. 20

నేనిపుడే పోయి శీఘ్రముగా యీ మృగమును గొనివచ్చెదను. అంతవరకు నీవు సీతను రక్షించుచు బహు జాగరూకుడవై యుండుము (11).

ప్రపంచరూపిణి జగన్మోహినియైన మాయ ఎవనిని ఆశ్రయించి ఉన్నదో, ఆ రాముడే ఇట్లు పలికి మాయా మృగమును అనుసరించి పరుగిడెను (12). అతడు నిర్వికారుడు, చిదాత్మ స్వరూపుడు, సర్వవ్యాపకుడు అయి ఉండి కూడ ( ఒక సాధారణ మానవునివలె) ఆ మృగము వెనుక పరుగిడెను (13). దీనివలన భగవానుడగు హరి భక్తవత్సలుడనుట సత్యమని తెలియుచున్నది. మారీచుని భక్తిని పరిపూర్ణము చేయుటకు స్వయముగా వెడలెను. భగవానుడు సర్వము ఎరిగియుండియు సీతను ఆనందింప చేయుటకై మృగము వెనుక పరుగిడెను. అట్లే కానిచో పూర్ణకాముడు, ఆత్మజ్ఞుడు, భగవానుడు - రామునకు మృగముతోగాని, స్త్రీతోగాని నేమి పని? ఆ మృగము ఒకసారి దగ్గరగనే కానవచ్చును. మరుక్షణములో దూరముగా పారిపోయి దాగుచుండును (14-15). మరల బహుదూరముగ కనుపట్టుచుండెను. ఈ విధముగా అది రాముని చాల దూరము కొనిపోయెను. అంతట రాముడు వీడు (మృగరూపి) రాక్షసుడే యని స్పష్టము కాగా, మృగరూపియగు రాక్షసునిపై ఒక బాణము వదలెను. బాణము తగులగనే రాక్షసుడు పూర్వరూపము దాల్చి నెత్తురు గ్రక్కుచు నేలపై బడెను (16-17). రక్తపానము చేయు నా రాక్షసుడు రాముని స్వరము వంటి స్వరముతో 'హా! చంపబడితిని. మహాబాహూ! లక్ష్మణా! నన్ను వెంటనే రక్షించుము!'' అనుచు అరచి, నేలబడెను. (18). మరణసమయమున ఎవరి నామము స్మరించుట చేత అజ్ఞానికూడ ఎవరిలో లీనమగునో అట్టి శ్రీహరిని కట్టెదుట చూచుచు హతుడైన రాక్షసుని విషయమున చెప్పుటకేమున్నది? (19). అతని శరీరమునుండి తేజము వెడలి అందరు చూచుచుండగనే రామునిలో లీనమై పోయెను. ఇది చూచి దేవతలకు పరమాశ్చర్యము కలిగెను (20).

కిం కర్మ కృత్వా కిం ప్రాప్తః పాతకీ మునిహింసకః,
అథవా రాఘవస్యాయం మహిమా నాత్ర సంశయః. 21

రామబాణేన సంవిద్ధః పూర్వం రామమనుస్మరన్,
భయాత్సర్వం పరిత్యజ్య గృహవిత్తాదికం చ యత్. 22

హృది రామం సదా ధ్యాత్వా నిర్ధూతాశేషకల్మషః,
అంతే రామేణ నిహతః పశ్యన్ రామమవాప సః. 23

ద్విజో వా రాక్షసో వాపి పాపీ వా ధార్మికోఽపి వా,
త్యజన్కలేవరం రామం స్మృత్వా యాతి పరం పదమ్. 24

ఇతి తేఽన్యోన్యమాభాష్య తతో దేవా దివం యయుః,
రామస్తచ్చింతయామాస మ్రియమాణోఽసురాధమః. 25

హా లక్ష్మణేతి మద్వాక్యమనుకుర్వన్మమార కిమ్,
శ్రుత్వా మద్వాక్యసదృశం వాక్యం సీతాపి కిం భవేత్. 26

ఇతి చింతాపరీతాత్మా రామో దూరాన్న్యవర్తత,
సీతా తద్భాషితం శ్రుత్వా మారీచస్య దురాత్మనః. 27

భీతాతిదుఃఖసంవిగ్నా లక్ష్మణం త్విదమబ్రవీత్,
గచ్ఛ లక్ష్మణ! వేగేన భ్రాతా తేఽసురపీడితః. 28

హా లక్ష్మణేతి వచనం భ్రాతుస్తే న శృణోషి కిమ్,
తామాహ లక్ష్మణో దేవి రామవాక్యం న తద్భవేత్. 29

యః కశ్చిద్రాక్షసో దేవి మ్రియమాణోఽబ్రవీద్వచః,
రామస్త్రైలోక్యమపి యః క్రుద్ధో నాశయతి క్షణాత్. 30

స కథం దీనవచనం భాషతేఽమరపూజితః,
క్రుద్ధా లక్ష్మణమాలోక్య సీతా బాష్పవిలోచనా. 31

ప్రాహ లక్ష్మణ! దుర్బుద్ధే! భ్రాతుర్వ్యసనమిచ్ఛసి,
ప్రేషితో భరతేనైవ రామనాశాభికాంక్షిణా. 32

వారు 'ఆహా! ఈ మునిజనహింసకుడు, పాపి, నిశాచరుడు ఎంతటి దుష్కర్మలు చేసినాడు! అయినను ఉత్తమగతి పొందినాడు. నిస్సందేహముగా నిది రామచంద్రుని పరమ కరుణయే! అతని మహిమయే (21). రామబాణము తగులక మునుపే అతడు భయముతో రాముని స్మరించుచునే యుండి, గృహ విత్తాదికము లన్నియు వదలిపెట్టెను (22). హృదయములో రాముని సదా ధ్యానించుచుండి, అనంత దోషములను తొలగించు కొని, మరణ సమయమున రాముని చేతనే వధింపబడి, రామునే చూచుచు రామునే పొందగలిగెను (23). బ్రాహ్మణుడు గాని, రాక్షసుడు గాని పాపియైనను ధార్మికు డైనను రాముని స్మరించుచు దేహము వదలినవాడు పరమ పదమును పొందును (24)''. ఇట్లనుచు పరస్పరము సంభాషించుకొనుచు అంతట దేవతలు స్వర్గమునకు వెడలి పోయిరి. రాముడిట్లు చింతించెను - ''ఈ రాక్షసాధముడు మరణించుచు నా స్వరముతో 'హా! లక్ష్మణా!' అని అరచి ప్రాణములేల వదలెను! నా స్వరమును బోలిన మాటలు విని సీత కూడ ఏమగునో! (25-26)''. ఇట్టి చింతాకులిత మానసుడై రాముడు కడు దూరమునుండి మరలెను.

ఇట సీత దురాత్ముడగు మారీచుని అరపు విని, అత్యంత భయము చెంది, దుఃఖముతో వ్యాకులత చెంది లక్ష్మణునితో ''లక్ష్మణా! నీవు శీఘ్రముగా నేగుము. నీ సోదరుడు రాక్షసుల చేత పీడింపబడుచున్నాడు (27-28). 'హా! లక్ష్మణా!' యను నీ సోదరుని మాట (అరపు) నీవు వినలేదా!' అని అడిగెను. లక్ష్మణుడు అంతట ''దేవీ! ఆ మాటలు రామునివి కావు (29). ఎవడో రాక్షసుడు మరణించుచు ఈ మాటలు పలికినాడు. ఏ స్వామి క్రుద్ధుడైన క్షణములో మూడులోకములను నాశము గావింపగలడో (30), అట్టి దేవవందితుడగు రాముడు ఇట్టి దీనాలాపము లేల పలుకును'' అని బదులు చెప్పెను.

అంతట సీత కనుల నీరు నింపుకొని, క్రోధముతో లక్ష్మణుని వంక చూచి, ''లక్ష్మణా! దుర్బుద్ధీ! నీవు నీ సోదరుని ఆపదనే చూడదలచితివా! తలచి చూడగా రామనాశమును కోరిన భరతుడే నిన్ను పంపెనా ఏమి!'' (31-32).

మాం నేతుమిహాగతోఽసి త్వం రామనాశ ఉపస్థితే,
న ప్రాప్స్యసే త్వం మామద్య పశ్య ప్రాణాంస్త్యజామ్యహమ్. 33

న జానాతీదృశం రామస్త్వాం భార్యాహరణోద్యతమ్,
రామాదన్యం న స్పృశామి త్వాం వా భరతమేవ వా. 34

ఇత్యుక్త్వా వధ్యమానా సా స్వబాహుభ్యాం రురోద హ,
తచ్ఛ్రుత్వా లక్ష్మణః కర్ణౌ పిధాయాతీవ దుఃఖితః. 35

మామేవం భాషసే చండి ధిక్ త్వాం నాశముపైష్యసి,
ఇత్యుక్త్వా వనదేవీభ్యః సమర్ప్య జనకాత్మజామ్. 36

యయౌ దుఃఖాతిసంవిగ్నో రామమేవ శనైః శనైః,
తతోఽంతరం సమాలోక్య రావణో భిక్షువేషధృక్. 37

సీతాసమీపమగమత్స్ఫురద్దండకమండలుః,
సీతా తమవలోక్యాశు నత్వా సంపూజ్య భక్తితః. 38

కందమూలఫలాదీని దత్త్వా స్వాగతమబ్రవీత్,
మునే భుంక్ష్వ ఫలాదీని విశ్రమస్వ యథాసుఖమ్. 39

ఇదానీమేవ భర్తా మే హ్యాగమిష్యతి తే ప్రియమ్,
కరిష్యతి విశేషేణ తిష్ఠ త్వం యది రోచతే. 40

భిక్షురువాచ

కా త్వం కమలపత్రాక్షి కో వా భర్తా తవానఘే,
కిమర్థమత్ర తే వాసో వనే రాక్షససేవితే.
బ్రూహి భద్రే తతః సర్వం స్వవృత్తాంతం నివేదయే. 41

సీతోవాచ

అయోధ్యాధిపతిః శ్రీమాన్ రాజా దశరథో మహాన్,
తస్య జ్యేష్ఠః సుతో రామః సర్వలక్షణలక్షితః. 42

తస్యాహం ధర్మతః పత్నీ సీతా జనకనందినీ,
తస్య భ్రాతా కనీయాంశ్చ లక్ష్మణో భ్రాతృవత్సలః. 43

పితురాజ్ఞాం పురస్కృత్య దండకే వస్తుమాగతః,
చతుర్దశ సమాస్త్వాంతు జ్ఞాతుమిచ్ఛామి మే వద. 44

(లేక) రాముడు నశింపగా నన్ను గొనిపోవుటకే నీవు వచ్చియుంటివా! నన్ను నీవు పొందలేవు, చూడుము! ఇపుడే నేను నా ప్రాణములు వదలెదను (33). తన భార్యను అపహరించుటకు ఉద్యమించినవానిగా నిన్ను రాము డెరుగడు! రాముని తప్ప అన్యుని నిన్నుగాని భరతునిగాని నేను స్పృశించను!'' (34)

అని పలికి చేతులతో గుండెలు బాదుకొనుచు రోదింపసాగెను. ఆ మాటలువిని లక్ష్మణుడు అతిదుఃఖితుడై చెవులు మూసికొని ఇట్లనెను - (35) ''చండీ! నన్నిటుల పలికెదవా! ఛీ ఛీ! నీవు నాశమునే పొందెదవు''. ఈ మాటలని జానకి (రక్షణ బాధ్యత)ని వనదేవతలకు అప్పగించి (36), దుఃఖస్వాంతుడై మెల్లమెల్లగా రాముని వెంటకు వెళ్లెను.

ఆ అవకాశమును పరికించి రావణుడు భిక్షుక వేషము ధరించి (37), దండకమండలములు సహితముగా సీతాదేవి సమీపమునకు వచ్చెను. సీత అతని చూచి వెంటనే నమస్కరించి, భక్తితో పూజించి (38), కందమూల ఫలాదులు సమర్పించి స్వాగతము పలికెను - 'మునీ! ఫలాదులు భుజింపుము. సుఖముగా విశ్రమింపుము! ఇపుడే నా భర్త ఇచటికి రాగలడు. విశేషముగా ప్రియము చేయగలడు ఇచ్చ గలదేని కూర్చుండవచ్చు' (39-40) అని పలికెను.

భిక్షువు ఇట్లనెను - ''నీవెవరు కమలపత్రాక్షీ! అనఘా! ఎవరు నీ భర్త? ఈ రాక్షస సేవితమైన వనములో ఎందులకు నీ ఆవాసము! భద్రా! చెప్పుము. పిమ్మట నా వృత్తాంతమంతయు నివేదించెదను'' (41).

సీత ఇట్లనెను - ''సంపత్కరుడు, మహాత్ముడు దశరథమహారాజు అయోధ్యాపతి. సర్వశుభలక్షణ లక్షితుడు రాముడాతని జ్యేష్ఠపుత్రుడు. జనకుని కుమార్తెను సీతను, నేను అతని ధర్మపత్నిని. భ్రాతృప్రేమ కలిగిన లక్ష్మణుడు అతని చిన్నతమ్ముడు (42-43).

రాముడు తండ్రి ఆజ్ఞను పురస్కరించుకొని పదునాల్గు సంవత్సరములు దండకారణ్యములో ఉండుటకు వచ్చియున్నాడు. నీ గురించి వినుటకు కోరుచున్నాను. మీరు మీ పరిచయము చేసికొనుడు'' (44).


రావణాసురుడు యతి వేషమున వచ్చుట
Rashmi.


మారీచ-వధ
Rashmi.

భిక్షురువాచ

పౌలస్త్యతనయోఽహం తు రావణో రాక్షసాధిపః,
త్వత్కామపరితప్తోఽహం త్వాం నేతుం పురమాగతః. 45

మునివేషేణ రామేణ కిం కరిష్యసి మాం భజ,
భుంక్ష్వ భోగాన్మయా సార్ధం త్యజ దుఃఖం వనోద్భవమ్. 46

శ్రుత్వా తద్వచనం సీతా భీతా కించిదువాచ తమ్,
యద్యేవం భాషసే మాం త్వం నాశమేష్యసి రాఘవాత్.47

ఆగమిష్యతి రామోఽపి క్షణం తిష్ఠ సహానుజః,
మాం కో ధర్షయితుం శక్తో హరేర్భార్యాం శశో యథా.48

రామబాణైర్విభిన్నస్త్వం పతిష్యసి మహీతలే,
ఇతి సీతావచః శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః. 49

స్వరూపం దర్శయామాస మహాపర్వతసన్నిభమ్,
దశాస్యం వింశతిభుజం కాలమేఘసమద్యుతిమ్. 50

తద్దృష్ట్వా వనదేవ్యశ్చ భూతాని చ వితత్రసుః,
తతో విదార్య ధరణీం నఖైరుద్ధృత్య బాహుభిః. 51

తోలయిత్వా రథే క్షిప్త్వా యయౌ క్షిప్రం విహాయసా,
హా రామ హా లక్ష్మణేతి రుదంతీ జనకాత్మజా. 52

భయోద్విగ్నమనా దీనా పశ్యంతీ భువమేవ సా,
శ్రుత్వా తత్క్రందితం దీనం సీతాయాః పక్షిసత్తమః. 53

జటాయురుత్థితః శీఘ్రం నగాగ్రాత్తీక్ష్ణతుండకః,
తిష్ఠ తిష్ఠేతి తం ప్రాహ కో గచ్ఛతి మమాగ్రతః. 54

ముషిత్వా లోకనాథస్య భార్యాం శూన్యాద్వనాలయాత్,
శునకో మంత్రపూతం త్వం పురోడాశమివాధ్వరే. 55

ఇత్యుక్త్వా తీక్ష్ణతుండేన చూర్ణయామాస తద్రథమ్,
వాహాన్విభేద పాదాభ్యాం చూర్ణయామాస తద్ధనుః. 56

భిక్షుడిట్లనెను- ''పులస్త్య తనయుడగు విశ్రవసుని తనయుడను రావణుడను, రాక్షసరాజును నేను. నిన్ను పొందవలెనను కోరికతో నేను తపించుచున్నాను. నిన్ను నా నగరమునకు కొనిపోవుటకు వచ్చినాను (45). మునివేషము దాల్చిన రామునితో నీవేమి చేయుదువు! నన్ను సేవించుము. నాతోగూడి భోగములన్నియు అనుభవించుము. వనవాస దుఃఖమును వదలిపెట్టుము (46)''

ఆ మాటలువిని ఒకింతభీతయై సీత వానితో నిట్లనెను - ''నీవు నాతో ఇటుల మాటలాడినచో రాఘవుని వలన నీవు నాశము పొందగలవు. క్షణకాలము నిలువుము. లక్ష్మణసహితుడై రాముడుకూడ రాగలడు. ఆడుసింగమును చెవులపిల్లివలె నన్ను ఎవరు చెనకగలరు! (47-48). నీవు రామబాణములచే ఛిన్నాభిన్నమై భూమిపై పడగలవు''. సీత చెప్పిన యీ మాటలువిని, రావణుడు క్రోధపరవశుడై (49), మహాపర్వత సంకాశము, పది ముఖములు, ఇరువది చేతులు, కాలమేఘమువంటి ఒడలిఛాయతోనున్న తన స్వరూపమును ప్రదర్శించెను (50). ఆ భయంకర స్వరూపమును చూచి సకల భూతములు, వనదేవతలు భయము చెందిరి. అంతట రావణుడు (సీత పాదముల క్రిందనున్న) భూమిని గోళ్లతో చీల్చి, బాహువులతో పెకలించి, రథమున ఉంచికొని, ఆకాశ మార్గమున వెడలెను. ''హారామా! హా! లక్ష్మణా!'' అనుచు ఆక్రోశించుచు జానకి (51-52), భయాకులిత మనస్వినియై దీనముగా భూతలము వంకకే చూచుచు రోదింపసాగెను. ఆమె దీనమగు ఆక్రందన విని వాడిగల చంచువు గల పక్షిశ్రేష్ఠుడగు జటాయువు కొండ శిఖరము నుండి వేగమే పైకెగసెను. రావణుని 'నిలు నిలు'మని హెచ్చరించుచు ''మంత్రపూతమగు యజ్ఞమున పవిత్రమగు పురోడాశమును ఎత్తుకొనిపోవు కుక్కవలె (రాముడు లక్ష్మణుడు లేక) శూన్యమైన ఆశ్రమమునుండి లోకనాథుడగు భగవానుని భార్యను నా కట్టెదుటనే, అపహరించుకొని సాగిపోవువాడవు - ఎవడవు నీవు'' అని పలికి వాడియైన చంచుపుటములతో రావణుని రథమును ముక్కలుగా చేసివైచెను. పాదములతో గుఱ్ఱములను చీల్చెను. అతని ధనస్సును ఖండించివేసెను (53-56).


రావణాసురుడు సీతాదేవిని అపహరించుట
J.M. Prasad

తతః సీతాం పరిత్యజ్య రావణః ఖడ్గమాదదే,
చిచ్ఛేద పక్షౌ సామర్షః పక్షిరాజస్య ధీమతః. 57

పపాత కించిచ్ఛేషేణ ప్రాణేన భువి పక్షిరాట్,
పునరన్యరథేనాశు సీతామాదాయ రావణః. 58

క్రోశంతీ రామ రామేతి త్రాతారం నాధిగచ్ఛతి,
హా రామ హా జగన్నాథ మాం న పశ్యసి దుఃఖితామ్. 59

రక్షసా నీయమానాం స్వాం భార్యాం మోచయ రాఘవ,
హా లక్ష్మణ మహాభాగ త్రాహి మామపరాధినీమ్. 60

వాక్శరేణ హతస్త్వం మే క్షంతుమర్హసి దేవర,
ఇత్యేవం క్రోశమానాం తాం రామాగమనశంకయా. 61

జగామ వాయువేగేన సీతామాదాయ సత్వరః,
విహాయసా నీయమానా సీతాపశ్యదధోముఖీ. 62

పర్వతాగ్రే స్థితాన్పంచ వానరాన్వారిజాననా,
ఉత్తరీయార్ధఖండేన విముచ్యాభరణాదికమ్. 63

బద్ధ్వా చిక్షేప రామాయ కథయంత్వితి పర్వతే,
తతః సముద్రముల్లంఘ్య లంకాం గత్వా స రావణః. 64

స్వాంతఃపురే రహస్యే తామశోకవిపినేఽక్షిపత్,
రాక్షసీభిః పరివృతాం మాతృబుద్ధ్యాన్వపాలయత్. 65

కృశాతిదీనా పరికర్మవర్జితా
దుఃఖేన శుష్యద్వదనాతివిహ్వలా,
హా రామ రామేతి విలప్యమానా
సీతా స్థితా రాక్షసబృందమధ్యే. 66

అంతట రావణుడు సీతను విడిచి, తన ఖడ్గము నందుకొని అతి క్రోధముతో ధీమంతుడగు పక్షిరాజు పక్షములను నరకివేసెను (57). రెక్కలు విరిగిన పక్షిరాజు జటాయువు కొనఊపిరితో నేలకూలెను. వెంటనే మరొక రథముపై సీత నిడుకొని రావణుడు - (58) వెడలెను.

తనకు వేరురక్షకులను గానక "రామా! రామా!" యనుచు "హా! రాఘవా! జగన్నాథా! దుఃఖితయైన నన్ను చూడరావా! (59). రాక్షసునిచే కొనిపోబడుచున్న నీ భార్యను విడిపించుము. హా మహాభాగ్యశాలీ! లక్ష్మణా! అపరాధినైన నన్ను రక్షింపుము (60). మరదీ! నా మాట లనెడు బాణములచే గాయపడిన నీచే క్షమింపబడుటకు అర్హురాలను తండ్రీ!" అనుచు ఆక్రోశించుచున్న సీతను, రాముడు తిరిగివచ్చునను శంకతో (61), రావణుడు సీతను గైకొని వడివడిగా వెళ్లెను.

ఆకాశమార్గమున అట్లు కొనిపోబడుచున్న సీత, అధోముఖియై (యున్నందున) ఒక పర్వతాగ్రముపై నిలచి యున్న అయిదుగురు వానరులను చూచి, పద్మముఖి యగు ఆమె తన చీర (పయ్యెద) కొంగును చింపి, ఆభరణాదులను వదలించుకొని మూటగా చుట్టి "వీరు రామునకు నా సమాచారమును తెలుపుదురు గాక" యని క్రిందికి విసరి వేసెను. అనంతరము రావణుడు సముద్రము దాటి లంకకు పోయి, తన అంతఃపుర ప్రాంగణమున ఏకాంతమున అశోకవనము నందుంచెను. రాక్షస స్త్రీలను కాపుంచి మాతృభావనతో రక్షింపసాగెను (62-65).

ఆ స్థానమునందు అతిగా కృశించి, దీనురాలై సర్వవిధ అలంకార ప్రక్రియలనుజ్ఞగించి, దుఃఖము చేత శుష్కించిన వదనముతో, అతి విహ్వలురాలై 'హా! రామా! రామా! యనుచు విలపించుచు రాక్షస బృందము నడుమ సీత ఉండెను (66).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో అరణ్యకాండ సప్తమ సర్గము (7)

----****----

ఓం

# అష్టమ సర్గము

## సీతా వియోగమున రాముని విలాపము - జటాయు సమాగమము

శ్రీమహాదేవ ఉవాచ

రామో మాయావినం హత్వా రాక్షసం కామరూపిణమ్
ప్రతస్థే స్వాశ్రమం గంతుం తతో దూరాద్దదర్శ తమ్. 1

ఆయాంతం లక్ష్మణం దీనం ముఖేన పరిశుష్యతా,
రాఘవశ్చింతయామాస స్వాత్మన్యేవ మహామతిః. 2

లక్ష్మణస్తన్న జానాతి మాయాసీతాం మయా కృతామ్,
జ్ఞాత్వాప్యేనం వంచయిత్వా శోచామి ప్రాకృతో యథా. 3

యద్యహం విరతో భూత్వా తూష్ణీం స్థాస్యామి మందిరే,
తదా రాక్షసకోటీనాం వధోపాయః కథం భవేత్. 4

యది శోచామి తాం దుఃఖసంతప్తః కాముకో యథా,
తదా క్రమేణాన్విష్యన్ సీతాం యాస్యేఽసురాలయమ్.
రావణం సకులం హత్వా సీతామగ్నౌ స్థితాం పునః. 5

మయైవ స్థాపితాం నీత్వా యాతోఽయోధ్యామతంద్రితః,
అహం మనుష్యభావేన జాతోఽస్మి బ్రహ్మణార్థితః. 6

మనుష్యభావమాపన్నః కించిత్కాలం వసామి కౌ,
తతో మాయామనుష్యస్య చరితం మేఽనుశృణ్వతామ్. 7

ముక్తిః స్యాదప్రయాసేన భక్తిమార్గానువర్తినామ్,
నిశ్చిత్యైవం తదా దృష్ట్వా లక్ష్మణం వాక్యమబ్రవీత్. 8

కిమర్థమాగతోఽసి త్వం సీతాం త్యక్త్వా మమ ప్రియామ్,
నీతా వా భక్షితా వాపి రాక్షసైర్జనకాత్మజా. 9

లక్ష్మణః ప్రాంజలిః ప్రాహ సీతాయా దుర్వచో రుదన్,
హా లక్ష్మణేతి వచనం రాక్షసోక్తం శ్రుతం తయా. 10

త్వద్వాక్యసదృశం శ్రుత్వా మాం గచ్ఛేతి త్వరాఽబ్రవీత్,
రుదంతీ సా మయా ప్రోక్తా దేవి రాక్షసభాషితమ్,
నేదం రామస్య వచనం స్వస్థా భవ శుచిస్మితే. 11

శ్రీమహాదేవుడిట్లు చెప్పెను - "పార్వతీ! కామరూపి, మాయావియగు మారీచుని వధించి, తన ఆశ్రమమువంకకు మరలివచ్చుచు, దైన్యముతో శుష్కించిన ముఖముతో ఎదురు వచ్చుచున్న లక్ష్మణుని అల్లంత దూరము నుండియే గమనించెను. అంతట మహామతియగు రాఘవుడు ఇట్లని యోచించెను (1-2) - "నేను మాయా సీతను కల్పించితినని లక్ష్మణుడు ఎరుగడు. నేను ఎరిగి యుండియు ఈతనిని (రహస్యము తెలుపక) వంచించుచు సాధారణమానవునివలె శోకింతును (3). అటుగాక నేను కుటీరముననే, అనాసక్తతతో ఉదాసీనముగా నిలచిన రాక్షస కోటుల వధోపాయము ఎటుల జరుగును (4)? నేనామె కొరకై దుఃఖసంతప్తుడగు కాముకునివలె శోకింతునేని క్రమముగా సీతను వెదకుచు రాక్షసరాజు రావణుని కడకు చేరుదును. వానిని నిరవశేషముగా వంశనాశము చేసి, అగ్ని యందు నాచే ఉంచబడిన సీతను తీసికొని వేగమే అయోధ్యకు పోయెదను. బ్రహ్మచేత అర్థించబడి నేను మానవుడనుగా జన్మనెత్తితిని (6). భూమియందు కొంత కాలము మనుష్య భావముతోనే వసించెదను. అందువలన మాయామానుషవేషి నైన నా చరిత్ర వినువారికి, భక్తిమార్గ అనువర్తనులైనవారికి ముక్తి సులభముగా లభించుగాక". ఇట్లు చింతించి లక్ష్మణుని చూచి ఇట్లనెను (7-8) - "నా ప్రియురాలను సీతను వదలి ఎందులకిటు వచ్చితివి? రాక్షసులు ఆమెను అపహరించి యుందురు లేదా భక్షించి యుందురు"(9).

లక్ష్మణుడు సాంజలి బద్ధుడై, రోదించుచు సీత పలికిన కటువచనములను ఇట్లు తెలిపెను - "రాక్షసుడు పలికిన 'హా లక్ష్మణా!' యనుమాట ఆమె వినినది. నీ మాటవంటి ఆ మాటవిని నన్ను త్వరగా వెడలుమని పలికెను. దుఃఖించుచున్న ఆమెతో "అమ్మా! దేవీ! ఇది రాక్షస భాషితము. రామునిది కాదు. శుచిస్మితా! స్వస్థురాల వగుము" (10-11). ఇట్లు ఓదార్చబడినను, సాధ్వి

ఇత్యేవం సాంత్వితా సాధ్వీ మయా ప్రోవాచ మాం పునః,
యదుక్తం దుర్వచో రామ న వాచ్యం పురతస్తవ. 12

కర్ణౌ పిధాయ నిర్గత్య యాతోఽహం త్వాం సమీక్షితుమ్,
రామస్తు లక్ష్మణం ప్రాహ తథాప్యనుచితం కృతమ్. 13

త్వయా స్త్రీభాషితం సత్యం కృత్వా త్యక్తా శుభాననా,
సీతా వా భక్షితా వాపి రాక్షసైర్నాత్ర సంశయః. 14

ఇతి చింతాపరో రామః స్వాశ్రమం త్వరితో యయౌ,
తత్రాదృష్ట్వా జనకజాం విలలాపాతిదుఃఖితః. 15

హా ప్రియే క్వ గతాసి త్వం నాసి పూర్వవదాశ్రమే,
అథవా మద్విమోహార్థం లీలయా క్వ విలీయసే. 16

ఇత్యాదిన్వన్వనం సర్వం నాపశ్యజ్జానకీం తదా,
వనదేవ్యః కుతః సీతాం బ్రువంతు మమ వల్లభామ్. 17

మృగాశ్చ పక్షిణో వృక్షా దర్శయంతు మమ ప్రియామ్,
ఇత్యేవం విలపన్నేవ రామః సీతాం న కుత్రచిత్. 18

సర్వజ్ఞః సర్వథా క్వాపి నాపశ్యద్రఘునందనః,
ఆనందోఽప్యన్వశోచత్తామచలోఽప్యనుధావతి. 19

నిర్మమో నిరహంకారోఽప్యఖండానందరూపవాన్,
మమ జాయేతి సీతేతి విలలాపాతిదుఃఖితః. 20

ఏవం మాయామనుచరన్నసక్తోఽపి రఘూత్తమః,
ఆసక్త ఇవ మూఢానాం భాతి తత్త్వవిదాం న హి. 21

ఏవం విచిన్వన్సకలం వనం రామః సలక్ష్మణః,
భగ్నం రథం ఛత్రచాపం కూబరం పతితం భువి. 22

దృష్ట్వా లక్ష్మణమాహేదం పశ్య లక్ష్మణ కేనచిత్,
నీయమానాం జనకజాం తం జిత్వాన్యో జహార తామ్.23

యగు ఆమె మరల నాతో చెప్పిన దుర్వాక్యములు నీ ఎదురుగా తిరిగి పలుకరానివి (12). చెవులు మూసికొని, బయలువెడలి, నిన్ను దర్శించుటకు నేను వచ్చితిని''. రాముడు లక్ష్మణునితో ఇట్లనెను - ''అంత జరిగినను నీవు అనుచిత కార్యమే చేసితివి (13).

''స్త్రీ వచనములను సత్యము చేసి, సుముఖియైన ఆమెను వదలివచ్చితివి. ఆమె రాక్షసులచే అపహరింపబడి యుండును. లేదా భక్షింపబడియే యుండును. ఇది నిస్సంశయము'' (14). ఇట్లు చింతాక్రాంతుడై రాముడు త్వరగా ఆశ్రమము చేరెను. అక్కడ సీతను గానక అతి దుఃఖితుడై విలపించెను (15).

''హా! ప్రియురాలా! ఎటకేగితివి? పూర్వమువలె నీవు ఆశ్రమములో కానరావేమి? లేదా నన్ను మోహింప చేయుటకు పరిహసించుటకు ఎటనైన దాగియుంటివా!'' (16). ఈ విధముగా విలపించుచు అతడు వనమంతయు గాలించెను. ఎచ్చటను జానకి కానరాలేదు. ''వనదేవతలారా! సీత ఎక్కడ? నా ప్రియురాలు ఏది? చెప్పుడు. మృగములారా! పక్షులారా! వృక్షములారా! నా ప్రేయసిని చూపుడు''. ఇటుల విలపించుచు సర్వథా సర్వజ్ఞుడైన రఘురాముడు సీతను ఎక్కడను చూడలేకపోయెను. ఆనంద స్వరూపుడైనను అతడు శోకించెను. అచలుడైనను అటునిటు పరుగెత్తెను (18-19). మమకార రహితుడు, అహంకారశూన్యుడు అయినను, అఖండమగు ఆనందమే రూపుగట్టినవాడయినను ''నా భార్య! నా సీత'' అనుచు అతిదుఃఖముతో విలపించెను (20). ఈ విధముగా రఘూత్తముడు అనాసక్తుడైయున్నను మాయను అనుసరించు మూఢులకు ఆసక్తి కలవాడుగా ప్రకాశించును గాని తత్త్వవేత్తలకు మాత్రము కాదు (21).

ఈవిధముగా అంతయు వెదకుచు, లక్ష్మణ యుతుడై రాముడు విరిగిపడియున్న రథమును, ఛత్ర చాపములను, భూమిపై పడియున్న నొగ (రథము ముందు భాగము)ను చూచి (22) లక్ష్మణునితో ఇట్లు పలికెను - ''ఇటుచూడు లక్ష్మణా! ఒకనిచేత కొనిపోబడుచున్న సీతను మరియొకడు అతనిని యుద్ధమునగెల్చి అపహరించి కొనిపోయినట్లున్నది'' (23).

తతః కించిద్భువో భాగం గత్వా పర్వతసన్నిభమ్,
రుధిరాక్తవపుర్దృష్ట్వా రామో వాక్యమథాబ్రవీత్. 24

ఏష వై భక్షయిత్వా తాం జానకీం శుభదర్శనామ్,
శేతే వివిక్తేఽతితృప్తః పశ్య హన్మి నిశాచరమ్. 25

చాపమానయ శీఘ్రం మే బాణం చ రఘునందన,
తచ్ఛ్రుత్వా రామవచనం జటాయుః ప్రాహ భీతవత్. 26

మాం న మారయ భద్రం తే మ్రియమాణం స్వకర్మణా,
అహం జటాయుస్తే భార్యా హారిణం సమనుద్రుతః. 27

రావణం తత్ర యుద్ధం మే బభూవారివిమర్దన,
తస్య వాహాన్ రథం చాపం ఛిత్త్వాఽహం తేన ఘాతితః. 28

పతితోఽస్మి జగన్నాథ ప్రాణాంస్త్యక్ష్యామి పశ్య మామ్. 29

తచ్ఛ్రుత్వా రాఘవో దీనం కంఠప్రాణం దదర్శ హ,
హస్తాభ్యాం సంస్పృశన్ రామో దుఃఖాశ్రువృతలోచనః. 30

జటాయో బ్రూహి మే భార్యా కేన నీతా శుభాననా,
మత్కార్యార్థం హతోఽసి త్వమతో మే ప్రియబాంధవః. 31

జటాయుః సన్నయా వాచా వక్త్రాద్రక్తం సముద్వమన్,
ఉవాచ రావణో రామ రాక్షసో భీమవిక్రమః. 32

ఆదాయ మైథిలీం సీతాం దక్షిణాభిముఖో యయౌ,
ఇతో వక్తుం న మే శక్తిః ప్రాణాంస్త్యక్ష్యామి తేఽగ్రతః. 33

దిష్ట్యాదిదృష్టోఽసి రామ త్వం మ్రియమాణేన మేఽనఘ,
పరమాత్మాసి విష్ణుస్త్వం మాయామనుజరూపధృక్. 34

అంతకాలేఽపి దృష్ట్వా త్వాం
ముక్తోఽహం రఘుసత్తమ,
హస్తాభ్యాం స్పృశ మాం రామ
పునర్యాస్యామి తే పదమ్. 35

మరికొంత దూరము నడచుచు పోయిన తరువాత రక్తసిక్తమైన పర్వతమువంటి శరీరమును చూచి మరల రాము డిట్లనెను (24) - "ఈ ప్రాణియే శుభదర్శనురాలగు జానకిని భక్షించి అత్యంత తృప్తితో (భుక్తాయాసముతో) ఏకాంతముగా ఇక్కడ నిద్రించుచున్నది, చూడుము. ఈ నిశాచరుని వధించెదను. శీఘ్రమే నా శరచాపములు గొనిరమ్ము సోదరా!" రాముని ఆ మాట విని జటాయువు భీతుడై ఇట్లు పలికెను (25-26).

"నన్ను చంపవద్దు! నీకు శుభమగుగాక! నేను నా యొనర్చిన కర్మముచేతనే మరణించుచున్నాను. నేను జటాయువును. నీ భార్యను హరించినవానిని, రావణుని వెంబడించితిని. వానితో నాకు పెద్దయుద్ధము జరిగినది. అరిసూదనా! వాని అశ్వములను, రథమును, చాపమును ఛేదించితిని, వానిచేత నేను గాయపడి యున్నాను (27-28). జగన్నాథా! నేల వ్రాలియున్నాను. ప్రాణములు వదలుచున్నాను. నన్ను (అనుగ్రహముతో) చూడుము" (29).

అది విని, కంఠగతప్రాణుడై ఉన్న దీనుడగు జటాయువును రాముడు చూచెను (గుర్తించెను). రాముడాతనిని చేతులతో స్పృశించుచు, దుఃఖాశ్రులోచనుడై 'జటాయూ! శుభాననయగు నా భార్య ఎవనిచే గొనిపోబడినది, చెప్పుము? నా కార్యముకొరకై నీవు నిహతుడవైతివా! ఇందులకు నీవు నాకు ప్రియబంధుగుడవైతివి (30-31)" అని దుఃఖించెను. జటాయువు నోటి నుండి రక్తము వెడలుచుండగా, తడబడు గొంతుతో ఇట్లనెను - "భీమ విక్రముడగు రాక్షసరాజు రావణుడు మిథిలానగర రాకుమారి సీతను కొని దక్షిణాభిముఖముగా పోయెను. ఇక నాకు మాటలాడుటకు శక్తి చాలదు. నీ కట్టెదుట (సన్నిధిని) ప్రాణములు వదలుచున్నాను. మరణించుచు అదృష్టవశమునచే అనఘుడా! రామా! నిన్ను చూడగలిగితిని. నీవు పరమాత్ముడవు. మాయామానుష వేషధారివై నిలిచిన శ్రీమహావిష్ణుడవు (32-34). రఘుపుంగవా! అంత్యకాలమున నిన్ను చూడగలుగుట వలన నేను ముక్తుడను. నీ హస్తములచే నన్ను స్పృశించుము. పిదప నీ పరమ పదమునే పొందెదను (35). ఇట్లనగా రాముడు

తథేతి రామః పస్పర్శ తదంగం పాణినా స్మయన్,
తతః ప్రాణాన్పరిత్యజ్య జటాయుః పతితో భువి. 36

రామస్తమనుశోచిత్వా బంధువత్సాశ్రులోచనః,
లక్ష్మణేన సమానాయ్య కాష్ఠాని ప్రదదాహ తమ్. 37

స్నాత్వా దుఃఖేన రామోఽపి లక్ష్మణేన సమన్వితః,
హత్వా వనే మృగం తత్ర మాంసఖండాన్సమంతతః. 38

శాద్వలే ప్రాక్షిపద్రామః పృథక్ పృథగనేకధా,
భక్షంతు పక్షిణః సర్వే తృప్తో భవతు పక్షిరాట్. 39

ఇత్యుక్త్వా రాఘవః ప్రాహ జటాయో గచ్ఛ మత్పదమ్,
మత్సారూప్యం భజస్వాద్య సర్వలోకస్య పశ్యతః. 40

తతోఽనంతరమేవాసౌ దివ్యరూపధరః శుభః,
విమానవరమారుహ్య భాస్వరం భానుసన్నిభమ్. 41

శంఖచక్రగదాపద్మ కిరీటవరభూషణైః,
ద్యోతయన్స్వప్రకాశేన పీతాంబరధరోఽమలః. 42

చతుర్భిః పార్షదైర్విష్ణోస్తాదృశైరభిపూజితః,
స్తూయమానో యోగిగణై రామమాభాష్య సత్వరః,
కృతాంజలిపుటో భూత్వా తుష్టావ రఘునందనమ్. 43

జటాయురువాచ

అగణితగుణమప్రమేయమాద్యం
సకలజగత్స్థితిసంయమాదిహేతుమ్,
ఉపరమపరమం పరాత్మభూతం
సతతమహం ప్రణతోఽస్మి రామచంద్రమ్. 44

నిరవధిసుఖమిందిరాకటాక్ష-
క్షపితసురేంద్రచతుర్ముఖాదిదుఃఖమ్,
నరవరమనిశం నతోఽస్మి రామం
వరదమహం వరచాపబాణహస్తమ్. 45

''అట్లే'' యని చిరునవ్వుతో జటాయు శరీరమును చేతితో స్పృశించెను. అంతట జటాయువు ప్రాణములు వదలి, నేలపై పడిపోయెను (36). రాముడాతని మరణమునకై తన బంధువు కొరకు చింతించినట్లు కన్నులనీరు నింపుకొని దుఃఖించెను. పిదప లక్ష్మణునితో చితి పేర్పించి స్వయముగా జటాయువునకు దహనక్రియలు చేసెను (37). రాముడంతట లక్ష్మణ సహితుడై స్నానము చేసి 'యదన్నం పురుషోఽశ్నాతి తదన్నాస్తస్య దేవతాః' అను వాక్యానుసారము గృధ్రోచితముగా అంత్యేష్టి సంస్కారము లను శ్రాద్ధ తర్పణాదికములు గావించెను (38-39).

తరువాత రాముడు ఇట్లుచెప్పెను - ''జటాయూ! నీవు నా పరమపదము చేరుము. ఈనాడు నీవు అందరు దర్శించుచుండగా నా సారూప్యము పొందుము'' (40). అపుడు జటాయువు సుందరమైన దివ్యరూపముపొంది శుభంకరుడై దివ్యము, సూర్యసమాన ద్యుతివంతము శ్రేష్ఠమగు విమానము అధిరోహించెను (41).

అతడు శంఖ చక్ర గదా పద్మకిరీటములు, శ్రేష్ఠము లగు ఆభరణములు ధరించి, స్వప్రకాశముతో ప్రకాశించుచు పీతాంబరధరుడై, నిర్దోషుడై, నలుగురు విష్ణుపార్షదులు (ముందు చెప్పిన అలంకారములు ధరించిన వారు) తనను సేవించుచుండగా, యోగిగణములచే స్తుతించబడుచు, కృతాంజలియై, త్వరగా రఘునందనుని ఈవిధముగా స్తుతించెను (42-43).

జటాయువు ఇట్లు స్తుతించెను - ''లెక్కకు అందని గుణగణములు కలవానిని, మనోబుద్ధ్యాదుల కందనివానిని, పరమకారణమైనవానిని, సకల జగత్ సృష్టి స్థితి లయకారకుడైన వానిని, ప్రపంచమునకు దూరముగా అనాసక్తునిగా నుండువానిని, ప్రశాంతస్వరూపుని, పరమాత్ముని రామచంద్రుని నిరంతరముగా సేవింతును (44). అఖండానంద స్వరూపుడు, లక్ష్మీకటాక్షమునకు ఏకైక లక్ష్యము, ఇంద్ర బ్రహ్మాదుల దుఃఖముల తొలగించువాడు, నరవరుడు, వరదుడు, శ్రేష్ఠములగు చాప బాణములు ధరించువాడు అగు రామునికి సదా ప్రణతులు (45). త్రిభువన కమనీయరూపుడు, అనేక సూర్యప్రభా

త్రిభువనకమనీయరూపమీడ్యం
రవిశతభాసురమీహితప్రదానమ్,
శరణదమనిశం సురాగమూలే
కృతనిలయం రఘునందనం ప్రపద్యే. 46

భవవిపినదవాగ్నినామధేయం
భవముఖదైవతదైవతం దయాలుమ్,
దనుజపతిసహస్రకోటినాశం
రవితనయాసదృశం హరిం ప్రపద్యే. 47

అవిరతభవభావనాతిదూరం
భవవిముఖైర్మునిభిః సదైవ దృశ్యమ్,
భవజలధిసుతారణాంఘ్రిపోతం
శరణమహం రఘునందనం ప్రపద్యే. 48

గిరిశగిరిసుతామనోనివాసం
గిరివరధారిణమీహితాభిరామమ్,
సురవరదనుజేంద్రసేవితాంఘ్రిం
సురవరదం రఘునాయకం ప్రపద్యే. 49

పరధనపరదారవర్జితానాం
పరగుణభూతిషు తుష్టమానసానామ్,
పరహితనిరతాత్మనాం సుసేవ్యం
రఘువరమంబుజలోచనం ప్రపద్యే. 50

స్మితరుచిరవికాసితాననాబ్జ-
మతిసులభం సురరాజనీలనీలమ్,
సితజలరుహచారునేత్రశోభం
రఘుపతిమీశగురోర్గురుం ప్రపద్యే. 51

హరికమలజశంభురూపభేదా-
త్త్వమిహ విభాసి గుణత్రయానువృత్తః,
రవిరివ జలపూరితోదపాత్రే-
ష్వమరపతిస్తుతిపాత్రమీశమీడే. 52

భాసమానుడు, అభీష్ట ప్రదాయకుడు, శరణాగత రక్షకుడు, భక్తజన హృదయ నివాసి, రఘునందనుని స్తుతించుచు శరణు వేడెదను (46).

''సంసారాటవిని దహించు, అగ్నివంటి నామము కలవాడు, మహాదేవాది దేవతలకు ఆరాధ్యుడైనవాడు, దయాళుడు, వేలాది రాక్షసుల వధించినవాడు, సూర్య తనయ యమునవంటి మేనివన్నె కలవాడు అగు శ్రీహరిని సేవించుచున్నాను (47). నిరంతర సంసార లంపటులకు దూరముగా నిలచువాడు, సంసారవిముఖులగు మునులకు సద్యోదర్శన భాగ్యము నిచ్చువాడు, సంసార జలధి దాటించ సమర్థములగు పాదములను నౌకలు కలవాడు, రఘు నందనుని నేను శరణు వేడెదను (48).

''శివపార్వతుల హృదయకమలములందు నివసించువాడు, కూర్మావతారమున మందరపర్వత శ్రేష్ఠమును (తరువాత కృష్ణుడై గోవర్ధనమును) ధరించినవాడు, లీలావిలాసము కలవాడు, సురవరులచేత, (ప్రహ్లాద, బలి, వృత్రాసురాది) దనుజేంద్రులచేత సేవించబడిన పాద పద్మములు కలవాడు, సురవరుడు, రఘునాయకుని సేవించెదను (49).

''పరధన, పరదారలపై ఆశ వదలిన మహానుభావుల చేత, ఇతరుల లేదా భగవంతుని గుణముల ఐశ్వర్యములను తలచి ఆనందించెడు వారిచేత, పరోపకార పారాయణులచేత బాగుగా సేవించబడు రఘువరుని, పుండరీకాయతాక్షుని నేను శరణు వేడెదను (50)''.

''మనోహర మందహాసముతో శోభించుచున్న ముఖకమలము కలవాడు, అతి కారుణికుడగుటచే స్మరణమాత్రముననే అనుగ్రహించు సులభుడు, ఇంద్రనీలమణిద్యుతి భాసితుడు, తెల్లతామరపూవువంటి అందమైన కన్నులు శోభ కలవాడు, మహాదేవగురుని, రఘుపతిని శరణు వేడెదను (51)''.

''ఈశా! దేవతాజన స్తుతిపాత్రా! నీరునిండిన పాత్రలో ప్రతిఫలించు సూర్యునివలె నీవే గుణత్రయమును ఆశ్రయించి, విష్ణు బ్రహ్మ శంభు నామములతో ప్రకాశించెదవు. నిన్ను నేను స్తుతించెదను (52)''.

రతిపతిశతకోటిసుందరాంగం
శతపథగోచరభావనావిదూరమ్,
యతిపతిహృదయే సదా విభాతం
రఘుపతిమార్తిహరం ప్రభుం ప్రపద్యే. 53

ఇత్యేవం స్తువతస్తస్య
ప్రసన్నోఽభూద్రఘూత్తమః,
ఉవాచ గచ్ఛ భద్రం తే
మమ విష్ణోః పరం పదమ్. 54

శృణోతి య ఇదం స్తోత్రం
లిఖేద్వా నియతః పఠేత్,
స యాతి మమ సారూప్యం
మరణే మత్స్మృతిం లభేత్. 55

ఇతి రాఘవభాషితం తదా
శ్రుతవాన్ హర్షసమాకులో ద్విజః,
రఘునందనసామ్యమాస్థితః
ప్రయయౌ బ్రహ్మసుపూజితం పదమ్. 56

''శతకోటి మన్మథుల మించిన సుందర శరీరము కలవాడు పుత్ర భ్రాతృ కళత్ర బంధు గృహక్షేత్రాది అవిద్యా భావనా మార్గములు అనుసరించువారికి అందరానివాడు, లేదా శతపథ బ్రాహ్మణమునందలి ''యతోవాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ' వంటి భావనలు కలవారికి అత్యంత సన్నిహితుడు, యతీశ్వరుల హృదయములలో సర్వదా ప్రకాశించువాడు, ఆర్తిహరుడు, ప్రభుడు, రఘురాముడు - ఆతనిని శరణు వేడుచున్నాను (53)''

ఈ విధముగా జటాయువు స్తుతించగా రామచంద్రుడు ప్రసన్నుడై ఇట్లనెను - ''జటాయూ! నీకు మంగళమగుగాక! నా విష్ణుపదమునకు పొమ్ము (54). ఈ స్తోత్రమును విన్నవాడు, లిఖించినవాడు నియతాత్ముడై పఠించినవాడు, నా సారూప్యమును పొందగలడు మరణ కాలమున నా స్మృతి లభించును' (55). ఈ విధముగా రాఘవుడు పలుకగా విని హర్షసమాకులుడై ద్విజోత్తముడైన జటాయువు రఘునందనునితో సారూప్యమును పొంది, బ్రహ్మపూజితమగు పరమపదము పొందెను (56).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో అరణ్యకాండ అష్టమ సర్గము ॥ 8 ॥

\----****----

ఓం

# నవమ సర్గము

## కబంధోద్ధరణము

శ్రీమహాదేవ ఉవాచ

తతో రామో లక్ష్మణేన జగామ విపినాంతరమ్,
పునర్దుఃఖం సమాశ్రిత్య సీతాన్వేషణతత్పరః. 1

తత్రాద్భుతసమాకారో రాక్షసః ప్రత్యదృశ్యత,
వక్షస్యేవ మహావక్త్రశ్చక్షురాదివివర్జితః. 2

బాహూ యోజనమాత్రేణ వ్యాప్తౌ తస్య రక్షసః,
కబంధో నామ దైత్యేంద్రః సర్వసత్త్వవిహింసకః. 3

తద్బాహ్వోర్మధ్యదేశే తౌ చరంతౌ రామలక్ష్మణౌ,
దదర్శతుర్మహాసత్త్వం తద్బాహుపరివేష్టితౌ. 4

రామః ప్రోవాచ విహసన్పశ్య లక్ష్మణ రాక్షసమ్,
శిరః పాదవిహీనోఽయం యస్య వక్షసి చాననమ్. 5

బాహుభ్యాం లభ్యతే యద్యత్తత్తద్భుక్షన్ స్థితో ధ్రువమ్,
వామస్యైతయోర్బాహ్వోర్మధ్యే సంకలితౌ ధ్రువమ్. 6

గంతుమన్యత్ర మార్గో న దృశ్యతే రఘునందన,
కిం కర్తవ్యమితోఽస్మాభిరిదానీం భక్షయేత్స నౌ. 7

లక్ష్మణస్తమువాచేదం కిం విచారేణ రాఘవ,
అవామేకైకమవ్యగ్రౌ ఛింద్యావాస్య భుజౌ ధ్రువమ్. 8

తథేతి రామః ఖడ్గేన భుజం దక్షిణమచ్ఛినత్,
తథైవ లక్ష్మణో వామం చిచ్ఛేద భుజమంజసా. 9

తతోఽతివిస్మితో దైత్యః కౌ యువాం సురపుంగవౌ,
మద్బాహుచ్ఛేదకౌ లోకే దివి దేవేషు వా కుతః. 10

శ్రీమహాదేవుడిట్లనెను - పార్వతీ! తదనంతరము శ్రీరాముడు మరల దుఃఖితుడై సీతను వెదకుచు లక్ష్మణునితో గూడి వేరొకవనమున కేగెను (1). అక్కడ అతడొక విచిత్రమైన ఆకారముగల రాక్షసుని చూచెను. అతని వక్షముననే పెద్ద నోరున్నది. కన్నులు మొదలైనవి లేవు (2). ఆ రాక్షసుని భుజములు ఒక్కొక్కయోజనమునకు విస్తరించి యున్నవి. అతడు సమస్త జీవరాశులను హింసించు రాక్షస రాజు - కబంధుడు (3). అతని బాహువుల మధ్యగా నడచుచు, వానిచే చుట్టబడి రామలక్ష్మణులు ఆ రాక్షసుని గమనించిరి (4).

రాముడు నవ్వుచు ఇట్లనెను - ''చూడు లక్ష్మణా! శిరస్సు పాదములు లేని యీ రాక్షసుని చూడుము. వీని వక్షమునందే నోరున్నది (5). నిశ్చయముగా చేతులకు ఏది అందునో దానినే తిని వీడు జీవించును. నిశ్శంకగా మన మిద్దరము వీని బాహువులమధ్య చుట్టబడుటచే చేరితిమి (6). రఘునందనా! బయటపడు మార్గము కానవచ్చుట లేదు. ఏమి చేయవలసి యున్నది? లేకున్న మనలను వీడు భక్షించి వేయగలడు(7).

అంత లక్ష్మణుడు ''ఇందు ఎక్కువగా ఆలోచించు టకు ఏమున్నది? మనమిరువురము జాగరూకతతో ఈతని భుజములను ఒక్కొక్కటిగా ఖండించివేసెదము'' అనెను (8). రాముడు 'అట్లే' యని ఖడ్గముతో కబంధుని కుడి భుజమును నరకెను. అటులే లక్ష్మణుడు అనాయాసముగా ఎడమభుజమును నరకివేసెను (9).

అంతట ఆశ్చర్యముతో రాక్షసుడు ''మీర లెవ్వరు? దేవశ్రేష్ఠులా? ఈ లోకములో నా బాహువులను ఖండించినవారు దివినుండి దిగిన దేవతలు కారుగదా!'' (10) అనెను. రాజీవలోచనుడు రాముడందులకు

తతోఽబ్రవీద్ధసన్నేవ రామో రాజీవలోచనః,
అయోధ్యాధిపతిః శ్రీమాన్ రాజా దశరథో మహాన్. 11

రామోఽహంతస్యపుత్రోఽసౌభ్రాతా మేలక్ష్మణః సుధీః,
మమ భార్యా జనకజా సీతా త్రైలోక్యసుందరీ. 12

ఆవాం మృగయయా యాతౌ తదా కేనాపి రక్షసా,
సీతాం సీతాం విచిన్వంతౌ చాగతౌ ఘోరకాననే. 13

బాహుభ్యాం వేష్టితావత్ర తవ ప్రాణరిరక్షయా,
ఛిన్నౌ తవ భుజౌ త్వం చ కో వా వికటరూపధృక్. 14

కబంధ ఉవాచ

ధన్యోఽహం యది రామస్త్వమాగతోఽసి మమాంతికమ్,
పురా గంధర్వరాజోఽహం రూపయౌవనదర్పితః. 15

విచరన్ లోకమఖిలం వరనారీమనోహరః,
తపసా బ్రహ్మణో లబ్ధమవధ్యత్వం రఘూత్తమ. 16

అష్టావక్రం మునిం దృష్ట్వా కదాచిదహసం పురా,
క్రుద్ధోఽసావాహ దుష్ట త్వం రాక్షసో భవ దుర్మతే. 17

అష్టావక్రః పునః ప్రాహ వందితో మే దయాపరః,
శాపస్యాంతం చ మే ప్రాహ తపసా ద్యోతితప్రభః. 18

త్రేతాయుగే దాశరథిర్భూత్వా నారాయణః స్వయమ్,
ఆగమిష్యతి తే బాహూ ఛిద్యేతే యోజనాయతౌ. 19

తేన శాపాద్వినిర్ముక్తో భవిష్యసి యథా పురా,
ఇతి శప్తోఽహమద్రాక్షం రాక్షసీం తనుమాత్మనః. 20

కదాచిద్దేవరాజానమభ్యద్రవమహం రుషా,
సోఽపి వజ్రేణ మాం రామ శిరోదేశేఽభ్యతాడయత్.
21

తదా శిరో గతం కుక్షిం పాదౌ చ రఘునందన,
బ్రహ్మదత్తవరాన్మృత్యుర్ నాభూన్మే వజ్రతాడనాత్. 22

చిరునవ్వుతో "శ్రీమంతుడగు మహానుభావుడు అయోధ్యాపతి దశరథుడు (11).

నేనాతని పుత్రుడను రాముడను. ధీమంతుడగు ఇతడు లక్ష్మణుడు, నా తమ్ముడు. నా భార్య, జనకుని కుమార్తె త్రిలోకసుందరి సీత (12). మేము వేటకై బయటికిపోగా ఎవడో ఒక రాక్షసుడు సీతను అపహరించి కొనిపోయెను. ఆమెను వెదకుచు మేము యీ అడవిలోనికి వచ్చితిమి. ఇంతలో నీవు మమ్ము బాహువులతో చుట్టితివి. ప్రాణరక్షణకై నీ భుజములు ఖండించితిమి. నీవెవడవు? ఈ వికారమగు రూపమేమి?" (13-14) అని అడిగెను.

కబంధుడిట్లనెను – "నీవు రాముడవే యైన నావంకకు నీ రాకతో నే ధన్యుడనైతిని. పూర్వము రూప యౌవన గర్వితుడనగు గంధర్వుడను. రఘూత్తమా! అవధ్యత్వమును వరముగా బ్రహ్మచే పొంది, వరనారీ మనోహరుడనై సర్వలోకములు సంచరించుచు, ఒకనాడు అష్టావక్ర మహర్షిని చూచి అపహసించితిని. అతడు ఆగ్రహించి "దుష్టుడా! దుర్మతీ! నీవు రాక్షసుడవు కమ్ము!" అనెను (15-17). దయాపరుడైన అష్టావక్రుడు, నాచే నమస్కరించబడి, స్తుతించబడి, మరల అనుగ్రహించెను. తపస్సుచే వెలిగెడు యాతడు, శాప విమోచనమును ఎరిగించెను – "ఓరీ! శ్రీమన్నారాయణుడు త్రేతాయుగము నందు దాశరథిగా అవతరించి స్వయముగా నీకడకు వచ్చును. యోజనము పొడవుగల చేతులను నరకును. (18-19). నీవపుడు శాపవిముక్తిపొంది తొల్లింటి రూపు పొందగలవు" అని చెప్పెను. అతని శాపము కారణముగా నేను ఈ రాక్షసరూపమును పొందితిని (20).

"రామా! నేనొకసారి రోషముతో దేవరాజగు ఇంద్రునివంక పరుగిడితిని. అతడు ఆగ్రహించి నా శిరముపై వజ్రాయుధముతో మోదెను (21). రామా! ఆ దెబ్బకు శిరస్సు, పాదములు పొట్టలోనికి చొచ్చుకొనిపోయినవి. కాని బ్రహ్మ వరప్రభావమున నేను మరణించలేదు (22). నోరు

ముఖాభావే కథం జీవేదయమిత్యమరాధిపమ్,
ఊచుః సర్వే దయావిష్టా మాం విలోక్యాస్యవర్జితమ్.23

తతో మాం ప్రాహ మఘవా జఠరే తే ముఖం భవేత్,
బాహూ తే యోజనాయామా భవిష్యత ఇతో వ్రజ. 24

ఇత్యుక్తోఽత్ర వసన్నిత్యం బాహుభ్యాం వనగోచరాన్,
భక్షయామ్యధునా బాహూ ఖండితౌ మేత్వయాఽనఘ. 25

ఇతః పరం మాం శ్వభ్రాస్యే నిక్షిప్యాగ్నీంధనావృతే,
అగ్నినా దహ్యమానోఽహం త్వయా రఘుకులోత్తమ.
26

పూర్వరూపమనుప్రాప్య భార్యామార్గం వదామి తే,
ఇత్యుక్తో లక్ష్మణేనాశు శ్వభ్రం నిర్మాయ తత్ర తమ్. 27

నిక్షిప్య ప్రాదహత్కాష్ఠైస్తతో దేహాత్సముత్థితః,
కందర్పసదృశాకారః సర్వాభరణభూషితః. 28

రామమ్ ప్రదక్షిణం కృత్వా సాష్టాంగం ప్రణిపత్య చ,
కృతాంజలిరువాచేదం భక్తిగద్గదయా గిరా. 29

గంధర్వ ఉవాచ

స్తోతుముత్సహతే మేఽద్య
మనో రామాతిసంభ్రమాత్,
త్వామనంతమనాద్యంతం
మనోవాచామగోచరమ్. 30

సూక్ష్మం తే రూపమవ్యక్తం దేహద్వయవిలక్షణమ్,
దృగ్రూపమితరత్సర్వం దృశ్యం జడమనాత్మకమ్,
తత్కథం త్వాం విజానీయాద్వ్యతిరిక్తం మనః ప్రభో.31

లేని (।) నన్ను చూచి, దేవతలు దయార్ద్రహృదయులై ''ఇతడు నోరులేక ఎటుల బ్రతుకగలడు'' అని అందరును పలికిరి (23).

అంతట దేవేంద్రుడు - ''నీకు ఉదరములోనే నోరు ఉండుగాక! నీ బాహువులు యోజనము పొడవుగా నుండుగాక! ఇంక పొమ్ము!'' (24) అనెను. ఇటుల చెప్పబడి నాటినుండి ఇచటనే యుండి, నిత్యము అడవిలోని జీవులను బాహువులతో పట్టి భక్షించుచుంటిని. అనఘా! నీచేత నా రెండుబాహువులు నరకబడినవి (25). ఇంక ''రఘుకుల తిలకా! నన్నొక పెద్దగోతిలో పడవైచి, ఇంధనము నిండుగా ఉంచి, అగ్నిచే దహింపుడు. నీచేత అట్లు అగ్నిదగ్ధుడనై తొలినాటి నారూపముపొంది నీభార్య తిరిగి లభించు (లభింప చేయు) విధానము తెలిపెదను''. ఇట్లు చెప్పబడి, రాముడు లక్ష్మణునిచేత, అక్కడ ఒక పెద్దగోతిని ఏర్పాటు చేయించెను (త్రవ్వించెను) (27). కబంధుని దేహమును అందు పడవైచి, కాష్ఠములునింపి, అగ్నితో దహించెను. అంతట అతని దేహమునుండి సర్వాభరణభూషితమై, మన్మథుని మించిన సుందరాకృతి వెలువడెను (28). అతడు రామునికి ప్రదక్షిణచేసి, సాష్టాంగదండప్రణామమును ఆచరించి, బద్ధాంజలియై భక్తిభావ గద్గదవచనములతో ఇట్లనెను -

(గంధర్వుడు చెప్పెను) - ''రామా! అత్యంత సంభ్రమముతో, మనస్సుతో నిన్ను స్తుతింపవలెనని ఉత్సహించుచున్నాను. నీవు అనంతుడవు. ఆద్యంత రహితుడవు. మనస్సునకు, వాక్కునకుకూడ అందనివాడవు (30). ప్రభూ! విరాట్ హిరణ్యగర్భ పదములతో చెప్పబడు దేహద్వయము కన్న వాస్తవికమగు జ్ఞానమయ స్వరూపము సూక్ష్మమైనది. యోగులకు కూడ దుర్జ్ఞేయము. దానికి భిన్నముగా దృశ్యమానమగుచున్నది అంతయు జడము, అనాత్మకము. కావున మీ కంటె వేరైనది జడమగు మనసు (తో) నిన్ను తెలియుట ఎట్లు? బుద్ధి యొక్క చిదాభాసము

బుద్ధ్యాత్మాభాసయోరైక్యం
జీవ ఇత్యభిధీయతే,
బుద్ధ్యాదిసాక్షీ బ్రహ్మైవ
తస్మిన్నిర్విషయేఽఖిలమ్. 32

ఆరోప్యతేఽజ్ఞానవశాన్నిర్వికారేఽఖిలాత్మని,
హిరణ్యగర్భస్తే సూక్ష్మం దేహం స్థూలం విరాట్స్మృతమ్. 33

భావనావిషయో రామ సూక్ష్మం తే ధ్యాతృమంగలమ్,
భూతం భవ్యం భవిష్యచ్చ యత్రేదం దృశ్యతే జగత్. 34

స్థూలేఽండకోశే దేహే తే మహదాదిభిరావృతే,
సప్తభిరుత్తరగుణైర్వైరాజో ధారణాశ్రయః. 35

త్వమేవ సర్వకైవల్యం లోకాస్తేఽవయవాః స్మృతాః,
పాతాలం తే పాదమూలం పార్ష్ణిస్తవ మహాతలమ్. 36

రసాతలం తే గుల్ఫౌ తు తలాతలమితీర్యతే,
జానునీ సుతలం రామ ఊరూ తే వితలం తథా. 37

అతలం చ మహీ రామ జఘనం నాభిగం నభః,
ఉరఃస్థలం తే జ్యోతీంషి గ్రీవా తే మహ ఉచ్యతే. 38

వదనం జనలోకస్తే తపస్తే శంఖదేశగమ్,
సత్యలోకో రఘుశ్రేష్ఠ శీర్షణ్యాస్తే సదా ప్రభో. 39

ఇంద్రాదయో లోకపాలా బాహవస్తే దిశః శ్రుతీ,
అశ్వినౌ నాసికే రామ వక్త్రం తేఽగ్నిరుదాహృతః. 40

చక్షుస్తే సవితా రామ మనశ్చంద్ర ఉదాహృతః,
భ్రూభంగ ఏవ కాలస్తే బుద్ధిస్తే వాక్పతిర్భవేత్. 41

యొక్క అన్యోన్య అధ్యాసరూపమైన ఏకత్వమే జీవుడని చెప్పబడును. ఈ బుద్ధ్యాదులన్నిటికి బ్రహ్మమే సాక్షి. అది మనోవాక్కులలో దేనికి అందనిది. నిర్వికారుడైన పరమాత్మ యందు అజ్ఞానవశమున ఈ సమస్త జగత్తు ఆరోపితమగుచున్నది. రామా! నీ సూక్ష్మదేహమే హిరణ్యగర్భుడని, స్థూలదేహమే విరాట్ అని పిలువబడును. భూత భవిష్యత్ వర్తమాన రూపముగా కానవచ్చెడి జగత్తు అంతయు ఎందు గోచరించునో, ఆ నీ భావనామయమైన సూక్ష్మ రూపము హృదయకమలమునందు ధ్యానించుటకు అర్హమైనదై ధ్యానించువారికి శుభము చేకూర్చును (31-34).

ఒకదానికంటె మరొకటి క్రమముగా గుణ పరిపూర్తిలో గొప్పవై, ఒక్కొక్కటి పదేసి రెట్లు అధికముగా నుండు మహత్తత్త్వాదులగు సప్త ఆవరణ సముదాయముగా* నీ స్థూల బ్రహ్మాండ శరీరమునందే ధారణకు ఆశ్రయ రూపమైన విరాట్ శరీరమున్నది (35). నీవే మోక్ష స్వరూపుడవు. పదునాల్గు లోకములు (పాద సూచికలో ఇవ్వబడ్డాయి) నీ అవయవములు. పాతాళము నీ పాద మూలము. మహాతలము మడమలు. రసాతలము, తలాతలము రెండును పిలమండలు, సుతలము మోకాళ్ళు. వితలము (37), అతలము తొడలు (రెండు) కటిభాగము నకు వెనుక, దిగువగల జఘన ప్రదేశము (నితంబము) మహీలోకము, భువర్లోకము (నభోలోకము) నాభి. స్వర్లోకము (జ్యోతిర్లోకము) వక్షస్థలము. మహర్లోకము కంఠము (38). జనోలోకము వదనము. తపోలోకము నొసలు. సత్యలోకము మస్తకము (39). రామా! ఇంద్రాది లోకపాలక గణము నీ బాహువులు. కర్ణములు దిశలు. అశ్వినులు నాసిక. అగ్ని ముఖము (40). రామా! సూర్యుడు నీ నేత్రములు. చంద్రుడు మనసు. కాలము భ్రూ భంగిమ, బృహస్పతి బుద్ధి (41). నిర్వికారా! రుద్రుడు నీ

★ ఇది సాంఖ్య సమ్మతము పురాణ సమ్మతమగు ప్రక్రియ. చతుర్దశ భువనములు (భూః, భువః, సువః, మహః, జనః, తపః, సత్యమ్, అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాళ) - స్వయంభువు (బ్రహ్మ) సంకల్పముచే పుట్టినవి. ఇది స్వయంభువు స్థూలదేహము. దీనికి నాల్గువంకల పృథ్వీతేజము వలన ఉత్పన్నమైన అండమున్నది. అది చతుర్దశ భువనములకు పదిరెట్లుండును. దీని ఆవరణము పృథ్వి. ఇది అండము కన్న పదిరెట్లుండును. పృథ్వికి ఆవరణము జలము. ఇది పృథ్వికి పదిరెట్లుండును. జలము ఆవరణము తేజము, జలముకన్న పదిరెట్లు పెద్దది. తేజస్సుకు ఆవరణము

రుద్రోఽహంకారరూపస్తే వాచశ్ఛందాంసి తేఽవ్యయ.
యమస్తే దంష్ట్రదేశస్థో నక్షత్రాణి ద్విజాలయః. 42

హాసో మోహకరీ మాయా సృష్టిస్తేఽపాంగమోక్షణమ్.
ధర్మః పురస్తేఽధర్మశ్చ పృష్ఠభాగ ఉదీరితః. 43

నిమిషోన్మేషణే రాత్రిర్దివా చైవ రఘూత్తమ.
సముద్రాః సప్త తే కుక్షిర్నాడ్యో నద్యస్తవ ప్రభో. 44

రోమాణి వృక్షౌషధయో రేతో వృష్టిస్తవ ప్రభో.
మహిమా జ్ఞానశక్తిస్తే ఏవం స్థూలం వపుస్తవ. 45

యదస్మిన్ స్థూలరూపే తే మనః సంధార్యతే నరైః.
అనాయాసేన ముక్తిః స్యాదతోఽన్యన్నహి కించన. 46

అతోఽహం రామ రూపం తే స్థూలమేవానుభావయే.
యస్మింధ్యాతే ప్రేమరసః సరోమపులకో భవేత్. 47

తదైవ ముక్తిః స్యాద్రామ యదా తే స్థూలభావకః
తదప్యాస్తాం తవైవాహమేతద్రూపం విచింతయే. 48

ధనుర్బాణధరం శ్యామం జటావల్కలభూషితమ్.
అపీచ్యవయసం సీతాం విచిన్వంతం సలక్ష్మణమ్. 49

ఇదమేవ సదా మే స్యాన్మానసే రఘునందన.
సర్వజ్ఞః శంకరః సాక్షాత్పార్వత్యా సహితః సదా. 50

త్వద్రూపమేవం సతతం ధ్యాయన్నాస్తే రఘూత్తమ.
ముమూర్షూణాం తదా కాశ్యాం తారకం బ్రహ్మవాచకమ్.
51

రామరామేత్యుపదిశన్సదా సంతుష్టమానసః.
అతస్త్వం జానకీనాథ పరమాత్మా సునిశ్చితః. 52

అహంకారము. వేదములే నీ వాణి. యముడు నీ కోరలు. నక్షత్రగణములు దంతములు (42). అందర మోహింపచేయు మాయ హాస్యము. సృష్టి నీ కటాక్షము. ధర్మము నీ ముందు భాగము. అధర్మము వెనుక భాగము (43).

రఘూత్తమా! రేయింబవళ్లు నీ నిమేష, ఉన్మేషములు. సప్తసముద్రములు నీ కుక్షి. నదులు నాడులు (44). ప్రభూ! వృక్షములు, ఓషధులు నీ రోమములు. వృష్టి నీ వీర్యము. జ్ఞానశక్తి నీ మహిమ. ఇదియే నీ స్థూల శరీరము (45). ఎవరు నీ యీ స్థూల రూపమును మనసులో స్థిరముగా ఉంచుకొనగల్గునో అతడు అనాయాసముగా ముక్తుడగును. ఆ తరువాత ఆత్మకు పొందతగినవి ఏవియును లేవు (46). కావున రామా! నేను ఎల్లపుడు ఆ స్థూలరూపమునే సర్వదా చింతించుచుందును. తత్ ధ్యానమువలన శరీరము పులకించి, హృదయమున అనురాగరసము ఉద్భవించును (47).

"రామా! ఎవడు ఎపుడు నీ విరాట్ రూపమును ధ్యానించునో అపుడు వెంటనే అతనికి ముక్తి కలుగును. అయినను నాకు దాని అవశ్యకము లేదు. నేను నీ ఈ రామస్వరూపమునే చింతించెదను (48). నా మనసులో ఎల్లపుడు ఇటులనే ధనుర్బాణధారివై, శ్యామవర్ణుడవై, జటావల్కల భూషితుడవై, తరుణవయస్కుడవై లక్ష్మణునితో కలిసి, సీతను వెదకుచు వచ్చిన నేటిరూపమే రఘునందనా! నా మనసున నిలచియుండుగాక! ఈ రూపమునే కదా! సర్వజ్ఞశంకరుడు పార్వతీసహితుడై సర్వదా ధ్యానించుచు, ముముక్షువులైనవారికి కాశియందు బ్రహ్మవాచకము అయిన రామతారకమును ఉపదేశించుచు సంతుష్టమానసుడై యుండునది! జానకీనాథా! నీవు నిశ్చయముగా పరమాత్ముడవే! (49-52). నీ మాయచే

---

వాయువు. ఇది ఇంతకు ముందున్న దానికి పదిరెట్లు హెచ్చు. వాయువు ఆవరణము ఆకాశము. ఇదియును వాయువునకు పదిరెట్లు. ఆకాశమునకు ఆవరణము అహంకారము; అహంకారమునకు ఆవరణము మహత్తత్త్వము. ఇందు ప్రతి ఆవరణము ముందున్న ఆవరణమునకు పదిరెట్లుండును.

పృథ్వి, జలము, తేజము, వాయువు, ఆకాశము – ఈ ఆవరణలన్నియు సూక్ష్మమైనవి, స్థూలములు కావు.

ఇచట విరాట్ రూపము ధారణా విషయమని చెప్పబడినది. 'యోగదర్శనము'న ధారణ యీ విధముగా చెప్పబడినది. 'దేశ బంధశ్చిత్తస్య ధారణా' (3/1). విషయాంతరము విడిచి, ఏదేని వస్తువునందు వృత్తి ద్వారా చిత్తమును స్థిరము గావించుట, ధారణ యనబడును.

సర్వే తే మాయయా మూఢాస్త్వాం న జానంతి తత్త్వతః,
నమస్తే రామభద్రాయ వేధసే పరమాత్మనే. 53

మోహితులైన జనులెల్లరు నీ వాస్తవస్వరూపము తెలియలేరు. రామభద్రా! జగత్ సృష్టికారకా! పరమాత్మా! నీకు నమస్కారము (53).

అయోధ్యాధిపతే తుభ్యం నమః సౌమిత్రిసేవిత,
త్రాహి త్రాహి జగన్నాథ మాం మాయా నావృణోతు తే. 54

సౌమిత్రి సేవితుడవగు అయోధ్యాపతీ! నీకు నమస్కారము. జగన్నాథా! రక్షింపుము! నీ మాయ నన్ను ఆవహింపకుండుగాక! (54).

శ్రీరామ ఉవాచ

తుష్టోఽహం దేవగంధర్వ భక్త్యా స్తుత్యా చ తేఽనఘ,
యాహి మే పరమం స్థానం యోగిగమ్యం సనాతనమ్.55

రాముడిట్లనెను - "దేవగంధర్వా! నీ భక్తిచేత, స్తుతిచేత నేను తృప్తుడనైతిని. అనఘా! యోగులు చేరతగినది సనాతనమైనది. నా పరమస్థానమునకు వెడలుము (55).

జపంతి యే నిత్యమనన్యబుద్ధ్యా
భక్త్యా త్వదుక్తం స్తవమాగమోక్తమ్,
తేఽజ్ఞానసంభూతభవం విహాయ
మాం యాంతి నిత్యానుభవానుమేయమ్. 56

ఎవరు ఆగమోక్తమగు నీ స్తోత్రమును అనన్యభక్తితో బుద్ధితో, నిత్యము జపించెదరో వారు అజ్ఞానజన్యమైన సంసారమునుండి ముక్తులై అంతమున జగద్రూపకార్యముద్వారా ఊహింపతగిన జ్ఞానస్వరూపుడను, నిత్యుడను, పరమాత్ముడనగు నన్ను చేరుదురు (56).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో అరణ్యకాండ నవమ సర్గము ॥ 9 ॥

----****----

ఓం

# దశమ సర్గము

## శబరితో సమాగమము

శ్రీమహాదేవ ఉవాచ

లబ్ధ్వా వరం స గంధర్వః ప్రయాస్యన్ రామమబ్రవీత్,
శబర్యాస్తే పురోభాగే ఆశ్రమే రఘునందన. 1

భక్త్యా త్వత్పాదకమలే భక్తిమార్గవిశారదా,
తాం ప్రయాహి మహాభాగ సర్వం తే కథయిష్యతి. 2

ఇత్యుక్త్వా ప్రయయౌ సోఽపి విమానేనార్కవర్చసా,
విష్ణోః పదం రామనామస్మరణే ఫలమీదృశమ్. 3

త్యక్త్వా తద్విపినం ఘోరం సింహవ్యాఘ్రాదిదూషితమ్,
శనైరథాశ్రమపదం శబర్యా రఘునందనః. 4

శబరీ రామమాలోక్య లక్ష్మణేన సమన్వితమ్,
ఆయాంతమారాద్ధర్షేణ ప్రత్యుత్థాయాచిరేణ సా. 5

పతిత్వా పాదయోరగ్రే హర్షపూర్ణాశ్రులోచనా,
స్వాగతేనాభినంద్యాథ స్వాసనే సంన్యవేశయత్. 6

రామలక్ష్మణయోః సమ్యక్పాదౌ ప్రక్షాల్య భక్తితః,
తజ్జలేనాభిషిచ్యాంగమథార్ఘ్యాదిభిరాదృతా. 7

సంపూజ్య విధివద్రామం ససౌమిత్రిం సపర్యయా,
సంగృహీతాని దివ్యాని రామార్థం శబరీ ముదా. 8

ఫలాన్యమృతకల్పాని దదౌ రామాయ భక్తితః,
పాదౌ సంపూజ్య కుసుమైః సుగంధైః సానులేపనైః. 9

కృతాతిథ్యం రఘుశ్రేష్ఠముపవిష్టం సహానుజమ్,
శబరీ భక్తిసంపన్నా ప్రాంజలిర్వాక్యమబ్రవీత్. 10

అత్రాశ్రమే రఘుశ్రేష్ఠ గురవో మే మహర్షయః,
స్థితాః శుశ్రూషణం తేషాం కుర్వతీ సముపస్థితా. 11

శ్రీమహాదేవుడు ఇట్లనెను - పార్వతీ! రాముని వలన వరములుపొంది పరమపదమునకు పోవుచు గంధర్వుడు కబంధుడు రామునితో ఇట్లు చెప్పెను - ''రఘునందనా! ముందున్న ఆశ్రమమున శబరి యున్నది (1). నీ పాదకములయందలి భక్తికల ఆమె భక్తిమార్గ విశారదురాలు. ఆమెవంకకు వెడలుడు. భాగ్యశాలీ! నీకు సర్వము చెప్పగలదు (2)''. ఇట్లు చెప్పి సూర్యసమభాసుర మగు విమానమున విష్ణుపదమునకు తాను వెడలెను. రామనామస్మరణ ఫలము ఇట్టిదే (3). (విష్ణుభగవానుడు రాముడై పాదచారిగా పోవుచుండగా, దనువను కబంధుడు విమానముపై పోవుచున్నాడు. రామనామ మహిమ యిట్టిది)

ఘోరము, సింహ వ్యాఘ్రాది జంతుసంకులము అయిన ఆ అడవిని వదలి, క్రమముగా మెల్లగా రఘునందనుడు శబరి ఆశ్రమము చేరెను (4). లక్ష్మణయుతుడై వచ్చుచున్న రాముని చూచి, అత్యంత హర్షితయై శబరి వెంటనే ఎదురేగెను (5). రాముని పాదములముందు వ్రాలి, హర్షముతో కన్నుల నీరు నిండగ, స్వాగతముతో అభినందించి ఆసనముల నిచ్చి కూర్చుండచేసెను (6). రామలక్ష్మణులను జాగ్రత్తతో, భక్తితో పాదములు కడిగి వారి పాదోదకమును శరీరముపై జల్లుకొని అర్ఘ్య పాద్యాదు లతో పూజించెను (7). సపర్యలతో లక్ష్మణ సహితుడైన రాముని పూజించి, రాముని కొరకై సంతోషముతో కొనివచ్చిన దివ్య, అమృతాయమానములగు ఫలములు రామునకు ఇచ్చెను. ఆతని పాదములను సుగంధ పుష్పము లతో అనులేపనములతో అర్చించెను (8-9).

ఇటుల సోదర సహితుడైన రామునికి ఆతిథ్యమిచ్చి భక్తిసంపన్నురాలగు శబరి అంజలించి యిట్లు చెప్పెను (10) - ''రఘుశ్రేష్ఠా! ఇక్కడి ఈ ఆశ్రమములో నా ఆచార్యులు, మహర్షులు నివసించియుండిరి. వారికి శుశ్రూష చేయుచు నేనును ఉంటిని. ఇటుల వేలాది సంవత్సరములు గడచినవి. వారు బ్రహ్మపదమునకు

బహువర్షసహస్రాణి గతాస్తే బ్రహ్మణః పదమ్,
గమిష్యంతోఽబ్రువన్మాం త్వం వసాత్రైవ సమాహితా. 12

రామో దాశరథిర్జాతః పరమాత్మా సనాతనః,
రాక్షసానాం వధార్థాయ ఋషీణాం రక్షణాయ చ. 13

ఆగమిష్యతి సైకాగ్ర
ధ్యాననిష్ఠా స్థిరా భవ,
ఇదానీం చిత్రకూటా
ద్రావాశ్రమే వసతి ప్రభుః. 14

యావదాగమనం తస్య తావద్రక్ష కళేబరమ్,
దృష్ట్వైవ రాఘవం దగ్ధ్వా దేహం యాస్యసి తత్పదమ్. 15

తథైవాకరవం రామ త్వద్ధ్యానైకపరాయణా,
ప్రతీక్ష్యాగమనం తేఽద్య సఫలం గురుభాషితమ్. 16

తవ సందర్శనం రామ గురూణామపి మే న హి,
యోషిన్మూఢాప్రమేయాత్మన్ హీనజాతిసముద్భవా. 17

తవ దాసస్య దాసానాం శతసంఖ్యోత్తరస్య వా,
దాసీత్వే నాధికారోఽస్తి కుతః సాక్షాత్తవైవ హి. 18

కథం రామాద్య మే దృష్ట స్త్వం మనోవాగగోచరః,
స్తోతుం న జానే దేవేశ కిం కరోమి ప్రసీద మే. 19

శ్రీరామ ఉవాచ

పుంస్త్వే స్త్రీత్వే విశేషో వా జాతినామాశ్రమాదయః,
న కారణం మద్భజనే భక్తిరేవ హి కారణమ్. 20

యజ్ఞదానతపోభిర్వా వేదాధ్యయనకర్మభిః,
నైవ ద్రష్టుమహం శక్యో మద్భక్తివిముఖైః సదా. 21

తస్మాద్భామిని సంక్షేపాద్వక్ష్యేఽహం భక్తిసాధనమ్,
సతాం సంగతిరేవాత్ర సాధనం ప్రథమం స్మృతమ్. 22

ద్వితీయం మత్కథాలాప స్తృతీయం మద్గుణేరణమ్,
వ్యాఖ్యాతృత్వం మద్వచసాం చతుర్థం సాధనం భవేత్. 23

వెడలిపోవుచు నాకు చెప్పిరి- ''నీవిక్కడే ఉండుము. ఏకాగ్రచిత్తవు కమ్ము. పరమాత్మ, సనాతనుడు, రాక్షసవధ కొరకు, ఋషుల రక్షణకొరకు దశరథపుత్రుడై రాముడుగా అవతరించియున్నాడు (12-13). దగ్గరలో చిత్రకూటము లోనే ఆశ్రమములో ప్రభువు వసించియున్నాడు. అతడు ఇక్కడకు రాగలడు. ఏకాగ్రధ్యాననిష్ఠురాలివై, స్థిరబుద్ధితో ఇక్కడ యుండుము (14). అతడు వచ్చునంతవరకు నీ శరీరము కాపాడుకొనుము. రాముని చూచినతోడనే, దేహము దగ్ధము చేసికొని ఆతనిపదము పొందెదవు'' (15). నీ ధ్యానపరాయణనై రామా! ఆజ్ఞ నీ ఆగమనమును ప్రతీక్షించుచు ఇక్కడ ఉంటిని. ఇపుడు గురువాక్యములు సఫలములైనవి (16). నీ దర్శనము నా గురువులకుకూడ లేదు. అప్రమేయాత్మా! స్త్రీని, మూఢురాలను, హీన జాతిలో జన్మించినదానను, నాకు లభించినది (17). నీ దాసుల యొక్క దాసుల పరంపరలో నూరు తరములు మించినను దాసీత్వము లభించు అర్హత లేని నేను సాక్షాత్తు నీ దాస్యము చేయగలిగితిని (18). రామా! మనోవాక్కులకు అందని వాడవగు నిన్ను ఎటుల చూడగలిగితినో! దేవేశ! నిన్ను స్తోత్రముచేయుట ఎరుగనిదానను. ఏమి చేయుదును? అనుగ్రహింపుము'' (19).

రాముడిట్లనెను - ''పురుషుడు - స్త్రీ యను భేదముకాని, జాతి నామ ఆశ్రమాది భేదములు కాని, నా భజనమునకు కారణములు కావు. దానికి ఒక్క భక్తియే కారణము (20). నా యందలి భక్తికి విముఖులైనవారు యజ్ఞదాన తపముల వలన కాని, వేదాధ్యయనాది కర్మల వలనగాని నన్ను దర్శింపలేరు (21). అందువలన, భామినీ! భక్తిని పొందుటకు గల సాధనములను నేను సంక్షేపముగా చెప్పుచున్నాను. మొదటిది - సత్పురుషుల తోడి సాంగత్యమని చెప్పబడినది (22). నా జన్మకర్మల కథాగానము రెండవది. నా అనంతకల్యాణ గుణగణములను చర్చించుకొనుట మూడవ సాధనము. నా ప్రవచన రూపము లైన శ్రుతులను, ఉపనిషదాదులను, గీతాది వాక్యములను విశ్లేషించుకొనుట నాల్గవ సాధనము (23). నాయందే బుద్ధిని

ఆచార్యోపాసనం భద్రే మద్బుద్ధ్యాఽమాయయా సదా.
పంచమం పుణ్యశీలత్వం యమాది నియమాది చ. 24

నిష్ఠా మత్పూజనే నిత్యం షష్ఠం సాధనమీరితమ్.
మమ మంత్రోపాసకత్వం సాంగం సప్తమముచ్యతే. 25

మద్భక్తేష్వధికా పూజా సర్వభూతేషు మన్మతిః.
బాహ్యార్థేషు విరాగిత్వం శమాదిసహితం తథా. 26

అష్టమం నవమం తత్త్వవిచారో మమ భామిని.
ఏవం నవవిధా భక్తిః సాధనం యస్య కస్య వా. 27

స్త్రియో వా పురుషస్యాపి తిర్యగ్యోనిగతస్య వా.
భక్తిః సంజాయతే ప్రేమలక్షణా శుభలక్షణే. 28

భక్తౌ సంజాతమాత్రాయాం మత్తత్త్వానుభవస్తదా.
మమానుభవసిద్ధస్య ముక్తిస్తత్రైవ జన్మని. 29

స్యాత్తస్మాత్కారణం భక్తిర్మోక్షస్యేతి సునిశ్చితమ్.
ప్రథమం సాధనం యస్య భవేత్తస్య క్రమేణ తు. 30

భవేత్సర్వం తతో భక్తిర్ముక్తిరేవ సునిశ్చితమ్.
యస్మాన్మద్భక్తియుక్తా త్వం తతోఽహం త్వాముపస్థితః.
31

ఇతో మద్దర్శనాన్ముక్తిస్తవ నాస్త్యత్ర సంశయః.
యది జానాసి మే బ్రూహి సీతా కమలలోచనా. 32

కుత్రాస్తే కేన వా నీతా ప్రియా మే ప్రియదర్శనా. 33

శబర్యువాచ

దేవ జానాసి సర్వజ్ఞ సర్వం త్వం విశ్వభావన.
తథాపి పృచ్ఛసే యన్మాం లోకాననుసృతః ప్రభో. 34

తతోఽహమభిధాస్యామి సీతా యత్రాధునా స్థితా.
రావణేన హృతా సీతా లంకాయాం వర్తతేఽధునా. 35

నిలిపి, మాయకు లోనుగాక, పుణ్యకార్యము లందాసక్తి కలిగి, యమనియమాదులను అనుష్ఠించుచు ఆచార్య ఉపాసన చేయుట ఐదవ భక్తి సాధనము (24). అనునిత్యము నా పూజయందు నిష్ఠ కలిగియుండుట ఆరవ సాధనముగా చెప్పబడినది. సాంగోపాంగముగా నా మంత్ర పూజనమే ఏడవ సాధనమని అందురు (25). నా భక్తుల యందు నాయందుకన్న అధికమైన భక్తిభావము కలిగి యుండుట, సమస్త ప్రాణికోటిలో నా స్వరూపమునే దర్శించగలుగుట, ప్రాపంచిక విషయములందు వైరాగ్యము కలిగియుండుట, శమదమాదులు కలిగియుండుట నాభక్తికి ఎనిమిదవ సాధనము. నా యథార్థ తత్త్వవిచారము తొమ్మిదవ సాధనము. శుభలక్షణా! ఎవరికైనను ఈ తొమ్మిది భక్తి సాధనములు ఉన్నయెడల (26-27), వారు స్త్రీలైనను, పురుషులైనను, పశుపక్ష్యాదులలో జన్మ నెత్తినను, ప్రేమ స్వరూపమైన భక్తి సంజననమొందును (28). సాధకుని హృదయములో భక్తి పుట్టినంత మాత్రముననే నా స్వరూపము అనుభవమునకు వచ్చుట, తద్వారా నా అనుభవ సిద్ధియగుట చేత అదే జన్మమునందు ముక్తియు లభించును (29). అందువలన భక్తి ఒక్కటే నిశ్చయముగా ముక్తికి కారణము అని సిద్ధమగుచున్నది. మొదటి సాధనమగు సత్సంగసమాగమము ఎవనికి లభించునో, వానికి క్రమముగా మిగిలిన సాధనములన్నియు అనువర్తించి తద్వారా భక్తి జనించి, తత్ఫలముగా ముక్తి లభించి తీరును. ఇది నిస్సంశయము. నీవు నాయందు అపరిమితమగు భక్తి కలదానవు (ముందు చెప్పబడిన నవవిధ సాధనములు కలిగినదానవని భావము). అందులకే నేను నిన్ను చేరవచ్చితిని (30-31).

"నా యీ దర్శనము వలన నీకు ముక్తి లభించియే తీరును. సంశయము లేనేలేదు. నీకు తెలిసియున్నచో కమలలోచనయగు నా సీత ఎచటనున్నది? ప్రియదర్శనురాలు, నా ప్రియురాలగు ఆమె ఎవనిచే అపహరించబడినది, తెలియచెప్పుము (32-33)" అనెను.

అందులకు శబరి "దేవా! నీవు సర్వజ్ఞుడవని ఎరుగుదును. అయినను విశ్వభావనా! లోకాచారము ప్రవర్తింపచేయుటకు నీవు నన్నిట్లడిగితివేని, సీత ఇప్పుడు ఎక్కడున్నదో తెలియచేయుదును. రావణుని చేత ఆమె అపహరించబడినది. ఆమె ఇపుడు లంకలో నున్నది (34-35).

ఇతః సమీపే రామాస్తే పంపానామ సరోవరమ్.
ఋష్యమూకగిరిర్నామ తత్సమీపే మహానగః. 36

చతుర్భిర్మంత్రిభిః సార్ధం సుగ్రీవో వానరాధిపః.
భీతభీతః సదా యత్ర తిష్ఠత్యతులవిక్రమః. 37

వాలినశ్చ భయాద్భ్రాతుస్తదగమ్యమృషేర్భయాత్.
వాలినస్తత్ర గచ్ఛ త్వం తేన సఖ్యం కురు ప్రభో. 38

సుగ్రీవేణ స సర్వం తే
కార్యం సంపాదయిష్యతి.
అహమగ్నిం ప్రవేక్ష్యామి
తవాగ్రే రఘునందన. 39

ముహూర్తం తిష్ఠ రాజేంద్ర యావద్దగ్ధ్వా కలేవరమ్.
యాస్యామి భగవన్ రామ తవ విష్ణోః పరం పదమ్. 40

ఇతి రామం సమామంత్ర్య ప్రవివేశ హుతాశనమ్.
క్షణాన్నిర్ధూయ సకలమ్ అవిద్యాకృతబంధనమ్.
రామప్రసాదాచ్ఛబరీ మోక్షం ప్రాపాతిదుర్లభమ్. 41

కిం దుర్లభం జగన్నాథే శ్రీరామే భక్తవత్సలే.
ప్రసన్నేఽధమజన్మాపి శబరీ ముక్తిమాప సా. 42

కిం పునర్బ్రాహ్మణా ముఖ్యాః
పుణ్యాః శ్రీరామచింతకాః.
ముక్తిం యాంతీతి
తద్భక్తిర్ముక్తిరేవ న సంశయః. 43

భక్తిర్ముక్తివిధాయినీ భగవతః
శ్రీరామచంద్రస్య హే
లోకాః కామదుఘాంఘ్రిపద్మ
యుగలం సేవధ్వమత్యుత్సుకాః.
నానాజ్ఞానవిశేషమంత్రవితతిం
త్యక్త్వా సుదూరే భృశం
రామం శ్యామతనుం స్మరారిహృదయే
భాంతం భజధ్వం బుధాః. 44

ఇక్కడకి అనతిదూరములో పంపయను సరోవరమున్నది. దానికి సమీపములోనే ఋష్యమూకమను గొప్ప పర్వతమున్నది (36). అక్కడనే వానరాధిపుడు సాటిలేని పరాక్రమశాలి, భయముచేత వెరచి, నలుగురు మంత్రులతో ఉన్నాడు. తన సోదరుడగు వాలివలని భయము చేతనే అతడు అచటికి చేరినాడు. ఋషిశాప భయముచే వాలి అచటికి పోనేపోడు. నీవు సుగ్రీవునితో స్నేహము చేయుము ప్రభూ! (37-38). నీకు కావలసిన కార్యము అంతయు సుగ్రీవుడే చక్కబరచును. ఇక నేను నీ సమక్షమున రఘునందనా! అగ్నిప్రవేశము చేయుదును (38-39). నా శరీరము దగ్ధమగునంతకాలము, ముహూర్తముసేపు రాజేంద్రా! నిలిచియుండుము! భగవన్! రామచంద్ర ప్రభో! నీ విష్ణుపదమునకే పోయెదను (40)''.

ఇట్లు రాముని అనుజ్ఞ తీసుకొని ఆమె అగ్ని ప్రవేశించెను. క్షణకాలములో సర్వవిధములైన అవిద్యాకృత బంధనము (శరీరసంబంధము) భస్మము చేసికొని, శబరి శ్రీరామానుగ్రహముతో అతి దుర్లభమగు మోక్షమును పొందెను (41).

జగన్నాథుడు, భక్తవత్సలుడు, శ్రీరాముడు ప్రసన్నుడైన ఏది దుర్లభము! నీచజాతిలో జన్మించినను, శబరి ముక్తినే పొందెను (42). అట్టియెడ శ్రీరామచింతన చేయువారు, పుణ్యాత్ములు బ్రాహ్మణాది ఉత్తమ కులజులు ముక్తినే పొందెదరని వేరుగా చెప్పవలెనా యేమి? శ్రీరాముని యందలి భక్తి నిశ్చయముగా ముక్తి (దాయక) స్వరూపమే! (43).

ఓ జనులారా! భగవానుడగు శ్రీరామచంద్రుని యందుండు భక్తియే ముక్తి ప్రదాయిని. అందువలన అత్యుత్సుకులై, శ్రద్ధాభక్తులతో సర్వకామములు ప్రసాదించెడి స్వామి పాదయుగ్మమును సేవింపుడు.

ఓ బుద్ధిమంతులారా! సర్వవిధములైన లౌకిక, వైదిక జ్ఞానవిశేషములను మంత్రాదులను, సుదూరముగా వదలి, శంకరుని హృదయమందే ప్రకాశించు శ్యామల కోమలాంగుని రాముని భజింపుడు (44).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో అరణ్యకాండ దశమ సర్గము ॥ 10 ॥

సమాప్తమిద మరణ్యకాండమ్.

----****----



హనుమంతుడు రామలక్ష్మణులను భుజములపై నిడుకొని ఋష్యమూక పర్వతమునకు వచ్చుట

॥ శ్రీహరిః ॥

ఓం శ్రీపరమాత్మనే నమః

# అధ్యాత్మ రామాయణము

## కిష్కింధా కాండము

## ప్రథమ సర్గము

### సుగ్రీవునితో సమాగమము

శ్రీమహాదేవ ఉవాచ

తతః సలక్ష్మణో రామః
శనైః పంపాసరస్తటమ్,
ఆగత్య సరసాం శ్రేష్ఠం
దృష్ట్వా విస్మయమాయయౌ. 1

క్రోశమాత్రం సువిస్తీర్ణమగాధామలశంబరమ్,
ఉత్ఫుల్లాంబుజకల్హారకుముదోత్పలమండితమ్. 2

హంసకారండవాకీర్ణం
చక్రవాకాదిశోభితమ్,
జలకుక్కుటకోయష్టి -
క్రౌంచనాదోపనాదితమ్. 3

నానాపుష్పలతాకీర్ణం
నానాఫలసమావృతమ్,
సతాం మనఃస్వచ్ఛజలం
పద్మకింజల్కవాసితమ్. 4

తత్రోపస్పృశ్య సలిలం
పీత్వా శ్రమహరం విభుః,
సానుజః సరసస్తీరే
శీతలేన పథా యయౌ. 5

ఋష్యమూకగిరేః పార్శ్వే గచ్ఛంతౌ రామలక్ష్మణౌ
ధనుర్బాణధరౌ దాంతౌ జటావల్కలమండితౌ
పశ్యంతౌ వివిధాన్వృక్షాన్ గిరేః శోభాం సువిక్రమౌ. 6

శ్రీమహాదేవుడు ఇట్లనెను - ఓ పార్వతీ! అంతట రాముడు లక్ష్మణ సమేతుడై క్రమముగా పంపా సరోవర తటము సమీపించెను. అన్ని సరోవరములలో శ్రేష్ఠమగు ఆ పంపాసరోవర శోభ సమృద్ధిని చూచి రాముడు మిగుల ఆశ్చర్యపడెను (1).

ఆ సరస్సు క్రోసు దూరము విస్తీర్ణము కలిగి, అగాధమై, నిర్మలమైన జలముతో నిండియున్నది. బాగుగా వికసించిన పద్మములు, కల్హారములు, కుముదములు, ఉత్పలములు శోభించుచున్నవి (2).

సరోవరమునందు అందందు హంస కారండవాది పక్షిగణములు సంచరించుచుండెను. చక్రవాకాదులు శోభింప చేయుచుండెను. నీరుకోళ్ళు, నీటి పక్షులు, క్రౌంచములు మొదలగు పక్షుల కలకలములతో మధురారావములతో ప్రతిధ్వనించుచుండెను (3). చిత్ర విచిత్ర పుష్పలతాదులతో పరిపూర్ణమై, నానావిధములగు ఫలవృక్షములచేత కూడియుండెను. పద్మపరాగము చేత సుగంధితమైన జలము సజ్జనుని హృదయమువలె స్వచ్ఛమై చూపట్టుచుండెను (4).

అక్కడ ఆ సరస్సునీటిని స్పృశించి, స్నానాచమ నాదుల గావించి, శ్రమము తొలగించెడి యా నీటిని తనివి తీరునట్లు త్రాగి, ప్రభువగు రాముడు అనుజ సహితుడై సరస్తీరమందలి చల్లని నీడపట్టులున్న మార్గముగుండా నడచెను (5). ఋష్యమూక గిరి లోయల గుండా ధనుర్బాణ ధరులు, జితేంద్రియులు, జటావల్కలశోభితులు, గొప్ప పరాక్రమశాలురు అగు రామలక్ష్మణులు వివిధ వృక్షములను ఋష్యమూక గిరి శోభను చూచుచు నడచుచుండగా, (6)

సుగ్రీవస్తు గిరేర్మూర్ధ్ని చతుర్భిః సహ వానరైః,
స్థిత్వా దదర్శ తౌ యాంతావారురోహ గిరేః శిరః. 7

వారి రాకను, ఋష్యమూక గిరి తటమున నలుగురు వానరులతో నిలిచియున్న సుగ్రీవుడు గమనించెను (వెంటనే) గిరి శిఖరము నెక్కెను (7).

భయాదాహ హనూమంతం కౌ తౌ వీరవరౌ సఖే,
గచ్ఛ జానీహి భద్రం తే వటుర్భూత్వా ద్విజాకృతిః. 8

వాలినా ప్రేషితౌ కింవా
మాం హంతుం సముపాగతౌ.
తాభ్యాం సంభాషణం కృత్వా
జానీహి హృదయం తయోః. 9

యది తౌ దుష్టహృదయౌ
సంజ్ఞాం కురు కరాగ్రతః,
వినయావనతో భూత్వా
ఏవం జానీహి నిశ్చయమ్. 10

అతడు భీతితో హనుమంతునితో యిట్లు చెప్పెను "మిత్రమా! ఎవ్వరి వీరవరులిర్వురు? పొమ్ము! తెలిసికొనుము. జాగ్రత్త! ద్విజుని వేషముతో బ్రహ్మచారివై పొమ్ము! నన్ను కడతేర్చుటకై వాలిచేత పంపబడి ఇటు వచ్చియుందురా! ఏమి? వారిరువురితో సంభాషించి వారి హృదయ (అంతర్గత) భావము తెలిసికొనుము. వారిరువురు కనుక దుష్టహృదయులైనయెడల చేసన్న చేయుము. ఇదంతయు వినయముతో (వినయము నటించుము) నిశ్చయముగా తెలిసికొనుము (10)".

తథేతి వటురూపేణ హనుమాన్ సముపాగతః,
వినయావనతో భూత్వా రామం నత్వేదమబ్రవీత్. 11

'అట్లే' యని ఆంజనేయుడు బ్రహ్మచారి రూపముతో (రామలక్ష్మణుల కడకు) వచ్చెను. రామునికి వినయముతో ముందుకు వంగి నమస్కరించి ఈ మాట చెప్పెను (11).

కౌ యువాం పురుషవ్యాఘ్రౌ యువానౌ వీరసమ్మతౌ,
ద్యోతయంతౌ దిశః సర్వాః ప్రభయా భాస్కరావివ. 12

యువాం త్రైలోక్యకర్తారావితి భాతి మనో మమ,
యువాం ప్రధానపురుషౌ జగద్ధేతూ జగన్మయౌ. 13

"ఎవరయ్యా మీరిరువురు? పురుషశ్రేష్ఠులు, యువకులు, మహావీరులు! దిశలన్నియు తేజస్సుతో ప్రకాశింపచేయు మీరెవ్వరు? మీరిద్దరు మూడు లోకములు సృజించువారని నా మనసు చెప్పుచున్నది. మీరు ప్రకృతి పురుషులు లేదా ముఖ్య పురుషులు. కావుననే ప్రపంచమునకు కారణభూతులు! జగమునందు అంతట నిండియున్నవారు!" (12-13).

మాయయా మానుషాకారౌ
చరంతావివ లీలయా,
భూభారహరణార్థాయ
భక్తానాం పాలనాయ చ. 14

"భూభారము హరించుటకు, భక్తజన పరిపాలనకు, లీలావశమువనే, మాయారూపమగు సంకల్పముచేత మానుషాకారములో మీరిరువురు చరించుచున్నట్లనిపించుచున్నది" (14).

అవతీర్ణావిహ పరౌ చరంతౌ క్షత్రియాకృతీ,
జగత్స్థితిలయౌ సర్గం లీలయా కర్తుముద్యతౌ. 15

"పరాత్పరులగు మీరిరువురు క్షత్రియాకృతి ధరించి జగదుత్పత్తి స్థితి లయములను, దుర్మార్గుల వినాశమును అవలీలగా సాధింప నుద్యమించి అవతరించినట్లు అనిపించుచున్నది" (15).

స్వతంత్రౌ ప్రేరకౌ సర్వహృదయస్థావిహేశ్వరౌ,
నరనారాయణౌ లోకే చరంతావితి మే మతిః. 16

శ్రీరామో లక్ష్మణం ప్రాహ పశ్యైనం వటురూపిణమ్,
శబ్దశాస్త్రమశేషేణ శ్రుతం నూనమనేకధా. 17

అనేన భాషితం కృత్స్నం న కించిదపశబ్దితమ్,
తతః ప్రాహ హనూమంతం రాఘవో జ్ఞానవిగ్రహః. 18

అహం దాశరథీ రామస్త్వయం మే లక్ష్మణో ఽనుజః,
సీతయా భార్యయా సార్ధం పితుర్వచనగౌరవాత్. 19

అగతస్తత్ర విపినే స్థితో ఽహం దండకే ద్విజ,
తత్ర భార్యా హృతా సీతా రక్షసా కేనచిన్మమ,
తామన్వేష్టుమిహాయాతౌ త్వం కో వా కస్య వా వద. 20

వటురువాచ

సుగ్రీవో నామ రాజా యో వానరాణాం మహామతిః,
చతుర్భిర్మంత్రిభిః సార్ధం గిరిమూర్ధని తిష్ఠతి. 21

భ్రాతా కనీయాన్ సుగ్రీవో వాలినః పాపచేతసః,
తేన నిష్కాసితో భార్యా హృతా తస్యేహ వాలినా. 22

తద్భయాదృష్యమూకాఖ్యం గిరిమాశ్రిత్య సంస్థితః,
అహం సుగ్రీవసచివో వాయుపుత్రో మహామతే. 23

హనూమాన్నామ విఖ్యాతో హ్యంజనీగర్భసంభవః,
తేన సఖ్యం త్వయా యుక్తం సుగ్రీవేణ రఘూత్తమ. 24

భార్యాపహారిణం హంతుం సహాయస్తే భవిష్యతి,
ఇదానీమేవ గచ్ఛామ ఆగచ్ఛ యది రోచతే. 25

''మీరిరువురు సర్వతంత్ర స్వతంత్రులు, జీవు లందరను ప్రేరణ చేయువారలు, సర్వహృదయ నివాసులగు నియామకులు అగు నరనారాయణులు ఈ లోకమందు చరించుచున్నారని తోచుచున్నది'' (16).

ఇట్లు హనుమ పలికి ముగించగానే శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లనెను - ''చూడుము! ఈ వటురూపము దాల్చినవానిని! తప్పునిసరిగా ఇతడు అనేకపర్యాయములు వ్యాకరణ శాస్త్రమును వినియుండియుండును (బాగుగా అధ్యయనము చేసియుండును). ఇతడు మాటలాడిన దాని యందు ఎక్కడను కించిత్తైనను అపశబ్దము కానరాదు'' అని ప్రశంసించి మూర్తీభవించిన జ్ఞానమగు రాఘవుడు సుగ్రీవ సచివునితో ఇట్లనెను (17-18).

''స్వామీ! బ్రాహ్మణోత్తమా! నేను దాశరథియగు రాముడను. ఇతడు లక్ష్మణుడు, నాతమ్ముడు. నేను నా భార్యయగు సీతతో కలసి, పితృవాక్యపాలనారూప గౌరవభావ ప్రదర్శనముతో, అడవికి వచ్చితిని. దండకారణ్యములో నిలిచితిని. అచ్చట ఎవడో ఒక రాక్షసునిచేత సీత అపహరింప బడినది. ఆమెను అన్వేషించుచు ఇరువురము ఇక్కడకి వచ్చితిమి. నీవెవరవు? ఎవరి వ్యక్తివి! తెలుపుము!'' (19 - 20).

వటువు ఇట్లు చెప్పెను - ''మహాబుద్ధిశాలి యగు వానరరాజు సుగ్రీవుడు నలుగురుమంత్రులతో కూడియుండి ఋష్యమూక గిరి తటమున నిలిచినాడు (21). అతడు దుష్టచేతనుడగు వాలికి తమ్ముడు. అన్నచేత సుగ్రీవుడు ఇల్లు వెడలగొట్టబడినాడు. ఈతని భార్యయు ఆ వాలిచేత అపహరింపబడినది (22). హనుమంతుడని నా పేరు. అంజనాదేవి తనయుడను. రఘూత్తమా! సుగ్రీవునితోడి మైత్రి నీకు యుక్తమైనది. నీ భార్యను హరించినవాని హతమార్చుటకు అతని సాయము నీకు లభించగలదు. నీకు అంగీకారమైనచో, ఇపుడే అతని వద్దకు పోదము! రమ్ము!'' (24-25).

శ్రీరామ ఉవాచ

అహమప్యాగతస్తేన సఖ్యం కర్తుం కపీశ్వర,
సఖ్యుస్తస్యాపి యత్కార్యం తత్కరిష్యామ్యసంశయమ్. 26

శ్రీరాముడిట్లనెను - "కపీశ్వరా! నేను కూడ ఆతనితోడి చెలిమిచేయుటకై వచ్చియుంటిని. మిత్రుడనై ఆతనికి కూడా ఏదైన చేయగలిగిన కార్యమున్నయెడల తప్పక చేయుదును. సంశయము లేదు" (26).

హనూమాన్ స్వస్వరూపేణ స్థితో రామమథాబ్రవీత్,
ఆరోహతాం మమ స్కంధౌ గచ్ఛామః పర్వతోపరి. 27

యత్ర తిష్ఠతి సుగ్రీవో మంత్రిభిర్వాలినో భయాత్,
తథేతి తస్యారురోహ స్కంధం రామోఽథ లక్ష్మణః. 28

ఇది విని హనుమ నిజరూపమును దాల్చి నిలిచి రామునితో ఇట్లనెను - 'నా భుజములను అధిరోహించుడు. వాలి భయము చేత, మంత్రులందరితో నున్న సుగ్రీవుడున్న కొండ కొమ్మునకు పోదము". రాముడు 'అట్లే' యని హనుమస్కంధము నధిరోహించెను. లక్ష్మణుడును అట్లే చేసెను (27-28). క్షణములో మహాకపియగు హనుమ గిరిశృంగమునకు ఎగిరెను. రామలక్ష్మణులిరువురు ఒక చెట్టు నీడలో నిలచిరి (29).

ఉత్పపాత గిరేర్మూర్ధ్ని క్షణాదేవ మహాకపిః,
వృక్షచ్ఛాయాం సమాశ్రిత్య స్థితౌ తౌ రామలక్ష్మణౌ. 29

హనూమానపి సుగ్రీవముపగమ్య కృతాంజలిః,
వ్యేతు తే భయమాయాతౌ రాజన్ శ్రీరామలక్ష్మణౌ. 30

హనుమంతుడు సుగ్రీవుని సమీపించి, అంజలించి, "కపిరాజా! భయము వీడుము. శ్రీరామలక్ష్మణులు వచ్చియున్నారు (30). వేగమే లెమ్ము. రామునితో స్నేహము కలుగునటుల ప్రణాళిక రచింపబడినది. అగ్నిని సాక్షిగా నిలిపి ఆతనితో స్నేహమును చేయుము. ఆలసింపవలదు" (31).

శీఘ్రముత్తిష్ఠ రామేణ సఖ్యం తే యోజితం మయా,
అగ్నిం సాక్షిణమారోప్య తేన సఖ్యం ద్రుతం కురు. 31

తతోఽతిహర్షాత్సుగ్రీవః సమాగమ్య రఘూత్తమమ్,
వృక్షశాఖాం స్వయం ఛిత్త్వా విష్టరాయ దదౌ ముదా. 32

అంతట అత్యంత సంతోషముతో రఘూత్తముని కడకు చేరి, స్వయముగా ఒక చెట్టుకొమ్మను విరిచి, ఆనందముతో, ఆదరముతో రాముని కూర్చుండ నియమించెను (32).

హనూమాన్ లక్ష్మణాయాదాత్సుగ్రీవాయ చ లక్ష్మణః,
హర్షేణ మహతావిష్టాః సర్వ ఏవావతస్థిరే. 33

హనుమ లక్ష్మణునకు, లక్ష్మణుడు సుగ్రీవునకు ఆసనముల నిచ్చిరి. అందరును అత్యంతానందముతో ఆసీనులైరి (33). శ్రీరామ వృత్తాంతమును మొదటినుండి జరిగినదంతయు, వనవాసగమనము వరకు, తరువాత సీతాహరణము కూడా లక్ష్మణుడు వివరముగా చెప్పెను (34).

లక్ష్మణస్త్వబ్రవీత్సర్వం రామవృత్తాంతమాదితః,
వనవాసాభిగమనం సీతాహరణమేవ చ. 34

లక్ష్మణోక్తం వచః శ్రుత్వా సుగ్రీవో రామమబ్రవీత్,
అహం కరిష్యే రాజేంద్ర సీతాయాః పరిమార్గణమ్. 35

లక్ష్మణుని మాటలు విని సుగ్రీవుడు రామున కిట్లు చెప్పెను - "రాజేంద్రా! సీతాన్వేషణము నేను చేసెదను! (35).

సాహాయ్యమపి తే రామ కరిష్యే శత్రుఘాతినః,
శృణు రామ మయా దృష్టం కించిత్తే కథయామ్యహమ్.36

ఏకదా మంత్రిభిః సార్ధం స్థితోఽహం గిరిమూర్ధని,
విహాయసా నీయమానాం కేనచిత్ప్రమదోత్తమామ్. 37

క్రోశంతీం రామరామేతి దృష్ట్వాస్మాన్పర్వతోపరి,
అముచ్యాభరణాన్యాశు స్వోత్తరీయేణ భామినీ. 38

నిరీక్ష్యాథః పరిత్యజ్య క్రోశంతీ తేన రక్షసా,
సీతాహం భూషణాన్యాశు గుహాయామక్షిపం ప్రభో.39

ఇదానీమపి పశ్య త్వం జానీహి తవ వా న వా,
ఇత్యుక్త్వానీయ రామాయ దర్శయామాస వానరః. 40

విముచ్య రామస్తద్దృష్ట్వా హా సీతేతి ముహుర్ముహుః,
హృది నిక్షిప్య తత్సర్వం రురోద ప్రాకృతో యథా. 41

ఆశ్వాస్య రాఘవం భ్రాతా లక్ష్మణో వాక్యమబ్రవీత్,
అచిరేణైవ తే రామ ప్రాప్స్యతే జానకీ శుభా,
వానరేంద్రసహాయేన హత్వా రావణమాహవే. 42

సుగ్రీవోఽప్యాహ హే రామ ప్రతిజ్ఞాం కరవాణి తే,
సమరే రావణం హత్వా తవ దాస్యామి జానకీమ్. 43

తతో హనూమాన్సుజ్వాల్య తయోరగ్నిం సమీపతః,
తావుభౌ రామసుగ్రీవావగ్నౌ సాక్షిణి తిష్ఠతి. 44

బాహూ ప్రసార్య చాలింగ్య పరస్పరమకల్మషౌ,
సమీపే రఘునాథస్య సుగ్రీవః సముపావిశత్. 45

స్వోదంతం కథయామాస ప్రణయాద్రఘునాయకే,
సఖే శృణు మమోదంతం వాలినా యత్కృతం పురా. 46

రామా! శత్రుసంహారమున కూడా సాయమును చేయుదును! రామా! వినుము! నేను చూచినది వినిపించెదను (36).

"ఒకసారి నామంత్రులతో గిరిశిఖరిపై యుంటిని. రామా! రామా! యని ఆక్రోశించుచు ఆకాశమార్గమున కొనిపోబడుచున్న ఒక ఉత్తమ స్త్రీని మేము చూచితిమి. మమ్ము చూచి యాభామిని, స్వామీ! నగలు ఒలిచి, ఉత్తరీయములో కట్టి క్రిందకి చూచి, వదలిపెట్టినది. ఆక్రోశించుచు ఆ రాక్షసుని చేత తీసికొనిపోబడినది. నేను వెంటనే ఆ ఆభరణములను గుహలోపల దాచియుంచితిని. (37-39).

"నీవు వానిని చూడుము. నీవి (నీభార్యవి) అవునో కాదో తెలిసికొనుము" అని చెప్పుచు వానరరాజు, నగల మూట తెప్పించి చూపించెను (40). రాముడు ఆ నగల మూటను విప్పి, చూచి గుర్తించి, 'హా సీతా!' యనుచు ఆ నగలను మాటిమాటికి గుండెలకు చేర్చుకొని సామాన్య మానవునివలె రోదించెను (41).

రాఘవుని ఊరడించుచు సోదరుడు లక్ష్మణుడు ఈ మాటలు చెప్పెను – "రామా! అచిరకాలముననే వానర రాజగు సుగ్రీవుని సాయముతో యుద్ధమున రావణుని వధించి శుభలక్షణయగు సీతను పొందగలవు" (42).

సుగ్రీవుడును ఇట్లనెను – "హే రామా! నేనిదే ప్రతిజ్ఞ చేయుచున్నాను. యుద్ధమందు రావణుని చంపి, జానకిని నీకు తిరిగి సమర్పింతును (43). అంతట హనుమ వారి సమీపములో అగ్ని రగుల్కొల్పెను. రామ సుగ్రీవు లిద్దరును స్వచ్ఛమైన అంతరంగములతో, అగ్నిసాక్షియై నిలువ, చేతులు చాచి ఆలింగనము చేసికొనిరి. సుగ్రీవుడు రఘునాథుని సమీపమున కూర్చుండెను (44-45). రఘునాయకునికి సుగ్రీవుడు ప్రణయ పూర్వకముగా తన ఉదంతమును ఈ విధముగా వివరించెను – "మిత్రుడా! వాలిచేత నాకేమి సంభవించెనో చెప్పెద వినుము. (46)




అగ్నిసాక్షిగా శ్రీరామ సుగ్రీవుల మైత్రి